UNIVERSAL LIBRARY
OU_204367
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. 782/S62R Accession No. T.T. 23

Author

Title [illegible]

This book should be returned on or before the date last marked below.

ఆంధ్రగ్రంథ రత్నాకరము, గుడివాడ

రాజపోషకులు

౧ మ॥ రా॥ శ్రీ వల్లభనేని రామబ్రహ్మం చౌదరిగారు, గొలివేపల్లి
౨ ,, పర్వతనేని నారాయణరావుగారు, కౌతరం.

ప్రధానపోషకులు.

౧ మ॥ రా॥ శ్రీ [illegible]ంగం వెంకటసుబ్బయ్యగారు, బొమ్మలూరు.
౨ ,, వల్లూరిపల్లి కోదండరామయ్యగారు, దోకరం.
౩ ,, అడపా సుబ్బారాయుడుగారు, గుడివాడ.
౪ ,, పురాణం సూరిశాస్త్రిగారు, బి. ఎ., బందరు
౫ ,, మల్లిరెడ్డి గురవారెడ్డిగారు, జొన్నపాడు.
౬ ,, మాగంటి వెంకటరామదాసుగారు, తిమిరిస.
౭ ,, చిట్టూరి వెంకటనరసింహంగారు, బందరు.
౮ ,, సూరపనేని సుబ్బయ్య చౌదరిగారు, దింటపల్లు.
౯ ,, వెల్లంకి రామదాసు చౌదరిగారు, అప్పికట్ల.
౧౦ ,, కొడాలి ఉమామహేశ్వరరావుగారు, జవగ్లపూడి.
౧౧ ,, వల్లభనేని రామకృష్ణయ్య చౌదరిగారు, గొలివేపల్లి.
౧౨ ,, కరిపినేని వెంకటరామయ్యగారు, చినపారుపూడి.
౧౩ ,, కామినేని గోపాలకృష్ణయ్యగారు, గుడ్లవల్లేరు.
౧౪ ,, ఉప్పలపాటి నాగయ్యగారు, గురజ-
౧౫ ,, జొన్నలగడ్డ శ్రీరామచంద్రయ్యగారు, గుడివాడ.
౧౬ ,, రాళ్ళబండి కుటుంబరావుగారు, బల్లిపర్రు.
౧౭ ,, అట్లూరి వెంకటాద్రిగారు, కోమూరు.
౧౮ ,, కూడవల్లి గోపాలకృష్ణయ్యగారు, నందమూరు.

పోషకులు.

౧ మ॥ రా॥ శ్రీ॥ నండూరు వరాహలక్ష్మీనృసింహంగారు, అరుకోలను.
౨ ,, పింగళి కుటుంబరావుగారు, లింగాల.
౩ ,, కూచిభట్ల వెంకటాచలపతిశాస్త్రిగారు, కొర్నిపాడు.
౪ ,, గో॥ భా॥ రామచంద్రరావు [illegible]గారు, ఉలవభద్ర.
గంజాంజిల్లా.
౫ ,, యలమంచిలి నాగయ్యగారు, నూజెళ్ల.
౬ ,, కిరిపురపు వెంకటరత్నంగారు, ఎలమర్రు.
౭ ,, కోనేరు నారాయణరావుగారు, బార్లపూడి.
౮ ,, అట్లూరి వెంకటపతి గారు, చవటపల్లి.
౯ ,, పాటిబండ్ల సీతారామయ్యగారు, అరుకోలను.

౧౦ మ॥ రా॥ శ్రీ॥ సీతంరాజు హనుమంతరావుగారు, జుజ్జనపూడి.
౧౧ ,, కే. వెంకటాచలంగారు, పెనుమళ్ల.
౧౨ ,, మొవ్వ భూషయ్యగారు, మొదునూరు.
౧౩ ,, పర్వతనేని గంగయ్యగారు, పోలుకొండ.
౧౪ ,, శివలెంక మల్లికార్జునరావుగారు, పెసరమిల్లి.
౧౫ ,, చెలసాని వెంకటరత్నంగారు, చిరుచింతల.
౧౬ ,, వల్లభనేని చౌదరయ్యగారు, గోరివేపల్లి.
౧౭ ,, వల్లభనేని రామశాస్త్రిలుగారు, ,,
౧౮ ,, శింగవరపు రామయ్యగారు, కొమరవోలు.
౧౯ ,, పాట్లూరి సీతయ్యగారు, ,,
౨౦ ,, పాట్లూరి వెంకటరత్నంగారు, ,,
౨౧ ,, హరి గుండేరావుగారు, కల్వపాముల.
౨౨ ,, మానికొండ కుటుంబరావుగారు, ఉరుటూరు.
౨౩ ,, కోవెలమూడి పరంధామయ్యగారు, కోలవెన్ను.
౨౪ ,, కసుపుగంటి సీతయ్యగారు, నందివాడ.
౨౫ ,, కొత్తపల్లి రామకుటుంబయ్యగారు, గుడివాడ.
౨౬ ,, బ్రహ్మభొట్ల పట్టాభిరామశర్మగారు, గుడివాడ
౨౭ ,, కాజ వెంకటరామయ్యగారు, పసుమళ్ల.
౨౮ ,, నూకల వీరరాఘవయ్యగారు, కానుమోలు.
౨౯ ,, పోతిన శ్రీనివాసరావుగారు, బెజవాడ.
౩౦ ,, అడుసుమల్లి వెంకటకృష్ణయ్యగారు, చిరుచింతల.
౩౧ ,, ఉప్పలూరి ఆదినారాయణమూర్తిగారు, గుడివాడ
౩౨ ,, తపిర్నేని సుబ్రహ్మణ్యంగారు, గుడివాడ.
౩౩ ,, పరిమి వెంకటపిచ్చయ్యగారు, ఐడాలి.
౩౪ ,, కొల్లి చినవెంకటరామయ్యగారు, అప్పికట్ల.
౩౫ శ్రీమతి వల్లూరిపల్లి కనకదుర్గమ్మగారు, వేల్పూరు.
౩౬ మ॥ రా॥ శ్రీ॥ పిడికిటి సూర్యనారాయణగారు, పునాదిపాడు.
౩౭ ,, పాలపర్తి వాసేశంగారు, పాలపర్రు.
౩౮ ,, గూడూరి మల్లికార్జునుడుగారు, వంగూరు.
౩౯ ,, కోడూరు రంగయ్యగారు, కోడూరు.
౪౦ ,, అడుసుమిల్లి కృష్ణయ్యగారు, ,,
౪౧ ,, కొండపల్లి నారాయణస్వామిరెడ్డిగారు, జొన్నపాడు,
౪౨ ,, కొడాలి వీరభద్రయ్యగారు, చినపారుపూడి.
౪౩ ,, కొరెడ్ల రామయ్యగారు, గుడివాడ.
౪౪ ,, గూడపల్లి రామబ్రహ్మంగారు, బెజవాడ.

భూమిక

మేవాడు రాజ్యవంశములో రాణా ప్రతాపసింహుఁ డద్వితీయపరాక్రమశాలి. అఖండశోభిష్ణుఁడు. దేశస్వాతంత్ర్యసంపాదనకై ఘోరదారిద్ర్యవ్రతము నవలంబించిన ధన్యుఁడు. చిత్తోరు రాజ్యము నుద్ధరించువఱకు నేలమీదనే పరుండెదననియు జీర్ణపత్రములందే భోజనము చేసెదననియు దీక్షవహించి యీ మహావీరుఁడు తన సామంతు లందఱి చేతనుజ్ఞ నిట్టి ప్రతిచేయించెను. ఈ వంశమువారు నేటికిని పళ్ళెముక్రింద నొక గడ్డిపఱక నుంచుకొనియు కంచముక్రింద నొక యాకు నుంచుకొనియు పారంపర్యముగ నీ ప్రతిజ్ఞను ఒక విధముగఁ బాలించుచున్నారు. ఇట్టి లోకోత్తర చరితుఁ డగు ప్రతాపసింహుని చరిత్ర సాధారణముగ భారత వర్షమందలి ముఖ్యభాష లన్నిటియందును వ్రాయఁబడినది. వంగభాషయందుఁ గూడ శ్రీ రవీంద్రనాథ ఠాగూరుగారి సోదరుఁడు జ్యోతిరింద్రనాథ ఠాగూరుగారు ప్రతాపుని చరిత్రను గ్రహించియే అశ్రుమతియను నొక నాటకమును రచించిరి. ఈ గ్రంథముండగా ఈ విషయమున మఱియొక గ్రంథము రచించి ఖ్యాతిబడయుట సామాన్యునకు శక్యముగాదు. అదియొక ద్విజేంద్రునకే చెల్లినది. చెల్లుటయేకాదు ద్విజేంద్రుని యీ గ్రంథము ముందు అశ్రుమతి అశ్రుమతివలె తేజము వాసెననియుఁ జెప్పవచ్చును. ఇట్టి సహృదయరంజకమగు నీ నాటకము ద్విజేంద్రుని గద్యనాటకములలో నెల్ల మొదటిది. 'రాణా ప్రతాపసింహ' తొలుదొల్త కలకత్తాలో సుప్రసిద్ధమగు మినర్వాథియేటరునందు ప్రదర్శింపఁబడి ప్రేక్షకుల నానందమున నోలలాడించెను. ద్విజేంద్రుఁడు గయలో నుద్యోగిగా నున్నకాలములో కొందఱు బంగాలీయువకులచే నిది ప్రదర్శింపఁబడినది. అప్పుడు ద్విజేంద్రుఁడుగూడ స్వయముగ శక్తసింహపాత్ర నభినయించెను.

ద్విజేంద్రుఁడు ఇతిహాసమును విశేషముగ నుల్లంఘింపకయే యీ గ్రంథము నింత యుత్తమముగ రచించెను. ఇది సామాన్యలేఖకుల పనిగాదు. ఇతిహాసము మౌనమువహించిన స్థలములందు మాత్రము నూతనపాత్రముల సృజించియు ప్రసిద్ధపాత్రముల ప్రకృతిననుసరించి కార్యక్రమమును గూర్చియు తన యమోఘకల్పనాశక్తిని సార్థకపఱచెను. టాడ్ దొరగారి రాజస్థానకథావళి నాధారముచేసికొని ద్విజేంద్రుఁడు ఇందు ప్రతాపునియందు మానవోచితమగు క్షణికదౌర్బల్యమును జూపి అయన అక్బరుని యధికారమును స్వీకరింపుచు నొకజాబు వ్రాసినట్టును మరల పృథ్వీరాజాదుల ప్రేరణముచే నక్బరుపై తిరుగుపాటు చేసినటులును వ్రాసెను. కాని ప్రతాపుఁ డక్బరున కెన్నఁడును లొంగలేదని అధునికచరిత్రలేఖకులు సప్రమాణముగ నిరూపించిరి. మఱియు 'అక్బరునామా' వ్రాసిన అబుల్ ఫజల్ స్వల్పవిషయములనుగూడ కొండంత చేసి వ్రాసియుండగా ఇది నిజమగుచో తన గ్రంథమున దీనిని వ్రాయకయుండునా?

ప్రతాపుని యొక్కణిక దౌర్బల్యముగూడ సత్యేతరమని యెఱిఁగియుండువో ద్విజేంద్రుఁడు తన లేఖినిని ఇంక నెంతచక్కనిత్రోవను నడిపించెడివాఁడోగదా!

ప్రకృతగ్రంథము అస్మన్మిత్రులును సుగుణభూషితులు నగు శ్రీ పర్వతనేని నారాయణరావుగారి ప్రేరణాఫలితము. వారు నావద్ద దీనిహిందీ అనువాదమును జదువుచు నొకనాడు దీనిని తెలిఁగింపుఁడని కోరిరి. నే నందు కియ్యకొని దీనిమాతృకను వంగభాషలోఁ జదివితిని. నావద్ద పంచమసంస్కరణపుప్రతియే యుండెను. అందు కొన్నిరంగములే పూర్తిగ తగ్గించఁబడినవి. అదియునుగాక మాతృకకంటె హిందీ అనువాదమే చాల బాగుగనున్నది. అందుచే నే నీగ్రంథము ననువదించుటలో విశేషించి హిందీ అనువాదమునే అనుసరించితిని. గాన తదనువాదకర్తకు విశేషకృతజ్ఞుఁడను. పాఠకులయు నటకులయు రుచిననుసరించి ఇందు కొన్నిపద్యములుగూడ చేర్చితిని. ఈ గ్రంథమును జదివినవారికి దీని ప్రచార మెంతయావశ్యకమో వేఱుగఁ జెప్పనక్కఱలేదు. పాఠకులు చదువుటకు ముందు శుద్ధపత్రిక ననుసరించి అచ్చుపొరపాట్లు దిద్దుకొనుట మంచిది. మఱియు నిందు శుద్ధపత్రికలో సవరింపరాని Comma, Full-stop, Hyp-hen మున్నగువాని దోషములును గొన్నిగలవు. వానిని సవరించుకొనుట నటకులకు పరమావశ్యకము. ఈ గ్రంథరచనకు నన్ను ప్రేరేపించుటయేగాక దీనిముద్రణముఁగూడ విశేషసహాయ మొనర్చిన శ్రీ పర్వతనేని నారాయణరావుగారికి పరమేశ్వరుడు సుపుత్రాద్యైశ్వర్యములనొసఁగి రక్షించుగాత.

జంధ్యాల శివన్న శాస్త్రి.

పాత్రసూచిక

పురుషులు

ప్రతాపసింహుఁడు— మేవాడురాణా
అమరసింహుఁడు— ప్రతాపుని పుత్త్రుఁడు.
శక్తసింహుఁడు—ప్రతాపుని తమ్ముఁడు.
అక్బరు— మొగలచక్రవర్తి.
సలీము—అక్బరు కొడుకు.
మానసింహుఁడు— మొగల సేనాపతి.
మహాబత్ఖాన్— మొగల సేనాధ్యక్షుఁడు.
పృథ్వీరాజు— మొగల దర్బారుకవి.
ప్రతాపుని సామంతులు, మంత్రి, భిల్లనాయకుఁడు. అక్బరు సభాసదులు,
ద్వారపాలకుఁడు, మున్నగువారు.

స్త్రీలు.

లక్ష్మి— ప్రతాపుని పట్టమహిషి
ఇర— ప్రతాపుని కూఁతురు.
జోషీబాయి— పృథ్వీరాజు భార్య.
మేహరున్నిసా— అక్బరు కూఁతురు.
దౌలతున్నిసా— అక్బరు మేనకోడలు.
రేవ— మానసింహుని చెల్లెలు.

శుద్ధపత్రిక

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
3	18	గురుర్యా	గురువర్యా
6	17	రందునది	రించునది
9	14	అపడు	అపాడు
18	5	కలి	కవి
17	8	యుండద	యిది
19	2	మాట	నిమాట
26	7	ప్రలానము	ప్రలాపము
27	8	లేవ—	(ఇది నాల్గవ పంక్తిలో ఉండవలెను.
32	12	గుదరని	గురని
54	28	జాలనిలో	జాలనిచో
65	9	పాశ	ప్రేమపాశ
74	15	కలికి	కలిక
75	4	నాకి	నాకీ
,,	12	నాయన్న	నాయన
81	9	లాల—	(ఇది లేదు)
,,	10	కొనను	కొనను. లక్ష—
,,	11	లక్ష—	(ఇది లేదు)
87	24	(కొన్ని ప్రతులలో పంక్తి)	ప్రతా—అవును. నేనే ప్రతాపసింహుడను.
94	12	గొట్టినాడు	గొట్టినవాడు
97	26	నైత	నైతిక
125	12	హరి—	మోహ—
137	14	కౌంతేయు	కౌంతేయు
145	1	వులును	వులను
156	24	ఖామా	భామా
178	19	జారా	రాజా

☞ 129 పు. 2వ పంక్తిలో "కోపమలసినంతయున్నది, మొదలగు వాక్యము ప్రతాపసింహునిది.

శ్రీ

రాణా ప్రతాప సింహ

ప్రథమాంకము

ప్రథమదృశ్యము

స్థానము—కోమలమీరు అడవిలో కాళిదేవాలయము,

సమయము—ప్రభాతము.

[కాళిప్రక్కగా కుల పురోహితుఁడు నిలఁబడి యుండును. కాళికి ఎదురుగా రాణా ప్రతాప సింహుఁడును రాజపుత్ర సామంతులును కుడి మోకాలు నేల మోపి అర్ధోప విష్టులై భూమిపై నుంచిన ఖడ్గములు స్పృశించి యుందురు.]

ప్రతాప:—అగుచో మీరు కాళీమాతసముఖమున శపథము చేయుఁడు.

అందఱు:—శపథము చేయుచున్నాము.

ప్రతాప:—అవసరమగుచో మేము చిత్తూరుకై ప్రాణము లిచ్చెదము.

అందరు:—అవసరమగుచో మేము చిత్తూరుకై ప్రాణము లిచ్చెదము.

ప్రతాప:—ఎంతవఱకు చిత్తూరు స్వాధీనము కాదో—

అందరు:—ఎంతవఱకు చిత్తూరు స్వాధీనము కాదో—

ప్రతాప:—అంతవఱకు భూర్జపత్రములందు భోజనము చేసెదము—

అందఱు—:అంతవఱకు భూర్జపత్రములందు భోజనము చేసెదము—

ప్రతాప:—అంతవఱకు తృణశయ్యపైఁ బరుండెదము—

అందఱు:—అంతవఱకు తృణశయ్యపైఁ బరుండెదము—

ప్రతాప:—అంతవరకు వేషభూషలఁ బరిత్యజించెదము—
అందఱు:—అంతవరకు వేషభూషలఁ బరిత్యజించెదము—
ప్రతాప—మఱియు శపథము సేయుఁడు. మేముగాని మావంశములోఁ బుట్టువారుగాని యెన్నఁడును మొగలులతో నెట్టి సంబంధమును జేయము.
అందఱు— (అదియేమాట అందురు.)
ప్రతాప—ప్రాణముండగా మొగలులకు దాస్యము చేయము.
అందఱు—(అదియేమాట అందురు.)
ప్రతాప—మాకును వారికిని మధ్య నెప్పుడు ఖడ్గమే యుండును.
అందఱు—(అదియే అందురు.)
పురోహి—స్వస్తి స్వస్తి స్వస్తి (మంత్రోదకము చల్లును.)
ప్రతాప—రాజపుత్రవీరులారా! నేఁడు కాళీమాత సన్నిధిని ఖడ్గము స్పృశించి మీరీప్రతిజ్ఞ జేసితిరి. దీని కెన్నఁడును భంగము గలుగఁగూడదు. మఱల వినుఁడు.

సీ॥ వీర సిసోదియాస్మారక చిహ్నంబు
చిత్తూరుకోట నార్జించువఱకు
రాజపుత్రుల మహారవి తేజమున కోడి
యక్బరు ఘూకమ ట్లణఁగువఱకు
తాతముత్తవులకుఁ దావాసంగిన మాతృ
దేశఋణమ్మును దీర్చువఱకు
శూర బాహుజమహాశోణితోర్వరయైన
మేవాడు నిర్భీతి మెలఁగువఱకు
గీ॥ వేషభూషలు సుఖభోగవితతి నెల్ల
చినుఁగుగుడ్డను బలె విసర్జింపవలయు
సర్వసన్యాసదీక్షను జరుపవలయు
స్వేచ్ఛఁ బ్రాణమ్ము లర్పణ సేయవలయు॥

అందఱు—రాణాజీ! అట్లే గావింతుము. ప్రాణము లుండఁగా మా ప్రతిజ్ఞకు భంగము రానీయము.

ప్రతాప—నేఁ డీకఠిన ప్రతిజ్ఞ యేలకు చేయించితినో మీ రెఱుఁగుదురా? దేశసేవ యొనర్చుట సామాన్యమైన పని గాదు. ఇది చాల కఠోరవ్రతము. ఉపన్యాసము లిచ్చుటవలనను గీతములు పాడుట వలనను దేశసేవ సాధింపఁబడదు. కఠోరదుఃఖము లనుభవించ వలయును. హృదయరక్తమును బొటింపవలయును. ప్రాణము లొడ్డి పని చేయవలయును. మంచిది మీ రింక కోమలమీారు నకుఁ బొండు.

(సామంతులు నిష్క్రమింతురు. ప్రతాపుఁడు ఉద్రేకముతో దేవ శము ముందు తిరుగుచుండును. పురోహితుఁ డించుకసేపు నిశ్చలుఁడై నిలఁబడి పదపడి నిట్లు పిలుచును.)

పురో—ప్రతాప్! (ప్రతాపుఁ డెదురుగా తిరుగును.) నేఁడు నీవు చేసిన ప్రతిజ్ఞను పాలింపఁగలవా?

ప్రతాప—గుర్వార్యా! నా చేఁగానిచో నే నిట్టిప్రతిజ్ఞను బట్టియేయుండను. అదియునుగాక.

సీ॥ మాతృసేవాత్యారమాణమానసులకు
ధనమును నీరసేంధనము నొండె
జన్మభూమీ మోక్షసాధనాచణునకు
పురమును నడవికాఁపురము నొండె
పతితసంఘోద్ధారపరునకు పక్వాన్న
జాలమ్ము వనకందమూల మొండె
దేశావమాన నిష్కాసనాతురునకు
భోగమ్ము కాలాహిభోగ మొండె
గీ॥ మాతృదేశ సముద్ధార మహితభాగ్య
మెల్లరలలాటమున లిఖియింపఁబడదు
కాని నిజజన్మభూమికై ప్రాణమొసఁగు
పరమసౌభాగ్య మెల్లరవశము గాదె॥

పురో—ప్రతాప్! నిన్ను ఆశీర్వదింపుచున్నాను. నీ వీప్రతిజ్ఞాపాలనమందు సఫలుఁడ వగుదువుగాక (ప్రస్థానము)

(ప్రతాపుఁడు ఉద్రేకముతో నిటునటు తిరుగుచుండును.)

ప్రతాప—అక్బర్!

ఉ॥ ధీరత శత్రువీరుల సుతీక్ష్ణశరాహతి కోర్చి ముంగటన్
బోరఁగలేక పందవయి పొంచి యధర్మరణమ్మునందు ము
న్నా రవితుల్యతేజుని మహాసుగుణున్ జయమల్లుఁ జంపి చి
త్తూరును మాదుపెన్నిధిని దోఁచితి వెట్టులొ రాజతస్కరా.

మేము క్షత్రియులము. చేత నగుచో న్యాయయుద్ధ మొనరించి చిత్తూరుకోట తిరిగి సాధించెదము. అన్యాయ యుద్ధమును చేయము. నీవు మొగలుఁడవు. దూర దేశమునుండి వచ్చితివి. భారత దేశమునుండి యించుక నేర్చుకొనిపొమ్ము. ధర్మయుద్ధమన నేమియో, ఏకాగ్రత, సహిష్ణుత, యథార్థ వీరత్వము అన నేమియో నేర్చుకొని పొమ్ము. దేశము నకై ప్రాణము లెటు లర్పింపవలయునో నేర్చుకొనిపొమ్ము. నేఁడు నీవు భారతచక్రవర్తి వి. సింహాసనాసీనుఁడవయి నీచులు, పిరికిపందలు, స్వధర్మద్రోహులు నగు పెక్కు రాజపుత్రులఁ జూచియుందువు. నీదర్బారులోఁజేరి నీకు స్తోత్రపాఠములు వినిపించుచు గౌరవపదవులఁ బడిసిన వారును యుద్ధక్షేత్రములనుండి కాలికిబుద్ధిచెప్పువారును తమకూతుళ్ళను భార్యలను, చెల్లెంద్రను నీపాదములకడ సమర్పించి నిన్ను సంతోషపెట్టు వారునునగు రాజపుత్రులను జూచియుందువు కాని యిప్పటికిని మాతృదేశారాధనకై తమప్రాణముల బలినిడువారును, స్త్రీజాతి గౌరవమును గాపాడువారును, నీవు దయతో నొసంగిన బహుమానముల దృణీకరించువారును నగు రాజపుత్రులుగలరని నీకు చూపింపఁగోరుచున్నాను. నీవు మాతండ్రియగు ఉదయసింహుఁడు చిత్తూరునుండి పాఱిపోవుట చూచితివి. ఇప్పుడు ఆయనకొడుకు ప్రతాపసింహుఁడు చిత్తూరుదుర్గమున ప్రవేశించుటకై చేయు ప్రతిజ్ఞచూడుము. (కాళికెదురుగ మోకరిలఁబడి చేతులుజోడించి) అమ్మా! నాశపథము సఫలమగునట్లును, ధర్మము జయించునటులను, మహత్త్వమందలి మహాత్త్వము నష్టముగాకుండునటులను అనుగ్రహింపుము. అమ్మా! జన్మభూమీ! నాపై విశ్వాసముంచుము.

సీ॥ లేఁబ్రాయమున నింద్రు లెక్క సేయని మేటి
మగఁటిమిఁగల రఘుక్ష్మావరుండు
కోతులమూకఁ గైకొని నిమిత్తమ్ముగ
రావణుఁ దునుమాడు రాఘవుండు
అలఖురాసానుపర్యంతమ్ము రిపుల వె
న్నాడు బాప్పా రావలాధిపుండు
కాబులీయుల భుజాగర్వ సర్వస్వమ్ము
రూపుమాపిన ఖుమానృపవరుఁడు
గీ॥ మొదలుగాఁగల భూవరుల్ పుట్టినట్టి
వంగడమ్మున జనియించి వారి ప్రతిభ
గంగఁ గలియంగ మ్లేచ్ఛునొక్కనికి జన్మ
భూమి నొసఁగుడె ప్రాణముల్ పోకమున్న॥

ఎవరు? (వెనుకకు తిరిగిచూడ శక్తసింహుఁడు నిలఁబడియుండును) ఎవ్వరు? శక్తా?

శక్త—అవును అన్నా! నేనే.

ప్రతాప—నీవింతదనుక నెచట నుంటివి?

శక్త—ఎంతదనుక?

ప్రతాప—కాళీపూజ జరుగుచున్నంతదనుక.

శక్త—ఇంతదనుక నేనా?

ప్రతాప—అవును.

శక్త—గణితము వేయుచుంటిని.

ప్రతాప—గణితము వేయుచుంటివా?

శక్త—అవును. అన్నా! అంధకారమయమగు భవిష్యత్తులో గంతులు వేయుచుంటిని. జీవితసమస్యలఁ బరిష్కరింపుచుంటిని.

ప్రతాప—నీవు కాళీపూజ సేయలేదా?

శక్త—పూజయా! లేదు అన్నా! పూజపై నాకు నమ్మకము లేదు. పూజవలన లభించునదియుఁ గనుపడుట లేదు. కాళీమాత నోరు తెఱచుకొని మట్టిబొమ్మవలె కదలక మెదలక నిలచి యున్నది.

ఇందు ప్రాణము లేదు. ఏమియు శక్తి లేదు. అన్నా! దీనిని పూజించుటకంటె గణితము వేసికొనుట మంచిది. కనుకనే నేను గణితము వేయుచుంటిని. ఒకసమస్యను బరిష్కరింపుచుంటిని.

ప్రతాప—ఆసమస్య యేమి?

శక్త—జన్మాంతరవాదము సత్యమగునా కాదా యని. జన్మాంతరముపై నాకు నమ్మకము లేదు. అది నిజమైనను గావచ్చును. మానవుఁడీప్రపంచమునకు ధూమకేతు వాకసమునకుఁ బలె వచ్చుచు పోవుచుండును. ధూమకేతు వాకసమున మరలఁ గనుపట్టదు. అది మఱియొక యాకాశమునఁ గనపడినఁ గనపడ వచ్చును. మఱియు పెక్కు శక్తు లేకీభవించుటచే మానవుని జన్మమును ఆశక్తులు విడిపోవుటచే మానవుని మృత్యువునుగూడ కావచ్చును, ఈ "నేను" విచ్ఛిన్నమగుడు ఈపెద్ద నేను నుండి పదిపంద్రెండు చిన్న "నేను" లు పుట్టుచుండవచ్చును.

ప్రతాప—శక్తా! జీవిత మంతయు నిట్టి ప్రశ్నలయందును వాని చర్చలందునే గడపెదవా? ఈప్రశ్నలకును ఈచర్చలకును అంతము లేదు. ఈవ్యర్థచర్చలు మానివేయుము, రమ్ము. మనము గలసి పనిచేయుదము. సహజముగ మన బుద్ధికి గోచరించునదియు స్వాభావికప్రవృత్తి గలదియునగు పనినే చేయుదము

శక్త—పనియా! ఏమిపని?

ప్రతాప—శక్తా! ఇంచుక దీనయగు నీజన్మభూమివంకకుఁ జూడుము. అన్యులు దీని నెట్లు పదదళితము చేయుచున్నారో. దీని యలంకారముల నూడఁదీసి దీని నెటుల కష్టములపాలుసేయుచున్నారో చూడుము. రమ్ము. మనముభయులము కలసి దీనియుద్ధారణమునకై జీవితమర్పింతము. ఇంతకంటె మంచివిషయ మేమున్నది?

(ప్రతాపుని మంత్రియగు భీమాషా ప్రవేశించును,)

భీమా—రాణాజీ!

ప్రతాప—మంత్రివరా! ఏమి సమాచారము?

భీమా—గుఱ్ఱము సిద్ధముగ నున్నది.

ప్రతా—రమ్ము శక్తా! రాజధానికి పోదము. చాల పనులు చేయవలసి యున్నవి. రమ్ము కోమలమీరునకుఁ బోదము,

శక్తి—మీరు నడువుఁడు. నేను వచ్చుచున్నాను.

(ప్రతాపభీమాషాలు నిష్క్రమించెదరు.)

శక్త—(కొంచెము సేపు ఇటునటు తిరిగి) జన్మభూమియా? అది నాకేమి యగును. నేను దానికేమియగుదును? నేనిచ్చట పుట్టిన మాత్రమున నేమాయెను? ఇంతమాత్రమున నే నేను దానికి చేయు పనియేమియు నుండదు. నేనిక్కడ పుట్టనిచో సముద్రములోఁ బుట్టువాఁడను. లేక ఆకాశమునఁ బుట్టువాఁడను. అది యునుగాక జన్మభూమినన్నింత దనుక బహిష్కరించినది. పట్టెఁ డన్నమేని నాకు పెట్టజాలకపోయెను. దానికై నేను నాజీవిత మేల యర్పింపవలయును? ప్రతాప్! నీవు మేవాడుకు రాణావు నీవు దానికై ప్రాణము లర్పింపఁదగుదువు. నేను ఎందుకర్పింప వలయును? నా కది యేమి యగును? — ఏమియు కాదు. (మెల్లగా నిష్క్రమించును.)

—* ద్వితీయ దృశ్యము *—

స్థానము—కోమలమీరులో రాజప్రాసాదసమీపమునసరోవరము.

సమయము—సాయంకాలము

(ప్రతాపుని పుత్రికయగు ఈర ఒంటరిగా అస్తమించు సూర్యుని చూచు చుండును.)

ఈర—(చప్పట్లు వేయును) ఈదృశ్య మెంత గరిమామయముగ నున్నది సూర్యుఁ డస్తమించుచున్నాఁడు. ఆకాశమంతటను సూర్యుఁడు దక్క మఱియెవ్వరును లేరు. నాలుగు జాములకాలము ఆకాశ మరుక్షేత్రమునఁ దిరిగి ఇప్పుడు విశ్వమునంతను రక్తవర్ణమున నద్ది అస్తమించుచున్నాఁడు.—ఏగరిమతో నుదయించెనో ఆగరిమతోడనే యస్తమించు చున్నాడు. అదుగో అస్తమానమయినది.

రాణా ప్రతాపసింహ.

పీతవర్ణమగు నాకాశమిపుడు ధూసర మగుచున్నది. దేవతల కారతి యెత్తుటకోయన సంధ్య అస్తంగతుఁడగు సూర్యుని శూన్యదృష్టితోఁ జూచి చూచి ఇప్పుడు విశ్రామమందిరమునఁ బ్రవేశించుచున్నది. ప్రియసఖీ! సుందరసంధ్యా! ఇప్పుడు నీ కేమి విచారము? నీహృదయమున ఇంతనైరాశ్య మేల నిండియున్నది? నీ వింత ఖిన్నవు, ఇంత నీరవవు, ఇంత కాతరవు నేఁ యగు చుంటివి? చెప్పుము. చెప్పుము ప్రియసఖీ!

(ఈరకు వెనుకగ ఈరతల్లియగు లక్ష్మీబాయి ప్రవేశించును.)

లక్ష్మి—ఈరా!

ఈర—ఉలికిపడి ఏమి అమ్మా?

లక్ష్మి—నీ వింతదనుక నిచ్చట నేమిచేయుచుంటివి?

ఈర—అమ్మా! నేను సూర్యాస్తమయమును జూచుచుంటిని, ఎంత సుందర దృశ్యమో చూడుము. ఇప్పుడాకాశ మెంత యుజ్వల ముగ నున్నది. పృథ్వి యెంత శాంతముగానున్నది! నాకు సూర్యాస్తమయదృశ్యము చాలబాగుగనుండును.

లక్ష్మి—ఇదినీవు నిత్యము చూచుదృశ్యమేకదా!

ఈర—అయినను ఇది నిత్యము బాగుగనేయుండును. ఇది ఎప్పటికిని ప్రాతగిలదు. సూర్యోదయముగూడ చాల అందముగనే యుం డును కాని సూర్యాస్తమయమున అందులోలేని యొకవైచి త్ర్యము గలదు. ఇందులో గంభీరమగు నొక రహస్యమును, నిగూఢమగు నొకవేదనయు, అపారము నగాధము నగు నొక విషాదమును, మధురమగు ప్రశాంతియుఁ గలవు. అమ్మా! ఇది చాల సుందరము చాల సుందరము.

లక్ష్మి— ఇక్కడ నీకు చలివేయును.

ఈర—లేదు అమ్మా! నాకు అభ్యాస మయినది. అమ్మా! నీవీనక్ష త్రముఁ జూచుచుంటివా?

లక్ష్మి—ఏనక్షత్రము?

ఈర—ఇదుగో పశ్చిమాకాశమున— అస్తమించుసూర్యునకు ముందుగా

లక్ష్మి—ఆఁ చూచుచున్నాను.

ఈర—దానిపే రేమో యెఱుఁగుదువా?

లక్ష్మి—లేదు.

ఈర—దానిని శుక్రుఁడందురు. ఇది ఆరుమాసములు ఉదయించు సూర్యునకు ముందుగను, ఆఱుమాసములు అస్తమించుసూర్యునకు వెనుకగను నడుచుచుండును. ఒకప్పు డిది ప్రేమరాజ్య సన్న్యాసియు, ఒకప్పుడు సత్యరాజ్యపురోహితుడు నగుచుండును అమ్మా! ఈచుక్క యెంతస్థిరముగను, ఎంతఉజ్జ్వలముగను, ఎంత సుందరముగను ఉన్నదో చూడుము.

(ఈర రెప్పయార్పక చుక్కవంక చూచుచుండును లక్ష్మి ఇంచుక సేపు ఈరవంక చూచి తర్వాత ఆమెవద్దకు వెళ్లి చేయిపట్టుకొనును.)

లక్ష్మి—మంచిది. ఈరా! ఇంక కద. ఇంటికి పోదము. ప్రొద్దుక్రుంకినది.

ఈర—అమ్మా! కొంచె మాగుము. అదుగో ఎవ్వరో పాడుచున్నారు.

లక్ష్మి—ఆఁ! ఈనిర్జనప్రాంతమున ఆపెడున దెవ్వరు?

(కొంచెము దూరమున ఒకవిరాగి పాడుచుపోవును.)

గీతము

సుఖముసుఖంబని భ్రమయ నేల యిటు సుఖ మారయఁగ ఫలంబే
సఖుఁడు దుఃఖమే నాకు నిక్కముగ సౌఖ్యంబును దుఃఖంబే॥
ప్రాణమిత్రమగు దుఃఖం బెయెడఁ బ్రబలప్రీతి నను డాయఁగా
జానుగ సుఖ మాక్షణమునఁ బరిహాసము సేయుచు నను బాయఁగా
అరుదుగ నెన్నఁడో దయచేసి సుఖం బంఘ్రిరజము పైఁ జల్లఁగా
బరువడి మొగమున నవ్వుట కనులబాష్పము దాఁగుటయు ఘటిల్లఁగా
అశ్రుబిందువులఁ గాంచినయంతట నరుగు విరక్తసుఖంబు
ప్రశ్రయముగ నాయశ్రులఁ దుడువగఁ బఱతెంచును దుఃఖంబు॥

(ఇద్దఱు నిలఁబడి గీతము విందురు. ఈర కన్నీరు గార్చును.)

ఈర—అమ్మా! ఇతఁడు చెప్పినది నిజము. పెక్కుసమయములందు సుఖముకన్న దుఃఖమే నాకు చాల మధురముగఁ గనుపట్టును.

లక్ష్మి—దుఃఖము మధురముగ నుండునా?

ఈర—అవును అమ్మా! దుఃఖము మధురముగ నుండును. త్రోవలో నెందరో ఆడుచుపాడుచు నుల్లాసముతో పోవుచుందురు. ఎవ్వడేని వారివంక కన్నెత్తి చూచునా? కాని వారిలో నొకఁడు దుఃఖితుఁడై ఏడ్చుచుండ వానికష్టకారణము దెలిసికొనుటకును సహానుభూతితో వానికన్నీరు తుడుచుటకును బుద్ధి పుట్టదా? యుద్ధములో విజయమందినవానికథ వినుటకు బాగుగ నుండునా లేక ఓడినవానికథయా? మనకెవ్వరిపై సహానుభూతి గలుగును? ఆనందగీతము చక్కగ నుండునా దుఃఖగీతమా? ఉష సుందరముగ నుండునా. సంధ్యయా? సౌభాగ్యగర్వితయు సంగీత మధురయు నగు ఢిల్లినగరిని జూడ మనసు గలుగునా లేక విగతవైభవయు మలిననీరవయునగు మధురాపురినా? అమ్మా! నిజముగ సుఖములో నొకవిధమగు అహంకార ముండును. దానిస్వరము ఉచ్చమును కర్కశమునగును. కాని విషాదము చాల నమ్రము గను నీరవముగను ఉండును.

లక్ష్మి—అవును. ఈమాట నిజమే

ఈర—దుఃఖము చాల గొప్పదియు సుఖము చాల నీచము అని నా యభిప్రాయము. దుఃఖములో సేకరించినదియే సుఖములో వెచ్చింపఁబడును. దుఃఖము సృష్టికర్తయు సుఖము భోక్తయు నగుచుండును. దుఃఖము వేరువలె మట్టినుండి రసము నాకర్షించును. అయితే సుఖము ఆకులుపూలువలె వికసితమై ఆరసమును వ్యయముచేయును. దుఃఖము వర్షరుతువువలె కాగికాగియున్నభూమిని జల్లపఱచును. సుఖము శారదపూర్ణచంద్రునివలె వచ్చి దానిపై హాస్యమొనరించును. దుఃఖము రయితువలె పొలము దున్ని సాగుచేయును. సుఖము రాజువలె అందు పండిన పంట ననుభవించును. సుఖ ముత్కటమును, దుఃఖము మధురము నగును.

లక్ష్మి—ఈరా! ఈసంగతులన్నియు నాకుఁ దెలియవు. కాని ప్రపంచములో గొప్పవారని చెప్పబడు వారెల్లరు దుఃఖితులే. వారే

దురదృష్టవంతులు. వారికే అనేకకష్టములు కలుగుచుండును. ఇది నేను బాగుగ నెఱుంగుదును మఱియు అప్పుడప్పుడు మంగళమయుండగు ఈశ్వరునివిధానములో ఈనియమ మెందుకా యని ఆలోచించుచుందును.

(ప్రతాపుని పుత్రుఁడు అమరసింహుఁడు ప్రవేశించును.)

అమర—అమ్మా!

లక్ష్మి—ఏమి అమర్

అమర—అమ్మా! నాయనగారు పిలుచుచున్నారు.

లక్ష్మి—పద వచ్చుచున్నాను. (ఈరతో) రమ్ము అమ్మాయీ! పోదము

(లక్ష్మియు ఈరయు పోవుదురు అమరుఁడు ఒకకొయ్యపై కూర్చుండును.)

అమర—అమ్మయ్యా! రోజంతయు పడి కొట్టుకొనఁ గొట్టుకొనఁగా నిప్పటికి కొంచెము విశ్రాంతి చిక్కినది. ఎటులో ప్రాణము దక్కినది. రామరామా! రాత్రి లేదు. పగలు లేదు. ఎప్పుడు నొకటే యుద్ధము. నాయనగారి కింక ఆఁకలి దప్పిక, నిద్రభద్ర ఏమియు లేవు. ఎప్పుడు శిక్షణము, వ్యాయామము, ఆలోచన ఇదియే పని. నేను పేరునకు రాజపుత్రుఁడనే కాని నాకును ఒకమామూలు సిపాయికివలె యుద్ధవిషయము లన్నియు నేర్చుకొనవలసిన దే. రాజకుమారుఁడ నగుటచే నింక నాకేమి లాభము? బుద్ధిపూర్వకముగ అనంతదారిద్ర్యమును శాశ్వతదైన్యమును తెచ్చి పెట్టికొనుట యేలాగో నాకు తెలియకున్నది. అదుగో బాబుగారు వచ్చుచున్నారు. బాబూ!

తాపసింహుఁడు—(ప్రవేశించి) ఎవరు? అమర్!

మర—అవును బాబూ! నేనే, మీ రిప్పు డిచ్చటకేల వచ్చితిరి?

తా—ఏమియు లేదు. ఊరకయే తిరుగుచున్నాను. ఇచ్చట కొంచెము గాలి వీచుచున్నదని వచ్చితిని. ఇంటిలో చాల వేడిగా నున్నది. ఈఉదయసాగరతీరము చాల సుందరమైనది.

మర—ఏమి బాబూ! మీరుండుచోట నిట్టి సరోవరము లేదా?

శక్త:—లేదు అబ్బాయీ!

అమర:—ఈకోమలమీరు మీ కెటు లున్నది?

శక్త:—బాగుగనే యున్నది.

అమర:—ఏమి బాబు! నాయనగారు మిమ్మిచ్చటకు పిలిచినది మొగలు లతో యుద్ధము చేయుటకేనా!

శక్త:— లేదు. ఆయననాకు ఆశ్రయ మొసఁగినాఁడు

అమర:—ఇంతకుముున్ను మీరు నిరాశ్రయులా?

శక్త:—ఆఁ. అన్నమాటయే.

అమర:—మీరు నాయనగారికి సహోదరులే కాదు?

శక్త:—అవును.

అమర:—అయితే ఈరాజ్యము ఆయన కెట్టిదో మీకు నట్టిదియే.

శక్త—లేదు అబ్బాయీ! మీనాయన నాకంటె పెద్దవాఁడు

అమర—అయిన నేమి? మీరు ఆయనకు సోదరులేకదా.

శక్త—అవునుకాని శాస్త్రప్రకారము జ్యేష్ఠుఁడే రాజ్యార్హుఁడు.

అమర—ఏమి బాబూ! ఈనియమ మేల పుట్టినది? జ్యేష్ఠుఁడగు మాత్ర మున శ్రేష్ఠుఁడు కాఁజాలఁడుగదా. ఇంక నీనియమ మెందులకు?

శక్త— ఇది నే నెఱుఁగను. (స్వగతము) ప్రశ్న న్యాయముగ నేయున్నది. జ్యేష్ఠుఁడగుమాత్రమున శ్రేష్ఠుఁడు కాఁజాలఁడు. ఇంక నీసాంఘిక నియమ మేల పుట్టినది? శ్రేష్ఠుఁడె రాజ్యాధికారియగునటుల నియమ ముండఁదగినది. చిన్నవాఁడైన నేమి పెద్దవాఁడైన నేమి? ఈనియమ మేలపుట్టినదో తెలియకున్నది. ఇది చాల గొప్ప సమస్యయే.

అమర—బాబూ! మీ రేమి యాలోచించుచుంటిరి?

శక్త—ఏమియు లేదు. పద ఇంటికిఁ బోదము. రాత్రి అయినది.

(ఇద్దఱు నిష్క్రమింతురు)

తృతీయదృశ్యము.

స్థానము — రాజకవియగు పృథ్వీరాజుగృహాంగణము. సమయము:— ప్రభాతము (పృథ్వీరాజు, రాజసభాసదులగు మార్వాడు, అంబరు, గ్వాలియరు, చందేరీరాజులు కూర్చుండియుందురు.)

మార్వా—కవిరాజుగారూ! కొంచెము మీపద్యము వినిపించుడు. (అంబరురాజువంక చూచి) చాల చక్కనిపద్యము. చాల చక్కనిది

అంబరు—ఈగందరగోళము కట్టిపెట్టండి. పద్యాలకు గిద్యాలకు ఇది సమయము గాదు చక్కని హాస్యప్రసంగము చేసికొందము రండు.

మార్వా—అటుల కాదు. కొంచెము వినుడు. ఆపద్యము పేరెంత సుందరముగ నున్నదో దానిభావము నంతసుందరముగనున్నది. వృత్తముకూడ విషయానురూపముగ నున్నది.

చందేరీ—ఆపద్యముపేరేమి?

పృథ్వీ—ప్రథమచుంబనము.

చందేరీ—పేరు చాల ముద్దుగ నున్నది. కొంచెముచదువుడు విందము

అంబరు—ప్రథమచుంబనమా? దీనినిగూర్చికూడ పద్యము వ్రాయ వచ్చునా?

పృథ్వీ—ఎందుకు కూడదు? మీరు మాటాడునంతలో పద్యమే చదివెడివాఁడను. మంచిది వినుడు.

అంబరు—పద్యముగిద్యము కట్టిపెట్టండయ్యా? కవిరాజుగారూ! నేడు రాజసభలో క్రొత్తసమాచారము లేవైనఁ గలవా?

పృథ్వీ—వేఱుసమాచార మేమియుండును? రాణాయుద్ధసమాచారమే.

అంబరు—ఓహో! ప్రతాపసింహుఁడు అక్బరుబాదుషాతో యుద్ధమా? ఇది యసంభవము. అట్లయగుచో మన మిదివఱకే యుద్ధము చేసియుండమా?

గ్వాలి—అవును. లేనిచో మన మిటు లూరక కూర్చుందుమా?

చందే—నిజము.

మార్వా—"నవవికసితకుసుమితఘనపల్లవ" వహ్వా! ఎంత చక్కని కూర్పు! కవిరాజుగారూ! ఈశ్వరుఁడు మిమ్ము చిరాయువులఁ జేయుగాక.

అంబరు—బయలుదేఁనాఁడు మేవాడుకు మహారాణాయఁట!

గ్వాలి—ఒకచిన్న రాజ్యమునకు రాజే కాదండి!

చందే—అవును అదిమాత్రమెంత. ఇంతదనుక ఒకచిన్నకోట చిత్తూరు ఉండెడిది. అదికూడ మొగలులు జయించిరి.

అంబరు—రాజ్యములేని రాజు అందురే అటులున్నది.

మార్వా—కొంచెము తన పౌరుషమును జూపింపఁగోరుచున్నాఁడు. ఇంక నేమున్నది.

పృథ్వీ—అవును. ఇప్పుడు ప్రతాపసింహుఁడు కొంచెము చెలరేగుచున్నాఁడు. మొన్న నే హఠాత్తుగ పైనఁబడి మూడు మొగలు దండులను నఱికి వేసినాడు.

అంబరు—అంత పొగరుగ నున్నచో దానిఫలితము త్వరలోనే యనుభవింపఁగలఁడు.

చందేరీ—ఇంక రెండు పోదము. దర్బారులో హాజరుకూడ వేయించుకొనవలయును. (లేచి నిలబడును.)

మార్వా—పదుఁడు. (మార్వాడు గ్వాలియరు అంబరురాజులు నిలఁబడుదురు.)

అంబరు—నే నిది ప్రతాపునిమూర్ఖత్వ మందును.

చందే—నేను ప్రతాపుని యున్మాదమందును.

(అందఱును ప్రతాపుని పరిహాసింపుచుఁ బోదురు.)

పృథ్వీ—వీరిలో మార్వాడురాజే కొంత తెలివితేటలు గలవాఁడు. ఈమాఱు మంచిపద్య మొకటివ్రాయవలయును. దానికి విషయము— వియోగచుంబనము. ఎంత చక్కనివిషయము! అయితే దీని కేవృత్తము బాగుగ నుండును? కవికి అనురూపమగు వృత్తము నెన్నుకొనుటయే చాల కష్టము. కవిత్వసౌందర్యము వృత్తముమీఁద నే ఎక్కువ ఆధారపడియుండును.

(పృథ్వీరాజుభార్య జోషీబాయి ప్రవేశించును.)

పృథ్వీ—నీ విప్పుడు బయటి కేల వచ్చితివి?

జోషి—నేఁడు మీరు బాదుషాదర్బారునకు వెళ్లెదరా?

పృథ్వీ—వెళ్ళక చేయునది యేమి? నేఁడు బాదుషాగారి దర్బారు దినము. ఇంక నేనో ఆషాయిమాషాయిగాడనుగాను. భారత చక్రవర్తియగు అక్బరు బాదుషాగారి ఆస్థాన కవీశ్వరుఁడను. అబ్దుల్ ఫజలు ఒకటవనంబరు. నేను రెండవనంబరు.

జోషీ— (కరుణముతో) అమ్మో! దీనికి అహంకారమా! ఏపని పరమ లజ్జాకరమో దానికిని ఇంత అభిమానమా! (వ్యంగ్యముతో) మీరు అక్బరు బాదుషాగారి దర్బారు కవీంద్రులా! కర్మము ఫలించినది!

పృథ్వీ—ఔరా! నీహృదయమునఁ జాల కరుణరసము వెల్లివిరిసినది! నీ వెఱుఁగుదువా అక్బరు బాదుషా ఎంత గొప్పవాఁడో? ఆస ముద్రక్షితీశానాం! ఆర్యావర్తమంతయు ఆయనకుతల వంచినది.

జోషీ—ఛీ! నాథా! మీకు సిగ్గుగుట లేదా?

గీ॥ పుణ్యభరిత భవన్మాతృభూమి యిటుల
మొగలు పాదాలఁబడి కడుఁ బొగులుచుండె
మాతృపరిభావకుండను మాట లేక
మ్లేచ్ఛుఁ బొగడంగ మీమన మెట్లులొప్పె?

ఔరా! ఎంత యధఃపతనము! ఎంత యధఃపతనము! ఆర్యావర్తమంతయు నింకను అక్బరునకు తలవంచలేదని మీ రెఱుఁగరా?

గీ॥ దాస్యమున లభ్యమౌ భోగతతుల నెల్ల
తృణముగ గణించి బాదుషాయెడు ఘనత
నేలరాచెడు నాశౌర్యనిధి ప్రతాపుఁ
డింకనున్నాఁడు భరతమహీతలమున॥

పృథ్వీ—ఆఁ. కవిత్వదృష్టిలో ఇది యొక చక్కనిభావమే దీని కొక మంచి యుపమాన మీయవచ్చును. ఉత్తరంగమగు సముద్రపు లహరులలో గ్రామములు, పట్టణములు, గొట్టుకొనిపోవు

చుండ దూరమున నొకపర్వతము చలింపక దృఢముగ నిలచి యున్నది. అయితే యథార్థమునకు నేను సముద్రమును జూడ లేదు, దానిలహరులను జూడ లేదు.

జోషీ—

సీ॥ క్రమహంసీతూలికాతల్పముల వీడి
గండశైలములఁ బరుండియుంట
రత్నభూషితఘనప్రాసాదముల వీడి
తవిలి కుటిం దలదాఁచికొంట
స్వర్ణరౌప్యాది భోజనపాత్రముల వీడి
జీర్ణపర్ణముల భుజింపుచుంట
అతిరుచ్యబహుళపక్వాన్నమ్ములనువీడి
కందమూలముల నాఁకలిని విడుట
గీ॥ దేశమాత ఋణమ్మును దీర్చువఱకు
గారవపుమూట మేటి చిత్తోరుకోట
బాపటా నాటువఱకు ప్రతాపసింగు
దాల్చిన దరిద్రఘోరవ్రతమ్ము సుమ్ము॥

ఈ కఠోరసన్యాసవ్రత మెంత మహాత్మ్యపూర్ణము! ఎంత ఉన్న తము!

పృథ్వీ—కవిత్వదృష్టితోఁ గాంచిన నిది యొకమంచిభావమే. నే నిప్పు డు చూపించిన యుపమానము దీనికి చక్కఁగా తగియున్నది. చూడుము. పర్వతమువలె నిదియు నున్నతము, ఇదియు కఠో రము, ఇదియు దరిద్రము. కవిత్వదృష్టిలో దారిద్ర్యముకూడ నొక మహోన్నతభావమే. కాని సాంసారికదృష్టిలో నిదియం తగ నుపయోగకరము గాదు.

జోషీ—ఉపయోగకర మెందులకుఁ గాదు?

పృథ్వీ—దారిద్ర్యములో విలాసమునకు స్థానముండదు గదా. ఎన్నియో ఆవశ్యకవస్తువులు కఱవై యుండును. చలికాలములో వ్యర్థముగ నెక్కువ చలికి లోను కావలసి యుండును. ఆకలి వేయునపుడు

ఆహారము దొరకమిచే కడుపులో నెప్పుడు గడబిడగా నుండును. మఱియు ప్రపంచములో నున్నతర్వాత్మ మనుష్యుని కేదో యొక వస్తువుపైకి బుద్ధి పోకయుండదు. కొందమన్న దగ్గఱ పైనా ఉండదు. ఇంక దీనికి తగునట్లుగా ఇంటిలో పిల్లమేకఉన్న వానియవస్థ చెప్పనలవి కాదు. ఇంక నిది లాభకారి యెట్లో చెప్పుము.

జోషీ—వినుఁడు బుద్ధిపూర్వకముగ దారిద్ర్యవ్రతముఁ బూనినవానికి ముది అంత కఠోరము గాజాలదు. వానికి దారిద్ర్యములో ఏ రాజమకుటమందును ఏ సార్వభౌముని సామ్రాజ్యమందునుగను పడని యొక సౌందర్యము, ఒకగమ అనుభూత మగును. ఉన్నత హృదయుఁడు దారిద్ర్యమున కెన్నఁడును వెఱవఁడు. పైఁగా వాఁడు దారిద్ర్యమును ప్రేమించును. దానిని కోరి తెచ్చుకొనును. వాఁడు దారిద్ర్యములో నెన్నఁడును మస్తకము వంచఁడు—ఇంకను ఉన్నతము చేయును. వాఁడు దారిద్ర్యమునఁ జల్లారఁడు—ఇంకను ప్రజ్వరిల్లును.

పృథ్వీ—కాని కవితాక్షేత్రమునకు వెలుపల దారిద్ర్యసౌందర్యము చూచు భాగ్య మెవ్వరికిని గలుగదు.

జోషీ—కలుగదా?

సీ॥ అఱచేతనున్న 'రాజ్యము వీడి నారప
ట్టములను దాల్చఁడే రాఘవుండు
భ్రాతృధర్మంబు నిర్వర్తింప సన్యాసి
యయి మెలంగఁడె యల్లకయికసుతుఁడు
ఎల్లభోగములఁ ద్యజింప నామరణమ్ము
ప్రతిన దాలుపఁడే దేవవ్రతుండు
ఆలుబిడ్డల రాజ్య మన్ని విసర్జించి
మునివృత్తిఁ బూనఁడే బుద్ధమూర్తి
గీ॥ ధర్మమూలకమౌ దరిద్రతను దాల్చి
పూజ్యత వహింపరే వారు భువనమందు

త్యాగశోభితమైన తత్తనువు గరము
రాజిలదె సానవట్టిన రత్నమటుల

పృథ్వీ—వారు వట్టి వెఱ్ఱివారు. ఇల్లు వాకిలి లేనివార లెండ కెండుచు వానకుఁ దడియుచు బాధపడుచుండిరనఁ గొంత సబబుగలదు. కాని సలక్షణముగ నిండ్లు వాకిళ్ళుగలవారుగూడ నట్లు బాధపడు చుండిరనిన వారిని ఉన్మాదవైద్యశాలకు పంపవలసినదే.

జోషీ—ఈవెఱ్ఱితనమే ప్రపంచమున ధన్యత సంపాదించునది స్వామీ! మహాత్ములు కాఁగోరినచో త్యాగ మావశ్యకము.

పృథ్వీ—త్యాగమా? చాలు. అయితే నా కామహత్త్వము వలదు.

జోషీ—మహత్త్వముఁ బడయుట మీవంటివిలాసప్రియులవని గాదు. ఇది నేను బాగుగ నెఱుఁగుదును. అయితే మాతృభూమిని పరులు పరాభవించుచుండ దానిని రక్షింపఁ బూనుట యొక మహత్త్వము కాదు. అది ప్రతిపుత్రునకును గర్తవ్యము—చాల సాధారణకర్తవ్యము. నిలఁబడి మాతృపరాభవమును గనులారఁ జూచుట మహాత్వాభావమును సూచింపదు—మనుష్యత్వాభావ మును సూచింపును.

పృథ్వీ—చూడుము. మొదటిమాట స్త్రీ లిటుల గూఢగీర్వాణభాషలో మాట్లాడిన "చిన్ననోరు పెద్దమాట" అను సామెత వారియెడ సార్థకమగును. రెండవది వారు తార్కికులువలె ఇటుల తర్కము ప్రారంభించిన మగవాళ్ళకు దేశము విడిచిపాఱిపోవలసిన దుస్థితి సంభవించును.

జోషీ—గుప్పెడుమెతుకులు తిని పొట్ట నింపుకొనుట, సుఖముగ నిద్రించుట ఈమాత్రమువని సాధారణపశువులు చేయుగలవు. కాని మనుష్యుఁడు యేవిషయమునఁగాని ఇంచుకస్వార్థత్యాగము చేయఁ జాలనిచో, తన మాతృగౌరవరక్షణమునకై అవసరము గలుగు నపుడు ఏపాటిసహాయమును జేయఁజాలనిచో నింక మనుష్యున కును పశువునకును భేదమేమి?

వృద్ధ—నీవింక లోనికిఁ బొమ్ము. నీమాటలు చాల ముదురుచున్నవి. నీ మాటలతో నాబుఱ్ఱ నిండిపోయినది. ఇంక వలితిలేదు. నీవు చెప్పినవన్నియు నేను జీర్ణము చేసికొనిన పిమ్మట తక్కినవి చెప్ప వచ్చును. పొమ్ము. (జోషి వెళ్లును.) ఈమె నన్ను వేపుకొని తినినది. తుదకు ఓడించి మఱి వదలినది. ఈమెతో నేను గెలువజాలకపోతిని. నాయోగ్యత నంతను కడిగి వేసినది. ఆడ వాళ్లే అసలు మాటలలో జాణలు. అందు జోషి బాగుగ చదువు కొనినది కూడ. ఇంక నే నామె నెట్లు గెలువఁగలను. అందుకనే నేను ఆడవాళ్ళకు ఎక్కువ చదువు పనికిరాదందును. చంపుకొని తిన్నది (విచారముతో బయటకుఁ బోవును.)

చతుర్థదృశ్యము

స్థానము—చిత్తూరువద్ద ఘోరారణ్యము. సమయము—ప్రభాతము (సశస్త్రుఁడగు ప్రతాపసింహుఁడు ఒంటరిగ అడవివంక చాలసేపు చూచుచుండును.)

ప్రతాప—(శుష్కకంఠముతో) అక్బర్! నీవు మేవాడను జయించిన మాట వాస్తవము కాని ఇంకను మేవాడను నేనే శాసించు చున్నాను. ఈవి శాల దేశమంతయు ధ్వంసము చేసితిని. గ్రామ వాసుల నెల్లఱను పర్వతదుర్గమునకు లాగికొని వచ్చితిని. అక్బర్! జ్ఞాపకముంచుకొనుము నాకంఠమునఁ బ్రాణమున్నంతవఱకు మేవాడనుండి రాగిదమ్మిడికూడ నీఖజానాకు చేరదు. దేశమంత లో తుదకు దీపము పెట్టుటకు ఒక్కమనుష్యునిఁ గూడ నేను మిగల్చలేదు. దేశమంతయు నెటుల బావురుమనుచున్నది! దేశమంతయు శ్మశానవాటికవలె నీరవముగ నున్నది. పొలములనిండ అడవిగడ్డి మొలచినది, త్రోవలలో పెద్ద పెద్ద మ్రాకులు పెరిగినవి. ఎటుచూచినను మహారణ్యము. పూర్వము మనుష్యులు తిరుగుచోట నిపుడు అడవిమృగములు చరిం పుచున్నవి, జన్మభూమి! సుందరమేవాడుభూమీ! వీరప్రసవినీ!

మాతా! నీకిపుడీవేషమే బాగుగనున్నది. ఇపుడు నిను 'నా' యనిమాత్ర మనఁజాలుదును. నీపై నాయధికారమును దెలుపఁ గలను. ఇంక నగలునా గేహములో—క్రమ్మఱ నా చేతులతో వానిని నీపాదములకుఁ దొడిగెదను. లేనిచో ఈశ్మశానమున నిన్నీతపస్వినివేషముననే యుంచెదను అమ్మా! నేఁడు నిన్ను మొగలదాసినిగఁ గాంచి నాహృదయము బ్రద్దలగుచున్నది. ఆహా! భారతభూమి కెట్టిదురవస్థ సంభవించినది!

సీ॥ దూరపుదృష్టి హిందువు లత్తఱిఁ మహా
దార్యంబును నొకింత దాల్పకున్న
జయచంద్రఁడాది దుష్టని కృష్టమతులు పృ
థ్వీశులు పుడమి జన్మింపకున్న
సోదరమాత్సర్యమేదురులై నృపుల్
మాతృహత్యకయి పాల్పడకయున్న
ఆర్యరక్తోద్భూతులైన హిందూరాజ
మణులు పూర్వోన్నతి మఱవకున్న
గీ॥ ఎన్నియుగములనుండియో యెసకమెసఁగ
సూర్యచంద్రాన్వయక్షత్రశూరవరులు
పాలనము చేసినట్టి యీభరతభూమి
యవనులకుఁజిక్కి దౌర్భాగ్య మబ్బునొక్కొ

(ప్రతాపునకు కంఠావరోధము గల్గును. ఇంతలో నొకపసులకాపరిని గొని యొక సైనికుఁడు వచ్చును.)

సైని—(నమస్కరించి) మహారాణాకు జయము.

ప్రతా—ఏమి?

సైని—ఈతఁడు చిత్తూరుకోటవద్ద గొఱ్ఱెలను మేపుచున్నాఁడు.

ప్రతా—(పసులకాపరిని తీవ్రముగ చూచుచు) ఇది నిజమేనా?

పసుల—అవును రాణాజీ!

ప్రతా—మేవాడుదేశమున ఎవ్వఁడేని పొలముదున్నకొనినఁగాని పసుల

మేపుకొనినఁగాని ప్రాణదండము విధింపఁబడునను నాయాజ్ఞ నెఱుఁగవా?

వసుల—ఎఱుఁగుదును.

ప్రతా—అగుచో నీవు గొఱ్ఱెల నేల మేపుచుంటివి?

వసుల—దుర్గముననుండు మొగలో ద్యోగి యాజ్ఞచే

ప్రతా—మంచిది. అతఁడు వచ్చి నిన్ను రక్షించుగాక. నేను నీకు మరణదండము విధించుచున్నాను.

వసుల—ఈసంగతి వారికి తెలిసినచో వారు తప్పక నన్ను రక్షింతురు.

ప్రతా—న్యాయముగ నే నాయనకు కబురంపుచున్నాను. సైనికా! నీ వితనికి సంకెలలు వేసికొనిపొమ్ము. ఒకవారము పిమ్మట నితఁడు వధింపఁబడును. దుర్గాధికారి వద్దకు నే నిపుడే కబురంపుచున్నాను. వధానంతరము ఇతనిసిరము వాసమునకు గట్టి చిత్తూరుదుర్గ మార్గమున నుంచవలయును. నాయాజ్ఞ తుచ్ఛముగాదనియు మొగలులు చిత్తూరు దుర్గమును జయించినను మేవాడకురాజు నేనే కాని అక్బరు గాదనియు జనులకు తెలియఁగలదు. పొమ్ము తీసికొనిపొమ్ము.

(వసులమేపరితో సైనికుఁడు పోవును.)

ప్రతా—ఓరీదురదృష్టవంతుఁడా! వసులకాపరీ! నీవు వ్యర్థముగ నీకలహమునఁ జంపబడితివి. రావణుని పాపమున లంక ధ్వంసమయ్యెను. దుర్యోధనుని పాపమున మహాత్ములగు భీష్మద్రోణకర్ణాదులు చంపఁబడిరి. నీవో ఒకమనుష్యమాత్రుఁడవు. ఈపనులన్నియుఁ గాల నిష్ఠురములు. అమ్మా! జన్మభూమీ! కేవలము నీకొఱకే నేను నిష్ఠురుఁడ నయితిని. కనుకనే నేను నీయలంకారములన్నియు విప్పితిని. ప్రియతమయగు మహారాణిని ఒకసాధారణపర్ణకుటీరమున నుండుదానినిగాఁ జేసితిని ప్రాణాధికులగు పుత్రుని పుత్రికను దరిద్రతావ్రతము నభ్యసింపఁజేసితిని స్వయముగ నేను సన్యాసి నయితిని

(శస్త్రధారియగు శక్తసింహుఁడు ఎడమవైపున పడియున్న క్రూరజంతువుల కంకాళములఁ జూచుచు మెల్లగ ప్రవేశించును.)

ప్రతా—చూచివచ్చితివా?

శక్త—ఆఁ

ప్రతా—ఏమి చూచితివి?

శక్త—అచ్చట నెవ్వరును లేకుండుటను జూచితిని.

ప్రతా—ఎవరును లేరా?

శక్త—ఎవ్వరును లేరు.

ప్రతా—ఏమి?

శక్త—ఎవ్వరేని ఉండినఁగదా కారణ మడుగుటకు.

ప్రతా—మందిరమందలిపూజారి ఏమయ్యెను? ఆయనయే నాకు మొగలసేనవచ్చు సమాచారము తెలిపెను.

శక్త—ఆయన తనయింటివద్ద లేడు.

ప్రతా—అయితే నా రాక వ్యర్థమయ్యెను.

శక్త—వ్యర్థమేమి? ఇచ్చట ననేకవన్యపశువులు గలవుగదా. వేఁటాడుదము రమ్ము.

ప్రతా—ఇంక పులివేఁటయేనా మన కిప్పుడు పని?

శక్త—లేకున్న మఱి యేమిచేయుదము? ఇంతమంచిరోజు ఇంతచక్కని అడవి, ఇట్టిభయానకనిర్జనమార్గము! దీనిసౌందర్యపూర్తికి రక్తమావశ్యకమగునపుడు మనుష్య రక్తము లభింపకున్న పశురక్తమునే ప్రవహింపఁజేతము.

ప్రతా—నిష్ప్రయోజనముగ రక్తమును బాఱించుటయా?

శక్త—నిష్ప్రయోజనమేమి? బల్లెముల లక్ష్యమును సాధన చేయుటయే ప్రయోజనము. అన్నా! నేఁడు మనయిద్దరలో ఎవ్వరు బల్లెములను బాగుగా గుఱిచూచి ప్రయోగింతురో చూతము.

ప్రతా—నీకు రుజువుకావలసినది యిదియేనా?

శక్త—అవును (స్వగతము) నీ వేయధికారముతో మేవాడుకు రాణావో నే నెందుకు నీదయాధర్మమునకుఁ బాత్రుఁడనయి నీవుపె

ట్టిడు అన్నము తినవలయునో నేడు కనుగొందును.

ప్రతా—మంచిది. నేడీపని చేయుదము. వేటకు వేటయునగును. అభ్యాసమునకు నభ్యాసము నగును. (ఇద్దరును పోదురు)

దృశ్యపరివర్తనము

(ఒకఅడవిలో ప్రతాపశక్తసింహులు చచ్చినపులిని పరీక్షించుచుందురు.)

ప్రతాప—ఈపులిని నేను చంపితిని.

శక్త—లేదు నేను చంపితిని.

ప్రతా—ఇదుగో చూడు. ఇది నాయలుగు.

శక్త—ఇది నాయలుగు.

ప్రతా—ఇదినాయలుగుచే చచ్చినది.

శక్త—కాదు నాయలుగుచేఁ జచ్చినది.

ప్రతా—మంచిది పద ఈ అడవిపందిని గుఱివెట్టి కొడుదము.

శక్త—సమానదూరమున నుండి కొడుదము.

ప్రతా—మంచిది. (ఇద్దరు అటనుండిపోదురు.)

(దృశ్యపరివర్తనము. మరియొకఅడవి)

శక్త—పంది పారిపోయినది.

ప్రతా—అయితే ఎవ్వరిబల్లెమును తగులలేదు.

శక్త—లేదు.

ప్రతా—అయితే ఏమియు రుజువు కాలేదు. నేడు చాలింతము. చాల ప్రొద్దు పోయినది. మరియొకప్పుడు చూతము.

శక్త—మరియొకనాఁ డెందుకు? నేఁడే యేల చూడఁగూడదు?

ప్రతా—ఎట్లు?

శక్త—మన మొకరిపై నొకరు బల్లెము ప్రయోగించుకొందము.

ప్రతా—ఆఁ అదియేమి?

శక్త—ఇందులో బాధ యేమున్నది?

ప్రతా—వద్దు వద్దు ఇందు లాభమేమున్నది?

శక్త—లాభము లేకున్న హానిమాత్ర మేమున్నది? అంతగా పోయిన శరీరమునుండి కొంచెము రక్తము పోవును అయినను మనము

కవచము ధరించియే యున్నాము. ఇంతమాత్రమున నీవును చావవు. నేనును చావను, ఇంక భయ మెందులకు?

ప్రతా—శక్తసింహా! నేను చచ్చుటకు భయపడుట లేదు.

శక్త—కాదు అన్నా! నీవు బల్లెము గ్రహింపుము. నేడు మనమిద్దరము నరరక్తమునకై బయలు దేరితిమి. కనీసము రెండుమూడు చుక్కలనెత్తురైనను కావలయును. బల్లెము పట్టుము. విసరుము. (బిగ్గరగా) విసరుము

ప్రతా—మంచిది. విసరుము.

శక్త—ఒక్కమారుగ విసరుదము

(ఇద్దరును కత్తులు క్రిందబెట్టి ఒకరిపై నొకరు బల్లెముల విసరుకొనబోదురు. ఇంతలో ప్రతాపుని పురోహితుఁడు వచ్చి వారిమధ్య నిలబడును.)

పురో—ఆఁ ఇదియేమి? సోదరులమధ్య యుద్ధమా? మీరు శాంతింపుఁడు. శాంతింపుఁడు.

శక్త—కాదు కాదు. మీరు తొలఁగుఁడయ్యా! లేనిచో మీరు చంపబడుదురు.

పురో—నేను మృత్యువునకు వెఱవను. మీరు శాంతింపుఁడు.

శక్త—ఎన్నటికిని లేదు. మేము నరరక్తమునకై ఇంటినుండి బయలు దేరితిమి. మాకు నరరక్తము కావలయును.

పురో—మీకు నరరక్తము వలయుచో ఇదుగో నిచ్చుచున్నాను. (క్రిందనున్న శక్తసింహుని ఖడ్గము తీసికొని ఱొమ్మున బొడుచుకొని పడిపోవును.)

ప్రతా—ఆఁ గురుదేవా! ఏమి యిట్లు చేసితిరి?

పురో—ఏమియు లేదు. మిమ్ము శాంతింపఁజేయుటకై నే నిట్లు చేసితిని. మీ అన్నదమ్ము లెప్పుడును జగడమాడకుఁడు. దీనివలన నే దేశము నాశమయ్యెను. ఇంక నాశము చేయకుఁడు (చనిపోవును.)

ప్రతా—శక్తా! నీ వేమి యిట్లు చేసితివి?

శక్త—(భయపడి) నిజముగ నే నేమి చేసితిని?

ప్రతా—శక్తా! నీవలననే ఈ బ్రహ్మహత్య జరిగినది. నీజాతకములో నీ వొకనాఁడు మేవాడును నాశము చేయుదువనియున్నట్లు వింటిని. ఇంతవఱకు నే నామాటను నమ్మలేదు. కాని నేఁడు పూర్తిగా నమ్మితిని

శక్త—నావలన బ్రహ్మహత్య జరిగినదా?

ప్రతా—నీవు నిరాశ్రయుఁడవై ద్రిమ్మరుచుండ నేనే నిన్ను మేవాడుకు గొనివచ్చితిని. కాని నీవుమేవాడకు సర్వనాశనముసేయువాఁడవు. నిన్ను మేవాడలో నుంచఁజాలను. నీవు తక్షణము నా రాజ్యము నుండి వెడలి పొమ్ము.

శక్త—మంచిది.

ప్రతా—పొమ్ము. నేనిపుడు వీరి సంస్కారప్రయత్నము గావించి ప్రాయశ్చిత్తము చేసికొందును. నీవు పొమ్ము,

(ఇద్దఱు చెరియొక ప్రక్కను బోదురు)

పంచమదృశ్యము

స్థానము—అక్బరు రాజప్రాసాదమందలి యొక వసారా.

సమయము—తృతీయయామము.

(మానసింహునిచెల్లెలు రేవ పచారుచేయుచుండ నొకవృద్ధదాసి ప్రవేశించును.)

దాసి—అమ్మాయీ! నీవు ఇక్కడ నున్నావా?

రేవ—ఏమి?

దాసి—నీ విక్కడ సుఖంగా పచార్లు చేస్తున్నావు. నేను నీకోసం ఇల్లు అంతా వెదకి వచ్చాను.

రేవ—ఏమి నాతో నీకేమి పని వచ్చినది?

దాసి—ఏంపని అంటున్నావు? పెండ్లికూతురుకు పెళ్ళిగోడవే తెలియదు కాని పొరుగువాళ్ళకంటికినిద్ర లేదన్నట్లుంది. నాతో పనేం అంటున్నావు? నీకు పెళ్లిమనువువచ్చింది. నీతోకాకపోతే నాతో

నా పని? చక్కనిమాటలు నేర్చావులే. నాకు కావలసిన పెళ్లే మిటో ఒక్కమాటే అయింది. ఆడవాళ్లకు రెండుసార్లు పెళ్లి అవుతుందా? ఇల్లాఅవుతే ఇంక చింత ఏం వుంది? అయినా ముసలిముండను నన్ను పెళ్ళాడే దెవళ్ళు? అమ్మాయీ! నాపెళ్ళయి నపుడు నీవింకా పుట్టలేదు. నేను మాత్రం అపు డేమంత పెద్ద దాన్ని? పదకొండోయేడు వచ్చిందో లేదో.

రేవ—మంచిది నీవు పొమ్ము నీప్రలాపములతో నిచ్చట నేమియుపని లేదు. నీవు పొమ్ము.

దాసి—ఎవడికోసం దొంగతనం చేస్తామో వాడే దొంగదొంగఅని అల్లరి చేసినట్టుంది నీకు పెళ్లి కబురు సెప్పగానె ఉబ్బి ముద్దెట్టుకొంటా వచుకొంటే పైగా నన్ను చినాల్లెడుతున్నావు? ఇవాళ్ళ ముసలిదాన్ని అయినానని నన్ను కసరి కొడతావా? ఇవాళ్ల ముసలిదాన్ని అయినాగాని ఒకప్పుడు నేనూ పడుచు దాన్నిగా వుండేదాన్నే. నాకూపెద్దపెద్దకళ్లుండేవి నాబుగ్గలుకూడా గులాబిపువ్వులల్లే వుండేవి. నావొంటితీరుకూడా బాగానేవుండేది. అప్పుడు . మా ఆయన నన్నెంతో పొగడుతూ వుండేవాడు ఒకనాడు ఆయన నన్ను పిలిచి—

రేవ—ని న్నీగొడవఅంతయు నెవ్వ రడిగినారు? పొమ్ము. నన్ను వేధింపకుము. లేనిచో నేను మంచిదాననుగాను.

దాసి—అమ్మా! ఎన్నిమాటలు నేర్చావు? నే నెట్లా వెడతా? నిన్ను పిల్వటానికి వచ్చాను. మీ అమ్మ నిన్ను పిల్వమంది. కాని మళ్ళీ పిల్వొద్దులే అంది. పెళ్ళిమాట వినగానే ఆవిడ మండి పడింది. ఆపాళాన నేను వచ్చేశాను. నీ వెరుగుదువా పెళ్లికొడుకు ఒక నేరురాజు రాయసింహుడు. హా! హా! హా! అరవైఏళ్లు బాలా కొమారుడు. మూడుతనాలు గడచాయి ఇంకా ఒకతనం వుంది చూపులుకు కోతి రూపయౌవనాలు సున్న.

రేవ—అగుచో నాతోఁ బని లేదు, నీవు పొమ్ము.

దాసి—పని యెందుకు లేదు. బలే! చక్కనిమాటలు నేర్చావు. ఇప్పుడు

మీఅమ్మ ఇట్లా అంటేనే మీనాన్న కాలవసినంత పోట్లాట చేశారు. ఇంత పోట్లాట నేనెప్పుడూ చూడలేదు. పెద్దమహా-భారతంఅయింది. మహాభారతం. మీఇల్లు కురుక్షేత్రం అయింది. ఆఁ!

దాసి—అవును! పెద్దజగడం అయింది. అయితే దెబ్బలాట జరుగలేదులే కాని

రేవ—'కాని' యేమి? కాని అర్థం.

దాసి—నీ కదే పెద్దదోషం. నీమాటేగాని రెండోవాళ్ళమాట వినిపించుకోవు. ఇంక నేనేమి చెప్పను. మీ అమ్మ ఈముసలివానికి నాకూతుర్ని ఇవ్వనంది. అప్పుడు మీనాన్నముసలివానికి ఇవ్వడం బాగోలేదని ఈ పెళ్ళివిషయంలో మానసింపానికి జబుర్వాస్తున్నారు.

రేవ—అయితే వారేమియు కోపగించలేదుగద?

దాసి—కోపగించలేదనుకో. ఇంతకు ఆయన మొగవాడు. కోపం రావాలంటే ఎంతసేపు? మాఆయన ఒకనాడిట్లే కోపగించాడు. కళ్ళెంత ఎఱ్ఱచేశాడనుకొన్నావు. కోపగించవద్దు మొర్రో నీఆరోగ్యం చెడుతుందని ఎంతో మొత్తుకొన్నా. ఇంతలో రామాచార్లుగారు వచ్చిచేతులు పట్టుకొని ఎక్కడికో లాక్కొని పోయాడు. నాప్రాణం దక్కింది. లేకపోతే ఆవ్వాళ్ళే మాయింట్లో మహాభారతం అయ్యేది. తర్వాత మళ్ళీ మాఆయనవచ్చి నన్ను బతిమాలుకొన్నాడు. కాళ్ళపైపడి ఎంతో వేడుకొన్నాడు. ఎంతసేపటికి నేను ఒప్పుకోలేదు. మళ్ళీ ఒకనాడు-

రేవ—నన్ను వేధించుకొని తినెదవా. నీవిచ్చటనుండి వెళ్ళెదవా లేదా?

దాసి—బాగుంది. నేనెందుకు వెడతా? నీకు నాకష్టసుఖాలు చెప్పుకుందామని వస్తే నన్ను చీడపురుగువలె విదిలించి కొడుతున్నావు. (ఏడ్చును)

రేవ—ఓసీ! నిన్నిప్పుడు నేనుకొట్టితినా?

దాసి—లేదు అమ్మా! నీవునన్ను కొట్టలేదు. నేనేనిన్ను కొట్టాను. రాజు

గారితోను రాణిగారితోనూ నేనుకొట్టాననివెళ్ళిచెప్పు. ఇన్నాళ్లు దాక నిన్ను చంకనెత్తుకొని పెంచాను. మీానౌకరి చేసిచేసి ముసలదాన్ని అయినాను. ఇంకేముంది. నన్ను కొట్టితిట్టి ఆవతలికి ఈడ్వండి. నేను కడుపుకాలి సందుగొందులు తిరుగుతూ వుంటాను. ఇప్పుడు నాకెవరున్నారు? నామగడు లేడు. ఆనాపడుచు దనమూ లేదు నీకు ధర్మమైతే నన్ను వెళ్ళకొట్టు. నీవు పసిదానవుగా వున్నపుడు నిన్ను చంకనెత్తుకొని ఆడించాను ఒకనాడు నిన్నుదొంగతనంగా వీధినాటకానికి తీసికొనిపోయి చూపించాను. ఈసంగతి మహారాజుగారికి తెలిసి వారు నన్ను పెట్టిన అవస్థ భగవంతుడికి తెలియాలి. మెడవిరవడం తరువాయిగా అన్నీ చేశారు. దీనిని గుంపులోకి ఎందుకు తీసుకు పోయావన్నారు. దానిపై నేను-

(తెరలో) రేవా! రేవా!

దాసి—అదుగో విను.

రేవ—వచ్చుచున్నాను. (నిష్క్రమించును)

దాసి—(కొంచెము సేపు మొదలక కూర్చుండి) ఇంక నేను పోయి మరెవ్వరితోనైనా బాతాఖాని వేసుకొంటాను.

(షష్ఠదృశ్యము.)

స్థానము—ఆగ్రాలో అక్బరుని ఆలోచనాగృహము
సమయము—ప్రభాతము

[అక్బరు, శక్తసింహుడు, ఎదురుగ నిలబడి యుందురు]

అక్బరు—మీారు రాణాప్రతాపసింహునకు సోదరులా?

శక్త—చిత్తము.

అక్బరు—మీా రిచ్చట కేయుద్దేశ్యముతో వచ్చితిరి?

శక్త—నేను మొగలసైన్యమును గొని రాణామీాదికి దండెత్తగోరు చున్నాను. రాణానుమొగలులకు పాదాక్రాంతునిఁ జేయుటయున

తత్సైన్య రక్తస్రవంతిని మేవాడునఁ బాఱించుటయు నా సంకల్పము.

అక్బరు—ఇందుచే మొగలుల కేమి లాభము? మేవాడునుండి నేటివరకును ఒకదమ్మిడీగూడ మాఖజానాకు రాలేదు.

శక్త—మీరు రాణాను జయించినచో చాల పైకము సర్కారు ఖజానాకు రాగలదు. రాణాహుకుముచే నిప్పుడు మేవాడులో బొత్తుగా కృషివ్యాపారము జరుగుటలేదు. లేకున్న మేవాడులో బంగారుపండెడిది. నాఁడు ఒకపసులకాపరి చిత్తూరు దుర్గాధ్యక్షునిహుకుముచే మేవాడులో గొఱ్ఱెలు మేపుచుండ రాణా వాని తల తీయించెను.

అక్బరు—(ఆలోచనతో) మంచిది. మీరు మాకేమి సహాయము చేసెదరు?

శక్త—నేను రాజపుత్రుడను. యుద్ధముచేయుట యెరుగుదును. రాణాతో బోరాడెదను, నేను రాజపుత్రుడను సైన్య సంచాలన మెఱుగుదును. మొగలసైన్యముఁ గొని రాణామీఁదికి దండెత్తెదను.

అక్బరు—దీనిచే మీ కేమి లాభము?

శక్త—పగ తీఱును.

అక్బరు—ఇంతయేనా?

శక్త—అవును. ఇంతయే.

అక్బరు—మీకు సైన్యమునిచ్చినచో మీరు ప్రతాప సింహునిజయింపగలరా?

శక్త—జయింపఁ గలనని నాకు గట్టినమ్మకము గలదు. నేను ప్రతాపసింహుని సేనాబలము నెఱుఁగుదును. యుద్ధకౌశలమెఱుఁగుదును. ఇంక ప్రతాపుఁడు యోద్ధయే నేను యోద్ధనే. అతఁడు క్షత్రియుఁడే నేను క్షత్రియుఁడనే. అతఁడు రాజపుత్రుఁడే నేను రాజపుత్రుఁడనే. భేదము అతఁడు పెద్దవాఁడు నేను చిన్నవాఁడను. ఇంతయే. ఒకనాఁడుప్రసంగవశమున పితాపసింహునిపుత్రుఁడగు

అక్బ అమరసింహుఁడు "జ్యేష్ఠుఁ డయిన మాత్రముననే శ్రేష్ఠతగలుగ"

దని చెప్పెను నాటనుండియు ఆవిషయము నన్ను శల్యమువలె వేధించుచున్నది. అతనిమాట యెంతయు సత్యమని నాకుతోఁచు చున్నది.

అక్బరు—ఊఁ! (నేలవంక చూచుచు కొంతసేపు ఇటునటు తిరిగి) ఎవ్వరక్కడ?

(ద్వారపాలకుఁడు వచ్చి నమస్కరించును)

అక్బరు—మహారాజ మానసింహుని నొకమాఱు దయచేయుఁడని చెప్పుము.

ద్వార—చిత్తము ఖుదావంద్! (ప్రస్థానము)

అక్బరు—రాణాప్రతాపసింహుఁడు మీకు చాల మేలుచేసెనని వింటిని

శక్త—ఏమి మేలు?

అక్బరు—లేదా? అయితే నేను విన్నది పొరపాటు ప్రతాపుఁడు నేటి వఱకు మీ కెట్టియుపకారమును జేయలేదా?

శక్త—చేసినాఁడు. మాతండ్రి ఒకమాఱు నన్ను వధించుట కాజ్ఞాపింప-

అక్బరు—(ఆశ్చర్యముతో) ఆఁ! మీతండ్రి మిమ్ము చంపుట కాజ్ఞయొసఁగెనా?

శక్త—చిత్తము వినుఁడు. నాచాటు భారతమంతయు వినిపించెదను. అయిదు సంవత్సరముల ప్రాయమున నా కొక కత్తి కనుపడగా దానికి పదునున్నదో లేదో యని పరీక్షించుటకు దానితో నా చెయ్యికోసికొంటిని. నాజాతకములో నేను నాజన్మభూమిని ధ్వంసము చేసెదనని వ్రాసియున్నది. నేను నిస్సంకోచముగ కత్తి పెట్టి నాచేతిని నఱికికొనుట చూచి నాతండ్రి నాజాతక వృత్తాంతమును నమ్మెను. నాచే అసాధ్యకార్యములన్నియు సాధింపఁబడునని యు నెఱింగి నాఁడే ఆయన నన్ను వధించుట కాజ్ఞ యొసంగెను.

అక్బరు—ఆశ్చర్యము!

శక్త—మీకు ఆశ్చర్యముగ నున్నదా? మీ రాయనను బాగుగ నెఱుఁగరు కాఁబోలు చిత్తూరుకోట ముట్టడింపఁ బడినపుడు ఆయకున

పిఱికివానివలె పాఱిపోవనిచో చిత్తూరు భాగ్యసూర్యుడుఁ డెన్నడు నస్తమించఁడు.

అక్బరు—చిత్తూరు రాజపుత్రుల చేతినుండి మొగలుల చేతికి వచ్చెనన్న ఇది దాని సౌభాగ్యముగాదా?

శక్త—అది యెట్లు?

అక్బరు—ఆటవికులగు రాజపుత్రులు రాజ్యసంచాలన మెఱుఁగరని మీరును ఒప్పుకొందు రనుకొనియెద.

శక్త—ఆటవికులు రాజపుత్రులో మొగలులో నాకీసంగతి తెలియదు. కాని ఇంతవరకు నేజాతివారును మమ్ము ఆటవికులనుట నేను వినియుండలేదు.

అక్బరు—అట్లు కానిచో మొగలులు హిందువులపై నెందుకు శాసనము గావింతురు?

శక్త—రోమను జాతీయు లంత నాగరికులుగదా. ఆటవికులగు గాథులు వారి నెట్లు లోడించిరి?

అక్బరు—రోమనులు ధర్మమును మఱచిరి. అందుచే ఓడిపోయిరి.

శక్త—అయితే గథులు ధార్మికులగుటచేతనా రోమనులను జయింపఁ గలిగినది? అట్లుకాదు. ప్రపంచములో నెప్పుడును ధర్మమునకే జయము గలుగదు. అధర్మమునకే యెప్పుడు నపజయము గలుగుచో అధర్మమెన్నఁడో నామ మాత్రావశిష్టమయి యుండెడిది. అట్లే యగుచో నేఁడు ప్రపంచములో మూడువంతులకుపైగా అధర్మమే ప్రభుత్వము చేయుచునుండదు. మఱియు నిపుడు హిందూ దేశములోనే అధర్మము తనహద్దునుమీఱి సభ్యతారాజ్యమునఁ బ్రవేశించి దానిని పాడుచేయుచున్నది. అయినను ఈ ప్రాపంచిక వ్యవహారమంతయు సర్వశక్తిమంతుఁడును, న్యాయవంతుఁడును, దయాళువునగు పరమేశ్వరుని చేతిలో నున్నదనియే శాస్త్రములు చెప్పుచున్నవి.

అక్బరు—(నిశ్చేష్టితుఁడై ప్రసంగము మార్చి) అయితే మీరు మీవ్వ

త్తాంతము వినిపింపుఁడు. మీతండ్రిగారు మిమ్ము వధించుట కా జ్ఞయిచ్చినపు డేమి జరిగెను?

శక్త—వధికులు నన్ను వధ్యస్థానమునకుఁ గొంపోవుచుండిరి. ఇంతలో సాలుంబరపతియగు గోవిందసింహుఁడు నాకు తటస్థించిరి. వారికి ఒకప్పుడు నాపై చాల దయ యుండెడిది. గనుకనే ఆయన నన్ను తనకు ఉత్తరాధికారినిగాఁ జేయఁగోరె రాణాతోఁ జెప్పి నన్ను రక్షించెను. నన్ను పోష్యపుత్రునిగ తనవద్ద నుంచుకొని పెంచుచుండగనే ఆయన కొక కుమారుఁడుదు గలిగెను. అప్పుడు మేవాడకు రాణాప్రతాపసింహుఁడు, సాలుంబరపతి చెప్పుటచే రాణా నన్ను తనరాజధానికిగొనివచ్చిచాల ఆదరముతో తనవద్ద నుంచుకొనెను.

అక్బరు— మీరు మేవాడుకు సర్వనాశనము చేయుదుగ్గరని యెఱింగి కూడనా?

శక్త—అవును. ఎఱింగియు

అక్బరు—అయితే ఆయన మీ కేమియు నుపకారము చేయలేదని యిప్పుడే అంటిరిగదా?

శక్త—ఇది ఉపకార మెట్లగును? నేను అన్యాయముగ నాజన్మభూమి నుండి, నారాజ్యమునుండి నాయధికారమునుండి వంచింపఁబడితిని. ప్రతాపుఁడు నన్ను రాజ్యమునకుఁ గొనివచ్చి కొంచెము న్యాయము చేసెను. ఇందు ఉపకార మే మున్నది? నే నతని కెందుకు కృతజ్ఞుఁడఁ గావలయును? ఇంతకు నాఅధికారము నాకు రాలేదుగదా. ఆత డేయధికారముతో మేవాడు సింహాసన మధిష్ఠించెను? నేనెందు కతనికి ఆజ్ఞావర్తియగు సేవకుఁడఁ గావలయును? మేమిద్దఱము ఒకతండ్రి బిడ్డలమేగదా! ఆతఁడు పెద్ద నేను చిన్నఅయిన మాట వాస్తవము. జ్యేష్ఠుఁడయిన మాత్రమున శ్రేష్ఠుఁడగునా? మా యుభయులలో నెవ్వరు శ్రేష్ఠులో పరీక్షించుటకే నాఁడు వెళ్ళితిమి. హఠాత్తుగ నొకబ్రహ్మహత్య జరుగుటచే అది రుజువు కాలేదు.

ప్రతాపుఁడు నాకంటె తాను శ్రేష్ఠుఁడగుటను రుజువుచేసి నన్ను రాజ్యమునుండి వెడలఁగొట్టినచో నాకు విచారముండదు. అట్లు చేయకయే నన్ను వెడలఁగొట్టెను చాలఅన్యాయము చేసెను. దీనికి బదులు దీర్చుకొనఁగోరుచున్నాను.

అక్బరు—(చిఱునవ్వుతో) ప్రతాపునకు మీపై నమ్మకము గలదా?

శక్త—ఆఁ కలదు.

అక్బరు—అగుచో మోసముతో మీ రాతని నేల పట్టింపరాదు? వ్యర్థముగ యుద్ధముచేయుట యెందుకు?

శక్త—ఇది మాత్రము నావలన కాదు. అయితే ఇంక సెలవు పుచ్చుకొందును.

అక్బరు—వినుఁడు. ఇందు భాధ యేమున్నది? యుద్ధము చేయకయే నెత్తురు పాఱింపకయే మనపని చక్కపడుచో ఇందు బాధ యేమి?

శక్త—మీరు నాగరక ముసల్మానులు. మీ కీపన్నాగము లన్నియు బాగుగనుండును. ఇంక మేమో ఆటవికులమగు రాజపుత్రులము. స్నేహము చేసితిమా మా హృదయము కోసి యిచ్చెదము. విరోధించితిమా తిన్నగా కత్తి దూయుదుము. పైకి స్నేహముగనుండి లోపలనుండి కత్తి దూయుట మేమెఱుఁగము. రాజపుత్రులు స్నేహసమయమందును రాజపుత్రులుగనే యుందురు. పగతీర్చుకొనునపుడును రాజపుత్రులుగనే యుందురు. నాకు ధర్మముపై విశ్వాసము లేనిమాట వాస్తవము నే నీశ్వరుని ఒప్పుకొనను. సామ్రాజ్యమునకు ద్రోహిని. అయినను నేను రాజపుత్రుఁడనే. రాజపుత్రుల కుచితముగాని పని నావలనఁగాదు.

అక్బరు—అయితే మానసింహుఁ డిట్టివిషయములలో వెనుక ముందు చూడడు. క్షత్రియులలో ఆతఁ డొక్కఁడే తెలివి తేటలతో యుద్ధము చేయువాఁడు. ఆతని విజయములలో సగము తెలివితేటలతో సాధించినవే. ఆయన పెక్కుసమయములందు సైని

కబలమును చూపించునేకాని దానిని ఉపయోగించుట చాల అరుదు.

శక్త—ఆయన అట్లెందుకు చేయఁడు? అట్లు చేయనిచో ఆయన మొగలసేనాపతి యెట్లగును? ఆయన స్థానమున నేను సేనాపతిని అయియుండక పోదునా?

అక్బరు—ఆయనయు రాజపుత్రుఁడేగదా?

శక్త—అఁ విన్నాను. ఆయన తల్లిదండ్రులు రాజపుత్రులేయఁట.

(శక్తసింహుని వ్యంగ్యమును అక్బరు గ్రహించియు గ్రహింపనట్లుండును.)

అక్బరు—అయితే ఇంక నేమి?

శక్త—గీ॥ అగుట కన్నియు మామిడు లయిన నేమి
సుమధురస్వాద మన్నిటఁ జూడఁగలమె?
రాజపుత్రజులైనమాత్రమునఁ గొన్ని
మహోన్నతగుణంబు లెల్లరు నొందఁబోరు॥

అక్బరు—మఱియేమి?

శక్త—ఏమన్నద? ఆయన బాదుషా గారికి స్యాలకపుత్రుఁడు. నేమియు కాను. ఆయన బాదుషాతోఁ గలసి పెక్కుమారులు పలావు, కోర్మా భుజించినాఁడు. బాదుషాపై ఆతనికి ఆమాత్ర మభిమాన ముండదా?

అక్బరు—(కొంచెమాగి) మంచిది. మీరు వెళ్లి యింక విశ్రమింపుఁడు.

శక్త—చిత్తము (సలాము చేసిపోవును)

అక్బరు—ప్రతాప్! నీతమ్ముఁడు నాపక్షమున నెప్పుడుచేరెనో అప్పుడే నీవు నాగుప్పిటిలోనికి వచ్చినావు. మధ్యమధ్య నాకు ఇట్టి మంచి అవకాశము లభింపనిచో నే నింత విశాలదేశమును జయింపఁజాలుదునా? మానసింహుఁడు నాకు సాయపడనిచో నేఁడు మొగలుసామ్రాజ్య మింతదూరము వ్యాపింపఁగలదా? అదుగో మహారాజు వచ్చెను.

(మానసింహుఁడు వచ్చి యక్బరునకు సలాముచేయును.)

అక్బరు—రండు మహారాజాసాహబ్!

మాన—సార్వభౌములు నన్ను పిలువనంపిరా?

అక్బరు—అవును. మీరు ప్రతాపసింహుని తమ్ముని శక్తసింహుని చూచితిరా?

మాన—చిత్తము. నే నిప్పుడే దారిలోఁ జూచితిని. నా యెదుట నుండి వెళ్లునంతవఱకు నావంకకే చూచుచు పోయెను.

అక్బరు—నిర్భయుఁడును, తెలివిగలవాఁడుగను గనుపట్టుచున్నాఁడు. మధ్యమధ్య చక్కని యెత్తిపొడుపులు ప్రయోగించుటగూడ బాగుగ నెఱుఁగును. ఈతఁడు ప్రపంచమున స్వార్థమును దక్క వేఱేమియుఁ జూడలేదు. ఇంకను లోహము కచ్చాది. కరగించి పనిలోనికి తీసికొని రావచ్చును.

మాన—బహుశః అతని హృదయమున ప్రతిహింసాసంకల్పము పొడమి యుండనోపు)

అక్బరు—ప్రతిహింస గాదు. ఇతఁడు పగతీర్చుకొనఁ గోరుచున్నాఁడు. ప్రేమయు హింసయు ఈ తరుణహృదయమున నింకను ప్రవేశింపలేదు. ఎవ్వని కెంత యీయవలయునో దమ్మిడీలతో ఈయఁగోరుచున్నాఁడు. ఎవనినుండి ఎంత పుచ్చుకొనవలయునో దమ్మిడిలతోసహా వసూలుచేసికొనఁ గోరుచున్నాఁడు. ఆతఁడు ధర్మమును బాటింపఁడు. గాని తనజాతిపై అతనికి చాల అభిమానము గలదు.

మాన—అగుచో నిపుడు ప్రభువుల హుకుమేమి?

అక్బరు—ప్రతాపుఁడు ఒక మొగలుపశుపాలకుని కొఱతవేసినవార్త వింటిరా?

మాన—లేదు. నేను వినలేదు.

అక్బరు—ఆతఁడు మూడుమాఱులు దండెత్తివచ్చి మూడుమొగలు పటాలముల రూపుమాపిన వార్తయు మీరు వినలేదా?

మాన—ఆఁ ఇదిమాత్రము వింటిని.

అక్బరు—ఈడున్మత్తసింహ మెంతవఱకు ఇటుల విశృంఖలముగ తిరుగుచుండును? వానిపైకి దాడివెడలుటకు నాకిదియే మంచియవకాశముగఁ గనుపడుచున్నది. మీ అభిప్రాయమేమి?

మాన—నే నీవిషయ మాలోచించితిని. నేను షోలాపూరునుండి తిరిగి వచ్చునప్పుడు ఆదారిని వెళ్లి ప్రతాపసింహుని కలసికొందును. ఏవిధముననైనను అతఁడు మనయుచ్చులోఁబడినచో వ్యర్థముగ రక్తముపాఱించుపని యుండదు. లేనిచో యుద్ధము తప్పదు.

అక్బరు—మంచిది. మీ అభిప్రాయము చాల ఉచితముగనున్నది. ఇదియే మంచిది. మీరు షోలాపూరు ఎప్పుడు వెళ్లెదరు?

మాన—ఎల్లుండి ప్రొద్దున.

అక్బరు—మంచిది. నే నొక యావశ్యకకార్యముపై మిమ్మిచట నొంటరిగ విడిచిపోవుచున్నాను.

మాన—చిత్తము. (అక్బరు పోవును.) నే నిందుకై పూర్తిగాసిద్ధపడియే వచ్చితిని. ఁవ పెండ్లివిషయమై నాయనగారు మాటిమాటికి వ్రాయుచున్నారు. ప్రతాపుని జ్యేష్ఠపుత్రుఁడగు అమరునకుదాని నిచ్చువిషయమై ప్రస్తావించెదను. ఆయన ఇందు కియ్యకొనిన చాల బాగుండును. నిష్కళంకమగు మేవాడువంశముతో సంబంధముచేసి యీకళంకితమగు అంబరవంశమును శుద్ధముచేయఁ గలనో లేనో చూతును.

మ॥ మొగలోచ్ఛిష్టములౌ ప్రలోభనములన్ మోహమ్ము రెట్టింప న
ల్పగరానట్టి యకార్యముల్ సలిపి బేలల్ రాజపుత్రాధముల్
జగతిన్ దేశముపట్ల క్షాత్రఖనియౌ సంఘంబుపట్లన్ గడున్
నెగడంజేసిరి దుష్కళంకమును దీనిన్ బాపఁగా శక్యమే॥

మే మెల్లఱము పతితులము కళంకితులము ఈ విశాలరాజపుత్రవంశమందు ప్రతాపుని నిష్కళంక శుభ్రపతాక యొక్కటియే విరాజిల్లుచున్నది. ప్రతాపసింహా! నీవు ధన్యుఁడవు. (ప్రస్థానము)

సప్తమదృశ్యము.

స్థానము—ఆగ్రాలో అక్బరుని అంతఃపురోద్యానము.

సమయము—మధ్యాహ్నము.

(అక్బరుని కన్యయగు మేహారున్నిసా ఒంటరిగా ఒకచెట్టుక్రింద దండగుచ్చుచు పాడుచుండును.)

గీతము

జనరహితంబగు వనమునఁ జేలాంచలమునఁ గూర్చుని హేలన్
ఘనముగ నిజకంఠమ్మునఁ దాల్పఁగ మనమున గ్రుచ్చెద మాలన్
నిజహృదయము సంతోషపెట్టుటకు నే గానము గావింతున్
నిజమనమునఁ గ్రీడింతును నాకీక నే సహచరినని యెంతున్
నామనమున నే నవ్వెద నేడ్చెద నన్నే నేను ప్రేమింతున్
నేమమ్మున నను నేనె సదా మన్నింతును సుఖమును గాంతున్

(ఇంతలో నక్బరుమేనకోడలు దౌలతున్నిసా పరుగెత్తుకొని వచ్చును)

దౌలతు—మేహార్! మేహార్! ఇదుగో చూడుము. ఒక పావురముల గుంపు ఎగిరిపోవుచున్నది.

మేహారు—వహ్వా! పావురములగుంపు ఎగిరిపోవుచున్నచో నం దాశ్చర్యమేమున్నది? అందు నన్నేమి చూడమందువు? (మఱల పాడును.)

దౌలతు—ఔరా! ఆశ్చర్యజనకము కానిచో దానిని చూడనేకూడదా? ప్రపంచములో ఆశ్చర్యవిషయము లెన్ని గలవు?

మేహారు—ప్రపంచములో ఆశ్చర్యవిషము లెన్నియో కలవు.

దౌలతు—కొంచెము విందును,

మేహారు—(దండ క్రింద ఉంచి గంభీరభావముతో) మంచిది వినుము. ముందు ఈప్రపంచమే ఆశ్చర్యమైన వస్తువు. దీనికి పని లేదు, పాట లేదు. అహోరాత్రములు సూర్యునకు నాలుగుప్రక్కల తిరుగుచుండును. ఇదియెందుకు తిరుగుచున్నదో యెవ్వరు నెఱుఁగరు. దీని తర్వాత మనుష్యుఁడును ఒకవింతవస్తువు ముందు వాఁడు ఒకమాంసముముద్దగా జన్మించును. తర్వాత

కొన్ని దినములు వాఁడు ప్రపంచతరంగములలో నిటునటు కొట్టుకొనుచు తిరుగును. తుద కొక్కనాఁడు ఎక్కడనో మునిఁగిపోవును. ఇంక వారి నెవ్వరును వెదకి పైకి తీయఁజాలరు. పిసినారులు ధనమును ప్రోవుచేతురు. గాని దాని యానంద మనుభవింపఁజాలరు. ఇది యొకవింత కాదా? లక్ష్మీపుత్రులు తమ ధనమంతయు వ్యర్థముగ నాశనముచేసి చిప్పకట్టు చేతఁబుచ్చుకొని సందుగొందుల ముష్టికిఁ దిరుగుదురు. ఇది అంతకన్న నెక్కువ వింతగాదా? బుద్ధియుండియు మానవుఁడు పెండ్లిచేసికొని తనకు తాను సంకెళ్లువేసికొనును. ఇంక వాఁడు చక్కగా తిననుజాలఁడు చేతులుకాళ్లుకదల్పనుజాలఁడు. ఇది తక్కువ వింతయా?

దాల...ఆడవాళ్లు మూర్ఖతచేఁ బెండ్లిచేసికొందురు. ఇదియు వింతయేనా?

మేహారు...ఇందు సందేహమేమున్నది? వారికి అన్నవస్త్రములవిషయమై విచారింపవలసిన పనియే లేదు. ఇట్టిస్థితిలో నే నింత గొప్పబాదుషాకు కూతురనై ఒకఅయ్యాకాళ్ళపై వెళ్లిపడినచో నిదియు నొక వింతయే. నే నిచ్చట నన్నవస్త్రములకు లోపము లేకుండ సుఖముగ నున్నాను. ఇట్టి స్థితిలో నే నెవ్వనేని పెండ్లిచేసికొనినచో నాకు తప్పక చికిత్స చేయింపవలసిన దే.

నాలతు—అయితే నీవు పెళ్లిచేసికొననని రూఢిచేసికొంటివా?

మేహారు—అయితే నే నింతవఱకు నూరక కూర్చుండ లేదు.

దాల—అనఁగా?

మేహారు—అనఁగా నిదియే. నాకు ఇంతవఱకు పెండ్లి కాలేదు. ఇంక నాకు వేఱే పని లేదు పాట లేదు. కనుక నిచ్చవచ్చిన పను లెల్ల చేయుచుందును. నిద్రించెదను, కూర్చుందును, లేచెదను, తిరిగెదను, ఆవలించెదను. వ్రేళ్లు విరచెదను. నేను కన్య నన్న మాటయేకాని యెప్పుడును ఉమర్ ఖయ్యాము చదువుచుందును. చిత్త చకోరమును ఇంటిదూలములందు చిత్రించుచుందును. అవకాశము చిక్కినప్పుడు ఆలస్యమును విడిచి ప్రాపంచికచిత్ర

ములు చూచుచుందును. మఱియు పురుషులలో నామనస్సున కనురూపుఁడగువాఁడు ఎవ్వఁడేని యుండునాయని ఆలోచించు చుందును. (తలవంచుకొనును.)

డాల—ఊరక ఆలోచించుటయేనా నిర్ణయించుటకూడ నున్నదా? నీకు నచ్చినపురుషుఁ డెవ్వఁడేని దొరకెనా?

మేహ—(గంభీరభావముతో) డాలత్! నీ విట్లడుగుట ఉచితముగాదు నాకు నచ్చినపురుషుఁడు దొరకినను నీకు చెప్పవచ్చెదనా?.

డాల—ఎందుకు చెప్పవు? నేను నీకు అంతరంగికురాలను.

మేహ—డాలత్! నీస్నేహము నామాంసకండరములఁ జీల్చుకొని లోవలకు చేరినమాట వాస్తవము. కాని యెముకలలోఁ బ్రవేశింప లేదు. అది యెముకలలో ప్రవేశింప దగినవిషయము—ఈశరీరములో మఱియొకశరీరమున్నచో నిదిదానికి చేరిన విషయము. గనుకనే నీకు స్పష్టముగా చెప్పఁజాలను. నీవు అంతగా పట్టుపట్టినచో నామనోహరుని రూపమును సాంకేతికముగ కొంచెము చెప్పగలను.

డాల—మంచిది చెప్పుము, నీమనోహరుని నేను గుర్తింపఁగలనేమో.

మేహ—మంచిది వినుము. నామనోహరునిరూప మెట్టిదో చెప్పెదను. ముక్కు—ఉన్నది. చెవులు—నేను బాగుగా చూడలేదు గాని అయినను తప్పక ఉండవచ్చును. అతఁడు నవ్వినపుడు ముత్యాలు రాలినను రాలకున్నను పండ్లుమాత్రము తప్పక బైట పడును. అత డెప్పుడేని వచ్చినచో ఆయేడ్పుచే అతనియందమేమియు హెచ్చదు. అతఁడు పాడుచున్నట్లును తెలియదు. నామనోహరుని యాకారము ఇంతవరకు నక్షావేసి చెప్పితిని. తక్కినదినీ వూహించుకొనుము.

డాల—ఇప్పుడు నాకు బాగుగ తెలిసినది నిజముగ నీప్రియుఁడు నా కన్నులయెదుటఁ గనుపట్టుచున్నాఁడు.

మేహ—నీ వతనిని చూచినఁ జూడుము. కాని నీ వతనిని ప్రేమింపకుము సుమా. నీవు ప్రేమించినను అంత పెద్ద హాని లేదు.

బాదుషాగారి అంతఃపురమున నూర్గురుకంటె నెక్కువ రాణు లుండుట నీవు చూచితివిగదా. కాని నీ వతనిని ప్రేమింప కుండిన కొంత బాగుగ నుండును.

(బట్టలు దులుపుకొనుచు మెల్లగా సలీము ప్రవేశించును.)

సలీము—మేహార్! నీ విచట నేమి చేయుచుంటివి?

మేహ— ఈదౌలత్ ప్రపంచములోని ఆశ్చర్యవస్తువుల జాబితా నడుగఁగా అది వినిపించుచుంటిని.

సలీము—నేనును ఆజాబితా విందును.

మేహారు—మఱల చెప్పెదను. దౌలత్! నీవు చెప్పుము. నీ కంతయు జ్ఞాపక ముండియుండవచ్చును. ఇంతసేపుండి నీకు చిలుకకువలె చదివించితిని. ఏమి చదివించితినో నాకు జ్ఞాపకమే లేదు. సలీమ్! నాకల్పనాశక్తి మంచిదేకాని జ్ఞాపకశక్తి లేదు. నేను దులాబీఖర్చుగల ఒకవర్తకుని వంటిదానను. వ్యాపారము చేసె దను. బాగుగ సంపాదించెదను. అయితే ఖర్చుపెట్టెదను కాని దౌలతు తెలివితేటలు గలది. వ్యాపారము ఎక్కువచేయ లేదు గాని బాగుగ కూడఁబెట్టఁగలదు. ఆఁ ఆఁ. బాగుగ జ్ఞప్తికి వచ్చినది. లోభులు మరణాంతమువఱకు బాగుగ వ్యాపారముచేసి తమపుత్రులకు, పౌత్రులకు ఖర్చుచేసికొనుటకు ద్రవ్యము కూడఁబెట్టెదరు. ఇదియు నొక వింత మాటయని నేను చెప్పుచుంటిని.

దౌల—ఇది వింతమాట యెట్లు సలీమ్?

మేహారు—ఏమి ఇది వింతమాటకాదా?

సలీము—ఎందుకు కాదు? కాని నీవుచెప్పిన వింతమాటలన్నిఁటిని మించిన మరియొక వింతమాట గలదు.

మేహారు...అదియేమి?

సలీము...అక్బరుబాదుషాతో రాణాప్రతాపసింహుని యుద్ధముప్రపంచములో సర్వోత్తమవీరుడైన బాదుషాతో ఒక చిన్న జమీందారు యుద్ధము. ఇంతకంటె నిఁక ఆశ్చర్యమేమి యుండును.

దాల...ఇది వెఱ్ఱితనము.

సలీము.. నేనును మొదటనిట్లే యనుకొంటిని. కాని కొలఁదిదినముల క్రిందటనే యతఁడు మొగలుసైన్యమును చెల్లాచెదరు చేసిన సంగతి చూడ ప్రతాపుఁడు వెఱ్ఱివాఁడు కాడని తెలిసికొంటిని. నూరుగురు రాజపుత్రులు ఏనూరు మొగలుల డీకొనుట యేగాక వారిని ఓడించిరి.

మేహ—అయితే మీరుమాత్రము ఒకమాఱు బాగుగా పోరాడివారి నెందు కోడించరాదు?

సలీము—ఈమా ఱట్లే యగును. మహారాజ మానసింహుఁడు షోలాపూరునుండి తిరిగివచ్చునపుడు దారిలో ప్రతాప సింహుని కలసి కొని ఆతనిసేనాబలమును బాగుగచూచి వచ్చును. ఏవిధమునైనను ప్రతాపుఁడు మనకు లోఁబడి పన్ను ఇచ్చుటకు ఒప్పుకొనిన సరే, లేనిచో యుద్ధము తప్పదు.

మేహ—నీవును యుద్ధమునకు వెళ్లుదువా?

సలీము—నేను యుద్ధమునకు వెళ్లక కుంటివానివలె నింట కూర్చుందు ననుకొంటివా?

మేహ—అయితే ఏతో నేనును వచ్చెదను.

సలీము—నీవా!

మేహ—నీకాశ్చర్యమెందుకు?

దాల—అయితే నేనును వచ్చెదను.

సలీము—మీరు యుద్ధమునకు వచ్చి యేమి చేయుదురు?

మేహ—నే నెందుకు రాను? నీ వెప్పుడును మావద్దకువచ్చి అట్లుయుద్ధముచేసితిని ఇట్లు యుద్ధము చేసితిని వానిని ఓడించితిని వీనిని ఓడించితిని అని బడాయిలు కొట్టుచుందువు. నీవు నిజముగ యుద్ధము చేసెదవో లేకమెదలక కూర్చుందువువో నేనుచూచెదను.

సలీము—నేను యుద్ధము చేయనిచో యుద్ధము లేకయే జయపరాజయములగునా?

మేహరు—నేనట్లే తలఁచుచున్నాను. యుద్ధములో ఈవైపువాళ్లు ఆవైపు

వాళ్లు ఫిరంగులు పుచ్చుకొని నిలఁబడుదురు. తర్వాత ఒకరూపా యితీసి ఒకపక్షమువాళ్లు ఒకవైపును వేఱొక పక్షమువాళ్లువేఱొకవైపును తీసికొందురు. ఒకఁడు ఆరూపాయిని గిరగిరత్రిప్పిపైకి ఎగురవేయును. నేలపైఁబడునప్పుడు ఎవరివైపు పైకి ఉండునో వారుగెలిచినట్లును, ఎవరివైపు క్రిందికి ఉండునో వారు ఓడినట్లును ఎంచఁబడుదురు.

సలీము—అయితే జనులు ఇంత సైన్యమును ఎందుకు తీసికొనిపోదురు?

మేహ—జనులకు తమగొప్ప చూపించుటకు, లేనిచో నీవంటి బక్క సిపాయీలు ఏమి యుద్ధము చేసెదరు? ఏమి దాలత్?

దాలతు—నిజము.

మేహ—ఇంకను వీరి పాలదంతములైనను ఊడలేదు. పాపము వీరేమి యుద్ధము చేసెదరు?

సలీము—అయితే నేను ఎట్లు యుద్ధము చేసెదనో మీరు చూడఁగోరుచున్నారుకాదు?

మేహ—అవును. ఏమి దాలత్?

దాల—అవును.

సలీము—మంచిది అయితే మీకు చూపించెదను. బాదుషాగారి ఆజ్ఞ తీసికొని మిమ్ము గొంపోవుదును. నేనుయుద్ధము చేయుదునో లేదో మీరు చూతురుగాక. (ప్రస్థానము.)

మేహ—హా...హా...హా...సలీమునకు కొంచెము పురిఎక్కించిఅప్పుడు తమాషా చూడవలె. ఈతఁడింత గొప్ప మేధావంతుఁడు. ఎవ్వఁడేని కొంచె మేమేని అన్నచో ఇంక ఒడలు తెలియదు.

(ఒకదాసి ప్రవేశించును)

దాసి—బాదుషాగారు దయచేయుచున్నారు (ప్రస్థానము)

మేహ—ఇప్పుడు బాదుషాగా రెందుకు వచ్చుచున్నారు?

దాల—నేను వెళ్లెదను.

మేహ—ఎక్కడకు వెళ్లెదవు? నిలువుము. మనము వారితో విన్నవము చేసికొందము.

డాల— లేదు నేను వెళ్లేదను.

మేహ— అబ్బా! ఇంత పిరికిదానవేమి? బాదుషాయన పులియా? యెలుఁగుబంటియా?

డాల— లేదు నేను వెళ్లెదను. (ప్రస్థానము)

మేహ— డాలతుకు బాదుషాయన నింత భయమెందులకో తెలియదు. కాని నా కేమియు భయము లేదు. బయట ఆయన బాదుషాయగుఁగాక. ఇంటిలో ఆయన నెవరు లెక్క సేతురు?

(అక్బరు ప్రవేశము)

అక్బ— మేహార్! నీ విచట నొంటరిగా నేల కూర్చుంటివి?

మేహ... (సలాము చేసి) అవును. ఇప్పుడు నేను ఒంటరిగానే యున్నాను డాలతు ఇంతదనుక నిచ్చటనే యున్నది. మీరు వచ్చుచున్నారని విని పారిపోయినది.

అక్బ... ఎందుకు?

మేహ... ఎందుకో బాదుషాకు శత్రువులు భయపడవలెనుగాని మాకెందుకు భయము?

అక్బరు... (నవ్వి) అయితే నీవు నాకు భయపడవా?

మేహ... ఎంత మాత్రము లేదు. నాకనులకు మీరు మనుష్యులే. మీరు హిందూదేశమునకు చక్రవర్తులయిన నేమి. టర్కీసుల్తానులైన నేమి? నా కెందుకు భయము? నేను మిమ్ము తప్పక గౌరవింతును

అక్బ— అది యెందుకు?

మేహ— తండ్రియనియు వయస్సున బెద్దవారలనియు.

అక్బ— మేహార్! నీవు చెప్పినది యథార్థము. మీరే నాకు భయపడుచో ఇంక నన్ను ప్రేమించువా రెవరు? అయితే నాకీమాట చెప్పుము. సలీము ఇచ్చటకు వచ్చినాఁడా?

మేహారు— అవును, జ్ఞాపకము చేసితిరి. రాణా ప్రతాపసింహునితో యుద్ధము జరుగునా?

అక్బ— జరుగవచ్చును. మానసింహుఁ డిపుడు ఆవైపునకే వెళ్లుచున్నాడు. ఆయన తిరిగివచ్చిన పిమ్మట నిశ్చయము తెలియును.

మేహ—అయితే సలీముకూడ యుద్ధమునకుఁబోవునా?

అక్బ—అవశ్యము. మానసింహుఁడెల్లకాలము బ్రతికియుండఁడుగదా. అందుకని సలీము కన్నిసంగతులు నేర్పవలయును.

మేహ—అయితేనాది యొకమనవియున్నది.

అక్బ—ఏమి?

మేహ—ముందు నాకీసంగతి చెప్పుడు. మీరుదానిని నెరవేర్చెదరా?

అక్బ—ఈమాట నేను చెప్పవలయునా! మేహర్! ఈప్రపంచములో నీకీయరాని దేమున్నది?

మేహ—నేనును గాలతును ఈయుద్ధములోనికిఁ బోయెదము. ఇదియే నామనవి.

అక్బ—ఏమి! మీరు యుద్ధములోనికి వెళ్ళి ఏమి చేసెదరు?

మేహ—ఏమి! మేము మనుష్యులము గామా? ఎప్పుడు నింటిలో ఖైదీలమై యుండుటయేనా మాపని? మాకుమాత్రము దేనిమీదను కోర్కెయుండదా?

అక్బ—ఇదియేటికోరిక? ఇది యెచటనైనఁ గలదా?

మేహ—ఎందుకు లేదు? మీరు పట్టుపట్టవచ్చునుగాని మీబాలిక పట్టగూడదా?

అక్బ—నేనెప్పుడు పట్టుపట్టితిని?

మేహ...పట్టితిరి. ఆనాఁడు మీరు చిత్తూరు జయించివచ్చినపుడు నన్ను హిందూశాస్త్రములలో ఏధార్మికవీరుఁడేని శత్రువును కపటముతో జయించినకథ యున్నఁ జెప్పుమని యడిగితిరి. అప్పుడు నేను వాలిద్రోణవధ వృత్తాంతము చెప్పఁగా మీమనస్సు కుదుటఁబడినది.

అక్బ—బాగున్నది. దానికిని దీనికిని సంబంధమేమి?

మేహ—ఉండనిండు లేకపోనిండు. నేను యుద్ధమునకు తప్పకవెళ్ళెదను.

అక్బ—ఇది యెట్లుజరుగును?

మేహ—జరుగునో జరగదో చూడుఁడు.

అక్బరు—మంచిది. ఇప్పు డీసంగతి కట్టిపెట్టుము. అసలు యుద్ధము జరిగిన అప్పుడు చూచుకొనవచ్చును. (ఇద్దఱు నిష్క్రమింతురు.)

అష్టమ దృశ్యము

స్థానము—ఉదయసాగరతీరము. సమయము—మధ్యాహ్నము.
ఒకప్రక్క మానా, గోవిందసింహుఁడు, రామసింహుఁడు, రోహిదాసు మున్నగు రాజపుత్రులును ప్రతాపుని మంత్రియగు భామాషా యును రెండవ ప్రక్క మహారాజ మానసింహుఁడును నిలచియుందురు.]

మానసిం—నాస్వాగతమునకై రాణాగారు ఇంత పెద్దయేర్పాటు చేసి నందులకు నేనెంతయు ననుగృహీతుఁడను.

భామాషా—మహారాజా! ఇప్పుడు మేమున్నస్థితిలో తమకు తగినస్వాగత మెక్కడఁజేయఁగలము? అయినను అంబరు మహారాజుగారు మాయీస్వల్పాతిథ్యము నే స్వీకరించి మాలోపములను క్షమించెదరని తలఁచుచున్నాము.

మానసిం...మంత్రిగారూ! రాణాప్రతాపసింహుని ఆతిథ్యము గ్రహించుట నేఁడు ప్రతిరాజపుత్రునకును గౌరవ విషయము.

గోవింద...మహారాజా! మీరు చెప్పినదెంతయు సత్యము.

మానా—మహారాజుగా రెప్పుడును నోటితోమాత్రము రాణాగారిని పొగడుచుందురు. క్రియమాత్రము వారిపూర్వ శత్రులగు మొగలులకు దాస్యముచేయుట.

రోహి—మాన ! నీ పూరకుంఠుము. మానసింహుఁడు అక్బరునకు స్యాలకపుత్రుఁడు. ఆయనపై మనమింతకంటె వేఱు ఆశ ఎట్లు పెట్టుకొనఁగలము?

భామాషా...ఎవ్వరేని యఁగుగాక. నేఁడు ఆయన మనకు అతిథి. మహారాజా! మీరుమానామాటలు లెక్కసేయకుఁడు

మానసి—లేదు మంత్రిగారూ! నే నిట్టిమాటలను లెక్కసేయను. అయినను వారుచెప్పినది యథార్థమే. కాని నేను అక్బరుబాదుషాకు స్యాలకపుత్రుఁ డగుటలో నాదోషమేమియు లేదని మాత్రము జ్ఞాపకముంచుకొనుఁడు. అందు నేను చేసిన దేమియు లేదు. అయితే అక్బరుపక్షమున నేను యుద్ధము చేయుచుంటినని

మాత్రము నే నొప్పుకొందును. అక్బరునకు విరుద్ధముగ శస్త్రము బట్టుట విద్రోహముగాదా?

గోవిం... మహారాజా! అది యెట్లు?

మాన... ఇప్పుడు భారతవర్షమునకు ఏకచ్ఛత్రాధిపతి అక్బరేకదా?

మానా... ఏయధికారముచే?

మాన... శక్తియధికారముచే. పలుమాఱులు యుద్ధక్షేత్రమునభరతవర్షమున కధిపతియెవ్వరో నిశ్చయమాయెను.

రామ... కాని మహారాజా! యుద్ధ మింకను సమాప్తము గాలేదు.

శా॥ స్వాతంత్ర్యార్థముసల్పు యుద్ధమెపుడున్ సాంతంబు గాదంచు వి
ఖ్యాతంబే, యొకవర్షమే యనఁగనేలా? నూరువర్షంబులే
నోత్రప్రాణముగాఁగ సాగుచునెయుండున్ దీనిఁ గావించు సు
స్వాతంత్ర్యమ్ము పరంపరాధిగతమై మించున్ బుత్రపౌత్రాళికిన్.

మానసిం . కాని ఇది యంతయు వ్యర్థము. ప్రచండబలశాలియగు అక్బరునకు విరుద్ధముగ యుద్ధముచేసి రక్తపాతము గావించుటచే ఫల మేమి?

రామ... మహారాజా!

గీ॥ తనదుబుద్ధికొలఁది యోజనము చేసి
కర్మ మొనరించుటే విధిగాని, నరుఁడు
తత్ఫలాఫలబాధ్యత దాల్పఁబోడు
సర్వమునకు విధాత యీశ్వరుఁడె కలఁడు.

మానసిం—ఫలాఫలముల విచారింపక యేపనియేని చేయుట మూర్ఖతగాదా?

గోవిం—మహారాజా! ఇదియే మూర్ఖత్వ మగుచో ప్రపంచములోని ఉచ్చప్రవృత్తులయు మహత్త్వము యొక్కయు సగమువంతు ఈమూర్ఖత్వమందే దాఁగియున్నది. ఈమూర్ఖత్వముచేతనేగదా

సీ॥ ప్రాణముల్ కత్తికి బలియిచ్చునేకాని
సాధ్వి సతీత్వ రక్షణము విడదు

మందునిప్పులఁబడి మ్రగ్గిమ్రందును గాని
తల్లి గానీదు సంతతికిఁ గీడు
తలదీసికొనుటకుఁ దలపడునే గాని
హిందువు కల్మా పఠింపఁబోడు
విమతులయసికి వక్షము సాఁచునే కాని
వీరుఁడు వీపు చూపింపఁబోడు
గీ॥ ప్రాణములపైని తీపిని బాసి యిటుల
నైజకర్తవ్యచరణ నీరేజములను
బ్రదుకు ధారనుబోయు మూర్ఖత్వమేని
యెల్లఱలలాటమందు లిఖింపఁబడునె॥

మహారాజా! రాణాగారి దారిద్ర్యమందున్న యీమహత్త్వము, వారి యాత్మత్యాగమందున్న యీగౌరవము అక్బరు పాదధూళి ధూసరితమగు మీసువర్ణకిరీటమందు లేదు. మానసింహా! మీ రెవరేని కానిండు, తుదకు హిందువులేకదా? హిందువులయ్యును మీరు ఇట్లు చెప్పుచుంటిరే! మీకు ధిక్కారము! మీకు ధిక్కారము!

(అమరసింహుని ప్రవేశము)

అమర—మహారాజా! తాము స్నానము చేసియున్నచో భోజనమును గావించి మమ్ము గౌరవింపుఁడని నాయనగారు చెప్పుచున్నారు.

మాన—రాణాగారేరీ?

అమర—వారు కొంచె మస్వస్థతగానున్నారు. తలనొప్పిగా నున్నది. వారు నేఁడు భోజనము చేయరు. తమభోజన మైనపిమ్మట తమ్మఁ గలసికొందురు.

మాన—అమరసింహా! మంచిది. నాకంతయుఁ దెలిసినది. నీవు వెళ్ళి రాణాగారితోఁ జెప్పుము. వారి యస్వస్థతకుఁ గారణము తెలిసినది. వారు నాపంక్తిని గూర్చుండి భుజించుట కిష్టపడుట లేదు. ఇన్నినాళ్ళనుండియు వారిగౌరవమును గాపాడుటకై నాగౌరవమును బోఁగొట్టుకొనుచుంటిని. బాదుషా భృత్యుఁడనయ్యు ఇన్నినాళ్ళవఱకు నేను రాణాకు విరుద్ధముగాఁ గత్తి పట్టలేదు.

వారితోఁ జెప్పుము నేటినుండియు నేను వారికి శత్రువు నైతిని.

గీ॥ మఱలఁ జను దెంతు తలనొప్పిమందుతోడ
కొలఁదినాళ్లలో స్వాస్థ్యమ్ము కలుగఁగలదు
సుప్తసింహమ్ము మేల్కొల్పఁ జూచునటుల
మానసింహున కేవఁ డవమాన మెంచు?

నే నాతని గర్వమును జూర్ణము సేయనిచో నా పేరు మానసింహుఁడు గాడు.

(ప్రతాపసింహుఁడు ప్రవేశించును.)

ప్రతాప—మంచిది మహారాజా! మంచిది. అట్లే యగుగాక. సాక్షాత్తు అక్బరునకే శత్రువగు నేను ఆతని యొక్క సేనాపతి శత్రుత్వమునకు వెఱవను. మఱియు జాతిభ్రష్టుఁడవగు నీపంక్తిని గుడుచుట కిచ్చగింప కయే నేను అస్వాస్థ్యమిషను బన్నినమాటయు వాస్తవము.

సీ॥ ఎవ్వాఁడు మొగల రాజేంద్రుప్రీతికి వంశ
గౌరవం బెల్లను గంగఁ గలిపె
ఎవ్వానికీవిలో నిమిడియున్నది మొగల్
బాదుషాశ్రిత పాదరజము
ఎవ్వాని యవనవాహిని పతిత్వమునకుఁ
బ్రబలహేతువు మ్లేచ్ఛబాంధవంబు
ఎవ్వాఁడు గరమున హేతి దాల్చు ఫలంబు
మాతృభూమి ప్రాణ మారణంబు

గీ॥ ఆకులాంగార మామాతృహంతకుండు
నాజఘన్యుఁడు నానీచుఁడైన మాన
సింహుఁ డొకమాని సే గ్రామసింహ మతఁడు
వాని పొత్తునఁ గుడుచుట పాడె నాకు॥

నీవు నా కతిథివై పోతివి. లేనిచో సార్వభౌముని స్యాలకపుత్రుఁడగు మహారాజ మానసింహుఁ డెక్కడో దీన దరిద్రుఁడగు ప్రతాపసింహుఁ డెక్కడో యిచ్చటనే తేలెడిది. నీ వెపుడు కోరిన అప్పుడే నన్ను సమరక్షేత్రమునఁ గాంచఁగలవు.

మాన—మంచిది. అట్లే యగుఁగాక నేను త్వరలోనే మిమ్ము యుద్ధ
క్షేత్రమునఁ గలసికొందును.

గీ॥ చీమ కవసానకాలమ్ము చేరువగుడు
రెక్కలు జనించునటు పోగరెక్కె నీకు
కాఁటమది మూడెఁ బోరునఁ గాచికొనుము
మానసింహుని సునిశిత మార్గణముల॥

రోహి—వీలగుచో మీ మేనత్తమగనిని అక్బరునికూడ వెంట తీసికొని
రండు.

ప్రతా రోహిదాసూ! ఊరకుండుము.

(మానసింహుఁడు క్రోధముతో నిష్క్రమించును.)

ప్రతా—సోదరులారా! ఇన్నినాళ్లనుండి మనము గావించిన సంగ్రామ
కృషికి ఇప్పుడు పరీక్షాదినము వచ్చినది. నేఁడు నేనునాచేతులతో
నంటించిన అగ్నిని వీరరుధిరప్రవాహముచే నార్పెదను. నాఁడు
మీరు యుద్ధములో నోడినను గెలిచినను మొగలులకుతలవంచమని
చేసిన ప్రతిజ్ఞ జ్ఞాపకమున్నదా? చిత్తూరు నుద్ధరించుటకై అవసర
మగుచో ప్రాణము లర్పించెద మని నాఁడు మీరు చేసినప్రతిజ్ఞ
జ్ఞాపకమున్నదా?

అందఱు—ఆఁ రాణాజీ! జ్ఞాపకమున్నది.

ప్రతా—మంచిది. అగుచో నింక యుద్ధమునకు సన్నద్ధులగుఁడు.

అందఱు—రాణాప్రతాపసింగుకు జై

శ్రీ

రాణా ప్రతాపసింహ

ద్వితీయాంకము

ప్రథమదృశ్యము

స్థానము—పృథ్వీరాజు అంతఃపురము సమయము—రాత్రి

[పృథ్వీరాజు మంచముపై పరుండియుండును. ఎదుట జోషీబాయి నిలఁబడియుండును.]

జోషీ—ఇప్పుడు అక్బరునకును రాణాప్రతాపసింహునకును యుద్ధము ప్రారంభమైనది. ఒకవైపున ఒకచిన్నరాజ్యమున కధిపతి. రెండవవైపున ప్రపంచములో సర్వాధికుఁడగు చక్రవర్తి.

పృథ్వీ—ఎంత సుందరదృశ్యము! ఎంత చక్కనిభావము! ఈ విషయమునఁగూర్చి నే నొకపద్యము వ్రాయవలయు ననుకొంటిని.

జోషీ—మీరు రాజకవులుగదా. మీకవిత్వమున సమ్రాట్టునే ప్రశంసించెదరు.

పృథ్వీ—బాగున్నది! నేను సమ్రాట్టును ప్రశంసింపనా? వారు భారతవర్షమునకు సార్వభౌములు. అందును నేను వారిద్రవ్యముచే నుదరము పోషించుకొనుచున్నాను. ఇది కలియుగమే అనుకొనుము. అందుకని నేను కృతఘ్నత వహింపుదునా?

జోషీ—నిజముగ నిది కలియుగమే. కలియుగమే కాకున్న

సీ॥ అలప్రతాపుని తమ్ముఁడగు శక్తసింహుఁడు
సోదరు సాధింపఁ జూచునొక్కొ

రాణాకు భ్రాతృపుత్రకుఁడో మహాబలు
మొగలదాస్యమ్మునఁ దగులునొక్కొ
ఇందాక నెటొ తలయెత్తిన మేవాడు
మానసింహుఁడు కూల్పఁ బూనునొక్కొ
బికనేరువిభుఁడు పృథ్వీరాజు మ్లేచ్ఛులౌ
మొగలుల నీరీతిఁ బొగడునొక్కొ
గీ॥ ఆత్మగౌరవమున నెక్కుడైన రాజ
పుత్రకులమునఁ బుట్టియు మొగలువంచఁ
జేరి మాతృభూమికి నెగ్గుచేయుటరయు
కాలమహిమమ్మ గాకున్నఁ గలదె వేఱు?

ఆహా! చంద్రకవి చెప్పినటుల హిందువులకు ముఖ్యశత్రువులు హిందువులే.

పృథ్వీ—నీవు చెప్పినది నిజము హిందువులకు ముఖ్యశత్రువులు హిందులే. (కొంచెము విచారించి) ఆఁ! నిజము హిందువులకు ముఖ్యశత్రువులు హిందువులే నిజము. నిజము.

(పృథ్వీరాజు మంచముదిగి ఇటునటు తిరుగుచుండును. జోషీబాయి మెదలక నిలఁబడి యుండును.)

పృథ్వీ—ఈవిషయమున నొకచక్కని పద్యము వ్రాయవచ్చును. హిందువులకు ముఖ్యశత్రువులు హిందువులు! దీనికి ఒకచక్కని యుపమాన మీయవచ్చును. మనుష్యునకు సింహము, పులి, పాము డేగమున్నగు ననేకశత్రువులుందురు కాని మనుష్యునకు ముఖ్యశత్రువు మనుష్యుఁడే. సింగము, పులి అడవులలో నుండును. పాము కన్నములో నుండును. డేగ ఆకాశమున నుండును. వీని శత్రుత్వము మనుష్యున కంత హానికరము గాదు. కాని మనుష్యులు ద్వేషించుకొనినచో చాల హాని గలదు. అట్లు గానిచో అహంజ్ఞానమునకు ముఖ్యశత్రు వహంకారమనియుఁ జెప్పవచ్చును. అట్లుగానిచో—

జోషీ—మీజన్మమంతయు నిటుల నుపమల వెదకుటయందే కడపెదరా?

పృథ్వీ—ఇందు హాని యేమున్నది? ఇది చాల గొప్పకార్యము. ఉపమలు ప్రపంచములో నెన్నియో గూఢతత్త్వముల విశదీకరించును. మఱియు నుపమలు వాస్తవికప్రపంచమందును, మనోరాజ్యమందును సర్వత్ర వికాసము ఒక్కవిధముననె ప్రవహించుచున్నటులఁ జూపించును. వాని సంబంధముల నెల్ల చూపించువాఁడే ఉత్తమకవి. ఆసంబంధముల నెల్లఁ జూపించుట కుపాయము ఉపమ యొకటియే. కాళిదాసు సర్వోత్తమకవిగా ఎందుకు గణింపఁబడుచున్నాఁడు? ఈఉపమాప్రభావముననే ఉపమా కాళిదాసస్య! ఆహా! కాళిదాసెంత గొప్పకవి! కాళిదాసూ! నీకు కోటినమస్కారములు. అయితే జోషీ! బాదుషాదర్బారు విషయమై నేను క్రొత్తగా వ్రాసిన పద్యమును నీవు వినలేదా? మంచిది వినుము

జోషి—స్వామీ! మీరింక నిట్టి నిస్సారకవిత్వమును వ్రాయుట విడువుఁడు.

పృథ్వీ—(కొంచెము సేపు నిలఁబడి (గుడ్లుపెద్దవిచేసి) నన్ను కవిత్వము వ్రాయుట మానుమందువా? ఇంతకంటె కత్తిపెట్టి నాకుత్తుక గోయరాదు? ఔరా! నన్ను కవిత్వము వ్రాయుట మానుమందువా?

జోషి—మీరు క్షత్రియులరు, బికనేరు మహారాజగు రాయసింహునకు సోదరులరు. కాని యిపుడు బాదుషాను బొగడు బట్టురాజులైతిరి. అసారవచనరచనయందే మీరీ దుర్లభమానవజీవితమును గడపుచుంటిరి. మీకు లజ్జ యగుట లేదా?

గీ॥ మాతృదేశ స్వతంత్రతాభూతికై ప్ర
తాపుఁ డొకవంక హృదయరక్తమును గార్ప
క్షత్రియుఁడవయ్యు తుచ్ఛభోగములఁ గోరి
యిచట జీవితముం బుచ్చు టుచితమగునె॥

పృథ్వీ—(పచారు చేయుచు) 'భిన్నరుచిర్హి లోకః' ఇదియు నాకాళిదాసు చెప్పినదే. జనులకు రుచి ఒక్కవిధముగా నుండదు. ఒక

నికి సంగీతము పాడుట యిష్టము. ఒకనికి వినుట యిష్టము. ఒకరికి వంటచేయుట యిష్టము. ఒకరికి తినుట యిష్టము. ప్రతాపునకు యుద్ధముచేయుట యిష్టము. నాకు పద్యముఁ వ్రాయుట యిష్టము. ప్రతాపుఁడు కత్తిపట్టినాఁడు. నేను కలముపట్టినాను.

జోషి—ఆహా! ఎంతఘనకార్యము! అయితే మీరీ కావ్యప్రపంచములో అసార విషయముల కసారసాదృశ్యముల వెదకుట యందే మీ జీవితమును గడుప నిశ్చయించుకొంటిరా?

పృథ్వీ—అన్నమాటయే. కాళిదాసు, భవభూతి, మాఘుఁడు పోయిన మార్గముననే నేను పోఁగోరితిని. ఇందు నేను సిగ్గుపడవలసిన సంగతి నాకేమియు గోచరించుటలేదు. కవిత్వము వ్రాయుట యేమియు చెడ్డపని కాదుగదా?

జోషి—చెడ్డపని గాదు. కాని దానికిది సమయముగాదు.

సీ॥ తనుఁగాచు దిక్కును గనక భారతమాత
యెలుఁగెత్తి యొకవంక నేడ్చుచుండ
సర్వధర్మముల శ్రేష్ఠమగు హిందూధర్మ
మొకచిక్కి నాశమ్ము నొందుచుండ
రాజపుత్రైక శరణ్య మార్యప్రతిష్ఠ
యొకప్రక్కేవఁ దుది యూర్పు నూర్చుచుండ
భారతవీరుల బాహాబలం బాత్మ
హత్యకై యొకవంక నడరుచుండ

గీ॥ కత్తిపట్టుకు చేతను గలముపట్టి
రణమున జయప్రశస్తుల వ్రాయుటుడిగి
మొగలుల ముఖస్తుతుల వ్రాసి ప్రొద్దుపుచ్చు
నుత్తమ క్షత్రియున కిది యుచితమగునె?

కవిత్వము వ్రాయుటే నీ కభిమతమగుచో

సీ॥ విద్యుత్ప్రవాహగర్భితమైన భావమ్ము
భారతీయాత్మలఁ బరుగులెత్త

ప్రావృట్పయోదగర్జనబోలు భావ హిం
    దువుల యీనాటి నిద్దుర హరింప
వడగట్టి దివిచిన వరవీరరస మార్య
    హృదయమాలిన్యమ్ము నెల్లఁ గడుగ
నాత్మచైతన్యమ్ము నొసఁగు సంగీతమ్ము
    జాతి నెల్లను నొక్కచక్కిఁ జేర్ప
గీ॥ మానవులు మానవత్వము మగుడఁ బూన
న్యాయహస్తము రాజ్యదండమును దాల్ప
వైళమ యధర్మమకుటమ్ము నేలఁగూలఁ
బాప మడుగంట నొక్క కబ్బమును బాడు॥
సీ॥ ఎవ్వానిగీత మాలించి త్రింశత్కోటి
    గళములు జయరవమ్ములఁ బొనర్చు
ఎవ్వానిపాటకు హిందులహృత్తంత్రు
    లేకస్వరమ్ము వహించి మ్రోయు
ఎవ్వానియుపదేశ మెల్ల భారతమాతృ
    సుతులఁ గర్తవ్యవిజ్ఞులను జేయు
ఎవ్వానియుద్గార మెలమి నార్యులకతి
    తజ్ఞాపనమున నుత్సాహ మొసఁగు
గీ॥ అట్టి రాష్ట్రీయకవియె పూజార్హుఁ డెందు
వానిజన్మంబు ధన్యమై వఱలుచుండు
బొల్లుకైతలఁ బొట్టలఁ బోసికొనెడు
కవులుఁ గవులేని యింకఁ గాకవులుఁ గవులె॥

నాథా! అట్టి గీతమును గాని కావ్యమునుగాని వినిపింతురేని నేనును మనసాగ్గివిందును.

పృథ్వీ—అనఁగా నేను కొఱత వేయఁబడగా నీవు కనులారఁ జూచుచు నుందువు అనియే కాదు?

జోషీ—అయ్యో! నాథా! మీకింత ప్రాణభయమా! మీరు మీప్రాణములను దుచ్ఛముగ నెంచిగీతమును బాడఁజాలనిచో నింక మీరు

గీతము వ్రాయఁబనిలేదు. దేశమును, జాతిని, ధర్మమును, మను ష్యత్వమును సర్వమును విడిచి అహోరాత్రములు యువనప్రమాట్టును బాగడుచుండుటయా! ఆహా! అక్బరు మీకేమి మందు మాకులఁ బోసి ఈ విధముగ తనదర్బారులో "చిత్తము చిత్తము" అనుటను నేర్పినాఁడు?

పృథ్వీ—ఇదుగో ఇప్పుడు నీవు తొందరగా చెప్పిన ఈ మాటలన్నియు కొంచెము అటుఇటు మార్చి ఒకవృత్తములో నిమిడ్చిన నొక చక్కని కబ్బమగును (తలయూచి) ఎంతచక్కని భావములు!

జోషీ—మీతో మాట్లాడుటయే వ్యర్థము.

పృథ్వీ—తెలిసికొంటివిగదా? ఇంక నెప్పుడు నిట్టివ్యర్థప్రలాపమును జేయక నాకు తృప్తికరముగ చక్కనివంట తయారుచేయించుము. పోయి వంటఅయినదేమో చూచిరమ్ము.

(జోషీ నిష్క్రమించును.)

పృథ్వీ—(తిరుగుచు) ప్రతాపసింహా! నీవు ఇల్లువాకిలి వదలి ఒంటరిగా నొట్టిచేతులతో బాదుషా నెదిరించి యేమిచేయఁగలవు? అసంభవవిషయముఁగూర్చి నీవింత వ్యర్థ ప్రయత్న మేలచేసెదవు? రమ్ము మా సంఘములోఁ జేరుము. మంచిమంచి భోజనము, ఉండుట కొకమేడ, దర్బారులో మర్యాద ఇవన్నియు దొరకును. పనికి మాలిన మూర్ఖత్వముతో నొక యాదర్శమును నిలఁబెట్టి క్షత్రియపురుషులతో వారిస్త్రీల కేలపోట్లాట పెట్టెదవు?

(నిష్క్రమించును.)

—o—

ద్వితీయ దృశ్యము

స్థానము—హాల్దిఘాటు, సలీము శిబిరము. సమయము—ఉదయము

[సలీముడేరాలో దౌలతు, మేహారు ప్రవేశింతురు.]

మేహారు—శాహజాదా ఇక్కడలేదు.

దౌలతు—లేదు.

మేహ—నే నిక్కడనే కూర్చుండి అతనిరాక చూచెదను.

దాల—నేఁడు నీవు చాలకోపముగా నున్నావు.

మేహ—ఉండనా? నేను యుద్ధముచూడవలెననుగంపెడాసతో నిచ్చటకు వచ్చితిని. కాని యిక్కడ నెక్కడను యుద్ధమనుమాటయే లేదు ఒట్టిమాటలే వినిపించుచున్నవి. నేనుండఁజాలను గోళ్ళుగిల్లుకొంటు నే నిక్కడ నొక్క గడియయైనను ఉండఁజాలను. నేఁడే యిక్కడనుండి పోయెదను.

దాల—నీమాట నాకేమియు నర్థమగుటలేదు. వచ్చువఱకు చంపిచంపి యుద్ధము చూడవచ్చితివి. యుద్ధ మారంభముకానుండ మఱల వెళ్లెదననిగోఁ!

మేహ—యుద్ధమెక్కడ? నేటికి పదియేనురోజులనుండి యుభయ సైన్యము లూరక యెదురుపడి నిలఁబడియున్నవి ఒకమాఱును యుద్ధము జరుగలేదు. నే నింక నుండఁజాలను. ఇప్పుడే వెళ్లెదను—అదుగో శాహజాదాసలీముకూడ వచ్చినాఁడు!

(సలీము సుసజ్జితవేషముతోఁ బ్రవేశించి వారిని జూచి ఆశ్చర్యపడును.)

సలీము—ఆఁ! మీరిచ్చట కేల వచ్చితిరి?

దాల—నేఁడు మేహరు చాల కోపముగా నున్నది

సలీము—ఎందుకు?

దాల—ఇప్పుడే వెళ్లిపోవుటకు సిద్ధముగానున్నది.

సలీము—ఎందుకు?

మేహరు—(లేచి) ఎందుకేమిటి? ఎక్కడనైన యుద్ధము జరుగుచున్నదా? పిటికి రాజపుత్రులును పిటికి మొగలులును మట్టి బొమ్మలువలె నిలఁబడినారు. మధ్యమధ్య ఒకకేకమాత్రము వేయుచుందురు. ఎక్కడను యుద్ధమును లేదు. యుద్ధ వాద్యములును లేవు. ఇదియే యుద్ధమగుచో నింకచాలు నన్నింటికి పంపివేయుము నే నిక్కడ నుండను

సలీము—బాగున్నది. అదియెట్లు ? నిన్నిప్పు డాగ్రా పంపుట మాటలా

మేహరు—అదియంత నాకు తెలియదు. రేపు ప్రొద్దున నన్నాగ్రాకు పంపిన సరే. లేనిచో (నేలతన్నుచు) పెద్ద యాపద తెచ్చిపెట్టెదను.

సలీము—అది యేమి?

మేహ—నేను స్వయముగ వెళ్ళి మహారాజ మానసింహునితో నేని చెప్పెదనా లేక ప్రాణము లేసి విడిచెదను. నాకు రెండును సమానములే. ఒకటేమాట (తలయాడించుచు బింకముతో) ఇంక నేనిక్కడ నొకరోజుగూడ నుండజాలను.

సలీము—ఆనాడువచ్చెదనని గందరగోళము చేసితివి. నేడు వెళ్లెదనని ఇంతకు ఆడవాళ్ళస్వభావ మెక్కడకుఁ బోవును? ఆనాడు నాకాళ్ళ పైఁబడుట తరువాయిగా ఇక్కడకువచ్చుటకు నీవేమిచేయలేదు?

మేహ—ఆనాటిశేషము నేడు పూర్తిచేసెదను. (సలీము పాదములు పట్టుకొనును) అన్నా! నేను పెద్దపొరపాటుచేసితిని. నేను వీరులతో యుద్ధమునకు వెళ్లుచుంటినిగదా అనుకొంటిని కాని ఇక్కడకువచ్చి చూచితినిగదా అందఱు పిఱికిపందలే. మీకు ఒక గొఱ్ఱెకున్నంత సాహసముగూడ లేదు. అందుకనియే నీకాళ్ళపైఁ బడుచున్నాను. చేతనగుచో రేపే ఏదో నిర్ణయము చేయుము. లేనిచో నన్ను తిన్నగా ఇంటికిఁ బంపుము. నాకు యుద్ధముపై మొగమొత్తినది.

సలీము—మంచిది లెమ్ము. నే నిప్పుడే మానసింహునివద్దకు వెళ్ళుచున్నాను. తర్వాత ఏమి చేయవలయునో అదిచేసెదను కాని నీవు మహాదృష్టముచే నాకు చెల్లెలవై పుట్టితివి. గనుకనే నీ మాట సాగుచున్నది (ప్రస్థానము)

లాల—మంచి పన్నుగడపన్నితివి.

మేహ—ఎందుకు పన్నను? లేనిచో మఱియెట్లు?

(ఇంతలో శక్తసింహుఁడు శాహజాదాసాహబ్! శాహజా దాసాహబ్! అని పిలుచుచు డేరాలోనికి వచ్చును అచ్చట ఇద్దఱ పిల్లలను జూచి “క్షమింపుఁడు” (అని వెడలిపోవును.)

లాల—ఏ రెవరు?

మేహ: ఈయన ప్రతాపసింహుని తమ్ముఁడు శక్తసింహుడని వింటిని. చాల సుందరుఁడు. ఏమి?

దౌల—ఆఁ—అయితే—

మేహ—సలీము చెప్పినాఁడు శక్తసింహుఁడు చాల చదువుకొనిన వాఁడట, అందును వ్యంగ్యోక్తులనుగూడ బాగుగ నెఱుఁగును. చూచితివా వచ్చినాఁడు. వెంటనే క్షమాపణగోరి వెళ్ళినాఁడు. కొంచెమాగిన సంభాషణ జరిగెడిది. ఈ యుద్ధరంగమున అంతఘోషా లేకున్న మాత్రము బాధ యేమి? వాస్తవమునకు ముసల్మానుల ఈ చెడు అలవాటు నాకిష్టములేదు. దీనిపేరుచెప్పిన నాయొడలు మండిపోవును. మన సౌందర్యసంపద నలుగురు చూచిన మాత్రముననే శూన్యమయిపోవునా?— మంచిది. పద. మనడేరాలోనికిఁ బోదము. ఏమి ఆలోచించుచుంటివి? పదపోదము. (దౌలతు చేయి పట్టుకొని మేహరు నిష్క్రమించును.)

—* తృతీయ దృశ్యము *—

స్థానము—మానసింహునిడేరా. సమయము—మధ్యాహ్నము.

[సలీము మహాబత్ఖాను ఎదురుగ నిలఁబడి మాటాడుచుందురు.]

సలీము—ఏమి ఖాన్సాహెబ్! ప్రతాపసింహునివద్ద ఎంతసైన్యమున్నది?

మహా—గూఢచారులు చెప్పినదానినిబట్టి దాదాపు ఇర్వది రెండువేల సిపాయీలు ఉందురు. ఇదిగాక భిల్లసైన్యము వేఱుగనున్నది.

సలీము—ఇర్వది రెండువేలేనా! (బట్ట దులుపుకొనుచు) ఏమేని యగుఁగాక. నేను ప్రతాపుని సాహసమును బొగడుచున్నాను. కేవల మిర్వది రెండువేల సైనికులతో ఇంతగొప్ప. బాదుషాను ఎదిరించిన యాతని నొకమాఱు నేను చూడఁగోరుచున్నాను.

మహా—యుద్ధసమయమున వారిని తప్పక చూడఁగలరు. ఆయన యెప్పుడు సైన్యమునకు వెనుక నుండడు. అందఱకు ముందుగ ఆయనయే యుండును.

సలీము—మహాబత్! ఈయుద్ధముయొక్క జయాపజయములు నీ చాక

చక్యము నీ పరాక్రమము మీాదనే ఆధారపడియున్నవని మేమం
దఱము ననుకొనుచున్నాము. (బట్టదులుపుకొనుచు) నీవు నీ పిన
తండ్రికి తగిన భ్రాతృవ్యుఁడ వగుదువో కాదో ఇపుడుచూచెదము.

మహా—ఈయుద్ధ పర్యవసానమును నేను బాగుగ నెఱుఁగుదును. మేవా
డు సైన్యముకన్న మన సైన్యము నాలుగురెట్లున్నది. అదియును
గాక మనవద్ద ఫిరంగులున్నవి. ప్రతాపునివద్ద లేవు. అందులో
నేఁడు సాక్షాత్తు మహారాజ మానసింహుఁడు మొగలు సేనా
పతి.

సలీము—మానసింహుని ప్రశంస వినివిని విసిగిపోతిని. యుద్ధముమాట
రాగానే బాదుషాగారుకూడ మానసింహుని నామమునే జపించె
దరు. మానసింహుఁడే దేవుఁడు కాఁబోలు. లేకమానసింహుఁడు
లేకున్న మొగలు సామ్రాజ్యము నిలువనే నిలువదు కాఁబోలు.

మహా—కాకున్న నిది యసత్యమా? పోనీ మీారే చెప్పుఁడు. కాకేశసు
మొదలుకొని ఆర్కాను వఱకును, హిమాలయము మొదలు
కొని వింధ్యాద్రివఱకును మానసింహుని సహాయము లేకుండ
మొగలు లేదేశమును సంపాదింపఁ గలిగిరి? బాదుషాగారు ఈ
విషయము బాగుగ నెఱుఁగుదురు. వారు ప్రతాపసింహునిఁ
గూడ బాగుగ నెఱుఁగుదురు. కనుకనే వారు ఈయుద్ధ
మునకు మానసింహుని బంపిరి.

సలీము—చాలు లేవయ్యా! నేను చాలవిన్నాను. వినివిని చెవులు తడికలు
గట్టినవి. మానసింహుఁ డంత వీరుఁడగుచో తానే రాజ్యము
చేయరాదు? మొగలుల కాళ్లకడఁబడి యేందు కేడ్వవలయును?

మహా— శాహజాదా సాహబ్! ఇవియన్నియు దైవలీలలు.

(మానసింహుఁ డొకమానపటమును బట్టుకొని ప్రవేశించును.)

మాన—శాహజాదాసాహబ్! సలామ్. మహబతాఖన్! బందగీ. మేవాడు
సైన్యమంతయు విశేషించి కోమలమీారుకు పడమటనున్న కొండ
లలోనున్నది. కోమలమీారుకుఁ బోవు త్రోవ చాల ఇరుకుగ
నుండును. దానికిరుప్రక్కలను చిన్నచిన్న గుట్టలున్నవి. వానిపై

రాజపుత్రులును విలుకాండ్రగు భిల్లులును, నిలఁబడియున్నారు.
ఈ పటము చూడుఁడు.

మహా—(పటమందుకొని) అయితే కోమలమీరు వఱకును బోవుట చాల కఠినమా?

మాన—కఠినమే కాదు. అసంభవము, రాజపుత్రులపై ఊరక కలియఁబడుట సరికాదు. మనము మొదలక కూర్చుండి వారిదాడిని నిరీక్షింతము

సలీము—సహ్వా! మన మెంతవఱకిటుల కూర్చుందుము?

మాన—వీలగునంతవఱకును కూర్చుందము. నేను భోజనసామగ్రి వగైరాల యేర్పాటంతయు పూర్తిగ చేసితిని.

సలీము—ఇది యెన్నటికిని వీలులేదు. మనమే ముందు వారిపై కలియబడుదము,

మాన—శాహజాదాసాహబ్! మనము శత్రువుల యాక్రమణమునే నిరీక్షింపవలయును. మహాబత్ఖాన్! పొమ్ము. ఇదియే నా హుకుము.

సలీము—కాదు. ఇది యెన్నటికిని కాఁజాలదు. (మహాబత్ఖానుతో) నీవు రేపుప్రొద్దున దాడివెడలుటకు సైన్యమును సిద్ధముగనుంచుము.

మాన—శాహజాదాసాహబ్! సైన్యమునకు నాయకుఁడను నేను.

సలీ—అయితే నేనూరక తమాషాచూచుటకే యిచ్చటకు వచ్చితినా?

మాన—మీరు బాదుషాకు ప్రతినిధిగ నిచ్చటకు వచ్చితిరి,

సలీ—అనఁగా?

మాన—అనఁగా నిదియే, మీరూరక నామమాత్రమునకు ఒకఫర్మానావలె ఒక ఆనవాలువలె బాదుషాపక్షమున నిచ్చటకు వచ్చితిరి. మీరు రాక మీకుబదులుగ బాదుషాగారి పాదరక్ష యిచ్చటకు వచ్చినను పని జరిగెడిదే.

సలీ—ఆఁ! ఇంతసాహసమా? (ఒరనుండి కత్తిదూయును)

మాన—శాహజాదాసాహబ్! కత్తిని ఒరలోనుంచుఁడు. వ్యర్థకోపముఁ బూనుటచే నేమి లాభము? మనయుభయులము పోరాడినచో

మీరు నన్ను గెలువఁజాలరని మీరెరుంగుదురు. మఱియు ఈ సైన్యమంతయు నాయధికారమున నున్నది కాని మీయధికారమునఁ గాదు. ఇదియు మీరెఱింగినదియే.

సలీ—మీరు నాయధికారములో లేరా?

మాన—లేను. నేను బాదుషా యధికారములో నున్నాను. ఈ యుద్ధములో నేను వారివలన సంపూర్ణాధికారమును బొంది వచ్చితిని. వీలగునంతవఱకు మీపనులన్నియుఁ జూచి యూరకుందును. మీ వ్యవహారము కొంచెము ముదురుచున్నట్లు తోఁచినచో పిచ్చివారికివలె మీకు చేతులకు కాళ్లకు సంకెళ్లు తగిలించెదను. నే నీ విషయమై యేమేని చెప్పవలసియున్నచో బాదుషా గారితో చెప్పికొందును. మహబ్బత్ఖాన్! నాయాజ్ఞానుసారమే పని జరుగవలయును. (మహబ్బత్ఖాను మొదలగు సలీముకు సలాముచేసి పోవును. తర్వాత మానసింహుఁడును సలాము చేసి పోవును.)

సలీ—మంచిది. ఈయుద్ధము పూర్తి కానిమ్ము, దీనికి ప్రతిక్రియ చేసెదను. ఔరా! ఇతని కింత సాహసమా! (త్వరగా డేరానుండి వెడలిపోవును.)

చతుర్థ దృశ్యము.

స్థానము—యుద్ధభూమిలో శక్తసింహుని శిబిరము

సమయము - అపరాహ్ణము.

[శక్తసింహుఁడు ఒంటరిగా నిలఁబడియుండును]

శక్త—ఇదియే మేవాడు. ఇదియే నాజన్మభూమియగు మేవాడు! నేఁడు నామాటమీఁదనే మొగలసేన వచ్చి స్వర్ణప్రసువగు నీ మేవాడు భూమిని నిండియున్నది. శీఘ్రముగ నే ఈభూమిపై తత్సంతాన రక్తస్రవంతులు ప్రవహింపఁ గలవు. ఈభూమితనసంతానమున కొసఁగిన రక్తమును ఇపుడు తిరిగి తీసికొనును ఇస్తేవాయనం పుచ్చుకొంటే వాయనం. లెక్క తేలిపోయినది. ప్రతాప్! ఇప్పుడు మన యుద్ధరతగాదాకూడ పరిష్కృతమగును.

నీవు నన్ను మేవాడునుండి వెడలఁ గొట్టితివి. ఇప్పుడు నీ యా ఋణమును నేను తీర్చుకొందును. రావణుఁడు విభీషణుని ఒక తన్ను తన్ని వెడలఁ గొట్టెను. విభీషణుఁడు తనపగదీర్చుకొనెను. నీవును నన్ను వెడలఁ గొట్టితివి. నాపగ నేఁడు తీర్చుకొందును. నేడు నిన్ను మేవాడునుండి వెడలఁ గొట్టెదను. మేవాడునంతను ధ్వంసము జేసెదను. తగులఁ బెట్టెదను. తర్వాత ఆశ్మశానముపై ప్రేతనలె తిరిగెదను. ఇంతయే జేసెదను. ఇంతకంటె నెక్కువ యేమియు లేదు. నేను మేవాడు రాజ్యమును గోరుట లేదు. మొగలుల బహుమానమును గోరుట లేదు. ఇందు ఏవిధమైన ద్వేషముగాని, లోభముగాని, హింసగాని, ఏమియు లేదు. నా పైఁ ప్రబతాపుని ఋణమొకటి యున్నది. దానిని దీర్చుకొనుటకై వచ్చితిని. నాచేతనగునంతవరకు ప్రాకృతికా న్యాయమునకు, సాంఘిక దురభిప్రాయమునకు, రాజనిరంకుశత్వమునకు ప్రతిక్రియ గావించెదను. జాతి చాల పెద్దది. దాని ముందు నేను చాలచిన్నవాఁడను. నే నొంటరిగ నా యుద్దేశ్యమును నెరవేర్పఁ జాలమిచే సహాయార్థము మొగలులఁ గొనివచ్చితిని. ఇందు నాది యన్యాయమని యెవ్వరనఁగలరు? నేనేమియు నన్యాయము చేయలేదు. పైఁగా నేనొక పెద్దయన్యాయమును న్యాయమువైపునకుఁ గొంపోవుచుంటిని. ఔచిత్యశాంతికి భంగము వాటిల్లెను. మరల ఆశాంతిని నేను స్థాపింపఁ బోవుచున్నాను. ఇందు నాదేమియు నన్యాయము లేదు.

[మేహారున్నిసా ప్రవేశించును.]

శక్త—(ఉలికిపడి) ఎవ్వరు?

మేహా—నేను మేహారున్నిసాను. అక్బరుబాదుషాకన్యను.

శక్త—(మర్యాదగ) బాదుషాకన్య నాడేరాలోనికా?

మేహా—మీరు ప్రతాపసింహుని తమ్ములుగదా. ఆయన శత్రుసైన్యములోని కెట్లు వచ్చితిరి?

శక్త—(కొంచెము వెల్లవోయి మెల్లగా) అవును. నేను ప్రతాపసింహుని శత్రుసైన్యములోనికి వచ్చినమాట వాస్తవము. నేను పగతీర్చుకొనుటకై వచ్చితిని.

మేహ—అయితే మీయుద్దేశ్యముకంటె నాయుద్దేశ్యము చాల గొప్పది నేను మైత్రిచేయుటకై వచ్చితిని. (శక్తసింహుఁడు విస్మితుఁడగుట చూచి) మీకు ఆశ్చర్యమెందుకు?

శక్త—నేనాలోచించునది—

మేహ—మంచిది. మీరు ఆలోచింపుఁడు. నేనును ఆలోచించెదను.

(కూర్చుండును.)

శక్త—(మఱియును విస్మితుఁడై) మీరిచ్చట కెందుకు దయచేసితిరో అడుగవచ్చునా?

మేహ—ఎందుకు అడుగఁగూడదు? చక్కగ అడుగవచ్చును. నే నొక పెద్దసంకటములోఁ బడితిని.

శక్త—సంకటమా! ఎట్టిసంకటము?

మేహ—చాల పెద్దసంకటము. సలీము నా సోదరుఁడని మీ రెఱిగియే యుందురు. నేనును దొలతున్నిసాయును యుద్ధము చూచుటకై వచ్చితిమి. ఇదియు మీకు తెలిసియే యుండవచ్చును. నే నేమో యిచ్చటకు యుద్ధము చూడవచ్చితిని. గాని ఇక్కడ యుద్ధమను మాటయే లేదు. ఇరుపక్షముల సైన్యమును ఒకరి వంక నొకరు చూచుకొనుచు పడియుండుటయె నాకిక్కడ కనఁబడుచున్నది. ఇదే చూచుటకు నేనేమియు నిచటకు రాలేదు. ఇంక మీరే చెప్పుడు. నే నిక్కడ కూర్చుని కూర్చుని యేమి సేయుదును? ఇంతదనుక దొలతున్నిసాతో కబుర్లుచెప్పుచుంటిని. ఇప్పుడదికూడ నిద్రపోయినది. ఎక్కడినిద్రయో గానిది. ఈ గందరగోళములో నేపెద్దమానిసి కేని నిద్రపట్టునా? ఇప్పుడు నే నొంటరిగా నేమి చేయుదును! మీరును ఇచ్చట నొంటరిగానుండుటగాంచితిని. కొంచెముసేపు మీతో సంభాషింప వచ్చునుగదాయనివచ్చితిని. సలీము మీరు పెద్ద విద్వాంసులనిచెప్పినాఁడు.

(శక్తసింహుఁడు మఱియును విస్మితుఁడగును.)

మేహ—మీ రిపుడు చాల ఆలోచనలోఁ బడినట్లు కనిపించుచున్నారు. నేనుబాదుషాగారి పుత్రికనే. కాని మాతల్లి రాజపుత్రస్త్రీ. నేని చటకు యుద్ధము చూడవచ్చుటయు, అందులో ఇంతకుమున్న మీతోఁ బరిచయము లేకయే నేను హఠాత్తుగ మీడేరాలోనికి వచ్చుటయు, మాకు అనుల్లంఘనీయమగు ఘోషా పద్ధతిని నేను విడనాడుటయు మీకు వింతగ నున్నవికాఁబోలు.

శక్త—అవును. అదియునుగాక మీరు నాడేరాలోనికి వచ్చిన సంగతి యెఱిగిన సలీముగాని బాదుషాగాని యేమందురు?

మేహ—మీరు భయపడకుఁడు. బాదుషాగారు ఏమియు ననరు. నా మాట వారికి ధర్మశాస్త్రవచనము. ఇంకసలీమా? పాపము వాఁ డేమిచేయును? నే నతనికి సోదరిని. మాయిద్దఱవయస్సు నొక టియే. అదియునుగాక మీరెఱిఁగియే యుందురు. ఆడవాళ్లు చిన్నవయస్సుననే పెద్దబుద్ధిగలవా రగుదురు. గాన నే నేది చెప్పినను వాఁడు తప్పక చేయును కాదనఁడు. ఆఁ! జ్ఞాపకము వచ్చినది. మీకు పెండ్లి అయినదా?

శక్త—లేదు. ఇంకను గాలేదు.

మేహ—ఇది గొప్ప వింతసంగతియే.

శక్త—ఏమి? ఇందు వింత యేమున్నది?

మేహ—మీకు పెండ్లి కాలేదు. ఇది సామాన్యపు వింతయా? నాకును బెండ్లి కాలేదు. మీకు పెండ్లి అయి మీతో మీభార్యకూడ ఈ యుద్ధమునకు వచ్చియున్నచో మాకు చక్కగ స్నేహము కలిసెడిది. కాని మీకు పెండ్లియే కాలేదు. ఇంక నెట్లు?

శక్త—ఇది నా దౌర్భాగ్యము.

మేహ—దౌర్భాగ్యమో సౌభాగ్యమో తెలియదు. కాని యీపెండ్లి చేసికొను నాచారము చిరకాలమునుండి వచ్చుచున్నది. ఆప్ర కారము అందరు నడువవలయును. ముందు నాకీసంగతిచెప్పుడు. ప్రణయినీ ప్రణయుల తొలిపలుకు లెట్లుండును? వానిని విను

టకు చాల కుతూహలముగ నున్నది. కావ్యములందును, నవల లందును వ్రాసిన విధముగనె సంభాషణము జరుగుచో చాలతమాషాగా నుండును. ఒక్కడనును—ప్రేయసీ! నీవు లేకున్న నేను బ్రదుకఁజాలను. దీనికి జవాబు—"ప్రియా! నిన్ను చూడకున్న నాప్రాణము లెగిరిపోవుచున్నవి." అని వచ్చును. ఇంతకుమున్ను వీరు ఒకరినొకరు చూచుకొన్నవారు గారు. రెండు మూడు రోజులలోనే ఈమాటలు! ఒకరినిజూడకున్న నొకరు బ్రదుకఁ జాలరు!

శక్త—ఇంతవరకు మీరెవ్వరి ప్రేమపాశమందును జిక్కుకొనినట్లు లేదు

మేహ.—లేదు. నేటివరకు నాకట్టి యువకాశము రాలేదు. నే నింతవఱ కెవ్వరిని ప్రేమింపలేదు. ఒకరు నన్ను ప్రేమింతురను భయ మును నాకు లేదు.

శక్త—ఏమి?

మేహ—ఎవ్వరినేని ప్రేమింపుచో మొదటిసంగతి ప్రేమింపఁబడువారి యాకారము అందముగ నుండవలయునఁట. నేను కావ్యము లలోఁ జదివితిని. ప్రేమింపఁబడు పురుషులందఱు కంతులో జయం తులో వసంతులో కావలయును. స్త్రీలు రతులో నిర్జరసతులో కావలయును. అనాకారయగు రాజపుత్రికకథను ఇంతదనుక నే నెక్కడను జదువలేదు. అయితే అనాకారయగు రాజపుత్రికను నేను చూచితిని.

శక్త—ఎక్కడ?

మేహ—అద్దములో. నాముఖము బొత్తుగ బాగుగలేదు. అయితే నా కనులు అంత చెడ్డవికావు. కాని అవి చెవులవఱకు వ్యాపింప లేదు. కనుబొమ్మలు రెండును దగ్గఱ కలసియుండిన బాగుండు నని వింటిని, గాని నాకనుబొమ్మలకు చాల ఎడముగలదు. అది యునుగాక నాముక్కు మధ్య కొంచెమెత్తుగానుండిన బాగుం డెడిది కాని చైనావారి ముక్కువలె అణఁగి పోయినది. అయితే మా అమ్మముక్కు మా నాయనముక్కు మాత్రము మంచివే.

తర్వాత నా బుగ్గలుకూడ గులాబిపువ్వులవలెలేవు. సారాంశము నేను చూచుటకు బాగుగ లేనన్నమాట. అయితే మాదాల తున్నిసా చూచుటకు చాల అందముగా నుండును. నేను అనాకారినయిన లోటును అది తీర్చినది. అయితే ఇందు నాకే ఎక్కువలాభము. ఏమన, రేయింబవళ్లు నాకనులకొక సుందర ముఖము కనిపించుచుండును. ఇంక నది పగలు రాత్రి అద్దము ముందు కూర్చుండదు గదా.

[యోగినివేషమున ఈర ప్రవేశించును.]

శక్త—ఎవరు?

ఈర—నేను ప్రతాపసింహుని పుత్రికనగు ఈరను.

శక్త—ఈరా నీవునాడేరాలోని కెట్లువచ్చితివి? నీకీ సన్యాసినీవేషమేమి? నేను స్వప్నమును గాంచుచుంటినా?

ఈర—లేదు బాబూ. ఇది స్వప్నము గాదు. నేను నిజముగ ఈరను. మిమ్మొకమారు చూచుటకై యిచ్చటికివచ్చితిని. (మేహారువంక జూచి) ఈమె యెవరు?

శక్త—ఈమె అక్బరుబాదుషా పుత్రిక మేహారున్నిసా (తనలో) ఇదియెంత వింతసంగతి. నాడేరాలోని కేకకాలమున మొగలసార్వభౌముని కన్యయు రాజపుత్ర ప్రభునికన్యకయు స్వయముగ వచ్చినారు

(మేహారు ఈరావద్దకుం బోయి అమె బుజముపై చేయివేయును)

మేహా—రాణా ప్రతాపసింహుడు మీకు తండ్రియా?

ఈర—అవును శాహజాదీసాహెబా!

మేహా—నేను శాహజాదీని గీహజాదీనిగాను. నేనువట్టి మేహారున్నిసాను నేను బాదుషాకూతునైనమాట వాస్తవము. కానినావంటి కూతుళ్లు ఆయనకు లక్షతొంబదిమంది కలరు. వారిలో నావంటిది ఒకర్తె హెచ్చినను, తగ్గినను వచ్చునది పోవునది యేమియు లేదు. నేను అనేకపర్యాయములు ఆయనతో యుద్ధమునకు వెళ్ళుటకు బ్రయత్నించితిని. కాని ఆయన యెప్పుడును నన్ను తీసికొని పోలేదు. ఈమాటు బలవంతముగ సలీముతో వచ్చితిని

నాతో మామేనత్తకూతురుకూడ వచ్చినది. దానిపేరు దాల తున్నిసా.

ఈర—ఆమె ఎక్కడనున్నది?

మేహ—స్వస్థముగా నిద్రబోవుచున్నది. దానినిద్ర విచిత్రమైనది. గిల్లినను మెలకువరాదు. మీరే చెప్పుఁడు ఈ గందరగోళములో నెవ్వరికైన నిద్రవట్టునా?

ఈర—పితృవ్యా! మీతోఁ గొంత చెప్పవలసియున్నది.

మేహ—ఆఁ చెప్పుఁడు, నేనిచ్చట నుంటినని మీరేమియు సందేహింపవలదు. మీరీమాట మీ పినతండ్రికి దక్క మరి యెవ్వరికిని తెలియగూడదనుకొన్న మీరు నాపై విశ్వాసముంచుఁడు నా తల కోసినను నే నెవ్వరికినిఁ జెప్పను. వీలగుచో నేనును మీమాటలలో నేకీభవించెదను. లేకున్న మొదలక యుందును. మీ పేరు ఈరగాదటా? ఎంతచక్కనిపేరు. ఆకారముగూడ ఎంతసౌమ్యమైనది. ఆఁ సంభాషణ ప్రారంభింపుఁడు. ఊరకుంటిరేమి? మీరు మాట్లాడుచునుండుఁడు. ఇంతలో నేను పోయి దాలతున్నిసాను బిలుచుకొని వచ్చెదను. అది మిమ్ముఁజూచి సంతోషించును.

(పరుగెత్తుకొని పోవును)

శక్త—విచిత్రపు పిల్ల!— ఈరా! నీవు ఒంటరిగనే వచ్చితివా?

ఈర—అవును,

శక్త—నీవు కుశలముగ నిచ్చటకు చేరగల్గితివా?

ఈర—కుశలముగ జేరుటకే నేనీ యోగినీవేషమును ధరించితిని.

శక్త—ప్రతాపునకు నివిక్కడకువచ్చు సమాచారము దెలియునా?

ఈర—లేదు నేను వారితోఁ జెప్పిరాలేదు.

శక్త—ప్రతాపసింహుఁడు క్షేమముగ నున్నాఁడా?

ఈర—శరీరముచే క్షేమముగనె యున్నాఁడు.

శక్త—ఆయన యేమి చేయుచున్నాఁడు.

ఈర—ఆయనకిప్పుడు యుద్ధపు పిచ్చ యెక్కినది.

సీ. ఒకవేళ సైనికప్రకరంబు గుమిగూర్చి
కదనశిక్షణమును గఱపుచుండు
ఒకవేళ రిపుభట వ్యూహంబు భేదింప
మొనసి మంత్రులతోడ ముచ్చటించు
ఒకవేళ ఘనగభీరోక్తుల సామంత
రాజపుత్రులకు నుత్తేజమొసఁగు
ఒకవేళ గట్టినమ్మకముగలట్టి వే
గులను వైరులగుట్టు తెలియఁబంచు
గీ. యుగయుగమ్ములనుండి హాయిగను హిందు
ప్రజల కాణాచియై వన్నెవాసిగనిన
భరతఖండంబు నేటికిఁ బరవశత్వ
మందెనని కార్చు నొకవేళ నశ్రువులను॥

శక్త—మావదినగారెట్లులున్నది?

ఈర—ఆమెయు బాగుగనె యున్నది. కాని రెండురోజులనుండి ఆమెకు నిద్రలేదు. నాయనగారి తలవంపుదిక్కున కూర్చుండి పారా వేయుచున్నది నాయనగారు నిద్రలో యుద్ధస్వప్నములనే గాంచుచున్నారు. ఒకప్పుడు నిద్రలో వారు "కలియబడుఁడు. కలియబడుఁడు" అని అరచుచుందురు. ఒకప్పుడు ఎవ్వరినోకసరుచుందురు ఒకప్పుడు "భయము విచారము ఏమియు లేదు." అనియనుచుందురు. ఒకప్పుడు "శక్తా! తుదకునీవే నీజన్మభూమి వినాశమునకుఁ గారణమైతివా" అనుచు నిట్టూర్పు విడుచుచుందురు.

(ఇద్దఱును కొంతసేపు మౌనముగ నుందురు.)

ఈర—(తలవంచుకొని) పితృవ్యా!

శక్త—ఈరా!

ఈర—మీరు నాయనగారికి సోదరులయ్యును వారిశత్రువులగు మొగలులలోఁ జేరుటకును, హిందువులయ్యును హిందువులకు శత్రువులగుటకును ఏమేని కారణమున్నదా?

శక్త—మీరాయన నిరపరాధుఁడగు నన్ను దేశమునుండి వెడలఁగొట్టెను. ఇదియే దానికి కారణము.

ఈర— నేనును ఆబ్రహ్మహత్యా వృత్తాంతము వింటిని. ఏదేశమును నాశముచేయుటకై మీరు అస్త్రమును గ్రహించితిరో దానిని గాపాడుటకే యాబ్రాహ్మణుఁడు తనప్రాణము లర్పించెను పితృవ్యా! ఒకమాఱు మీరు మీ పూర్వవృత్తాంతమును స్మరింపుఁడు

గీ॥ మృత్యుముఖమునుండి తప్పించి దరికిఁ
జేర్చి కాపాడె గోవిందసింగు తొలుత
పిదప నినుఁ దనకడకు రప్పించి యింత
దనుక మీయన్న సాకె ప్రతాపవిభుఁడు॥

పితృవ్యా! మీ రాగోవిందసింహుని మఱచినను, మీ యన్నయగు ఆ ప్రతాపసింహునకును విరుద్ధముగ నిప్పుడు ఖడ్గము ధరించితిరిగదా? మీప్రాణదాతల ప్రాణములు దీయుటకే యిప్పుడు సిద్ధపడితిరిగదా?

శక్త—ఈరా! నీవు చెప్పినది నిజము. కాని నన్ను అన్యాయముగ దేశమునుండి వెడలఁగొట్టిన యన్నకు విరుద్ధముగ ఖడ్గము గ్రహించితినని నీవు చెప్పలేదు.

ఈర—ఇది నిజము. అయితే పితృవ్యా! సోదరుఁడే దేని భయమూహించి యపరాధమును జేసినచో నింక ప్రపంచములో క్షమయను వస్తువు లేదా? క్షమ కేవలము నిఘంటువులందును, కథలయందును నుండునదియేనా? పితృవ్యా! మీ రొకమాఱు ఇటు చూడుఁడు.

సీ॥ కాలితో రాచి నాగటదున్ను ప్రజకే
సకలధాన్యముల నొసఁగు ధరణి
ప్రతిదినమ్మును బైఁబడి మేయు పసుకే
గ్రొంజిగురాకులఁ గూర్చు ద్రుమాను
కఱకుగానుగ నిడి కరముఁ బీడింపఁ జా
రకే మిష్టరసము నిచ్చుఁ జెఱకు

తనకు శ్రేగకును బంధము వేసి పిదికెడు
జనుల దుర్ధమ్ముల దనుపు మొదవు
గీ॥ సంద్రమునఁబుట్టు క్రూరబాష్పమ్ము మింట
ఘనముల సృజించు ఘోరగర్జనము సేయు
చల్లపడి వెండిసుమధుర జలముఁగురియు
క్షమయ లేకున్న నింక విశ్వమ్ము గలదె?

పితృవ్యా! ఈప్రపంచములో హింస, ద్వేషము, వివాద ఇవి దక్క వేఱొండు లేదా?

శక్త—ఊరా! ప్రపంచములో క్షమ యున్నమాట వాస్తవము. అట్లే ప్రతిశోధనమనునదిగూడ కలదు. నేను ప్రతిశోధనమునే శ్రేష్ఠముగ తలంచుచుంటిని.

ఊర—పితృవ్యా! దేనికి ప్రతిశోధనము? దేశనిష్కాసనమునకా? నాయనగారు దోషములేకయే మిమ్ము దేశమునుండి వెడలఁగొట్టిరా? బ్రహ్మహత్యా కారణంబగు నాటిద్వంద్వ యుద్ధమును జేయుటకు తొలుత ఎవ్వరు ప్రసంగించిరి? నాయనగారు మిమ్ము దోషములేకయే వెడలఁగొట్టి రనుకొనుఁడు. అయినను అంతకుమున్ను ప్రేమపూర్వకముగ మిమ్ము తమవద్ద నుంచుకొని పుత్రునివలె పోషింపలేదా?

శక్త—కాని అంతకుమున్ను నేను అన్యాయముగ వెళ్ళఁగొట్టఁబడితిని.

ఊర—ఆ అన్యాయము నాయనగారు చేయలేదు. రాణాఉదయసింహుఁడు చేసినదానికి నాయనగారు బాధ్యులు గారు. వారు మీ కొకమాఱు ఆశ్రయము నిచ్చిరి. మఱల విడనాడిరి. ఇందు ప్రతిశోధనమునకుఁ బనియేమి? ఉపకార మివ్విధమున మరవఁదగినదియును అపకారము మరవరానిదియునా?

శక్త—(స్తంభితుఁడై) స్వాగతము. నిజముగ నిది నాపొరపాటేనా? అట్లే కాకున్న ఈపసికూనవేయు ప్రశ్నపై నేను నిరుత్తరుఁడనగుదునా? (కొంచె మాలోచించి) ఊరా! నీమాట కేమి యుత్తర

మీయావలయునో నాకు తోఁచకున్నది. మంచిది. ఈవిషయమై ఆలోచించెదను.

ఈర—పితృవ్యా! ఈసమస్య యేమియు నంత కఠినమైనది. గాదు. మీరును దీనిని తెలిసికొనలేనంత మూఢులు గారు. మీప్రతి శోధము న్యాయసంగతమే యనుకొందము. అయినను అపరాధి నాయనగారే గాన వారివట్లనే మీప్రతిశోధము న్యాయ్యము. దేశముపట్లఁ గాదు. పాప మీజన్మభూమి మీకేమి యపరాధము చేసినది? దీనిపై మీకింత ద్వేష మెందుకు? ఏదేశమును రక్షించుటకై నాయనగారు తన ప్రాణముల గూడ నిచ్చుటకు సిద్ధముగనుండిరో దానిని ధ్వంసము చేయుటకై మీరిపుడు ఈ మొగలసైన్యమును బిలచుకొని వచ్చితిరి.

గీ॥ తండ్రికొమరులకును నన్నదమ్ములకును
వర్ణములకును నన్యోన్యవైరములను
గల్పనముచేసి యొక్కపక్షమునఁ జేరి
పరనృపుల్ తమపని చక్క పెట్టుకొంద్రు॥

పితృవ్యా! అట్టిచో పరరాజుల ప్రయత్న మక్కఱలేకయే మీలో మీరు గలఁతలువడి అందొకరు వారిపక్షమునఁ జేరి దేశమును వారిచేతిలోఁ బెట్టుటయు జాతిని వారికి పాదాక్రాంతముఁ జేయుటయు నుచితమా? ఇది మనుష్యుల ప్రతిశోధముగాదు-రాక్షసుల ప్రతిశోధము. ఇద్దరు అన్నదమ్ములు ఒండొరులలోఁ గలతపడి మాతృహత్యకుఁ బాల్పడుటయా? ఆహా! జన్మభూమిపై నింత నిర్దయతయా!

శక్త—కాని ఈరా! నేను బాల్యమునుండియే జన్మభూమ్యుత్సంగము నుండి వేఱుసేయఁబడితిని.

ఈర—అయినను అదిమీకు జన్మభూమియె

శక్త—నామమాత్రమునకే. నాపై దాని ఋణ మేమియు లేదు.

ఈర—ఋణము లేకుండుఁగాక నిరపరాధియగు దానిని మొగలులపాదములచేఁ ద్రొక్కించుట అన్యాయము అత్యాచారము గాదా?

ప్రతాపసింహుఁడు మీవిషయమై అన్యాయము చేసినచో ఆయన యే దానికి బాధ్యుఁడుగాని మేవాడుగాదు

శక్త—(కొంచెమాలోచించి) ఈరా! నీవు చెప్పునది న్యాయ్యముగనే కను పట్టుచున్నది. అయినను ఇంకనాలోచించి చూచెదను. నేనొనర్చు నదియే అన్యాయమని తోఁచినచో యథాసాధ్యముగ దానికిఁ బ్రతిక్రియ చేసెదనని ప్రతిజ్ఞ చేయుచున్నాను—కానిచాల ముం దుకు వచ్చితిని. ఇప్పుడు వెనుకకు మఱలుటకు దారి లేదు.

ఈర—పితృవ్యా! నేను యుద్ధమునకే విరోధిని. నేను నాయనగారిని యుద్ధవ్యవసాయమునుండి నిరంతరము మరల్చుచు వచ్చితిని. కాని వారునామాట వినలేదు. అయినను ఈమారుయుద్ధమగు నపుడు నాకు నాయనగారియెడలనే సహానుభూతి యుండును. వారు నాకు తండ్రియనియు మొగలులు నాకు శత్రువులనియుఁ గాదు? మొగలులు ఆక్రమించువారును, నాయనగారు ఆక్రమిం పఁబడువారును అని. మొగలులు ప్రబలులు, నాయనగారు దు ర్బలులు అని.

శక్త—ఈరా! తప్పు నాయదియే. నీవు చెప్పినది నిజము. ఇంక సాధ్య మగునంతవఱకు దీనికి ప్రతిక్రియ చేసెదనని ప్రతిజ్ఞ చేయుచు న్నాను.

ఈర—భారతమాతకు జై. మీ ప్రయత్నము సఫల మగుగాక. నాకు సెలవిండు. ఇంక నేను వెళ్ళెదను.

శక్త—పద. నిన్ను పంపించివచ్చెదను.

ఈర—అక్కర లేదు. నేను యోగినిని! నన్నెవ్వరు నడ్డగింపరు. మంచిది పితృవ్యా! నేనుపోవుచున్నాను. నమస్కారము.

శక్త—మంచిది అమ్మా! చిరంజీవిని కమ్ము.

(ఈర నిష్క్రమించును.)

శక్త—గొప్ప విద్వాంసుఁడననియు బుద్ధిమంతుఁడ ననియు నాకు పెద్ద గర్వము. కాని నేఁడీబాలికచే ఓడింపఁబడితిని. నిజముగ నేనొక పెద్ద యన్యాయమునకుఁ బ్రవర్తకుఁడ నయితినా? ఇందు అపరా

ధము నాదియేనా! కొంచె మాలోచించెదను. (విచారించుచు నిలఁబడును. ఇంతలో దాలతున్నిసాను దీసికొని మేహారున్నిసా ప్రవేశించును.)

మేహారు—ఈరి ఎక్కడ?

శక్త—వెళ్ళిపోయినది.

మేహా—వెళ్ళిపోయినదా? ఔరా! ఏటిమాట! నేను దాలతును దీసికొనివచ్చినది ఈరతో ఈమెకు పరిచయముచేసి మేమందఱము కలసి మాటాడుకొందముగదాయని. ఇంతలోనె మీరు ఆమెను బంపివేసితిరి. ఔరా! ఇది యేటి సౌమ్యత!

శక్త—క్షమింపుఁడు. మీ రీమెను పిలచుటకు వెళ్లినమాట నేను మఱచితిని.

మేహా—వహ్వా! ఎట్లు మఱచితిరి? బహుశః నేను పిలువకుండ మీడేరాలోనికి నచ్చినందుకు ఫలితముగాఁబోలు ఇది. కాని నేనెవ్వతెనో మీ రూహింపలేదు అక్బరుబాదుషాకూతునిమాట మీరు మఱచెదరుగాక. ఒక భద్రస్త్రీని నిర్లక్ష్యముచేయుట యుక్తము కాదు. నేను స్వయముగ నింతశ్రమపడి దాలతు నింత శ్రమపెట్టి ఇక్కడకు తీసికొనివచ్చినది మీ యాకారమును జూచుటకా?

శక్త—అట్లు అయినమాత్రము బాధయేమి?

మేహా—అవును నిజముగ మీ యాకారమును దర్శనీయమే; కాని మీముక్కు కొంచెము చిన్నదిగ నుండుచో చాల బాగుగ నుండెడిది.

శక్త—ఈమెయేనా మీ మేనత్తకూతురు

మేహా—అవును ఈమెయే దాలతున్నిసా. ముఖమెంత చక్కనిదో చూచితిరా?—దాలత్! కొంచెము ముసుఁగు తీయుము

దాల—పో: (ఇంకను ముసుగువేసుకొనిసిను)

మేహా—ఓసీ! కొంచెము ముసుఁగుతీయుము ఇందు నష్టమేమున్నది! నీముఖమేమియు గులాబుజామనుగాదుగదా చూడగ నేనోటిలో వేసికొందురని భయపడుటకు? నామాట విని కొంచెము ముసుఁ

గు తీయుము. తర్వాత ఇంటికి వెళ్ళి అద్దములో బాగుగ జూచు కొనుము. ఏమేని అరగినఁగాని చెడిపోయినఁగాని, నీ యిచ్ఛ వచ్చినది చేయుము. ఈ మాదిరిసిగ్గు నాకు బాగుగ నుండదు. ముసల్మానుల కిదియొక పాడుఅలవాటు. శక్తసింహాజీ ఇది నేను ఒప్పుకొందును. మీపూర్వులుమీ పద్మిని ముఖమును అల్లాఉద్దీనుకు చూపింపకున్నచో నేఁడు చిత్తూరు ఇతిహాసము మరియొక విధముగనుండెడిది! దౌలత్! ఇంక ముసుఁగు తీయుము. (బలాత్కారముగ ముసుఁగు తీయును.) ఇదుగో ఇప్పుడు బాగుగ చూడుడు. చూచితిరా ఎంత చక్కనిదో?

శక్త—చక్కనిది యగుటలో నేమియు సందేహము లేదు. నేటిదనుక నే నిట్టి సౌందర్యమును ఎక్కడను జూడలేదు. ఈమె నెట్లు ప్రశంసింపవలయునో తెలియకున్నది.

మేహ—మంచిది. మీరు ప్రశంసింపకుఁడు. నేనే ప్రశంసించెదను.

గీ॥ ధ్వాంతమయరాత్రి వీణారవంబు విధము
ఘనవిపినమందున గులాబికలికవగిది
కలితమధుమాసమునఁ దొలిగాడ్పువోలె
నలరుచున్నది మిఘల నుత్పలదళాక్షి॥

వర్ణన బాగుగ నున్నదియా లేదా?

దౌల—ఓసీ! పొమ్ము.

మేహ—యౌవనారంభమున ప్రథమ ప్రేమస్వప్నమువలె.

[దౌలతు రెండు చేతులతో మేహరునోరు మూయును.

మేహ—విడువుము, విడువుము. నాకు ఊపిరి సలుపుట లేదు. (శక్తసింహునితో) నేను ఆఖ్యాయికలలో నెన్నియో రూపవర్ణనములు చదివితిని. నేను స్వయముగఁగూడ చాలబాగుగ వర్ణింపఁ గలను. హాఫిజ్ ఫైజీలుగూడ అట్లు వర్ణింపఁజాలరు.

శక—ఎట్లు?

మేహ—ఈరూపమును నిర్మించిన దైవము దీనియందు ఇంకను చక్కదనము పెట్టుటకు ప్రయత్నించినచో ఇది ఇంకను చెడిపోయె

డిది. ఇంతకంటె చక్కనిది యగుటకు వీలులేదు. (దాలతుతో)
ఏమి దాలత్! నీ వీయనవంక రెప్పలార్పక యేల చూచుచుం
టివి? శక్తసింహుని ప్రేమలోఁ బడితివా?

దాల— పో, నా కీమాటలు బాగుగనుండవు.

మేహ—ఆఁ. అన్నియు ప్రేమలక్షణములుగనే కనుపించుచున్నవి. రెప్ప
మార్పక చూచుట, రెండుచూపులు కలియునపుడు తలవంచు
కొనుట, చెవులవరకు ముఖమంతయు ఎఱ్ఱవడుట, దీనిపై నెవ్వ
రేని పరిహాసము చేసినచో, పో నాకీమాటలు బాగుగ నుండవు.
అనుట - పుస్తకములో వ్రాసిన సంగతులన్నియు బాగుగ సరి
పోవుచున్నవి. ఓసీ! ఏమి పనియది? ఈయనమాయలోఁ బడుట
లేదుగదా! ఈయన రాజపుత్రుఁడు. మనము మొగలులము.
అయినను ఇందు బాధయేమి! నాయన మహమ్మదీయుఁడు
అమ్మ రాజపుత్రస్త్రీ. వారును పెండ్లి చేసికొనిన వారేకదా.
(దాలతు వెళ్లఁబోఁగా శక్తసింహుఁడు ఆమె నడ్డగింపఁ బోవును.
ఆమె పరుగున వెళ్లిపోవును.)

మేహ—ఔరా! మీకును ఆలక్షణమె కనుపట్టుచున్నది. లేకున్న ఆమె
నడ్డగించుటకు మీ కేమి యధికారము? కాని యుద్ధరంగమునకు
వచ్చి ప్రేమపాశమునఁ జిక్కుకొనుట యింతవరకు నే నెక్కడను
జదువలేదు. అదనెఱిఁగి పని చేయుఁడు. ఇక నెన్నడు నిట్టి పని
చేయకుడు. (నవ్వుచుఁ బోవును.)

శక్త—ఇద్దరు విచిత్రబాలికలు. దాలత్ ఎంతసుందరియో మేహరు
అంత విదుషి. దాలతును మాటిమాటికి చూడవలయు ననిపిం
చును. మేహరుకూడ చూడఁదగినదే. వీరెంత చపలలు. ఎంత
రసికలు. ఎంత ఆనందమయులు. - విచిత్రబాలికలు.

పంచమ దృశ్యము.

స్థానము— హాల్దీఘాటు, ప్రతాపుని శిబిరము.

సమయము—అర్ధరాత్రి.

(ప్రతాపుఁడు వక్షముపై రెండుచేతులు ముడుచుకొని దూరమున నేదియో చూచుచు నిలఁబడును)

ప్రతా— (శుష్కస్వరముతో) మానసింహుఁడు నాయాక్రమణమును నిరీక్షించుచున్నాఁడు. నేను ఆతని యాక్రమణమును నిరీక్షించుచున్నాను, నేను ముందుగ ఆతనిపై నాక్రమణ సేయను. పర్వత సంకులమగు ఈకోమలమీరు మార్గమును గాచియుండెదను. నేను వారిపై నాక్రమణసేయువాడనే కాని అక్కడ ఎనుబది వేలు సుశిక్షిత మొగలసైనికులు గలరు. ఇంక నిచ్చట ఇర్వది రెండువేలే నవశిక్షితులగు రాజపుత్రులు గలరు. అదియునుగాక మొగలులవద్ద ఫిరంగులున్నవి. నావద్ద లేవు. ఔరా! ఇప్పుడు నాకు ఏబదిఫిరంగులైనను దొరికినచో వానికి నాకుడిచేయి కోసి యిచ్చుటకు సిద్ధముగా నున్నాను. ఇంక నాకేమియు నక్కర లేదు. ఏబదిఫిరంగులు కావలయును.

([ప్రతాపుఁడు ఇటునటు వేగముతో తిరుగుచుండును. ఇంతలో గోవిందసింహుడు వచ్చును.]

గోవిం—రాణాజీకి జై

ప్రతా—ఎవ్వరు? గోవిందసింహుఁడా?

గోవిం—అఁ రాణాజీ!

ప్రతా—ఇంతరాత్రి నేలవచ్చితివి?

గోవిం—ఒకవిశేషవార్త యుండుటచే

ప్రతా—ఏమియది?

గోవిం—మానసింహుఁడు తనయభిప్రాయము మార్చుకొనినాఁడు.

ప్రతా—ఎట్లు?

గోవిం—శక్తసింహుఁడాయనకు కోమలమీరునకుఁగల సుగమమార్గ

మును జూపించెను. అందుచే మానసింహుఁడు కొందఱ సైనికు లకు ఆమార్గమునఁబోవుట కాజ్ఞాపించెను.

ప్రతా—శక్తసింహుఁడా?

గోవిం—అవును రాణాజీ! సలీమునకును మానసింహునకును సైన్య ము నడిపించు విషయములో వివాదము గలిగెను. సలీము మన పై నాక్రమణము సేయుట కాజ్ఞాపించెను. కాని మానసింహుఁ డాయాజ్ఞను నిరోధించెను. అటుపిమ్మట శక్తసింహుడు వచ్చి మానసింహునకు కోమల మీారుమార్గమును జూపించెను. ఇప్పు డు మానసింహుఁ డామార్గమున మొగలులఁ బంపుటకు నిశ్చ యించుకొనెను.

ప్రతా—(నిట్టూర్పు విడిచి) గోవిందసింహాజీ! ఇప్పు డెక్కువ కాలవిలంబ ము పనికిరాదు. రేపు ఉదయమే శత్రుసైన్యములపై నాక్రమణ ము సేయునదిగా సామంతుల కాజ్ఞాపించుము. మనము వారి యాక్రమణమును నిరీక్షింపవలదు. మనమే ముందుగ నాక్రమణ ము సేయుదము. పొమ్ము.

(గోవిందసింహుఁడు పోవును.)

ప్రతా—(తిరుగుచు తనలో) శక్తసింహా! శక్తసింహా! ఆఁ ఇది తప్పక శక్తసింహునిపనియే. శక్తసింహుఁడు మేవాడు ధ్వంసము చేయు నని చెప్పిన ఆజోస్యుని మాట నాకు జ్ఞాపకమున్నది. ఇంక నేమి యు ఆశ లేదు. ఇక నాజోస్యుని మాటయే సత్యమగును.

ఉ॥ చేవదలిర్ప నాయుదయసింహుఁడు నాజనకుండు ధైర్యసం
భావితచిత్తుఁడై ముసలుమానులదాడి కెదిర్చి వెన్కకుం
బోవక పోరియున్న రసపుత్రులమాట చితౌరుకోట నే
డీవిధి పారతంత్ర్యమయహీనతకుఁ నతశీర్షమానొకో॥

ఉ॥ ప్రాణములఁ దృణమ్ములుగ భావనచేసి యవార్యశౌర్య సా
రీణత నాలమందు చెలరేగు తురుష్కభటాళినెల్ల హై
రాణనుబెట్టి నీదుపరిరక్షకు నాజయమల్లు ఫత్తయుఁ
బ్రాణములిచ్చి ధన్యతములయ్యిరిగాదె చితౌరుదుర్గమా!

మంచిది. నేను చితౌరు నుద్ధరింపఁజాలనిచో దానికై ప్రాణము లీయఁగలను. (వెనుకనుండి లక్ష్మి ప్రవేశించును)

లక్ష్మి—నాథా! మీరింకను మేలుకొనియే యున్నారా?

ప్రతా—ఇప్పు డెంత ప్రొద్దు పోయినది?

లక్ష్మి—రెండుజాములైనది? మీ రింతదనుక నిద్రపోలేదా?

ప్రతా—నాకు నిద్రపట్టుటయే లేదు

లక్ష్మి—చింతచేతనే మీకు నిద్రపట్టుటలేదు. మీ రీచింతలనెల్ల విసర్జింపుఁడు సంగ్రామము క్షత్రియుని కార్యము. జయాపజయములు దైవాధీనములు. ఏది కానున్నదో అగును. జీవనమరణములు క్షత్రియుని లీలామాత్రములు ఇంక చింత యెందుకు?

ప్రతా—రేపుప్రొద్దున మొగలసైన్యముల నెదుర్కొనుటకు (?) కాజ్ఞనొసఁగితిని. ఇప్పు డాయాలోచనచేతనే నాతల తిరుగుచున్నది. ఒడలియందలి రక్తమంతయు నెత్తికెక్కినది. నాకు నిద్రవచ్చుటలేదు.

లక్ష్మి—ఎట్లైన మీరీచింతను విసర్జింపుఁడు. రేపు యుద్ధమగును. అందు మీరెంతయు నాలోచన చేయవలసి యుండును. పరిశ్రమచేయవలయును. గాన ఇప్పుడు కొంచెము నిద్రింపుడు ప్రొద్దున మీశరీరమునకు నూతనప్రాణమును, నూతన తేజమును, నూతనోత్సాహమును గలుగును.

ప్రతా—నేను నిద్రింపవలెనని యనుకొనుచున్నాను. గాని నిద్రవచ్చుట లేదు. నిద్రించుటచే శరీరము చులకనగ నుండుననియు, నూతన ప్రాణము, నూతన తేజము నూతనోత్సాహమును గలుగుననియు నెఱుఁగుదును. కాని నాకు నిద్రవచ్చుటలేదు. ఇప్పుడు నా కంటి కెవ్వరు నిద్రనీయఁగలరు!

లక్ష్మి—రండు. నేను నిద్రపుచ్చుటకు ప్రయత్నించెదను.

(ఇద్దఱును డేరాలోనికిఁ బోదురు.)

షష్ఠదృశ్యము

స్థానము—శిబిరబహిర్భాగము, సమయము—అర్ధరాత్రి

[మేహరున్నిసా ఒంటరిగ పాడుచు తిరుగుచుండును.]

గీతము

వానిని ప్రేమింప నీవు వలదని వారెంతు రెపుడు
మానక సంతతము నాదుమనము వానిపదములఁ బడు
అతనిపొత్తు దెంపికొనఁగ జతనము సేసినకొలంది
అంతకు మతియు బలపడి సాధ్యముగాకుండును గడింది.
బలిమిని ప్రేమప్రవంతి బంధింపఁగఁ గట్టువేతు
తలఁగక యశ్రువులధార దాని ద్రెంచు నేమి సేతు

(దాలతు ప్రవేశించును)

దాల—ఏమి వదినా! నీవింత ప్రొద్దుపోవువరకు మేల్కొనియుంటివా?

మేహ—నీవు నిద్రించుచుంటివా?

దాల—నాకు నిద్రవచ్చుట లేదు.

మేహ—నాకు నదియే స్థితి. నిద్రవచ్చుటలేదు.

దాల—నీకెందుకు నిద్రపట్టుటలేదు?

మేహ—వహ్వా! నేనును సరిగా నిదియే నిన్ను నడుగ నెంచితిని. ఊహ యెట్లు కలసినదో చూడుము. అయితే నీకు నిద్ర ఎందుకు పట్టుట లేదు?

దాల—మాట నిల్లే టలాయించెదవా?

మేహ—ఇంక చాలును. దీనికి జబాబు నావద్ద లేదు నేను నీకు ఓడితిని. మంచిది వినుము. రాత్రి నీకును నాకును గడచినది. ఇద్దరమును మేలుకొనియే యున్నాము. ఇద్దఱకును మేలుకొని యుండుటకు కారణమును ఒకటియే- నిద్రరాక పోవుట. నిద్రరాకుండుటకు కారణముకూడ ఇద్దఱకును ఒకటియే. అది నీవును చెప్పఁజాలవు. నేనును చెప్పఁజాలను.

దాల—ఎందుకని?

మేహ—చెప్పుచుంటినిగదా ఆకారణము చెప్పఁజాలము.

దాల—అయినను చెప్పుడు.

మేహ—నీయందిదే పెద్దదోషము. అయిన దానికి కానిదానికి పట్టు పట్టెదవు. అదుగో వినుము. నీకేమేని వినఁబడుచున్నదా?

దాల—ఏమి?

మేహ—ఆ మొగల సైనికు లెంత గాఢముగ నిద్రించు చున్నారో చూడుము.

దాల—నేను నిద్ర యెందుకు వచ్చుట లేదు? అని అడుగుచున్నాను.

మేహ—వారి గుఱ్ఱు ఇచ్చుటకు విన బడుచున్నది

దాల—ముందు నామాటకు జవాబిమ్ము.

మేహ—ఆ రాజపుత్రుల కాగడాలు నీకు కనుపించుచున్నవా?

దాల—అడిగిన మాటమాత్రము చెప్పుము.

మేహ—వారు ఫారా వేయుచున్నారు కాఁబోలు

దాల—పో. నీమాటలు నేను వినను.

మేహ—కాదు కాదు. విను.

దాల—ఊఁహూ. నేను వినను.

మేహ—కాదు. విను.

దాల—ఊఁహూ. నీవు మాట్లాడకుము.

మేహ—కాదు నేను మాట్లాడెదను.

దాల—నేను వినను.

మేహ—కాదు. నీకు వినకతప్పదు.

(దాలతు ముఖము త్రిప్పికొని నిలఁబడును. మేహరు ఆమె ముఖమును తనవైపునకు త్రిప్పఁగోరును. కాని ఆమె అట్లేయుండును.)

మేహ—అయితే వినవుకాదు! (ఆవలించి) నాకు నిద్ర వచ్చుచున్నది. ఇంక నేను వెళ్ళి నిద్రించెదను.

దాల—ఎక్కడకు వెళ్లెదవు? చెప్పి వెళ్లుము.

మేహ—ఇప్పుడు విననని అంటివిగదా?

దాల—లేదు నే నేదియో ఆలోచించుచుంటిని.

మేహ—నేను నాలోచించు చుంటిని.

దాల—ఏమి?

మేహ—నేననుకొనినది సరియగునా కాదాయని. ఇప్పుడు నా కది సరి యని యే తోఁచుచున్నది. నేను గ్రంథములలోఁ జదివిన దంత యు సరిగా సరిపోవుచున్నది. ఇట్టి స్థితిలో మానవులకు రాత్రి యంతయు నిద్రపట్టదు. వారు చాటుమాటుగ అది నాకు లభిం చునా లభింపదా యని ఆలోచింపుచుందురు. అన్నిటికంటె పెద్దవిచారము తన్నెవరేని చూచిరో తన విషయము నెవరేని తెలిసికొనిరో యని కాలు జారి పడినవానికి మొదటి విచారము తన్నెవరేని చూచినారేమో యని.

దౌల—తుదకు నీవు నాకుగూడ దాఁచి యుంచెద వెందుకు? నీ ప్రియుని నే నేమియు లాగికొనను.

శక్తు—(దౌలతు రెండుచేతులతో మేహరునోరు మూయును. మేహరు ఆమె చేతులు విడిపించుకొనును.)

మేహ—ఏమి? నీ వ్యాధిని నేను బాగుగ కనిపెట్టితినా? తలవంచు కొంటివి. సిగ్గువచ్చినదా?

దౌల—పో.

మేహ—మంచిది పోవుచున్నాను. (వెళ్ళఁబోవును.)

దౌల—ఎక్కడకు బోయెదవు? ఒకమాట వినుము.

మేహ—(తిరిగి) ఏమి చెప్పెదవో చెప్పుము. మరల నూరకుంటివేమి? చెప్పుము నేను నీవ్యాధిని బాగుగ కనిపెట్టితినా?

దౌల—ఆఁ వదినా తెలిసికొంటివి. ఇంతకు ఏమేని ఆశయున్నదా?

మేహ—ఆశయా? ఏమి ఆశ? స్పష్టముగా నేల చెప్పవు. ఈ పొదుపు కథ లెందుకు? మంచిది ఉండనిమ్ము. నాకు తెలసినది లెమ్ము. ఆశ యెందుకు లేదు? ఇది యేమియు క్రొత్త సంగతి కాదు. మొగలులకు రాజపుత్రులకును తరుచు వివాహములు జరుగు చునే యుండును.

దౌల—కాని వారు ఇష్టపడనిచో.

మేహ—ఇష్టపడరని యెట్లను కొంటివి?

దౌల—ఆయనకు చాల గర్వము, ఆయన రాజపుత్రుఁడు రాణా ఉదయసింహునకుఁ బుత్రుఁడు,

మేహ—నీవును గర్వితుఁడగు హుమాయున్ మొగలు బాదుషాకు దౌహిత్రివి. నీవెవరికి తీసిపోదువు?

దౌల—వీలగుచో—

మేహ—ఇంకమాఱు ప్రయత్నించి చూడుమందువు కాదు? మంచిది. ఈ పని నాకు విడిచిపెట్టుము, కాని—ఈ పనికి మఱియొకరు పూను కొనినచో చాల బాగుగనుండును

దౌల—ఏమి?

మేహ—ఇంక నీ ప్రసంగము వినుము ఈ సంఘటన విద్యలో నేను కృతకార్య నగుదునో కానో చూచెదను.

దౌల—తుదకు ఏమగునని నీ వూహించుచున్నావు?

మేహ—ఊహించుట గీహించుట నాకేమియు తెలియదు. ఈ పని యగునని మాత్రమే నాకు తెలియును. నేనుపట్టినపని ప్రాణముపోయినను తుదనెగ్గింపక విడువనని నీవును ఎఱుఁగుదువు, వాస్తవమునకు ఈపనిలో నాకును కొంత యానందమున్నది.

దౌల—అనఁగా?

మేహ—శక్తసింహునితో నీకు ప్రథమ సమావేశముచేసినది నేను ఇప్పుడాసమావేశమును సఫలముచేయక నా కెట్లు నిద్రపట్టును. ఇంత కష్టపడి పరికరములన్నియు పోగుచేసియుంచితిని. ఇప్పుడు భవనమును నిర్మింపనిచో నాకష్టమునకు ఫలితమేమి? నే నీపనిని అసంపూర్ణముగా విడువను, మంచిది వెళ్ళి నిద్రపొమ్ము. తెల్లవారవచ్చినటులున్నది,

దౌల—రమ్ము పోదము నీతో నింక నేమని చెప్పుదును!

మేహ—ఏమియు చెప్పనక్కఱలేదు, నీవు పొమ్ము నే నిప్పుడే వచ్చుచున్నాను. (దౌలతుపోవును) ఖుదా! రక్షింపుము. పాప మీదౌలతు తానెవనిని ప్రేమింపుచున్నదో నేనును అతనిని ప్రేమింపుచున్నానని యెఱుఁగదు. కాని ఈ సంగతి దానికి తెలియఁగూడదు, ఖుదా!

ఈవిషయము మనయిద్దరకే తెలియవలయును. నాకుదొలతున్ని సామనోరథమును దీర్పు శక్తి నిమ్ము. ఇంక నామనోరథ మది యే నెరవేరఁగలదు. నాకై నేనేమియుఁ గోరుటలేదు. ఈశ్వరా! నాకు నా మనోరథము నణచుకొను శక్తి నిమ్ము నా కోమల హృదయమును గఠోర మొనరింపుము, నాహృదయమునఁ బుట్టిన ప్రేమావేగము పరకల్యాణ విధానమునకు బాణాతిమ గుఁగాక.

సప్తమదృశ్యము.

స్థానము—హల్దీఘాటు యుద్ధభూమి. సమయము—ప్రభాతము.

(ప్రతాపుఁడును పెక్కు రాజపుత్రులు నిలఁబడియుందురు)

ప్రతా—సోదరులారా! నేఁడు యుద్ధదినము. ఇన్నినాళ్ళనుండియు నేను మీకు గఱపిన రణశిక్షకు నేఁడు పరీక్షాదినము. సోదరులారా! మొగల సైనికుల సంఖ్య ముందు మన సైనికుల సంఖ్య చాలా స్వల్పమని నే నెఱుఁగుదును. రాజపుత్ర సైనికులు స్వల్పసంఖ్యాకులయ్యును వారియందు శక్తి యున్నది—వారియందు బలమున్నది. నాకు మీతో నొకమాట చెప్పుటకు లజ్జయగుచున్నది; నోటమాట వచ్చుటలేదు కన్నుల నశ్రుధార గట్టుచున్నది.

గీ॥ మనవలెన్ దేశమునకయి ప్రమందఁగిన
వారు, రాజపుత్రకులు మేవాడు ప్రభులు
నామతమ్ముండు నాభ్రాతృ నందనుండు
వైరులంగూడి మనపైకి వచ్చిరిపుడు॥

కానిందు నాశిబిర మేమియునంత గొడ్డువోవలేదు సాలుంబర పతి, ఝాలపతి, చందుఁడు, ఫత్తాపుత్రులు నీయుద్ధమున నాపక్షమున నున్నారు ఈ యుద్ధమున న్యాయము మన పక్షముననే యున్నది, ధర్మమును మనపక్షముననే యున్నది, రాజపుత్ర కుల దేవతలును మనపక్షముననే యున్నారు, రాజపుత్ర వీరులారా!

మన మీ యుద్ధము నొకరి కపకారముచేయు తలంపుతోఁ
జేయుట లేదు. మొగలులు మనస్వాతంత్ర్యమును హరించిరి. దానిని తి
రిగి రాఁబట్టుకొనుటకై మనము యుద్ధము చేయుచున్నాము

సీ॥ దేశమాతకుఁ బరాధీనత దొలఁగించి
స్వాతంత్ర్యసుఖము నొసంగుటకును
హైందవసుందరుల్ పొందుసంకటములఁ
బాపి వారికి దారి చూపుటకును
భయలోభముల పాఁబడి కృశియించెడు
హిందుజామత ముద్ధరించుటకును
నివురుగప్పిన క్షత్రనిబిడ తేజోవహ్ని
నిల నధర్మంబు దహించుటకును

గీ॥ ప్రతినదాల్చి సంగర రంగమందు
నుఱుకుచున్నాము, విజయమ్ము నోటమియును
ఈశ్వరాధీనములు, వాని నెంచబోక
పోరుడీ బీరమున రాజపుత్రులార॥

వీరవరులారా! నేటిదినము మనకు చాల గౌరవప్రదము. మాతృ
దేశోద్ధరణమునకై మన మీసంగరమును చేయుచున్నాము.

సీ॥ ఈ సంగరమ్ము ఢిల్లీ సార్వభౌముని
యుచ్చసింహాసన • మూచివైచు
ఈయుద్ధమే భారతీయ చరిత్రలో
స్వర్ణాక్షరమ్ముల వ్రాయఁబడును
మీ రక్తబిందువే • మీవీరసంతతి
నుదుటఁ గుంకుమపువ్వువిధము మెరయు
మీవీరగాథలే భావికవీంద్రుల
కవితకు జీవమ్ము గలుగఁజేయు

గీ॥ భరతఖండమ్మునందు నపారవిక్ర
మోర్జితంబగు నొకజాతి యుండెననుచుఁ

ప్రీతి ముక్కున వ్రేలిడి లాతిజాతి
వారు మీ శౌర్యములఁ జదువంగఁ గలరు.

సోదరులారా! మీ రిది జ్ఞాపక ముంచుకొనుఁడు. మనకు ప్రతిపక్షులు మఱియెవ్వరును గారు సాక్షాత్తు అక్బరు బాదుషా. ఇప్పు డీ యుద్ధమున వచ్చినది. అయన కుమారుఁడగు సలీమును, సేనాపతియగు మానసింహుఁడును గాన మన మిప్పుడు శత్రువుల కనుగుణమగు యుద్ధమును జేయ వలయును.

అందఱు—జై రాణాప్రతాపసింహునకు జై

ప్రతా—రామసింహా! జయసింహా! మీరు బేదనోర్ప్రభువగు నాజయమల్లుని పుత్రులనుమాట మరవకుఁడు. చిత్తూరుదుర్గమును రక్షించుచుండగా మీతండ్రిని అక్బరు చాటునుండి తుపాకిపేల్చి చంపెను. సంగ్రామసింహా! ఏసిసోదియావీరుఁడు పదియారేండ్ల ప్రాయమున తనతల్లితోడను భార్యతోడను కలసి చిత్తోరుదుర్గమున ఘోరసంగర మొనరించెనో ఆఫత్తాప్రభునివంశమున మీరు జన్మించితిరి. వారి కవమానమును రానీయకుఁడుసుమా. గోవిందసింహా! రోహిదాసూ! ఝాలాపతీ! మానా! మీపూర్వులుగూడ స్వాతంత్ర్యసంగ్రామమునఁ బ్రాణములు విడిచిరి. నేఁడుకూడ నట్టి స్వాతంత్ర్యసంగ్రామమే జరుగుచున్నదని తలవుఁడు. వారికీర్తిని స్మరించి సమరానలమున నుఱుకుఁడు. (ప్రస్థానము.)

అందఱు—జై రాణాప్రతాపసింగునకు జై (వప్రస్థానము)

(కొంచెము దూరమున భేరీనాద్యము వినబడును)

దృశ్యాంతరము (౧)

స్థానము—హల్దీఘాటు యుద్ధక్షేత్రము, సమయము—ప్రభాతము.

(సలీము మహాబత్ఖాను నిలచియుందురు)

మహా—శాహజాదాసాహబ్! మీరు ప్రతాపసింహుని గురుతించితిరా?

సలీము—లేదు.

మహా—అదుగో ఎదురుగ ఎఱ్ఱజెండా కనుపించుచున్నదా? దానిక్రింద

నే వారు నిలఁబడియున్నారు. వారి నల్లగుఱ్ఱ మెంతగొప్పది! ఆ విశాలవక్షము, ఆదేదీప్యమానమగు ముఖము, హస్తమున ఖడ్గము, ప్రక్క బల్లెము ఆయనయే ప్రతాపుఁడు.

సలీము—ఆయనకుడిప్రక్క నున్న దెవరు?

మహా—ఝూాలవాడు ప్రభువగు మానా.

సలీము—ఎడమప్రక్కనో

మహా—సాలుంబర ప్రభువగు గోవిందసింహుఁడు.

సలీము—చూడుఁడు. అందఱు ముందుకు వచ్చుచున్నారు. వారి ముఖములందు విశ్వాసము, దృఢత్వము ప్రతిఫలించుచున్నవి. వారు మనమీఁదికి దండెత్తి వచ్చుచున్నారు. ఇంక మనసైనికులఁ జూడుఁడు రాతిబొమ్మలువలె నెట్లు నిలఁబడియున్నారో వీరే దండెత్తవలయును.

మహా—కాదు. మానసింహ మహారాజు హుకుము ముందుగ వారినే దండెత్తనీయవలయునని.

సలీము—కాదు. ఇది వెఱ్ఱితనము. మనమే శత్రులపైఁ గలియపడవలెను.

మహా—కాదు. శాహజాదాసాహెబ్! రాజామానసింహుని హుకుము వేఱు.

సలీము—మానసింహుని హుకుమా! మానసింహునిహుకుము నావద్ద కాదు. ఎవ్వఁడక్కడ? నా అయిదువేల రౌతులను బిలువుము. నేను శత్రులపైకి దాడివెడలెదను.

మహా—శాహజాదాసాహెబ్! మీరు వ్యర్థముగ ఈప్రజ్వలితానలమున నుఱుకుటకు ప్రయత్నింపకుఁడు.

సలీము—మహాబత్! నీవును నామాట వినవా? పొమ్ము. ఇప్పుడే వెడలి పొమ్ము.

మహా—చాల మంచిది. (ప్రస్థానము)

సలీము—మానసింహున కింత సాహసమా! ఒకసామాన్య సైనికుని పాటి శక్తియును నాకు లేదా? ఎవ్వరును నన్ను లక్ష్యపెట్టుట

లేదు. ఓయీ గర్వోన్మత్తా! మానసింహా! నీకింత తలపొగరా! మంచిది. ఈ యుద్ధము సమాప్తముకానిమ్ము. నీయాగడ మడంచెదను. (ప్రస్థానము)

దృశ్యాంతరము (౨)

స్థానము—హల్దీఘాటు యుద్ధక్షేత్రము, సమయము—అపరాహ్ణము.

(రాజపుత్రులును సర్దారులును ఖడ్గపాణులై అశ్వముల నధిష్ఠించి యుందురు.)

ప్రతా—మానసింహుఁడెక్కడ?

మానా—ఆతఁడు తనడేరాలో నున్నాఁడు. రాణాజీ! మీరు మీకిరీటమును నాకొసంగుఁడు.

ప్రతా—ఎందుకు?

మానా—దీనినిఁబట్టి మిమ్ము అందరు గుఱుతించు చున్నారు.

ప్రతా--అయిన నేమి?

మానా—శత్రుసైన్యమ్ములు మిమ్ము గుఱుతించి మీవైపునకే సాగి వచ్చుచున్నవి.

ప్రతా—మంచిది, రానిమ్ము- ప్రతాపసింహునిఁ బొంచి దాఁగి యుద్ధము చేయుట నెఱుఁగడు సలీము, మహబతు, మానసింహుడు వీరందఱకు నేను ప్రతాపసింహుఁడనని తెలియవలెను. వీరికి బలము సాహసము నున్నచో నాయెదుటకు వత్తురుగాక.

మానా—రాణాజీ!—

ప్రతా—మానా! ఇంక నూరకుండుము. ఈతఁడేనా సలీము?

రోహి—అవును రాణాజీ! (ఖడ్గపాణియై సలీము ప్రవేశించును.)

సలీము—నీవేనా ప్రతాపసింహుఁవు.

సలీ—నేను సహజాదాసలీమును. రమ్ము నాతో యుద్ధము చేయుము. (ఇద్దఱును యుద్ధము చేయుదురు. సలీము వెనుకకు తగ్గును. పెక్కు సైనికులతో మహబత్ఖాను వచ్చి ప్రతాపునిపై కలియబడును. సలీము అచ్చటనుండి వెడలిపోవును.)

ప్రతా—ఎవరు మహబతా?

గీ॥ పూజ్యవంశమ్మునన్ జీడ పుర్వుపోలె
పుట్టితివి నీదుపుట్టుక బుగ్గిగాను
ఓ కులాంగార! మాతృఘాతీ! కలంకి
కలుషమతివి మహాబతుఖాను నీవె? (కన్నులు మూసికొనును)

మహా—అవును నేనే. (మహాబతు సైనికులతో ప్రతాపునిపై గలియ బడును. ఇంతలో వెనుకనుండి కొందరుసైనికులు వచ్చి ప్రతాపునిపై గలియబడుదురు. ప్రతాపునికి చాల దెబ్బలు తగులును.

మానా—(ప్రతాపుని కాపాడవచ్చి దెబ్బలు తగిలి క్రింద పడిపోవును.)

మానా—రాణాజీ! నాకు చెడ్డదెబ్బలు తగిలినవి.

ప్రతా—ఆఁ! మానా పడిపోయెనా?

మానా—రాణాజీ! నేను చచ్చిపోయినను మరేమియు చింతలేదు. మీరుమరలిపొండు ఇటు శత్రువులు గుంపులు గుంపులుగా వచ్చుచున్నారు. లేకున్న చాలకష్టము.

ప్రతా—మానా! నీవు చచ్చుట నెఱిఁగినవాఁడవును నేను ఎఱుఁగని వాఁడనునా? రానిమ్ము శత్రువులను.

(మహాబతుతో యుద్ధము చేయుచు చేయుచు ప్రతాపుఁడు కాలుజారి నీరుఁగుంటపైఁబడును. మహాబతు ప్రతాపునితల నఱుకఁబోవును. ఇంతలో పెక్కుసైనికులతో గోవిందసింహుఁడు వచ్చును.

మానా—గోవిందసింహా! రాణాజీని రక్షింపుము.

(గోవిందసింహుఁడు మహాబతుపైఁ గలియఁబడును. ఇరుపక్షముల సైనికులును పోరాడుచు అక్కడనుండి వెడలిపోదురు.)

మానా—రాణాజీ! మనకింక విజయము కలుగునను ఆశ యేమియు లేదు. దాదాపు మనసైన్యమంతయు మడసినది. ఇంక మీరు మరలిపొండు.

ప్రతా—లేదు. ఎన్నటికిని లేదు. పోరాడెదను. బొందిని ప్రాణమున్నంతదనుక పోరాడెదను. నేను యుద్ధక్షేత్రమునుండి పాఱిపోవుట యెఱుఁగను. తెమ్ము, నాకత్తి తెమ్ము.

మానా—కాదు రాణాజీ! మీరు మరలిపొండు. చూడుడు శత్రువుల పెద్దదండు వచ్చుచున్నది

ప్రతా—రానిమ్ము. కత్తి యెక్కడ? (క్రింద పడియున్న ఒకకత్తిని దీసికొని) నాగుఱ్ఱ మెక్కడ? (ప్రస్థానము)

మానా—హా రాణాజీ! మీ రేమిచేయుచున్నారు! ఇందఱమొగలసైనికుల నెవ్వ రడ్డగించఁగలరు? ఈమాఱు రాణాప్రాణములు తప్పకపోవును. హా ఈశ్వరా! నీసంకల్ప మిదియేనా?

అష్టమదృశ్యము

స్థానము—శక్తసింహుని శిబిరము. సమయము—సాయంకాలము

శక్తసింహుఁడు—(నిలఁబడి) ఏమిభయంకరయుద్ధము! ఏమిభయంకరయుద్ధము! ఫిరంగులమ్రోఁతలు, ఉన్మత్తసైనిక వీరాలాపములు, హయహేషలు, గజబృంహితములు, భేరీభాంకారములు, మరణోన్ముఖసైనిక సీత్కారములు! అబ్బా! ఏమియుద్ధము! ఒకవంక ఇసుకవేసిన రాలని అసంఖ్య మొగలభటులు! రెండవవంక కేవలము ఇర్వదివేల రాజపుత్రులు! ఒకవైపున పెద్దపెద్ద ఫిరంగులు రెండవవైపున కేవలము బల్లెములు కత్తులు! ఆహా! ప్రతాపసింహుని సాహసమెంత విలక్షణమైనది! ప్రతాప్! ప్రతాప్! నీవు ధన్యుఁడవు. నేఁడు నేను నాకనులతో నీయద్భుత విక్రమమును జూచితిని. నాకనులనుండి నిరంతర ప్రేమబాష్పములు ప్రవహింపుచున్నవి. నేఁడు నాహృదయము భక్త్యభిమానములతో నీపాదములపై నొరగఁగోరుచున్నది. ప్రతాప్! నేఁడు ప్రతిమొగల సేనాపతి నోటనుండియు నీశౌర్యప్రశంసయే వెలువడుచున్నది. ఆప్రశంసను వినిఅభిమానముచే నాయెడలు పెఱుగుచున్నది. అన్నా! ప్రతాప్!

ఉ॥ తావకసద్గుణమ్ములఁ బ్రతాపము నేఁ దెలియంగలేక దో
షావిలమైన చేతమున స్వర్ణముపండెడు మాతృభూమి నే

పాఱిపోయి వచ్చితివి? మన మిద్దరము యుద్ధమున ఒక్క మారుగనే ఛచ్చెడు వారముకదా. చూడుము శత్రువులు నవ్వుచున్నారు. ప్రతాపుఁడు యుద్ధమునుండి పాఱిపోయె ననుచున్నారు. చేటక్! మరణ సమయమున నీవు నాయధికారము నెందుకు మన్నింప లేదు. ఎంత ఆపినను నీవెందు కాగలేదు? చూడుము నేనిపుడు సిగ్గుచే చచ్చిపోవుచున్నాను. నాతల తిరుగుచున్నది.

(శస్త్రధరులై ఖురాసాను ముల్తాను రాజులు ప్రవేశింతురు.)

ఖురా—ఇదుగో ప్రతాపసింహుఁ డిక్కడ పడియున్నాఁడు.

ముల్తా—ఇతఁడు చచ్చిపోయినాఁడు.

ప్రతా—(లేచి) నేను చావలేదు. ఇంకను జీవించియున్నాను. ఇంకను యుద్ధము ముగియ లేదు. కత్తి దీయుఁడు.

ముల్తా—ఆఁ ఆఁ.

ఖురా—అవశ్యము. (ఇద్దరు ప్రతాపునితోఁ బోట్లాడు చుందురు.)

తెరలో—ఓకాలాశ్వారూఢా. ఆగుము.

ప్రతా—ఇంకను సైనికులు వచ్చుచున్నారు. ఇంక ఆశలేదు

ముల్తా—ఇంక కత్తి క్రింద పెట్టుఁడు

ప్రతా—చేతనగుచో పెట్టింపుఁడు,

(మరల యుద్ధమగును. ప్రతాపుఁడు మూర్ఛితుఁడై క్రిందపడును. ఇంతలో శక్తసింహుఁడు వచ్చును.)

శక్త—ఆగుడు.

ఖురా—మఱియొక కాఫిరు వచ్చినాఁడు.

ముల్తా—వీనినిగూడ చంపుము.

శక్త—అయితే చావుఁడు. (వారియిద్దఱిను క్రిందపడగొట్టి చంపును) ఇంక నేమియు భయము లేదు. ఇంకఁ బ్రతాపసింహుని కేయాపత్తియును రాఁజాలదు. అన్నా!—అరే! వీరికి స్మృతియే యున్నట్లులేదు. సెలయేటినీటిని దెచ్చెదను. (నీరుదెచ్చి ప్రతాపునినోటిలోఁ బోయును.) అన్నా! అన్నా!

ప్రతా—ఎవ్వరు? శక్తా!

శక్త—ఇంకను మేవాడుసూర్యుఁడస్తమింపలేదు. అఁ—అన్నా! నేనే.

ప్రతా—శక్తా! నేను నీచేతిలో కైదీ నయితిని. కాని నాకు సంకెలలు తగిలించి మాత్రము మొగలులదర్బారునకుఁ గొంపోవకుసుమా! ముందుగ నీచేతితో నాతల నఱకి దానిని మీప్రభువున కుపహారముగఁ గొనిపొమ్ము. నన్నీజీవితావస్థలోఁ బట్టుకొనిపోకుము. యుద్ధక్షేత్రమునఁ బోరుచుఁబోరుచు ప్రాణములు విడువవలయునని నాకు పెద్దకోర్కె యుండెడిది కాని నకాలమున నా గుఱ్ఱము చేటక్ కళ్లెములాగినను ఆగక యుద్ధభూమినుండి పాఱిపోయి వచ్చినది. దానినిఆపుటకు నే నెంతయో ప్రయత్నించితిని. కాని యాగలేదు. యుద్ధములోఁ జచ్చుగౌరవము నాకుఁ దక్కినదికాదు. నాకు సంకెలలు తగిలించి నన్నింకను లజ్జితునిఁ జేయవలదు. నన్ను చంపివేయుము. సోదరా! శక్తా! కాదు కాదు. నిన్ను సోదరా యని నాపై నీకు జాలిపుట్టింపను. నేఁడు నీవు విజేతవు, నేను విజితుఁడను. నీవు చక్రమునకు పైనుంటివి. నేను క్రిందనుంటిని. నీవు నిలఁబడియుంటివి, నేను నీపాదములకడఁ బడియుంటిని. ఇంక నిన్నేమియుఁ గోరను. నిన్నుగోరునది యిదియొక్కటే నీవు నాకు సంకెలలు తగిలించి తీసికొనిపోవద్దు కాని చంపుము నేనెప్పుడేని నీకేదేని యుపకారము చేసియున్నచో దానికి బదులుగ నా యీ చిన్నిప్రార్థన నెఱవేర్పుము, నా కీభిక్ష పెట్టుము. నా యీ యంతిమవాంఛను దీర్పుము నన్ను చంపుము కాని నన్ను కట్టి తీసికొని పోవద్దు ఇదుగో నావక్షము. దీనిపై ఖడ్గప్రహారము చేయుము.

శక్త—(కత్తి పాఱవేసి) అన్నా! మీ యీ విశాలహృదయమున నాకు స్థానమిండు.

ప్రతా—అయితే శక్తా! ఇప్పుడీ మొగల సైనికులనుండి నన్ను రక్షించినది నీవేనా?

శక్త—అన్నా! మీరు వీరుల కాదర్శస్వరూపులు, స్వదేశ సంరక్షకులు రాజపుత్రకుల తిలకులు. మి మ్మా ఘాతుకులచేతిలో నెందుకు

చావనిత్తునా? నే నిన్నినాళ్ళవరకు మీ మహాత్త్వము నెఱుఁగకుంటిని ఒకనాఁడు మీకంటె నేనే శ్రేష్ఠుఁడ ననుకొంటిని మీరు మరచియుండరు ఈ విషయము తేల్చుకొనుటకే నాఁడుమీతో ద్వంద్వయుద్ధము చేసితిని కాని నేడీయుద్ధములో మీరే శ్రేష్ఠులు నేనే క్షుద్రుఁడను అని తెలిసికొంటిని మీరు వీరులు నేను కాతరుఁడను నెను నైచ్యముతో పగదీర్చుకొనుటకై నాజన్మభూమిని ధ్వంసము చేసితిని అయినను నేను మిమ్ము రక్షింపజాలుటనుబట్టి చూడ మేవాడురక్షణ మవశ్యంభావిగఁ గనుపట్టుచున్నది. మీరు రాజపుత్రకుల దీపకులు, వీరసింహులు, పురుషోత్తములు, నన్ను క్షమింపుఁడు.

గీ॥ కన్నతండ్రియె మదిఁ గనికరము లేక
నన్ను నిలువెళ్ళగొట్టనాఁడు దరికి
జేర్చి కాపాడినట్టి యచింత్యకరుణఁ
జూపి నాతప్పులన్నియు సైఘుమన్న॥

ప్రతా——తమ్ముఁడా! తమ్ముఁడా! ఇద్దఱు కౌఁగిలించుకొందురు.

రాణా ప్రతాప సింహ

తృతీయాంకము

ప్రథమదృశ్యము

స్థానము—సలీముగది. సమయము—అపరాహ్ణము,

[శత్రుప్రాప్తియె కోపావిష్టుఁడగు సలీము కూర్చుండి యుండును. ఎదుటశక్తసింహుఁడు నిలఁబడియుండును. సలీముకు దగ్గఱగ ఆమేరు, మార్వాడు చందేరీరాజులును, పృథ్వీరాజును నిలఁబడి శక్తసింహుని వంక చూచు చుందురు.]

సలీము—శక్తసింహా! నిజము చెప్పుము. ప్రతాపసింహుని ఆవిధముగఁ గాపాడి పాఱిపోఁజేసినందుల కెవ్వరు బాధ్యులు ?

శక్త—శాహజాదాసాహబ్ ! మీరు మంచిప్రశ్న వేసితిరి. ప్రతాపసింహుఁడు యుద్ధరంగమునుండి బుద్ధిపూర్వకముగ పాఱిపోలేదు. వారికి ప్రాప్తించిన ఈయపకీర్తికి వారు బాధ్యులు గారు.

ఆమేరు—స్పష్టముగఁ జెప్పుము వారి పాఱిపోవుట కెవ్వరు బాధ్యులు?

శక్త—వారి గుఱ్ఱము చేతఁ.

పృథ్వీ—(దగ్గును)

సలీము—వారు పాఱిపోవుటలో నీవేమియు సహాయము చేయలేదా?

శక్త—లేదు. నేనేమియు సహాయము చేయలేదు.

బికనేరు—అయితే ఖురాసాను ముల్తానురాజు లెందుకుజచ్చిరి ?

శక్త—కత్తివదునుగ నుండుటచే.

పృథ్వీ—(నవ్వు నాపికొనుటకై దగ్గును)

ఆమేరు—శక్తసింహా! నీవు పరియాచకమున కిచ్చుటకు పిలువబడలేదు. ఇది కచేరీ.

శక్త—అట్టులా! ఇది కచేరియా! మహారాజా! నేనిది యత్తవారి యిల్లు అనుకొంటిని. నేను పెండ్లికొడుకును, సలీము పెండ్లికూతురును, మీరందఱు వదినలు మఱదళ్లు ననుకొంటిని.

పృథ్వీ—(ప్రయత్నించినను నవ్వు ఆగదు.)

సలీము—శక్తా! స్పష్టముగా సరియైన యుత్తరమిమ్ము.

శక్త—యువరాజా! నన్నే మేని అడుగఁదలఁచుకొనినచో స్వయముగ మీరే యడుగుడు. ఈస్తుతిపాఠకుల మాటలు విన్న నాకు అతి కాలిమంట నెత్తికి వచ్చును.

సలీము—మంచిది, నేనే అడుగుచున్నాను చెప్పుము. మొగల సేనా పతులగు ఖురాసాను ముల్తానురాజులను ఎవ్వరు చంపిరి?

శక్త—నేను,

చందేరీ—ఇది నేను మొదటనే తెలిసికొంటిని.

శక్త—అవును. మీరు గొప్ప తెలివిగలవారు గదా.

పృథ్వీ—(మార్వాడ పతివంకఁ జూచును.)

సలీము—నీవు వారి నెందుకుఁ జంపితివి?

శక్త—నాయన్నయగు ప్రతాపుఁడు శస్త్రహతుఁడై స్మారకము లేక పడి యుండెను. ఆస్థితిలో వారిద్దఱు ఆయనను చంపఁబోవు చుండిరి. నాయన్నను గాపాడుటకై నేను వారిద్దఱను జంపితిని.

ఆమేరు—అయితే నీవేనా యీపని చేసినది? నీవు చాల కృతఘ్నుఁడవు, మోసగాడవు, కాతరుఁడవు.

శక్త—జయపురాధిపతీ! నేను కృతఘ్నుఁడను గావచ్చును, మోసగాడను గావచ్చును, కాని కాతరుఁడనుగాను. ఇద్దఱు పఠానులు కలసి రణ పరిశ్రాంతుఁడై క్రిందఁబడియున్న యొక వీరుని వధించుటకుఁ బ్రయత్నించు చుండగనే నొక్కఁడను వారితో నెదురుపడి యుద్ధముచేసి వారినిఁజంపితిని. నేను హింసమాత్రము చేయ లేదు.

సలీము—పోనిమ్ము. నీవు విశ్వాసఘాతుక కృత్యముచేసితినని యొప్పుకొనుచుంటివి గదా?

శక్త—త్రికరణశుద్ధిగా. యువరాజా! ఇందు ఆశ్చర్యమేమి? నేను మొదటినుండియు విశ్వాసఘాతకుఁడనే. నేనీసమయమున మరల విశ్వాసఘాతుకత్వము చేయుటలో వింతయేమి? నేనింతకుమున్ను మొగలులతోఁ గలిసి నా దేశము, నాధర్మము, నాసోదరుఁడు వీరి విషయమై విశ్వాసఘాతుకుఁడను గాలేదా? ఇప్పుడు మరల నింకొకమారు విశ్వాసఘాతుకుఁడనైతి ననుకొనుఁడు. ఇందు వింతయేమి? బాదుషా నన్ను విశ్వాసఘాతుకుఁడనని యెఱింగియే నాకు ఆశ్రయమొసంగలేదా? ప్రతాపుని అన్యాయ యుద్ధములో జంపుటకునై నేనొకమారు విశ్వాసఘాతుకుఁడను జేయఁబడియే యుంటిని. అయితే ఈమారు ప్రతాపునిఁ జంపుటకు బదులుగ నేనాతనిని అన్యాయ హింసనుండి తప్పించితిని—ఆప్రతాపుఁడు మాత్రమెవరు? నాసోదరుఁడు. ఎట్టిసోదరుఁడు?—నిరాయుధుడయి నాలుగురెట్లు సేనతోఁ బోరఁగల వీరుఁడు స్వదేశరక్షణమునకై అడవులందును గొండలందును పెక్కు ఇడుములుపడు మహాత్ముఁడు. మాజాతికి, మాదేశమునకు ఏకమాత్రమాధారము.

పృథ్వీ—(ప్రతాపుని యత్నములన్నియు వ్యర్థములను భావముతో తల యూపును.)

మార్వాడు—(చందేరీపతి చెవిలో నేదియో చెప్పును).

ఆమేరు—కొండదొంగయు రాజద్రోహియునగు ప్రతాపుఁడే కాదు?

శక్తి—ప్రతాపుఁడు రాజద్రోహి. ఇంకమీరు గొప్ప దేశభక్తులు అవునా భగవాన్దాస్!

సలీము—అయితే ప్రతాపుఁడు రాజద్రోహి కాఁడనియా నీయభిప్రాయము.

శక్తి—ప్రతాపసింహుఁడు రాజద్రోహియును, అక్బరు బాదుషా చిత్తూరునకు న్యాయమైన ప్రభువునా? అట్లుగాదు రాజనీతిపరిభాషా శబ్దముల కర్థము విచిత్రముగ నుండును.

సీ॥ పరదేశములపైనఁ బడి దోఁచుకొనుట మా
　　　　రణము సేయుటను నాక్రమణమండ్రు
బలిమిమై నొక్కదుర్బలుని దేశమ్మును
　　　　హరియించుటను విజయంబటండ్రు
తాదోఁచుకొనిన రాష్ట్రమును శాసించుట
　　　　యమలశాంతి స్థాపనమనియండ్రు
చేతకానితనమ్ముచేత బానిసయయి
　　　　వర్తించుటను రాజభక్తియండ్రు
గీ॥ పోయిన స్వకీయవస్తువుఁ బొందఁగోరి
తొడరి కృషిసల్పువాని విద్రోహియండ్రు
నీచు ఘనుఁడండ్రు మఱి ఘనున్ నీచుఁడంచుఁ
బలికెదరు రాజనీతి ప్రపంచమందు॥

పృథ్వీ—(అసమ్మతినిఁ బ్రకటించుటకు తలయూడించును.)

సలీము—అయితే నీవు బాదుషాగారి నేమందువు?

శక్త—బాదుషాను భారతవర్షమందలి ప్రధానచోరుఁడందును. చోరుఁడు సొమ్ములను దోఁచుకొనును. బాదుషా రాజ్యముల దోచుకొనును ఇదియే భేదము.

పృథ్వీ—(అత్యాశ్చర్యముతో నోరు తెఱచును).

(సైనికులు శక్తసింహుని బంధింతురు.)

సలీము—శక్తసింహా! నీ కేమిశిక్ష విధింపఁబడునో ఎఱుఁగుదువా?

శక్త—అంతగా విధించిన మృత్యువును విధించెదరు. అంతకంటె గొప్ప శిక్ష లేనేలేదు. నేను క్షత్రియుఁడను. చావుకు వెఱువను. నేను చావుకు వెఱచువాఁడనేయగుచో అసత్యము పలికి యుండు వాఁడను మఱియు నాకెట్టిభయమేని యున్నచో నాయంతట నేను మొగలుల శిబిరమున కెన్నఁడునురాను. సత్యమును జెప్పుటకై నేనిచ్చటకు వచ్చినపుడు మొగలులు నాసత్యమును మెచ్చుకొని నన్ను క్షమించెదరని నేను తలఁచియుండలేదు. నేను చాలదినములనుండి మొగలుల సహవాసము చేసితిని. వారి

స్వభావమును బాగుగ నెఱుఁగుదును. అక్బరుని స్వభావముగూడ నేను బాగుగ నెఱుఁగుదును. అతఁడు మాయావి, అవివేకి, కపటి, రాజనీతి విశారదుఁడు ఇంక నీవో మూర్ఖుఁడవు. నిరక్షరకుక్షివి, విద్వేష ప్రధానుఁడవు, రక్తలోలుపమగు పిశాచమవు.

పృథ్వీ—(జాలిగ శక్తసింహునివంక చూచును.)

సలీము—నీవు ఇంటనుండి వెడలఁగొట్టగా మొగలుల ఎంగిలికి ఆసించి వచ్చిన విశ్వాసములేని కుక్కవు. ఇంకను గన్నులెఱ్ఱచేయుచుంటివా? మోసమునకు శిక్షమృత్యువు. దానికిముందు ఈ అవసరనైవేద్యము గానిమ్ము. (తన్నును; వీనిని కైదులోనుంచుఁడు. తర్వాత నితఁడు వేఁటకుక్కల కెరయగును. (ప్రస్థానము.)

శక్తి—ఒక్కక్షణమాత్రము నన్నెవఁడేని విడిచిపెట్టుఁడు. తర్వాత ఏశిక్ష విధించినను సరియే. ఒక్కమాఱుమాత్రము విడిచిపెట్టుఁడు. (పృథ్వీరాజు జాలితో శక్తసింహునిఁ జూచును. శక్తసింహుఁడు విడిపించుకొనుటకు ప్రయత్నించుచుండ సైనికులు అతనిని గొనిపోవుదురు.)

ద్వితీయదృశ్యము.

స్థానము—దౌలతున్నిసాగది: సమయము—అపరాహ్ణము

[మేహరు, దౌలతు నిలఁబడియుందురు. మేహరు పాడును.]

గీతము.

ప్రేమ విషమయమ్మటంచు నామదిగుఱుతింతునేని
ఈమహితవ్యథలఁ బొందనేల ప్రోలియుందుదాని?
ప్రేమసుఖము గడుస్వల్పము ప్రేమపీడ గడునధికము
ప్రేమసుమము శుష్కము, గాఠించు తగులఁగంటకము.

దౌలతు—(మేహరును జఱచుచు) ఇంతకు ఏమైనది?

మేహ—ఆహా! "ప్రేమసుఖమెంత గొప్పదై వెలయుచుండు?"

దౌల—గొప్పదా?

మేహ—చాలగొప్పది "ఒక్కక్షణముననే యస్తమొందుచుండు"

దాల—ఏమి దానిగొప్పతనము?

మేహ—దాని గొప్పతనము చెప్పనలవిగాదు. ఎదను బహువేదనలను నొందించుచుండు'

దాల—ఓ నేను వినను.

మేహ—కొంచెము విందు!

దాల—ఉఁహూ నేను వినను.

మేహ—మంచిది. వినకుము. అయితే శక్తసింహుఁ డేమిచేయును?

దాల—(ఔత్సుక్యముతోఁ జూచును)

మేహ—పాపమాయన అన్నప్రాణము కాపాడుటకై వెళ్ళి తనప్రాణములపైకి తెచ్చుకొనినాఁడు

దాల—మెహర్!

మేహ—కాని సలీము మంచిపనిచేసినాఁడు ఇట్టివారికి ఇట్టిశిక్షయే విధింపఁబడవలెను. ఇందు సలీముదోష మేమియు లేదు.

దాల—మేహర్! ఏమి అట్లనెదవు?

మేహ—నేనేమి చేయుదును. నేను చేసినదంతయు సరిగానే చేసితిని. కాని సలీము అంతయు పాడుచేసినాడు.

దాల—అయితే సలీము శక్తిసింహునకు మరణదండనము విధించెనా?

మేహ—అతనియాజ్ఞ కర్థమిదియనియే నాతలంపు.

దాల—కాదు. నీవు పరిహాసము చేయుచున్నావు.

మేహ—మంచిది. పరిహాసమే యనుకొనుము. కాని శక్తసింహునకు మాత్ర మిది పరిహాసముగాదు. అతఁడెంత వీరుఁడేని కానిమ్ము. అతని ప్రాణముమాత్ర మతనికి ప్రియమైనదే.

దాల—ఏమిటకు సలీము ఇట్టి శిక్ష నేల విధించెను?

మేహ—ఈశ్వరుఁడు శక్తిసింహుని సృజించుటలో కొంచెము లోపము చేసెనని అతఁడు బాగుగ గ్రహించెను.

దాల—ఏమి లోపము?

మేహ—లోపమిదియే. ఆతని చేతులుకాళ్ళు మొదలయిన అవయవము లన్నియు యథాస్థానమునఁ జక్కగనే కూర్చబడినవి. కాని

అతని మెడకాయపై తలకాయ చక్కగా కూర్చబడినట్లు సలీమునకుఁ దోఁచలేదు. కనుకనే యతఁడు ఈ లోపమును దీర్చుటకై శక్తసింహుని తలతీయుట కాజ్ఞాపించెను. ఇంతకన్న మరియేమియు లేదు, ఇందు అద్భుత మేమున శక్తసింహుఁడు దీనికేమియు మారుసెప్పలేదు.

దౌల— దేనికి మారు?

మేహ— దేనికిమారా! ఇదియే తలకాయ సరిగాకూర్పఁబడినదో లేదో కాని యది జన్మకాలమున ఈశ్వరునిచే ప్రసాదింపబడినది. ఈశ్వరసృష్టికి ప్రతివిధానము సేయుటకు మనమెవ్వరము! ఎవ్వఁడేని వచ్చి నాతల తెగవేయు ననుకొనుము. నేను నిలఁబడి యుందును. నాతలకాయవచ్చి నా కాళ్ళకడఁబడి దుమ్ములో దొర్లుచుండినచో అప్పుడేమగును? ఊరకుంటివేమి? చెప్పుము. నీ ముఖము వెల్లబోయిన దేమి?

దౌల— వదినా! ఇప్పుడాయనను రక్షింపవలయునన్నచో నీవే రక్షింపఁగలవు. ఆయనకు మరణదండము విధించినచో నేనొక్కదినమేని బ్రతుకఁజాలనని నమ్ముము. నేను ఒట్టుబెట్టి చెప్పుచున్నాను. ఆయన చనిపోయినచో నేనును విషము దిని ప్రాణత్యాగము చేసెదను.

మేహ—నీవు ప్రాణత్యాగము చేయుచో చేయుము, దీనికింత గర్వమెందుకు? నీకు పూర్వమే యెందరో ప్రేమకై ప్రాణత్యాగము చేసియున్నారు. నేను గ్రంథములలో నిట్టి కథలెన్నియో చదివితిని. ప్రాణత్యాగము చేసెద నని ఇంతగా చాటించి చెప్పుటకది యేమియు నంత పౌరుషకార్యముగాదు. ఇంతకు నీవు ప్రాణత్యాగము చేసినప్పటి మాటకద. పోనిమ్ము నీవు తప్పక ప్రాణత్యాగము చేసెదవే యనుకొందము. నీవంటి వారిదివరకు లక్షతొంబదిమందిచేసినారు.

దౌల—అయితే ఆయనప్రాణము రక్షించుటకేమియునుపాయములేదా!

మేహ—(గంభీరభావముతో తల వంకించి) నీవు నీప్రాణము నొసఁగు

టయే దానికి ఉపాయము. ఆ ఉపాయము నీవు చేయనే చేయుదువు. ఇంతకంటె వేఱు ఉపాయము లేదు. ఇదుగో ఒక సంగతి. నీవు ప్రాణత్యాగమే చేయుచో చిరకాలము భూమిపై నీ పేరు నిలుచు పద్ధతిపై చేయుముసుమా'

దాల—అది యెట్లు?

మేహ—నీవు నీ శృంగారభవనములో ముఖమల్లు పరచిన సోఫాపైఁ గూర్చుండుము. ఎదుట నొకచక్కని ముక్కాలిపీటపై నొకజరీ బట్ట పరచి దానిపై నొకవెండిగిన్నె యుంచుము. దాని నిండ విషముండవలయును. తెలసినదా? ఆగిన్నెను బంగారుచేతులతో నెత్తి యొక చక్కని పద్యముగాని కీర్తనగాని పాడుము. అప్పుడు దానిని మెల్లగా నీబింబాధరము వద్దనుంచుము. త్రాగునప్పుడు గడ్డము పైకి నెత్తఁ గూడదు. తర్వాత వీణనుమేళగించి శక్తసింహునుద్దేశించి త్రిశ్రగతిలో సింధుకమాచి రాగములో నొకకీర్తన పాడుము. అట్లుపాడుచుఁ బాడుచుకూర్చుండియే ప్రాణత్యాగము సేయుము, చేతులు కాళ్ళు నేమియుకదలించగూడదుసుమా? నీవీవిధముగఁ బ్రాణత్యాగము సేయుచో ప్రపంచములో కొంతకాలము నీపేరుండును. నీబొమ్మలు చిత్రించెదరు. ముందువారికి నాటకములు వ్రాయుటకు సామగ్రిదొరకును.

దాల:—ఏమివదినా! నీకుపరిహాసము చేయుటకిదియే సమయము దొరకినదా?

మేహ:—పరిహాసమున కింతకంటె మంచిసమయమేది చెప్పుము? మీరిద్దఱు నొక్కమాఱు మాత్రమే కలసికొనిరి. అదియును ఏపొదరింటిలోనో, ఏయమునాతీరముననో ఏవెన్నెలరాత్రిలోనో ఏనొకయందో కాదు—యుద్ధభూమిలో, ఒక మామూలు డేరాలో. కలసికొనిరి. అదియును ఏకాంతమునఁగాదు, అక్కడ మఱియొక మానిసియుండెను. ఆమానిసియే మిమ్ములను సమావేశ పఱచినది. ఒక్కమాఱు ఒకరినొకరు హఠాత్తుగ చూచుకొనిరి, దానికే యీప్రేమ—ఈప్రాణత్యాగము, ఈప్రపంచము

శూన్యమగుట!—ఇంతకంటె పరిహాసమునకు విషయమేది?

డాల—ఏమివదినా! నిజముగదీనికేమియు నుపాయములేదా? నీవీ వ్యవహారములో నేమియు చేయఁజాలవా? నిజముగనీవు వెళ్ళి సలీముతోఁజెప్పిన ఆతఁడు ఆయనను క్షమింపకుండునా?

మేహ—నీవొకపని చేయుదో నిదియంతయు నగును.

డాల—నీవు ఏదిచెప్పిన అదియే చేసెదను ప్రపంచములో మానవునకు సాధ్యమైన దెల్లచేసెదను?

మేహ—నీవుఏదో పెద్దజబ్బువచ్చినట్లుగా మెదలక పడియుండుము. చూచువారు చచ్చినదో లేక చావునకు సిద్ధముగనున్నదోయని తలఁచునట్లుండవలెను. అంతట హకీములు, వైద్యరాజులు, ఆయుర్వేద పంచాననులు, కవిరాజ కంఠీరవులు వచ్చి తలయొక మాత్రవేసి చివరకు చేతగాక సలాము పెట్టిపోదురు. అప్పుడు నేను సలీముతో ఈ మందు మాకులవలన లాభములేదు. ఈ రోగమునకొక చట్కా క్రియయున్నది. అదిశక్తిసింహునకొక్కనికే తెలియును, అతనిని పిలువుము, అందును అప్పుడు శక్తసింహుడు వచ్చి చట్కా ప్రయోగముచే నీజబ్బు కుదిరించును. అతనితో నీకు పెండ్లియగును. తర్వాత సంగీతము—యవనికాపతనము.

డాల—మేహర్! నేనెన్నియేని అపరాధములు ననుచితములు చేసియుందునుగాక. అయినను నేను నీ డాలతును (ఏడ్చును.)

మేహ—ఇదియేమిడాలత్! నిజముగ నీవేడ్చుచుంటివా? వద్దు వద్దు ఏడ్వకుము. ఇదుగో నావంకచూడుము. ఛీ ఏడ్వకుము ఏమియు భయములేదు. శక్తసింహునినేను రక్షించెదను. ఆతని నేను రక్షింపఁజాలనిచో నిట్టిసమయమున నేను పరిహాసము చేయుదునా డాలత్! ఇందునీ దోషమేమియులేదు. దోషములన్నియు నావే నేనే మీయిద్దఱను సమావేశపఱచితిని నేనే మీయిద్దఱకును హృదయములందు అనురాగమును రగులగొలిపి దానిని ఉద్ధసితికిఁ దెచ్చితిని నేను శక్తసింహుని రక్షించుటయేకాదు అతనితో నీకు వివాహముకూడ చేసెదను. నేనేపనిని ప్రారంభింతునో దానిని

తుదముట్టించునంతవరకు మాననని నీవెఱుఁగుదువు నే నీశ్వర సాక్షిగ చెప్పుచున్నాను, నీశక్తసింహుని నేనుతప్పకరక్షించెదను. పొమ్ము. ముఖముకడుగుకొనుము. ఏడ్చుటచే క్షణములోనే నీ కన్నులు వాచినవి. పొమ్ము ముఖము కడుగుకొనుము.

(దౌలతు పోవును.)

మేహ—(గద్గదస్వరముతో) దౌలత్! నా యీపరిహాసముక్రింద నెట్టి అగ్ని అణఁగియున్నదో నీవెఱుఁగవు. శక్తసింహా! నేను నాహృదయమునుండి నిన్నెంత బహిష్కరింపఁ గోరుచుంటినో అందు నీవంత స్థిరముగఁ బాదుకొనుచున్నావు. నేనెంతయో అణచుచుందును, ఎంతయో పరిహాసము చేయుచుందును. కాని ఈ యగ్ని చల్లారుట లేదు. నేను తొలుత నీరూపమునకును, నీపాండిత్యమునకునే ముగ్ధురాలనైతిని. నేఁడు నీశౌర్యమునకును, నీమహాత్మ్యమునకును గూడ ముగ్ధురాల నగుచుంటిని. ఈయగ్ని అంతకంతకు రగులుకొనుచున్నది. కాదుకాదు. నేను దీనిని అణచి వేసెదను. నాసుఖమునకై కాదు అమాయిక బాలిక యగు నీదౌలతున్నినా సుఖమునకై. ఈశ్వరా! నాహృదయ నిగూఢమగు ఈ విషయము దానికి తెలియకుండుగాక. తెలిసినచో దానికి దుఃఖమగును—అపారదుఃఖమగును.

(అలక్షితభావముతో సలీము ప్రవేశించును)

సలీము—మేహర్!

మేహరు—ఎవరు? సలీమ్!

సలీము—నీవు ఒంటరిగా నుంటివేమి? దౌలతు ఎక్కడ?

మేహ—లోపలికివెళ్లినది. ఇప్పుడేవచ్చును, ఏమిసలీమ్! నీవు శక్తసింహునకు మరణదండము విధించితివా?

సలీము—అవును.

మేహ—అది యెప్పుడు జరుగును.

సలీము—రేపు ఉదయము అతఁడు వేటకుక్కల కెఱయగును.

మేహ—సలీమ్! నీవింకను పిల్లవాఁడవయిన మాట వాస్తవమే కాని

ఇతరుల ప్రాణములతో చెరలాటమాడు వయస్సుమాత్రము కాదు.

సలీము—ఆహా! ఇది చెరలాటమా? నేను కచేరీలో తీర్పుచెప్పితిని.

మేహ—తీర్పా! ఈతీర్పుపేరిట నింతవఱకు ప్రపంచములో లక్షలకొలఁది మనుష్యుల ప్రాణములు తీయఁబడినవి తీర్పుచెప్పుటకు నీ వెవ్వఁడవో కొంచెమాలోచించికొనుము.

సలీ—నేను బాదుషా కొమరుఁడను. తీర్పుచెప్పుటకు నాకధికారమున్నది.

మేహ—నేను బాదుషా కూతురను. తీర్పు చెప్పుటకు నాకును అధికారమున్నది.

సలీ—ఇంతకు నీ అభిప్రాయమేమి?

మేహ—నా అభిప్రాయమిదియే నీవు శక్తసింహుని విడిచిపెట్టుము

సలీ—నీవు చెప్పుటచేతనా?

మేహ—అవును నేను చెప్పుటచేతనే (సలీము పకపకనవ్వును) సలీమ్! ఇది నవ్వఁదగిన మాటకాదు. తక్కినది యేదియెట్లున్నను నీవు శక్తసింహుని విడువక తప్పదు లేనిచో—

సలీ—లేనిచో ఏమి?

మేహ—లేనిచో నేను స్వయముగ వెళ్ళి నా చేతులతో ఆయనను వదలించెదను. ఈ ఆగ్రాలో నన్ను అడ్డగించువా రెవ్వరును లేరు, అందఱును బాదుషాకూతురగు మేహరున్నిసా నెఱుగుదురు.

సలీ—నాయనగారు మితిమీఱిన గారాబముచేసి నిన్నీస్థితికిఁ దెచ్చిరి.

మేహ—ఈమాటలతోఁ బని లేదు. నీవు శక్తసింహుని విడిచిపెట్టెదవా లేదా చెప్పుము.

సలీ—నీ వెఱుఁగవా? శక్తసింహుఁడు వీరులగు మన సేనాపతుల నిద్దఱను హత్యసేసినాఁడు.

మేహ—హత్యచేయలేదు. ఎదుటఁబడి పోరాడి చంపినాఁడు.

సలీ—లేదు. అతఁడు చాల విశ్వాసఘాతుకత చేసినాఁడు. తొలుత మొగల పక్షమునఁ జేరి—

మేహ—సలీమ్! ఇది విశ్వాసఘాతుకతయేయైనను స్వర్గీయ ప్రతిభా

మండితము. శక్తసింహుఁడు తన సోదరుని ఆపదనుండి రక్షింపక అతనిని చంపియున్నచో నీవు ఆయనను ప్రశంసించువాఁడవు కాఁబోలు.

సలీ—అవశ్యము.

మేహ—కాని ఇట్టి స్థితిలో నే నాయనను ఏవగించెడిదానను. ప్రపంచములో ప్రభుసేవకుల సంబంధ మెక్కువదో అన్నదమ్ముల సంబంధ మెక్కువదో నీవు చెప్పఁగలవా? ఆపరమేశ్వరుఁడు మానవులను ఈప్రపంచములోనికిఁ బంపునపుడు ఒక్కని ప్రభునిగను ఒక్కని సేవకునిగనుచేసి పంపలేదు. కాని అన్నదమ్ముల సంబంధము మొదటనుండియు నుండును. అది ఈజన్మములో విడిపోదు. శక్తసింహుఁడు తన యన్నతోఁ బోరాడి మీావద్దకు వచ్చినపుడే ఈ మేఘములు ఎక్కువకాల ముండవని యాయన తెలిసికొనవలసినది. నీవును ఈవిద్వేషము భ్రాతృస్నేహాము యొక్క రూపాంతరమాత్రమని తెలిసికొనవలసినది. ఈ రూపాంతరము విరూపమును, వికటమును, కుత్సితమును అయిన నగుఁగాక. వాస్తవమున కిది ఛద్మవేషముదాల్చిన భ్రాతృస్నేహామే. ప్రతిహింసాభిలాష అంతరంగిక ప్రేమను నశింపఁజేయదుసుమా సలీమ్! ఎల్లప్పుడు స్నిగ్ధమధురముగ వీచుసమీారము క్షణమాత్రమే భీషణ ఝంఝూవాత రూపము ధరించును.

సలీ—వహ్వా! మేహారున్నిసా! నీవు శక్తసింహుని పక్షమున వకాల్తాపుచ్చుకొంటివి. నీతో వాదముసేయుట వ్యర్థము. నీవు శక్తసింహుని పక్షమున మాట్లాడుచుంటివన్న నాశ్చర్యమేమి? నీవాతని ప్రేమించుచుంటివి గదా.

మేహ—అసత్యము, కేవలమసత్యము.

సలీ— కాదు, కేవలము సత్యము నీవొకమాఱు అతని డేరాలోనికివెళ్ళి అతనిని కలసికొని యుండలేదా?

మేహ —నన్నిట్లు ప్రశ్నించుటకు నీకేమియు నధికారము లేదు.

సలీ—మంచిది స్వయముగ బాదుషాగారే ప్రశ్నించెదరు లెమ్ము

మేహ—నీవు శక్తసింహుని విడిచెదవా లేదా చెప్పుము.

సలీ—ఎన్నటికిని లేదు. నీయిచ్చవచ్చినది చేయుము. (సలీము వెంటనే వెడలిపోవును. మేహరు కొంతసేపు మెదలక యాలోచింపుచు నిలఁబడియుండును.)

మేహ—(నవ్వి) అయితే ఈపని నాకు తప్పదా? నేనీపనిచేయఁ జాలనని సలీముతలంపు కాఁబోలు. మంచిది ఈపని నాచేతనగునో కాదో చూపించెదను. (ప్రస్థానము)

తృతీయదృశ్యము.

స్థానము. చెఱసాల—సమయము—ప్రభాతము.

శక్త—రాత్రిగడచినది. దానితోబాటు నా యీ క్షుద్రజీవితమును గడచినది. నేటి ప్రభాతము నాజన్మమున కంతిమప్రభాతము. నేఁడు నా యీ సుందరకోమల గౌరశరీరము రక్తసిక్తమై మట్టిలోదొర్లును. అందఱును నా యీ అంతిమ భీషణదృశ్యమును జూడఁగలరు. నేనొక్కఁడనే చూడఁజాలను. నేను! ఇంతకు ఈ 'నేను' ఎవఁడను ఎక్కడనుండి వచ్చితిని, నేఁడు ఎక్కడకు పోవుచుంటిని! ఎంత ఆలోచించినను తెలియుటలేదు. గణితమువల్లను తేలుటలేదు. దర్శనశాస్త్రములవల్లను తేలుటలేదు. నేనెవఁడను! నలుబది సంవత్సరములకు పూర్వము ఈ 'నేను' ఎక్కడనుంటిని! రేపు నే నెక్కడ నుందును! నేఁడీ ప్రశ్నపరిష్కారమగును—ఎవరు?

[దీపముచేతఁ బట్టుకొని మేహరున్నిసా ప్రవేశించును.]

మేహ—నేను మేహరున్నిసాను.

శక్త—మేహరున్నిసా! అక్బరు బాదుషాకూతురు!

మేహ—అవును.

శక్త—మీ రిక్కడ కెందుకు వచ్చితిరి.

మేహ—మీ ప్రాణము కాపాడుటకై వచ్చితిని.

శక్త—నా ప్రాణము కాపాడుటకా? నాకు బ్రదుకవలయునను కోరిక యేమియు లేదు.

మేహ—(ఆశ్చర్యముతో) ఏమి ? మీకు బ్రదుకవలయునను కోరిక లేదా ? మీకీ సుందరప్రపంచమును విడిచిపోవుటకు విచారము లేదా ?

శక్త—లేదు. ఏమాత్రమును లేదు. నాకీ ప్రపంచము చాల ప్రాతపడి పోయినది. ప్రతిదినము ప్రొద్దున ఒకసూర్యుఁడే ఉదయించును. రాత్రి ఒక్కచంద్రుఁడే కనుపించుచుండును. అప్పుడప్పుడు చీఁకటిగనుండును. నిత్యము ఆవృక్షము లే, ఆజంతువులే, ఆపర్వతములే, ఆనదులే, ఆయాకాశమే కనిపించుచుండును. నాకీ ప్రపంచము చాల ప్రాతపడిపోయినది. మరణానంతరము ఆలోకమునకు వెళ్ళి చూచెదను. అక్కడ నేమేని క్రొత్తవస్తువు లున్న వేమో.

మేహ—మీకు మీజీవితముపై నేమియు ప్రేమ లేదా?

శక్త—ఏమియు లేదు. నేను ఇన్నినాళ్ళవఱకు ఈజీవితమును దలఁచిచూచితిని. కాని నాకిది యసారముగఁ గనుపట్టినది. ఇంక మృత్యు వెట్టుండునో జూచెదను. నిత్యము దానిప్రతాపము చూచుచుంటిని. కాని దానివిషయమై నాకేమియు తెలియ లేదు. నేఁడు తెలిసికొందును.

మేహ—మిమ్ము ప్రేమించువారిని విడుచుట మీకు కష్టముగాదా?

శక్త—నన్ను ప్రేమించువా రెవ్వరును లేరు. ఉన్నచో కష్టముగ నుండు నేమో. నేనింతదనుక ఎవ్వరిని ప్రేమించుట నేర్చుకొనలేదు. నన్నును ఎవ్వరును ప్రేమింపలేదు. నేనెవ్వరికిని ఋణస్థుఁడను గాను. అందఱి ఋణమును దీర్చివేసితిని. (స్వగతము) కాని ఒక ఋణముమాత్రము మిగిలియున్నది. సలీము నన్ను కాలితో తన్నెను ఆఋణమును దీర్పలేదు. ఈపనియొకటియే మిగిలినది.

మేహ—అయితే మీరీశిక్షనుండి విముక్తులు కాఁగోరుట లేదా?

శక్త—ఆఁ, అవశ్యము గోరుచున్నాను. కొద్దిసమయము వఱకే విము

క్తుఁడనుగాఁ గోరుచున్నాను. ఋణముతీర్చిన పిమ్మట నేను స్వాయముగనే వచ్చి పట్టు పడెదను. మీకు చేతనగుచో ఒక్కమాఱు నన్నీ చెఱసాలనుండి విడిపింపుఁడు.

మేహ — పహరేదార్! (పహరేదారువచ్చి నమస్కరించును) వీనిసంకెలలు విప్పుము.

(పహరేదారు సంకెలలు విప్పును. మేహరు తనకంఠమందలి వజ్రహారమునుదీసి వానికిచ్చును.)

మేహ—పొమ్ము దీనిని అమ్మికొనుము. దీనివలన సుమారు లక్షరూప్యములు వచ్చును. ఉదర పోషణమునకింక నీ కేమియు చింతలేదు. పొమ్ము. (పహరేదారు నమస్కరించిపోవును.)

శక్త—(కొంచెముసేపు నిశ్చేష్టుఁడై యుండి పదపడి) మిమ్మొక సంగతి అడుగుచున్నాను. నన్ను విడిపించుటకు మీరింత ప్రయత్నమేల చేసితిరి?

మేహ—నన్ను మీరిది యెందు కడుగుచున్నారు?

శక్త—ఊరకయే.

మేహ—(స్వగతము) ఇప్పుడు నాయుద్దేశము చెప్పినచో బాధయేమి? ఇప్పుడే నిర్ణయ మగును (శక్తునితో) మీరు మాదాలతున్నిసాను ఎఱుఁగుదురుగదా?

శక్త—ఆఁ. ఆఁ.

మేహ—ఆమె—ఆమె మిమ్ము ప్రేమించుచున్నది.

శక్త—నన్నా?

మేహ—అవును. మిమ్ము. నాయూహ సరియగుచో మీరును ఆమెను ప్రేమింపుచుంటిరి.

శక్త— నేనా?

మేహ—అవును, మీరు.

శక్త— నేను విముక్తుఁడనగుటచే నామె కేమి లాభము?

మేహ—ఈ సంగతి ఆమెకే తెలియును. అదుగో తెల్లవార వచ్చినది. మీరిపుడు స్వతంత్రులు. బయట గుఱ్ఱము సిద్ధముగ నున్నది.

మీయిచ్ఛవచ్చిన చోటికి పొండు. మిమ్మెవ్వరు నడ్డగించరు. మీరు దాలతును పెండ్లియాడఁగోరినచో—

శక్త— పెండ్లియా! హిందువునై మహమ్మదీయ స్త్రీని పెండ్లియాడుటయా? ఏశాస్త్రప్రకారము?

మేహ—మీహిందూశాస్త్రము ప్రకారమే. మీపూర్వుఁడగు బాప్పరావలు మహమ్మదీయస్త్రీని పెండ్లియాడ లేదా?

శక్త— అదిరాక్షసవివాహముగదా.

మేహ—అగుఁగాక. దానవేమి? అది పెండ్లియగునా కాదా? మీరే చెప్పుఁడు. శాస్త్రము లెవ్వరు చేసిరి? వివాహమున కొక్కటే శాస్త్రము. అది ప్రేమ. ప్రేమచే దృఢమైన బంధనమును ఏశాస్త్రమును త్రెంపఁజాలదు.

సీ॥ పలుతిప్పలంబడి పఱతెంచెడు స్రవంతి
యుదధికి సర్వాంగమొసఁగు నపుడు
అతిసంభ్రమమ్మున నాలింగనము సేయ
నుల్క భూతలమున నొరఁగునపుడు
మాధవీలత సుధామధురమౌ సహకార
మును బెనంగొని కడు మురియునపుడు
చలివెల్గు కరములఁ గలువపూముద్దియఁ
బ్రేముడిఁ గిలిగింత పెట్టు నపుడు
గీ॥ శ్రుతితతింజదివెడు పురోహితుఁ డెవండు?
కర్మకాండము గావించు కాజి యెవఁడు?
మనమునన్ వెల్లివిరియు ప్రేమస్రవంతి
నల్పబంధమ్ము లెన్నియో నడ్డఁగలవె?

శక్త—శాహజాదీ! నాకు శాస్త్రభయమిసుమంతయు లేదు. సంఘమును లక్ష్యము సేయనివారికి శాస్త్రముల విలువయేమి?

మేహ—అయితే మీరంగీకరించితిరా?

శక్త—(స్వగతము) ఇందు బాధయేమున్నది? మఱియొక వైచిత్ర్యము చూచెదము. ఇంతదనుక నేను రమణీచరిత్రమును బరీక్షించి

గొఱుఁగను. అదికూడచూతము. బాధయేమి?

మేహ—చెప్పుడు మీ కంగీకారమేనా?

శ క్త—ఆఁ అంగీకారమే,

మేహ—'ఈశ్వరసాక్షి' అనుఁడు.

శ క్త—నేను ఈశ్వరునిఁ బాటింపను

మేహ—పాటింపుఁడు మానుఁడు. ముందు 'ఈశ్వరసాక్షి' అనుఁడు

శ క్త—ఈశ్వరసాక్షి

మేహ—రండు

శ క్త—పదుఁడు (కొంచెము దూరము నడచి తనలో) ఇంతవఱకు నాజీవితమొక విధముగ గంభీరముగ నడచినది, అందుఁ నేఁడొక ప్రహసనముకూడ ప్రవేశించినది.

మేహ—రండు తెల్లవార వచ్చునది.

చ తు ర్థ దృ శ్య ము .

స్థానము—పృథ్వీరాజు అంతఃపురము, సమయము=రాత్రి

(జోషీబాయివిచారముతో నిలఁబడియుండును)

జోషి—ఇంకనేమున్నది అదియు ఆఱిపోయినది రాజపుత్ర స్థానమునకంతకు నొక్కటే దీపము వెలుఁగుచుండెడిది—తుదకు నదియు నాఱిపోయినది ప్రతాపసింహుఁడు మేవాడనుండి వెడలిపోయి నాఁడు. ఇప్పుడు అడవుల యందును, కొండలందును ద్రిమ్మరు చున్నాఁడు. హా! దురదృష్ట భారతవర్షమా!

సీ॥ తీరవే యింకను భారతమాతకు
పరదాస్యమునఁజెందు పరిభవములు
ఆఱవే యింకను న్యాయశోషకములౌ
యవనుల దుర్విక్రమాగ్ని శిఖలు
ఎండవే యింకను హిందూమహాధర్మ
దేవతబాష్పనదీజలమ్ము

తలయెత్తదే యింకఁ గలితశౌర్యౌదార్య
భూషితయౌ రాజపుత్రజాతి

గీ॥ దీర్ఘకాలమ్ము భారతదేశమాత
బానిసగనుండు విధమె కన్పట్టుచుండె
మంచిరోజులు మాహిందుమాతకింక
లేవు లేవిల దైవమ్ము లేడు లేడు॥

(వ్యగ్రభావముతో పృధ్వీరాజు ప్రవేశించును.)

పృధ్వీ—జోషి! జోషి!

జోషి—ఏమి?

పృధ్వీ—దర్బారులోని క్రొత్తసమాచారము వింటివా?

జోషి—నేనెక్కడనుండి విందును?

పృధ్వీ—చాలగొప్పసంగతి.

జోషి—ఏమయ్యెను?

పృధ్వీ—ఏమయ్యెనని చెప్పుదును? చాలగొప్పసంగతి అయినది—ఊర కుంటివేమి ?

జోషి—ఇంక నేమిచేయుదును?

పృధ్వీ—మంచిది వినుము, శక్తసింహుఁడు కైదునుండి పాఱిపోయినాడు

జోషి—పాఱిపోయెనా?

పృధ్వీ—తానొక్కఁడే పాఱిపోలేదు, దొలతున్నిసాకఁగాడ (పాఱిపోవు టనుసంకేతించును).

జోషి—ఆఁ!

పృధ్వీ—ఇంతయే కాదు. మఱియొకటి. సలీము మానసింహునిపై దో షారోపణము చేసి బాదుషాగారికొక జాబు వ్రాసెనని చెప్పితిని గదా.

జోషీ—అవును.

పృధ్వీ—నిన్న బాదుషాగారు గుజరాతునుండి తిరిగివచ్చిరి.

జోషీ—ఎందుకు?

పృధ్వీ—వీరితగవు తీర్చుటకై—ఇంకనెందుకు? ఇదిసామాన్యపుతగవా?

ఒకవైపున మానసింహుఁడు. రెండవవైపున సలీము—ఒకవైపున రాజ్యము, రెండవవైపున కుమారుఁడు. బాదుషా వీరిద్దరిలో నెవ్వరిని విడువఁజాలరు. ఇంక తగవు తీర్చవలయును.

జోషీ—ఎట్లు?

పృథ్వీ—ఇటు సలీముతో 'మానసింహుఁడు మన ఆశ్రితుఁడు, పోనిమ్ము!' అనును. అటు మానసింహునితో 'మహారాజా! సలీము కుఱ్ఱవాఁడు వానిమాట మీరు పాటింపకుఁడు' అని చెప్పును.

జోషీ—రాణాప్రతాపసింహుని సమాచారమేమేని తెలిసినదా?

పృథ్వీ—ఇంక సమాచారమేమున్నది. దొరగారు అడవులన్నియు చెడ తిరుగుచున్నాఁడు. అక్బరు బాదుషాతో యుద్ధమాయని నేను మొదటనే యంటినిగదా. ఎంతవఱకు విఱ్ఱవీగుచు తిరుగఁగలఁడు. అయినది వలలోఁబడినాఁడు.

జోషీ—నాథా! మీరు క్షత్రియులు గారని నేనెఱుఁగుదును. కాని మీసోదరుని ఒక విజాతీయుఁడు పరాజితునిఁజేయ నాపరాజయమునకు మీరింతగ చంకలు కొట్టుకొనునంతటి నీచులనియు, పిఱికిపందలనియు, నేనెఱుఁగను. (ఏడ్చుచు పోవును.)

పృథ్వీ—అంతయు తెలిసినది. ఇది పట్టిఉద్రేకము. దీనిచే నేమిప్రయోజనము. అయితే ఒక సంగతియున్నది. ఇది యెన్ని అనినను మొదలక సహించును. గాని ప్రతాపుని నెవ్వరేని పల్లెత్తిమాట యనిన తాచుపామువలె పడగవిప్పి బుసకొట్టును. అయితే నేను పాము పడగవిప్పి బుసకొట్టుటను ఎన్నఁడును జూడలేదు. కాని ఇట్లేయుండునని యూహించుచున్నాను. (ప్రస్థానము)

—o—

పంచమదృశ్యము.

స్థానము—అగ్బరునిగది. సమయము—ప్రా[illegible]త్రము

(అక్బరు హుక్కా త్రాగుచుండును. సలీము [illegible] నిలఁబడియుండును.)

అక్బరు—సలీమ్! మానసింహుఁడు నిన్నేమియును నమర్యాద చేయలేదు. ఆయన చేసినదంతయు నాహుకుమును బట్టియే.

సలీము—ఇంతకంటె నాకేమి యమర్యాదయుండును? నేనింత పెద్ద సామ్రాజ్యమునకు యువరాజును. మానసింహుఁడొకసామాన్య సేనానాయకుఁడు. హల్దీఘాటు యుద్ధమున ఆయన నాయాజ్ఞను లక్ష్యపెట్టనేలేదు. తాను ప్రత్యేకాజ్ఞల నొసఁగెను. అదియు నొకమాఱుగాదు. అనేక పర్యాయములు.

అక్బరు—ఊఁహూ! అయినను నాకిందు మానసింహుని దోషమేదియు గనుపట్టుట లేదు.

సలీము—అవును. మీకు మానసింహుని దోషమెందుకుఁ గనుపించును అతఁడు మీకు స్యాలకపుత్రుఁడుగదా. వాస్తవమునకు మీరే అతనిని ఇట్లు నెత్తినెక్కించుకొన్నారు.

అక్బరు—కొంచెమాలోచించి మాట్లాడుము. మానసింహుని నేదోషమో నీవే చెప్పుము.

సలీము—ఇదియే, ఆయన నాయాజ్ఞకు విరుద్ధముగ పనిచేసెను.

అక్బరు—ఈయధికారమును ఆయనకు నేనేయొసఁగితిని. ఆయన సేనా నాయకుఁడు

సలీ—అయితే నన్ను యుద్ధమునకుఁ బంపవలసిన పనియేమి వచ్చినది?

అక్బ—ఆయన వెంటనుండి యుద్ధవిషయములు నేర్చుకొందువని పంపి యుంటిని.

సలీ—మానసింహునికి తాబేదారుగ నుండియా?

అక్బ—దురభిమానమును విడువుము. నీవు ముందుముందు భారతవర్షమునకు చక్రవర్తివి కావలసినవాఁడవు యుద్ధము లెట్లు చేయవలయునో రాజకార్యముల నెట్లు నడిపించవలయునో నేర్చుకొనుము. మానసింహునకు నేనెంతయు ఋణగ్రస్తుఁడను. ఆయన మూలముననే నేనీ యర్ధభారత వర్షమును—అర్ధభారత వర్షము నేకాదు ఆఫ్గని నునుగూడ జయింపఁ గలిగితిని.

సలీ—మానసింహునకు మీరు ఋణగ్రస్తులు కావచ్చును. నేనుకాను

అక్బ—ఇదుగో నీవీప్రగల్భములు చాలింపుము. మానవుఁడు ఇతరులను శాసించుటకు మున్ను తన్నుతాను శాసించుకొనుట నేర్చుకొన

వలయును. మానసింహుని నేను హృదయపూర్వకముగ గౌర వించుచుంటినని నీవనుకొనవలదు. వాస్తవమున కతనికి నేనెంతయు వెఱచుచుందును. అతనివలన పనులన్నియు నెరవేరిన పిమ్మట నతనిని పాతచెప్పునువలె పరిత్యజించెదను. మనపనులు ముగియువఱకు మానసింహుని గౌరవింపక మనకు తప్పదు.

సలీ—మీయిష్టము నెఱవేరవలెను. ఆ కాఫిరు మానసింహుని యధికారమును భాటింపఁజాలను. నాయవమానమునకు ప్రతిక్రియ మీరు ఆలోచింపని యెడల నాప్రతిజ్ఞ వినుండు, నాచేతులతో నేను ప్రతిక్రియ చేసెదను. మాయిద్దఱిలో నెవ్వరు శ్రేష్ఠులో చూచెదను. (కత్తిపై చేయివేయును.)

అక్బ—ఇదుగో సలీమ్! నేను బ్రదికియున్నంతవఱకు బాదుషాను నేనే కాని నీవు కావు. నీబుద్ధులుచూడ సంగానికనుపట్టుట లేదు. నీకు తిరుగుబాటు సంకల్పమున్నట్టులున్నది. సామ్రాజ్యము వలయుచో తిన్నగా నడచుకొనుము. లేనిచో నీకును సామ్రాజ్యమునకును సంబంధము లేదు.

సలీ—ఈ నిర్ణయము కేవలము మీచేతులలోనే లేదని మనవిచేయుచున్నాను. (వెడలిపోవును.)

అక్బ—(కొంతసేపు నిస్తబ్ధుఁడైయుండి) ఓరా! తల్లితండ్రు లెంతటి యవివేకులు! ఈ సంతానముకొఱకే వారు సర్వస్వము సర్పణము చేయుదురు. నను కోరెనచో ఈతుచ్ఛుని కొసగోటితో గీటడం పఁగలను. నేఁడు వీనిదుర్వాక్యములను విని యూరకుండవలసి వచ్చినది. ఈశ్వరా! ప్రేమబంధనముచే జనకు నెంతదుర్బలునిఁ జేసితివి. ఇదియంతయు విని యూరకుండవలసి వచ్చినది. ఎవరది? మేహారున్నీసా?

మేహారు—(ప్రవేశించి) అవును నేనే నాయనగారూ!

అక్బ—మేహార్! నీపై నొకపెద్ద యపరాధమున్నది.

మేహా—నేను స్వయముగ ఆవిషయము మనవిచేసికొనుటకే యిచ్చటకు వచ్చితిని. కాని సలీముఇదవఱకే అంతయు చెప్పినటులతోఁచుచున్నది.

అక్బ—చెప్పుము శక్తసింహుని ఎవ్వరు విడిపించిరి?

మేహ—నేను నా చేతులతో

అక్బ—దౌలతు ఏమయినది?

మేహ—దానిని శక్తసింహునికిచ్చి పెండ్లి చేసితిని.

అక్బ—(వ్యంగ్యస్వరముతో) చాలమంచిది. శక్తసింహునితో అక్బరు బాదుషా మేనకోడలికి పెండ్లి! ఒక హిందువునితో మొగల కన్యకు వివాహమా!

మేహ—సమ్రాట్! ఇదియేమియు క్రొత్తవిషయముగాదు. మీ తండ్రి యగు హుమాయూనుచక్రవర్తి దీనికి మార్గదర్శికులు. తర్వాత మీరును ఈత్రోవనే త్రొక్కితిరి.

అక్బ— మేము కాఫిరుల కన్యలను దెచ్చుకొంటిమి గాని కాఫిరులకు మాకన్యల నీయలేదు.

మేహ—ఎట్లయినను ఒకటే.

అక్బ—ఒకటి యెట్లు?

మేహ—ఒకటియే. అదియు పెండ్లియే. ఇదియు పెండ్లియే.

అక్బ—ఒక్కటిగాదు. మేహర్!— నీ వింకను పిల్లదానవు. రాజనీతి నెఱుఁగవు.

మేహ—రాజనీతి నెఱుఁగనుగాని ధర్మనీతి బాగుగ నెఱుగుదును.

అక్బ—నీవింత చిన్న వయస్సులోనే తెలసికొనుటకు ధర్మనీతి యంత సులభమనుకొంటివా? ప్రపంచములో నిన్నిమతము లెందుకు పుట్టినవో ప్రతిమతమునందును ఇన్ని శాఖోపశాఖలు ఎందుకుఁ గలిగినవో నీవేమి యెఱుఁగఁగలవు? ప్రపంచములో నెందరో విద్వాంసులు, మహాత్ములు గలరు కాని మతము విషయము అందరిది తల యొక్క అభిప్రాయము. నే నెన్నియో వాద వివాదములు వింటిని. పారసీ, క్రైస్తవ; మహమ్మదీయ, హైందవ పండితు లెందరితోడనో మాట్లాడియుంటిని. కాని నాకేమియు తెలియలేదు. ఇంక పసిదానవు. నీవు సర్వము తెలసికొంటివి కాఁబోలు.

మేహ—సమ్రాట్! ఈ తర్కములు, ఈ యుక్తులు, ఈ ఆలోచనలు ఎందుకు? ఈశ్వరుఁ డొక్కఁడు. మతమొక్కటి. నీతియు నొక్కటియే. మానవులు స్వార్థపరతాహంకార విద్వేషాదులకు వశులై ఇన్ని భేదములు గల్పించిరి. జ్యోతిఃపుంజరంజితమగు నీయాకాశమును జూడుఁడు. దిగంతపర్యంతమగు సముద్రమును జూడుఁడు. సస్యశ్యామలమగు పృథ్వీతలమును జూడుఁడు. ఎల్లెడను ఒకయీశ్వరుని పేరే వ్రాసియున్నది. మానవులాయనకు పరబ్రహ్మ, అల్లా, జిహోవా మున్నగు పేరులు పెట్టి ఒండొరులు తగవులాడుచుందురు. దూషించుకొనుచుందురు. వాస్తవమునకు మానవులెల్లరు సహోదరులే. భిన్న భిన్న దేశములఁ బుట్టిన మాత్రమున మనము భిన్నులము కాఁజాలము. శక్తసింహుఁడును మానవుఁడే. దౌలతున్నిసాయును మానవయే. వీరిలో భేదమేమున్నది?

అక్బ—భేద మున్నది. దౌలతు మహమ్మదీయ, శక్తసింహుఁడు కాఫిరు. మరియు దౌలతు భారతరాజేశ్వరుని భాగినేయి, శక్తసింహుఁడు ఇల్లువాకిలి లేక ప్రతివారి చేతను తన్నులు తిను కుక్క.

మేహ—శక్తసింహుఁడును మేవాడ మహారాణాయగు ఉదయసింహునకు పుత్రుఁడు. నేఁడు ఆయన స్వదేశ బహిష్కృతుఁడును, మీరు భారతసార్వభౌములును అయినమాట వాస్తవము. రోజులన్నియు నిట్లే యుండునని ఎవరు చెప్పఁగలరు? ఒకనాఁడు అక్బరు పాదుషాగారి జనకులును శక్తసింహునివలె బహిష్కృతులై యుండిరి.

అక్బ—శక్తసింహుఁడు మహమ్మదీయుఁడగుచో నాకేమియు నాక్షేపము లేదు. కాని యతఁడు నీచుఁడగు కాఫిరు.

మేహ—ఇంక నూరకుండుఁడు నాయనగారూ!—మీ రీ కాఫిరు శబ్దమును మాటిమాటికి ఇంత నీచకముగా ప్రయోగింపకుఁడు. మా అమ్మ—సమ్రాజ్ఞియుం కాఫిరని మీ రెరుఁగరా?

అక్బ — ఆమె కాఫిరగుఁగాక. నేను మాత్రముగాను, స్త్రీలు కేవలము పురుషుల సౌఖ్యమునకై సృజింపఁబడినారు. వారు విలాస వస్తువులే కాని సహధర్మ్యవస్తువులుగారు నావద్దనిట్టి స్త్రీలు వందల కొలఁది నున్నారు.

మేహ — ఆహా! భారతరాజేశ్వరుని నోటనుండి ఎట్టి మాట వినుచుంటిని. స్త్రీలు పురుషులకు విలాసవస్తువులా! ఎంతమాట! సమ్రాట్! వారికిమాత్రము మీవంటి హృదయము లేదా? ఆహృదయమునకు మాత్రము మీ హృదయమునకుఁ బలె సుఖదుఃఖానుభవ జ్ఞానము లేదా? స్త్రీలు విలాసవస్తువులా! నేను మా అమ్మవలన వింటిని, హిందువులకు స్త్రీ సహధర్మిణియఁట హిందుశాస్త్రములో "యత్రనార్యస్తు పూజ్యంతే ప్రీయంతే సర్వదేవతాః" అని వ్రాసియున్నదఁట! స్త్రీలు పురుషులకు విలాసవస్తువులా! వారును కోరినచో "పురుషులు మాకు విలాసవస్తువులు. మాసౌఖ్యమునకై వారు జన్మించిరి" అని అనవచ్చును. కాని యట్లనరు. వారి హృదయము చాల ఉన్నతమైనది. పతికై వారు తమసౌఖ్యమును, తమజీవితమును, సర్వస్వమును అర్పణము చేయుదురు: ఇంక పురుషుల సంకుచితబుద్ధిని జూడుఁడు వారు స్త్రీలను గౌరవింపరు. ఇంక వారి యన్యాయమును. నిర్దయత్వమును జూడుఁడు— స్త్రీలు అబలలు గదాయని వారి మీఁద నెన్నియో ద్రోహములు చేయుచుందురు. తమయక్కఱ దీఱిన పిమ్మట వారి కష్టజీవితమును మఱియుఁ గష్టమయము నొనర్తురు.

అక్బ — మేహర్! నేను నీతో శాస్త్రచర్చ సేయుటకుఁగాని నీయుద్ధతోపన్యాసమును వినుటకుఁగాని కోరుటలేదు నీకుఁగాని సలీమునకుఁగాని నాయాజ్ఞల శిరసావహించుటయే కర్తవ్యము (అక్బరు కోపముతో వెళ్లును.)

మేహ — (అభిమానముతో) సమ్రాట్! నాకర్తవ్యమేదియో నేనుబాగుగ నెఱుఁగుదును, ఏతండ్రి నాతల్లిని అవమానించునో, దాసి

నిబలె తనకు విలాసవస్తువుగాఁ జూచునో, అట్టివానిని విడిచి పోవుటయే నాకర్తవ్యము. అతఁడు తండ్రియగుఁగాక భారత వర్షమంతయు నేలు బాదుషా యగుఁగాక అతఁడు నాకు సర్వథాపరిత్యాజ్యుడే—ఓదారిద్ర్యమా! విశాలమగు నోయాకాశమా ఓశీతలసమీరమా! ఓనిర్జనారణ్యమా! నేఁడు నిరాశ్రయయగు మేహరున్నిసాకు మీయుత్సంగమున స్థానమొసఁగుఁడు నేఁడు నేను భారత రాజేశ్వరుని కన్యనుగాను, నిరుపేదనగు నొకభిక్షుకిని, రాజకన్యనగుటకంటె భిక్షుకిగ నుండుటయే నాకు శ్రేయము (నిష్క్రమించును).

షష్ఠదృశ్యము.

స్థానము—ఆగ్రాలో మానసింహుని మహాలు సమయము-సాయంకాలము (మానసింహుఁడు పచారు చేయుచుండును)

మాన—నాయనగారు రేవను నా వద్దకుఁబంపినది దానివివాహముకొఱకేయని తోఁచుచున్నది. ఆవివాహముకూడ ఈమొగల కుటుంబములో అగునని తోఁచుచున్నది. ఓహో! మేమెంతటి యధోగతినిఁ జెందితిమి, పవిత్ర మేవాడువంశముతో సంబంధము చేసి ఈకళంకమును బాపుకొందు ననుకొంటిని, నాయాశయంతయు వ్యర్థమైనది ప్రతాపసింహా! నేను నీ అభిమానము నంతయు చూర్ణము చేసెదను. నేను సర్వము కలిగియుండియు నావంశగౌరవము నష్టముచేసికొంటిని. నీవు సర్వము పోఁగొట్టుకొనియు దానిని నిలఁబెట్టికొంటివి కాని యొకనాఁడు నేను నీయున్నత శిరమునువంచి నిన్నునాతో సమానునిగఁ జేయుదును. నిన్ను అడవి అడవి త్రిప్పెదను. నీశిరముపై ఆకాశమునుదక్క మఱి యేమియు నుండనీయను.

[సశస్త్రుఁడై సలీము ప్రవేశించును]

మాన—[ఆశ్చర్యముతో] శాహజాదాసాహెబ్! ఆదాబ్, ఈసమయమున తామేల శ్రమపడి వచ్చితిరి?

సలీ—మానసింహా! నేనిపుడు నీకేమియు మేలుచేయుటకై రాలేదు

నేను ప్రతిశోధమును దీర్చుటకై వచ్చితిని.

మాన—ప్రతిశోధమా?

సలీ—అవును. ప్రతిశోధము.

మాన—దేనికి ప్రతిశోధము?

సలీ—నీయహంకారమునకు. మహామూద్!

(మహామూదు ప్రవేశించును.)

సలీ—మహామూదు చేతినుండి ఆయుధములు దీసికొని మానసింహున కిచ్చుచు) ఈరెండు ఖడ్గములలో నీయిచ్చవచ్చినది తీసికొనుము.

మాన—శాహజాదాసాహబ్! మీకు మెదడుచెడిపోయినది. మీరు ఢిల్లీశ్వరునకుఁ బుత్రులు నేను వారిసేనాధిపతిని నేను మీతో యుద్ధము చేయుదునా!

సలీ—నీకు యుద్ధముచేయక తప్పదు. నీవు బాదుషాకు స్యాలకుఁడగు భగవాన్దాసునకు పుత్రుఁడవు. నీతండ్రికిని వారికిని మధుర సంపర్కముగలదు. మనకులేదు. నీవు బాదుషాకు ఆంతరంగిక సేనాపతివి. నీయభిమానమును బాదుషా సహించిన సహించుఁగాక. నేను సహింపను. నీయిచ్చవచ్చిన ఖడ్గము తీసికొనుము.

మాన—మన యిద్దఱకును పడనిసంగతి నెనెఱుఁగుదును. అయినను మీరు యువరాజులు. మీపై నేను ఖడ్గమును ప్రయోగింపఁజాలను. ఏమన నేను బాదుషాగారి యుప్పుపులుసు తింటిని.

సలీ—భీరూ! నిన్నువిడువను ఖడ్గముతీసికొనుము. నేఁడు మనయిద్దఱలో నెవ్వరెక్కువయో తెలియును.

మాన—మీరు కొంచెము శాంతింపుఁడు.

సలీ—లేదు. నేనేమియు వినను ఖడ్గము తీసికొనుము. (మానసింహుని చేతికి కత్తినిచ్చును.)

మాన—(కత్తిదీసికొని) యువరాజా! మీకు పిచ్చయెక్కినదా?

సలీ—అవును మహారాజా! (మానసింహునిపైఁ గలియఁబడును. మానసింహుఁడు దెబ్బ తప్పించుకొనును.)

మాన—శాంతింపుఁడు.

సలీ—లేదు. (మరలఁ గలియఁబడును. మానసింహుని కాలికి దెబ్బతగులును)

మాన—(గర్జించి) మంచిది యువరాజా! కాచుకొనుము. (సలీముపై కలియఁబడును. సలీము దెబ్బతిని వెనుకకు తొలఁగును)

మాన—ఇప్పటికేని మీరు శాంతింపుఁడు. లేకున్న మీ తలయెగిరిపోవును

సలీ—ఇంత సాహసమా! (మఱల కలియఁబడును)

(తత్తరపాటుతో రేవ ప్రవేశించి చేతులెత్తికొని యుభయుల మధ్య నిలఁబడును.)

రేవ—ఆగుఁడు, ఆగుఁడు. ఇది గృహాంగణముగాని సంగర రంగము గాదు (రేవ రూపమునుజూచి సలీము ముగ్ధుఁడగును. అతని చేతి నుండి ఖడ్గము క్రిందపడిపోవును. అతఁడు కొంచెము సేపు తన రెండు చేతులతో కన్నులు మూసికొనును. తర్వాత కన్నులు తెఱచిచూడ రేవ అచ్చటనుండదు)

సలీ—(ఆశ్చర్యముతో) ఈమె యెవరు? మానవకాంతయా లేక దేవ భామినియా?

సప్తమదృశ్యము.

స్థానము—ఉదయపురారణ్యమున ఒకపర్వత గుహాబహిర్భాగము.

సమయము—సాయంకాలము.

ప్రతాపుఁడు—(నిలఁబడి) తుదకు కోమలమీరుకూడ పోయినది. ధూర్మటీగోగుండా దుర్గములు శత్రువులకుఁ జిక్కినవి. ఉదయపురము మహాబత్ఖాను చేతిలోనున్నది. ఇవియన్నియు పోయినవి. వీని దుఃఖము నెట్లో సహింపవచ్చును. ఘటనాచక్రమునుండి వెడలిపోయినవి మఱల ఘటనాచక్రమునుండియే ప్రాప్తములగును. కాని మానారోహిదాసులారా! హల్దిఘాటు యుద్ధమున మిమ్ము ద్దఱను బోఁగొట్టుకొంటిని. ఇంక మిమ్ము పొందఁజాలను.

[మెల్లగా ఈర ప్రవేశించును]

ప్రతా—ఈరా! నీవు భోజనము చేసితివా?

ఈర—ఆః నాయనగారూ! ఈస్థానము పేరేమి?

ప్రతా—ఉదయ పురారణ్యము.

ఈర—చాల చక్కని ప్రదేశము. ఈనిస్తబ్ధ నీరవఘూర్మ పర్వతమాలిక యెంత సుందరముగ నున్నది!

(భోజన సామగ్రితీసికొని లక్ష్మి ప్రవేశించును.)

ప్రతా—పిల్లలు భోజనముచేసిరా?

లక్ష్మి—ఆ. మీకోసమే భోజనము దెచ్చితిని.

ప్రతా—నేనేమితిందును? నాకు ఆఁకలియే లేదు.

లక్ష్మి—ప్రొద్దుటనుండియు తిన లేదుకదా. ఇంకఆఁకలియెందుకులేదు?

ఈర—నాయనగారూ! కొంచెము భుజింపుఁడు.

ప్రతా—మంచిది. ఉంచుము.

లక్ష్మి—(భోజనముచ్చటనుంచి) ఇంక నేనువెళ్ళి పిల్లలను నిద్రపుచ్చెదను.

(లక్ష్మి వెళ్ళును. ప్రతాపుఁడు ఫలమూలములుదిని జలముఁద్రాగును.)

ప్రతా—ఇదియే రాజపుత్రులజీవితము! పగలంతయు నిరాహారముగ నుండుటయు సాయంకాలమున ఈఫలమూలములఁదినుటయు,పగ లంతయు కఠినపరిశ్రమము చేయుటయు రాత్రి కటికనేలఁ బరుండుటయు! ఇదియే రాజపుత్రుల జీవనము!

ఉ॥ కాననమూలముల్ గసరుగాయలుఁకూరలె షడ్రసాంచితా
నూన సుధాశనంబురుచినొప్పును, ప్రస్తరలోష్ఠకర్కశం
బైన ధరిత్రిఁబండుటయె యంచితకోమల శయ్యకంటె సౌ
ఖ్యానుభవంబొసంగుఁగదు సద్ధిర! దేశహితార్థజీవికిన్ ॥

(భిల్లనాయకుఁడగు మాహూవచ్చి రాణాకు నమస్కరించును.)

ప్రతా—ఎవ్వరు? మాహూ!

మాహూ—అవును రాణాజీ! తామువచ్చారనివిని తమ దర్శనానికై వచ్చాను.

ప్రతా—దేశభక్తాగ్రేసరా! మాహూ!

ఈర—మాహూ! బాగుగనుంటివా?

మాహూ—ఆ. అమ్మా! నీవిట్లా సిక్కిమోయినావేం?

ప్రతా—ఇంకను ఇది బ్రదికియున్నందుకు వింతయగుచున్నది. అసలే జబ్బుశరీరము. అందులో సరియైనయుపచారము, వేళకు పాళకు అన్నము, ఉండుటకు సరియైన కొంపలేకుండుట! నేడుపగలంత యు ఇది ఏమియు తినలేదు. ఇప్పుడేకొంచెము తిన్నది

మాహూ—బద్దిరం అమ్మా! పున్నేనికి సచ్చిమోతావు ఎక్కడో పిచ్చిదానల్లేవున్నావు. జాగర్త ఇట్టాఎన్నిరోజులు ఉపాసాలు సేసావు?

ప్రతా—ఏమిచేయుదుముమాహూ? బిహారు అడవిలో భోజనయత్నము చేసితిమి. ఇంతలో అయిదువేల మొగలసైనికులు తరుముకొని వచ్చిరి నేను పదుగుర ననుచరులను తీసికొని ఈకొండదాటని ఈపదికోసులు నడిచివచ్చితిని. వీరిని డోలిపై తీసికొనివచ్చితిమి.

మాహూ—(నిరాశ నభినయించుచు) రాణాజీ! ఇదిమీరు విన్నారా?

ప్రతా—ఏమి?

మాహూ—ఫరీమఖాను సిపాయీలంతా రాయగఢుకు పోయారు. ఇక్కడవారి సిపాయీలు వేయిగాందే వున్నారు.

ప్రతా—ఫరీమఖానెక్కడనున్నాడు?

మాహూ—ఇక్కణ్ణే. ఇవాళ్ళవాడి పుట్టినరోజు. పెద్దసంబరంచేస్తారు. మనమువాళ్ళ పైకి దండెత్తిపోదాము.

ప్రతా—కాని మనవద్ద నూరుగురేనియు మంచిసైనికులు లేరు.

మాహూ—నావద్ద కావలసినంతమంది అడవి సిపాయిలువున్నారు. రాణాగారంటే వాళ్లు పాణంకోసి యిస్తారు.

ప్రతా—అయితేపోమ్మా. వారిని సిద్ధపఱచుము. నేటిరాత్రియే వారి శిబిరమును ముట్టడింతము—పొమ్మా త్వరగాపొమ్మా.

మాహూ—సిత్తం. (ఈరతో) అమ్మా! నీవొళ్లుబద్దిరం లేక పోతే వుధాగా సచ్చిపోతావు (ప్రస్థానము)

ప్రతా—భక్తవరా! భిల్లనాయకా! నీవంటి మిత్రుడు ప్రపంచమున దొరకడు. ఈయుద్ధనములలో నీభిల్లసైన్యమే దేవతా వరప్రసాదమువలె నాకు సాయపడినది.

ఈర—(మృదుస్వరముతో) నాయనా!

ప్రతా—ఏమి అమ్మా!

ఈర—ఈ యుద్ధము చేయుట యేఁదుకు? ఈ ప్రపంచములో మన మెన్ని రోజు లుందుము? ఈ ప్రపంచములో నున్న నాలుగురోజులు ఒకరి నొకరు ప్రేమించుకొనుచు ఒకరి దుఃఖముల నొకరు పోఁగొట్టుకొనుచు నుండవలయునా లేక జగడము లాడుచు నింకను దుఃఖములఁ దెచ్చి పెట్టుకొనవలయునా?

ప్రతా—అమ్మా! మన మొక్కరి నొకరు ప్రేమించుకొనుచు నీజీవితమును గడుపఁగలిగినచో మనకీ పృథ్వియే స్వర్గమగును.

ఈర—నాయనగారూ! స్వర్గ మెక్కడ నున్నది? ఆకాశముననా? కాదు. ఒకనాఁడు ఈపృథ్వియే స్వర్గమగును.

సీ॥ నిరతిశయప్రేమ నిర్మలజ్యోత్స్నచే
నలుదెసల్ దీప్తిమై వెలుఁగునాఁడు
భక్తియు నుపకారభావముల్ మాత్రమే
యెల్లెడ సామ్రాజ్య మేలునాఁడు
అఖిల మంగళమూలమైన స్వార్థత్యాగ
మే స్వాంతరాభమం చెంచునాఁడు
ఈర్ష్యమహాద్వేష హింసాది రాక్షస
భావమ్ము లెడఁదలఁ బాయునాఁడు
గీ॥ ఈధరిత్రియు స్వర్గమై యొసక మొసఁగు
నీమనుష్యులె దేవతాకృతి వహింత్రు
లేనినాఁ డీ ధరిత్రియె యౌను నరక
మీమనుష్యులె రాక్షసాకృతి వహింత్రు॥

ప్రతా—అమ్మా! ఆరోజు ఇంకను చాల దూరముననున్నది.

ఈర—నాయనగారూ! ఆరోజు మనము దగ్గఱకు తీసికొనిరాక ఈవిధమున నెత్తురుటేఱులఁ బ్రవహింపఁ జేయుచు దాని నింకను దూరమేల చేయుచుంటిమి?

(బాలకవేషముననున్న మేహరున్నిసాను దీసికొని అమరుఁడు ప్రవేశించును.)

ప్రతా—ఎవ్వరు? అమరసింహా!—ఈనీవెంటనున్న దెవరు?

అమర—ఇతఁడు మానసింహుని దూతనని చెప్పుచున్నాఁడు. కానియితని మాటలపై నాకు నమ్మకములేదు.

(మేహరు ప్రతాపునివంక రెప్పయార్పక చూచును).

ప్రతా—నీవు మానసింహుని దూతవా?

మేహ—రాణాప్రతాపసింహులు మీరేనా? ఈకుటీరమేనా మీరుండు స్థానము? మీరీఫలమూలములనే తినుచుందురా? ఈతృణశయ్య మీదనే మీరుపరుండునది?

ప్రతా—అవును నేనే ప్రతాపసింహుఁడను నిజము చెప్పుము. నీవెవఁడవు?

ఈర—నిజముచెప్పిన మీరు నన్ను విడిచెదరేమోయని భయముగ నున్నది.

ప్రతా—నిన్ను విడిచిపెట్టవలదా?

మేహ—మీరు రాజపుత్రకుల ప్రదీపకులు మీరు మానవజాతికి గౌరవ స్వరూపులు మీవిషయమై నేనెన్నియో సంగతులు వింటిని. అందు కొన్నిటిని విశ్వసించితిని. కొన్నిటిని విశ్వసింపలేను. కాని నేఁడు ప్రత్యక్షముగఁ జూచితిని. మీమహిమ అద్భుతము కల్పనాతీతము. అక్బరుచక్రవర్తి ప్రభుత్వమును స్వీకరించి సగౌరవముగ నాయన యర్ధసింహాసనమునఁ గూర్చుండలేక దేశస్వాతంత్ర్యమునకై మీరెన్నియో యిడుములఁ బొందుచున్నారు. ఈవిషయమున నమ్మకము కలిగించుకొనుటకై యిచ్చటకు వచ్చి మీ స్థితిని ప్రత్యక్షముగఁ జూడవలసివచ్చెను. రాణాజీ! నేను మాన సింహుని దూతనుగాను (భక్తివిస్మయానందములచే మేహరు మాటాడఁ జాలదు.)

ప్రతా—అయితే నీవెవరవు?

మేహ—నేను స్త్రీని.

ప్రతా—అయితే ఈవేషమున నిచటకేలవచ్చితివి?

మేహ—నేనిచ్చటకు వచ్చిన ఉద్దేశము వేఱు. కాని యిప్పుడు ఇక్కడనే యుండి మీపరివారమునకు శుశ్రూష చేయవలయునను ఇచ్ఛ కలిగినది.

ప్రతా—అయితే నీవెవరవో చెప్పలేదు.

మేహ—మీకు స్త్రీలపేరు వినవలసిన పనియేమున్నది?

ప్రతా—మీతండ్రిపేరేమి?

మేహ—మాతండ్రి మీకు పరమశత్రువు. కాని యిప్పుడు నేనుమీ యాశ్రయమునకు వచ్చితిని. మాతండ్రిపేరు విన్నను నన్ను పరిత్యజింపనని ప్రతిజ్ఞచేయు నంతవఱకు నేను మాతండ్రి పేరు చెప్పను.

ప్రతా—ఎఱుఁగుదువా నేనుక్షత్రియుఁడను, శరణాగతుని విడుచుట క్షత్రియధర్మముగాదు.

మేహ—నాతండ్రి

ప్రతా—ఆఁ ఆఁ చెప్పుము

మేహ—నాతండ్రి - మీకు పరమశత్రువగు అక్బరు బాదుషా [ప్రతాపుఁడు విస్మితుఁడై తీవ్రదృష్టితో కొంచెముసేపు మేహారు వంకచూచును.]

ప్రతా—నీవు నన్ను మోసగించుటలేదు గదా?

మేహ—రాణాజీ! నేను నాజీవితములో నొక్కని మోసగించుట నేర్చుకొననే లేదు.

ప్రతా—అక్బరుకన్య నాయొద్దకేల వచ్చినది?

మేహ—నేను పాఱిపోయి వచ్చితిని.

ప్రతా—ఎందుకు?

మేహ—చెప్పెదను

ఈర—ఆఁ నేనుగుర్తించితిని, ఈమె మేహరున్నిసా.

ప్రతా—నీవీమెనెట్లు గుర్తించితివి.

ఈర—ఈమెను నేనెఱుఁగుదును నాయనగారూ! ఈమె అక్బరుని కన్య మేహరు.

ప్రతా—నీవీమె నెక్కడ చూచితివి?

ఈర—హాల్దీఘాటు యుద్ధక్షేత్రమున.

ప్రతా—(విస్మితుఁడై లేచి) మేహరున్నిసా! నీవు నాకు శత్రుకన్యవయ్యును నాయాశ్రయముచొచ్చితివి ఇప్పుడు నేను ఒకరికి ఆశ్రయమిచ్చు స్థితిలో లేను నేనె నిరాశ్రయుఁడనై యుంటిని అయినను నీకు ఆశ్రయ మొసఁగెదను. నిన్ను విడువను. రమ్ము లోపలికి రమ్ము. (అందఱు గుహాలో ప్రవేశించెదరు.)

రాణా ప్రతాప సింహ

చతుర్థాంకము

ప్రథమదృశ్యము.

స్థానము— షిష్నరాదుర్గము. సమయము—మధ్యాహ్నము.

(శక్తసింహుఁడు ఒంటరిగా ఉద్యానమున తిరుగుచుండును.)

శక్త—సలీమ్! ఇన్నినాళ్ళవఱకు నేనీదుర్గమున మెదలక కూర్చుండియుంటిని. అందుచే నేను నీపగాఘాతమును దీర్చుకొనుట మఱచితి ననుకొనకుము. ఆగ్రానుండి వచ్చునపుడు నేనుకొందరు రాజపుత్ర సైనికులఁ బోగుచేసితిని. ఇచ్చటకు వచ్చి యీదుర్గమును వశపరచుకొంటిని. అంతటితో నేను నిశ్చింతుడను గాలేను. నీపై నిపగ తీర్చుకొనుటకు సమయముఁ జూచుచున్నాను. ఈపగ తీర్చుకొనుటకై నే నెందరనో నిరపరాధులను వధించితిని. ఇంక నెందర వధింపనుంటినో తెలియదు. నేనేమేని అన్యాయమును జేయుచుంటినా? ఎంతమాత్రము లేదు. శ్రీరామచంద్రుఁడును సీతారక్షణమునకై నిరపరాధులును, స్వదేశవత్సలులును, రాజభక్తులునగు వేలకొలఁది రాక్షసులను వధంచెను.

[ఒకదూతవచ్చి నమస్కరించును.]

శక్త—ఏమేని సమాచారము తెలిసినదా?

దూత—ఆఁ రాణాగారు ఇపుడు బిహారు అడవిలోనున్నారు. మానసింహుఁడు కోమఁ మీరును తగులబెట్టించినవార్త సత్యము.

శక్త—మంచిది. రేపు ఇచ్చటనుండి ప్రయాణము కావలయును. దుర్గాధ్యక్షునిఁ బంపుము. (దూతపోవును.) మానసింహా! దీనికి ప్రతిక్రియ తప్పక చేసెదను. అదుగో దౌలతు వచ్చుచున్నది.

(దౌలతు ప్రవేశించి మెదలకయుండును.)

శక్త—నీ కేమి కావలయును?

దాల—(ఏమియు తోఁచక) చల్లనినీడ కావలసినంత యున్నది. నీవింక నేమియో కోరుచున్నావు. ఊరకుంటివేమి?

దాల—నాథా!—(మరల ఊరకొనును.)

శక్త—ఏమేని చెప్పెదవా లేక ఈమిట్టమధ్యాహ్నమున నాథా ప్రాణేశ్వరా! యనుటకె ఇచ్చటకు వచ్చితివా? ఈసమయమున ఈసంబోధనముల కేమియు విలువ లేదు. ప్రేమప్రథమాధ్యాయములో నిట్టిమాటలు కొంతశోభ నాపాదింపఁగలవు. ఇంక మన ప్రేమకు ఒక సంవత్సరకాలము పైగానయినది, ఇప్పు డీమిట్టమధ్యాహ్నమున 'నాథ' ప్రాణనాథ శబ్దంబులు అకాలసంగీతమువలె కర్ణకఠోరములుగ నుండును.

దాల—నాథా! పురుషులప్రేమ విషయమై నే నేమియు చెప్పఁజాలను. కాని స్త్రీలప్రేమవిషయమై నేను బాగుగ నెఱుఁగుదును. అది యెప్పుడును ఒకవిధముగనే యుండును.

శక్త—అనఁగా పురుషులాలస కంతముండునుగాని స్త్రీలలాలస కంతముండదనియే కాదా?

దాల—నాథా! పతికిని పత్నికిని ఇదియేనా సంబంధము?

శక్త—పురుషునకును స్త్రీకిని ఇదియే సంబంధము. పురోహితుఁడువచ్చి నాలుగు మంత్రములు చదివినమాత్రమున అందేమి విశేషము వచ్చునో తెలియకున్నది. ఇంక మనవివాహములో నదియును జరుగలేదు. ఇందువలన సంఘపుదృష్టిలో నీవు నాకు ప్రేమికవే కాని పత్నివికావు.

దాల—(మొగమెఱ్ఱవడును.) ప్రభూ!

శక్త—దాలత్! ఇప్పుడు నీవు వెళ్ళిపొమ్ము. పురుషునకు స్త్రీలయధరామృతమును గ్రోలుటయేగాక మఱికొన్ని పనులుగూడ నుండును.

(దాలతు తలవంచుకొని మెల్లగ వెళ్ళిపోవును.)

శక్త—ఇదియే స్త్రీజాతి! ఎంత యసారము, ఎంత కుత్సితాకారము! ఆహా! లాలసాంధులమై మనము దీనినే ఎంతయో సుందరమని

తలంతుము. స్త్రీజాతియే యననేల మానవజాతియే నీచమగు నొకపశుజాతి. వస్త్రభూషణములు దీసివేసినచో మానవునికంటె నాపశువే యందముగఁ గనుపట్టును. మానవశరీర మెంత కుత్సితమైనది. ఇది పుష్టికై సుందరములును, స్వాదిష్ఠములును, సుగంధములు నగు పదార్థముల సేవించును. ఇంక (ప్రవగింపును సూచింపుచు) నికృష్టపదార్థములను విడుచుచుండును. తుదకు శరీరపు చెమటయందుఁగూడ నెట్టిదుర్గంధ ముండునో చూడుఁడు ఇంక చచ్చినపిమ్మట ఈశరీరమును ఒకటిరెండు రోజులు నిలువ యుంచినచో ఇంక నాసుగంధము చెప్పనలవిగాదు.

దుర్గాధ్యక్షుఁడు—(ప్రవేశించి) మహారాజా! రేపేనా ప్రయాణము?

శక్త—అవును. రేపు ఉదయమే నీచేతిక్రింద వేయిమంది సైనికు లుందురు. దాలతున్నినా ఇక్కడనున్న సంగతి యెవ్వరికిని తెలియఁగూడదు సుమా పొమ్ము

దురా—చిత్తము (నిష్క్రమించును.)

శక్త—సలీమ్! అక్బర్! ఓ మొగలసామ్రాజ్యమా! మిమ్మందఱను ఒక్కమాఱుగ కాలితో రాచివైచెదను. (ప్రస్థానము)

ద్వితీయదృశ్యము.

స్థానము—నౌరోజు ఉత్సవము. సమయము—సాయంకాలము.

[రేవ పూలదండలు ఎదురుగనుంచి నిలఁబడియుండును. చిత్రవిచిత్రవేషధారిణులగు పెక్కుస్త్రీలు వచ్చుచు పోవుచునుందురు. రేవ మోచేయి బల్లపయి మోపి అఱచేతను గపోలముంచి ఆదృశ్యము చూచుచుండును. సుందర వస్త్రభూషణములు ధరించిన ఒకస్త్రీ అచ్చటకు వచ్చును.]

స్త్రీ—ఇచ్చట నేమి యమ్మఁబడును?

రేవ—పూలదండలు.

స్త్రీ—తెమ్ము. చూచెదను, ఇవి యేమిపూలు?

రేవ—పారిజాతములు.

స్త్రీ—పేరు పెద్దదేగాని దండ చిన్నది, ధరయెంత?

రేవ—అయిదు మోరీలు.

స్త్రీ—ఇదుగో మోరీలు తీసికొనుము. దండ తెమ్ము. బాదుషాగారి మెడలో వేసెదను. (దండ తీసికొని వెళ్లును)

రేవ—ఈమె బేగంసాహెబా. బాదుషాగా రిచ్చటను కనుపించలేదు.

మఱియొక స్త్రీ—(ప్రవేశించి) ఇచ్చట పూలదండ లమ్మెదరా?

రేవ—అవును.

స్త్రీ—తెమ్ము చూచెదను. (ఒకదండ తీసికొని దానిని విడిచి మరల రెండవ దండ తీసికొని) ఇవి యేమిపూలు?

రేవ—కడిమిపూలు.

స్త్రీ—ఇదుగో వెల. (కొన్ని మోరీలిచ్చి దండతీసికొని పోవును.)

రేవ—ఇదియు నొకవిచిత్రపు ఉత్సవమే. ఇక్కడ దొరకని వస్తువు లేమియు లేవు. కాశ్మీరపు సేలువలు. జయపురపు స్ఫటికపాత్రలు చీనాబొమ్మలు, టర్కీ తివాచీలు, సింహళశంఖములు ఇక్కడ లేనివేవి? ఇట్టిఉత్సవము నేనెక్కడను చూడలేదు.

[పూలదండలు ధరించి అక్బరు ప్రవేశించును]

అక్బరు—ఈ దండలు గుచ్చిన దెవరు?

రేవ—నేనే.

అక్బరు—నీవు మహారాజ మానసింహుని చెల్లెలవా?

రేవ—అవును.

అక్బరు—(స్వగతము) సలీముని అనురాగోన్మాదమునకుఁ గారణము తెలిసినది. ఈమె నిశ్చయముగ భారతభావి సమ్రాజ్ఞి యగుటకు తగినదియే. (రేవతో) తెమ్ము నీ తెక్కిన దండలు చూచెదను (అన్నిదండలు తీసికొని) వీనియన్నిటి వెల యేమి?

రేవ—వేయి మోరీలు.

అక్బరు—ఇదుగో నీదండలన్నియు కొంటిని. (మోరీలు అక్కడనుంచి దండలు తీసికొనును.)

రేవ—మీరు అక్బరు బాదుషాయేనా?

అక్బ—అవును. (ప్రస్థానము)

దృశ్యాంతరము. (౧)

స్థానము—నౌరోజు ఉత్సవము. సమయము — రాత్రి.

వేశ్యల నృత్యగానము.

దృశ్యాంతరము (౨)

స్థానము—చీకటిమార్గము. సమయము—రాత్రి.

[జోషిబాయి ఒంటరిగా దారి వెదకుచుండును. రెండవ వైపు నుండి అక్బరు ప్రవేశించును]

అక్బరు—సుందరీ! నీవిచ్చట నేమి చేయుచుంటివి?

జోషి— నేను దారి మరచితిని. బాదుషాగారు దయచేసి దారి చూపినచో —

అక్బ— నేను బాదుషానని యెట్లు తెలిసి కొంటివి?

జోషి—ఈయుత్సవమునకు బాదుషాదక్క ఇతరపురుషులు రాజాల రని వింటిని

అక్బ—మంచిది. సుందరీ! నీ వెవ్వతెవో నే నడుగవచ్చునా?

జోషి— నేను రాజసభాకవియగు పృథ్వీరాజునకు భార్యను మేవాడు రాజవంశమున కాదుపడుచును. నాపేరు జోషిబాయి.

అక్బ—నీ వీయుత్సవమున కిదియే తొలిసారి వచ్చుట కాబోలు?

జోషి—చిత్తము. నా కిచ్చటి దారి యేమియు తెలియదు. దయచేసి దారి చూపినచో—

అక్బ—నీ కిది తెలియదు కాబోలును. ఇక్కడకు వచ్చు మార్గము సులభముగాని ఇక్కడనుండి వెళ్లుమార్గము చాల కఠినము.

జోషి— మీరు దయచేసి నాకు దారి చెప్పుము. ఇదియేనా దారి? (వెళ్ళబోవును)

అక్బ—(దారి అడ్డి) నీవు దయచేసి ఇంత దూరము వచ్చిన దానవు మఱి కొంచెము దయచేసి ఒకమారు నాగదిలోనికికూడరమ్ము.

జోషి—మీరు దాగి వదలుఁడు.

అక్బ—నీవు బొత్తుగా తెలియని దానవుగా నున్నావు. సౌందర్యవతు లగు రమణుల నేనెంతగా గౌరవింతునో నీవెఱుఁగవు కాఁబోలు సుందరీ!—(ముందుకుఁ బోవును.)

జోషి—ఈయుత్సవము ప్రతిసంవత్సరమును బాదుషాగారు ఇట్టి పైశాచిక కాంక్షలఁ దీర్చుకొనుటకే చేయుచుందురని నేనెఱుఁగుదును. మఱియు బాదుషాగారు పరరాజ్యములఁ దోచుకొనుటయందుఁ బలె పరకాంతల గౌరవమును దోఁచుకొనుటయందును వీరులని నేనెఱుఁగుదును. కాని మీరు మీభవనములో కులకాంతల నిట్లు పరిభవించుటకు లేశమును సంకోచింపని పరమనీచులని నేనెఱుఁగను. మంచిది. దారి విడువుఁడు.

అక్బ—రత్నభూషణములచే నిన్ను అలంకరించి ఇంటికిఁ బంపెదను.

జోషీ—హా పరమేశ్వరా! ఎంతమాట వినవలసివచ్చినది.

అక్బ:—నేను నీకొక చిన్న రాజ్యమునిచ్చెదను.

జోషి—నీరాజ్యములు నీభోజ్యములు నాకు తృణసమానములు,

అక్బ—ప్రేయసీ! నీ కోపారుణవదనము నా హృదయమును మఱియు నలరించుచున్నది. నేను నీతో ఒట్టుబెట్టి చెప్పుచున్నాను. ఈ రహస్యవిషయమును నే నెవ్వరికిని చెప్పను. నేడు దక్క మఱల నిన్నెన్నఁడును ఇట్టికోరికను గోరను. నీగౌరవము పోవునని భయపడకుము ఇంకను హెచ్చును. నీ గర్వాశము స్థిరము ఇంకను ఉన్నతమగును. రమ్ము పోదము. (జోషీబాయి చేయిపట్టుకొనును.)

జోషి—(చేయి విడిపించుకొని) ఓరీ అధమాధమా! కాపురుషా! లంపటా! జాగ్రత్త! (అక్బరు వెనుకకు తగ్గును) నేను హిందూరమణినని జ్ఞప్తినుంచుకొనుము, కొందరు కులాంగారులగు హిందూరాజులు తమకాంతలను నీయీనీచపైశాచి కోత్సవమునకుఁ బంపి తమగౌరవమును బోఁగొట్టుకొని నీదుర్వ్యసనము నీగతికిఁ దెచ్చిరికాని వారిని నేను హిందువులుగ తలంచుటలేదు. నేటి

హిందువులలో పెక్కుమంది తమహిందుత్వమును బోగొట్టుకొనిరి. నీవు చక్రవర్తివి. నీవే ప్రజలకు తల్లివి తండ్రివి. కులకాంతలయెడ నీకిట్టి దుష్ప్రవర్తనము తగదు. ఇంకనన్ను స్పృశింపకుము. లేనిచో (కత్తిదూసి) నీ యధమజీవితము నంతమొందించెదను. మఱియు నాహితో క్తి నాలింపుము.

సీ॥ సామాన్యుఁడే శౌర్యశాలి రావణుఁడు సీ
తను బట్టి వంశనాశనము గనఁడె
మనుజమాత్రుఁడె సుయోధనుడు సానుజుఁడయి
ద్రౌపది పరిభూతి ద్రుగ్గిపోఁడె
శాసనీయుఁడె లోకశాసకుండగు శౌరి
బృందచే దుదకు శపింపఁబడఁడె
అలతులే యల్లత్రిమూర్తులు సాధ్వి ననసూయఁ
గవ్వించి బాలురై కట్టు పడరె
గీ॥ పతుల నిజదైవతములని మతిఁదలంచు
సతుల కహితమ్ముగోరు దుర్మతుల కెందు
నిహపరంబులు సున్నయౌ నెంచి బుద్ధి
గలిగి వర్తించెదేని మంగళము గలుగు॥

అక్బ—సుందరీ! నీవు వ్యర్థముగ గోపించితివి పవిత్రస్వభావముగల సతులను నేను హృదయపూర్వకముగ గౌరవించెదను. అట్టివారియిచ్ఛకు విరుద్ధముగ నేనెన్నడును బ్రవర్తింపను అక్బరొకమహావ్యక్తి గాకున్నను అతఁడు మహాత్మ్యమును గురుతింపఁగలఁడు. రమ్ము నిన్ను బయటకు బంపెదను. (అక్బరునివెంట జోషిబాయి వెళ్లును.)

తృతీయ దృశ్యము

స్థానము—పృథ్వీరాజుగది. సమయము—రాత్రి.

(పృథ్వీరాజు కవిత్వమువ్రాయుచుండును)

పృథ్వి—గీ॥ బ్రహ్మలోకమ్ము నల పరబ్రహ్మమాడ్కి

అల్లవైకుంఠమ్ముఁ దానవారియటుల
స్వర్గలోకమ్ము నలశచీపతివిధంబు
భరతఖండంబు నేలు నక్బరు విభుండు॥

పైమూడుపాదములందును అల, అల్ల, అల అని మూడు వడి కట్టురాళ్ళు వడినవి. మఱియు నాల్గవపాదమున గోడపై పిల్లివాటముగ తద్ధర్మకాలముగాక "భరతఖండంబు నక్బరు నేలుచుండె" అని వర్తమానకాలముంచిన ప్రకరణోచితముగ నుండెడిది. కాని యతి భంగమువచ్చును. యతిభంగమోలేక దీనిని విధించి నవారికి మతిభంగమో తెలియదు. కాని ఒక్కొకప్పుడు ఇది ప్రాణాలు తీయును. ఇట్టిసమయములందు యతిభంగమున కనుమతియిచ్చినవీరిప్పుట్టియేమిమునిఁగిపోవునో తెలియకున్నది. అయితే—

(జోషిబాయి ప్రవేశించును)

పృథ్వీ—ఏమిజోషి! ఉత్సవము చూచివచ్చితివా?

జోషి—ఆఁ స్వామీ చూచివచ్చితిని.

పృథ్వీ—నిజము చెప్పుము నీకెంత ఆనందము కలిగినది? నేనుమొదటనే చెప్పితిని. ఇట్టియుత్సవము ప్రపంచములో నెక్కడను జరుగదు. బాదుషావలెనే ఈ యుత్సవమును అసాధారణమైనది.

((బ్రహ్మలోకమ్ము, అను పద్యము చదువును.)

జోషీ—ఛీ! స్వామీ! ఇట్టిపద్యములు వ్రాయునపుడు మీమస్తకము లజ్జాభరముచే నవనత మేలకాదు? మీనాలుక చీలిక లేలకాదు? ఇంత నీచస్తుతియా! యింతఅసత్యముఖస్తుతియా!

పృథ్వీ—ఏమి జోషి! ఇందసత్యమేమున్నది? బాదుషాగారు ఈస్తుతికెంతయు నర్హులనియే నాతలంపు. ఇంతకు మించి స్తుతించినను అతిశయోక్తిగా నేరదు.

సీ॥ కాబూలుమొదలు బంగాళ పర్యంతమ్ము
నెల్లదేశమ్ము జయించె నెవఁడు
హిందూముసల్మాను లెంమివర్తింపంగ
నేకసూత్రమున బంధించె నెవఁడు

తా ముసల్మానయ్యుఁ దవిలి హిందూధర్మ
 శాస్త్రముల్ శ్రద్ధతోఁ జనువు నెవఁడు
అసమబాహాబలప్రశమితారాతియై
 స్థిరసుయశమ్ము నార్జించె నెవఁడు
గీ॥ అతఁడు పొగడొందఁడే సమస్తావనీశ
 మస్తకన్యస్త విస్తృత మణికిరీట
 ఘృణిగణాంచిత పాదనీరేజుఁ డమిత
 విక్రమస్ఫూర్తి యక్బరు చక్రవర్తి

జోషి—మీపద్యములో నీపాదమునుగూడఁ జేర్పుఁడు—"విమల హిందూరాజకామినుల స్వీయోపభోగార్హలని తలపోయు నెవఁడు."

పృథ్వీ—జోషి! నీవు అక్బరును జూడలేదుగాబోలు? కనుకనే యిట్లను చుంటివి

జోషి—చూచితిని స్వామీ! నేఁడు చూచితిని. నేఁడు నాకటారియే నాకు సాయముఁడనిచో మీభార్యకూడ అక్బరువారాంగనా సహస్రములో నొక్కతెయయి యుండెడిది.

పృథ్వీ—ఆఁ! ఏమి! ఏమనుచుంటివి?

జోషి—ఇక నేమందును? మీరు క్షత్రియులగుచో, మీయందు మనుష్యత్వమున్నచో, మీయందు కొంచెమేని పౌరుషమున్నచో దీనికి ప్రతిక్రియ సేయుఁడు. లేనిచో 'నాకు నాథుఁడు లేఁడు, నేను విధవను' అనుకొందును. ఇంక పత్నీభావముతో నన్ను స్పృశించుటకు మీ కధికారముండదు. హానాథా! ఏమి చెప్పుదును! పిరికిపందలు, కులాంగారులగు ఈహిందువులఁ జూచినచో నాకు పురుషజాతిమీఁదనే ఏవగింపు కలుగుచున్నది. మాయాత్మరక్షణమునకై యింక మేమే కత్తిపట్టుకొందుమా యనిపించుచున్నది. ఆహా! అస్పృశ్యుఁడగు నొకయవనుఁడు ఆలింగనాభిలాషియై మీధర్మపత్నిఁ జెయిపట్టుకొనుటయు మీరు ప్రశాంతభావమున మొదలక నిలఁబడి యీమాటలన్నియు వినుటయునా?

పృథ్వీ—ఇదియంతయు సత్యమేనా?

శోభి—నాధా! ఇంకను మీకు సందియమా?

గీ॥ అధమ పురుషులు వలె నధమాంగనలును
ఒరులు తముఁ గూడిరని గొప్ప కుగ్గడింత్రు
సుకులసంజాత కులకాంత యొకఁడు తనుఁ గ
ళంకితం జేసెనని యెందు బొంకునొక్కొ॥

మీరింకను ఎక్కువ వినఁగోరినచో అక్బరుచే ప్రతిభ్రష్ట చేయఁబడి ఆతఁడొసంగిన యాభరణములతోఁ గులుకుచు నింటికివచ్చిన మీనా దినగారిని అడుగుఁడు. ఆకులటను మీ యన్న గామసింహుఁడు నిరాతంకముగ నింటఁజేర్చుకొనెను. ఆహా! ఆర్యజాతి యెంత యధోగతిపాలైనది!

సీ॥ ధీమతి గార్గి లోపాముద్ర మైత్రేయి
మొదలగు విదుషులపుట్టినిల్లు
సావిత్రి యనసూయ సాధ్వి గాంధారి ము
న్నగు పతివ్రతలకు నాటపట్టు
గాంగేయ రాధేయ కౌంతేయులాది వీ
రులగన్న వీరమాతలకు నెలవు
శక్తిసంయుక్త సంయుక్త దుర్గావతి
ప్రముఖ వీరాంగనా వాసభూమి
గీ॥ భారతావని యస్మదభాగ్యగతిఁ
గులటలకు నాశ్రయంబయి మెలఁగుచుండె
ధనము నుద్యోగములఁ గోరి తముదుసతులఁ
దార్చుచున్నారు హైందవాధములు నేఁడు॥

ఈశ్వరా! ఈపాపయుగమున సాధ్వులకు స్థానము లేదు, ప్రళయకాలాభీలబాడబజ్వాలల నొక్కమాఱుగ నీభారత జాతిని దగ్ధము చేయుము, (క్రోధముతో ప్రస్థానము)

పృధ్వీ—హా నే నేమి వినుచున్నాను ఈ మాటలన్నియు సత్యములేనా నాకేమియు తోఁచుటలేదు, నే నేమి చేయుదును. అయినను నే నేమి చేయఁగలను! అక్బరు సర్వశక్తిమంతుఁడు- ఇంక నే నేమి చేయఁగలను. ఏమియు ఉపాయము తోఁచుటలేదు.

చతుర్దదృశ్యము.

స్థానము — పర్వతగుహ. సమయము — రాత్రి

[ఈర రోగశయ్యపైఁ బరుండును. దగ్గర మేహారు కూర్చుండును.]

ఈర — మేహార్!

మేహా — ఏమి అక్కా?

ఈర — అమ్మయేమ్పుచు నేడ్చుచు బయట కెందుకు లేచిపోయినది! నేను చచ్చిపోవుచుంటిననియేనా?

మేహా — కాదు అక్కా! అట్లనకుము.

ఈర — అనిన నేమి? ప్రపంచములో నింతకంటె మించిన సత్యవిషయ మున్నదా? ఈజీవితము కొలఁదికాలమే యుండును ఇక మృత్యువు శాశ్వతమైనది. మృత్యుసముద్రమున ఈజీవితము అలలువలె కొద్దికాలము లేచి పడపడి శాంతమగును. జీవితము మాయ-భ్రమ. ఇంక మరణమో స్థిరము-సత్యము. చిరస్థాయియు సంజ్ఞా హీనయునగు నిద్రలో నీ జీవితము స్వప్నము వలె వచ్చి పోవుచుండును. మేహార్.

మేహా — ఏమిఅక్కా?

ఈర — చూడుము. నీవు మొగలకన్యవు, నేను రాజపుత్రకన్యను. నీ తండ్రియు నాతండ్రియు పరమశత్రువులు, ఒకరిమొగము నొకరు చూచిన మహాపాతకమని తలంచెదరు? ఇంక మనమిద్దఱము పరమమిత్రులము, మనమైత్రి పూర్వజన్మ సంస్కారజనితమో యని పించును. అయితే మన స్నేహ మింక నెంతకాలము? మనము తొలుదొల్త పితృవ్యుని శిబిరమున కలసినమాట నీకు జ్ఞాపకమున్నదా?

మేహా — ఆ జ్ఞాపకమున్నది.

ఈర — తరువాత నెవ్వరో స్వప్నమునఁబలె మనల జతగూర్చిరి. ఈస్వప్నము క్షణస్థాయియే. కాని చాల మధురము. నిన్ను విడిచిపోవుచున్నాను. మఱల నెప్పుడో మనము కలసికొనఁగలమని నాకు తోఁచుచున్నది.

మేహ—మరల కలిసికొందుమా?—ఎక్కడ?

ఈర—(ఆకాశమువంక వ్రేలితో జూపుచు) అక్కడ:—ఇప్పుడు నీకా స్థానము కనుపించదు. ప్రఖరభాస్కరప్రకాశమున అసంఖ్య తారాగణములువలె తీవ్రజీవితప్రకాశమున ఆస్థానము అదృశ్యమై యుండును. ఈ జీవితజ్యోతి అడగిననాడు ఆయపూర్వజ్యోతిర్మయ రాజ్యము ప్రకాశించును కనుపింప సాగును. ఆహా ఆదృశ్యమెంతసుందరమైనది.

(మేహరు మెదలక ఈరవంక చూచును)

ఈర—మేహర్! చూడుము. నీ కాయూకాశము కనుపించుచున్నదా? నీలము, గాఢము, సుందరమునై యెంతశోభావహముగ నున్నది! పృథ్వికి బంగారుపూత పెట్టుచు సంధ్యాసూర్యుఁడస్తమించుచున్నాఁడు. నీరవరాగిణివలె ఆకాశమున ఈలోహితమేఘమాలిక పలురంగులతో విహరించుచున్నది. ఇవి యన్నియు నిక్కంపు వస్తువులే యనుకొనుచుంటివా?

మేహ—కాసిచో మఱి యేటివి?

ఈర—ఇవియన్నియు తెలుపు ప్రాయుఁబడిన వాస్తవిక సౌందర్య చిత్రమాత్రములు. ఆ వాస్తవిక సౌందర్య మీ తెరవెనుక నున్నది-అది ఈసూర్యుని వెనుక ఈ ఆకాశమువెనుక నున్నది.

మేహ—(మెదలక ఈరవంక చూచుచుండును.)

ఈర—(కొంచెమాగి) నిద్రవచ్చుచున్నది. నిద్రపోయెదను.

[మెల్లగా ప్రతాపుఁడు ప్రవేశించును.]

ప్రతా—(మెల్లగా) ఈర నిద్రపోయినదా?

మేహ—ఆఁ ఇప్పుడే నిద్రపోయినది.

ప్రతా—మేహర్! ఇంక నీవు పోయి విశ్రమించుము. ఇక్కడ నేను కూర్చుండెదను.

మేహ—కాదు. నేను కూర్చుండెదను. మీరే విశ్రమించుఁడు. మీరు పగలంతయు అలసియున్నారు.

ప్రతా——ఇప్పుడు నాకు విశ్రాంతి అవసరము లేదు. అవసరమైనపుడు నిన్ను పిలిచెదను, నీవు పోయి విశ్రమింపుము.

మేహ——మంచిది. (వెళ్ళఁబోవును.)

ప్రతా——లక్ష్మి యెక్కడ నున్నది?

మేహ——వారు వంటజేయుచున్నారేమో? పిలుతునా?

ప్రతా——పని అయిన పిమ్మట ఇచ్చటకు రమ్మని చెప్పుము.

(మేహరు వెళ్ళును.)

ప్రతా——ఇదియే నాదినచర్య. మూఁడు రోజులనుండి ఒక్క వరుసగా అడవులన్నియు ద్రిమ్మరుచు మొగలసైనికులనుండి తప్పించుకొని తిరుగుచున్నాను. భోజనమునకు సమయము చిక్కుట లేదు. అందులో ఈపిల్ల రోగశయ్యపై నున్నది. పిల్లలు ఏమి తినుచున్నారో ఏమి చేయుచున్నారో తెలియదు. నాకు అహోరాత్రములు ఈయలజడితో సంపోవుచున్నది (మెల్లగా ఈరవద్దకుఁ బోయి కూర్చుండును.) ఇంతలో నేపథ్యమున పిల్లలరోదనము వినఁబడును.) నిన్న నేను మొగలుల చేతికిఁ జిక్కవాడనే. విశ్వాసపాత్రుఁడగు భిల్లనాయకుని అనుగ్రహ[illegible] యవమానము దప్పించుకొంటిని [illegible] నా ప్రాణములు గాపాడుటకై తన ప్రాణములు [illegible]. ఇటుల నా ప్రాణరక్షణమునకై ఎన్నిప్రాణములు పోవుచున్నవో తెలియదు. నా ప్రాణదాతల స్త్రీలు అనాథలై కుందుచున్నారు. వారి పిల్లలు నిరాధారులై వగచుచున్నారు. ఇది యంతయు దేనికి? నా కొఱకు——నాప్రాణములు రక్షించుటకొఱకు. ఇంక నా ప్రతిజ్ఞ నిలచునట్లు తోఁచుటలేదు. దానిని నిలఁబెట్టుకొనుటకు నాకు సామర్థ్యము లేదు.

లక్ష్మి——(ప్రవేశించి) ఈర నిద్రపోయినదా?

ప్రతా——అవును నిద్రపోయినది. లక్ష్మీ! పిల్లలేడ్చుచున్నారెందుకు?

లక్ష్మి——వారిద్దరు కూర్చుండిరి. ఇంతలో నొక యడవిపిల్లి వచ్చి వారి రొట్టె లాగికొని పోయెను.

ప్రతా—అయితే ఈరాత్రి వారేమితిందురు?

లక్ష్మి—నేను నావంతు వారికిచ్చితిని. మన మొకపూట తినకున్నను బాధ లేదు.

ప్రతా—(కొంచెమాగి) లక్ష్మీ!

లక్ష్మి—ప్రభూ!

ప్రతా—లక్ష్మీ! నీవు నానిమిత్తమై బహుకష్టముల నహించితివి.

సీ॥ పతి లభించెనో ధరాపాలుఁడే యగుటకుఁ
గుడువఁగూడును గట్ట గుడ్డ కరవు
రాజ్యమబ్బెనో మహారాజ్యమే పేరుకు
తలదాఁచు కొనుటకు నెలవు నున్న
వైభవంబలవడెనో భవ్యరాజ్ఞీత్వ
జనితమ్ము, సతతమ్ము శ్రమముపడుటె
సంతతిగల్గెనో సంతతక్షుత్పిపా
సలకు లోనయి చింత గొలుపునదియు
గీ॥ అతివ! నను జెట్టఁబట్టిన దాది నీకు
బహులకష్టమ్ము లేగాని స్వప్నమునను
సౌఖ్యమనుమాట లేదాయి చాన యింకఁ
గష్టములు నీకు వెరవును గాంచఁగలవు.
ఇంక నేను స్వయముగ వారికే పట్టుపడెదను.

లక్ష్మి—అదియేమి నాథా?

ప్రతా—ఇంక నేను పట్టుపడక యుండఁజాలను. అదియునుగాక మీకష్టములుగూడ నేను చూడఁజాలను నక్కవలె అడవులందును కొండలందును ఇంక నెంతకాలము దాగుచు తిరుగుచుందును? కడుపునకన్నము కంటికి నిద్ర లేక యెంతకాల మిడుములు పడుచుందుము! నేను అన్నియు సహింపగలుగుదును. గాని నీవు—

లక్ష్మి—నేనా!—నాథా! నాకన్నిటకంటె మీయాజ్ఞా పాలనమందే సమధికానందము గలుగును.

ప్రతా—ప్రేయసీ! కష్టసహనమునకుఁగూడ కొంత అవధియుండును

నేను మోటువాఁడను, పురుషుఁడను. అన్నియు సహింపఁగలను కాని నీవు ఆడుదానవు, కోమలహృదయవు.

లక్ష్మి—నాథా! నన్ను ఆడుదియని లఘూకరింపవలదు. స్త్రీలు పతి సుఖమే తమసుఖమని యెఱుఁగుదురు. మఱియు పతిదుఃఖములను శిరసావహించి సహించుటయు నెఱుఁగుదురు. నాథా! స్త్రీలకు కష్టముసహించుట బాగుగ తెలియును. కష్టసహనమునకే వారి జీవిత మేర్పడినది. ఆత్మోత్సర్గమందే వారి కపారసుఖము జనించును స్వామీ! మీయరికాలులో ఒకచిన్నముల్లు గుచ్చుకొనినచో అది మాహృదయమున అంకుశమువలె పొడుచుకొని అపారబాధ గలిగించును.

సీ॥ ప్రాణాధికంబగు పరమసంప్రీతిఁ బా
యకతల్లిదండ్రుల నాదరించు
భుజలతావేష్టితంబునఁ జిక్కనిడుకొని
పతి నతిప్రీతిఁ గాపాడుచుండు
హృదయరక్తమును సమ్మోదమునఁ బోషించి
సంఘభూజమును రక్షణము సేయు
ఆహారనిద్రాదులన్ని విసర్జించి
ప్రాణపణమ్ముగాఁ బ్రజను బ్రోచు
గీ॥ ప్రేమయే ధ్యేయమై సదా వెలయుచుండు
ధర్మమే జీవితంబయి తనరుచుండు
త్యాగమే మూలమంత్రమై యలరుచుండు
భళిర! స్త్రీజాతియన లాఘవంబు తగునె॥

ప్రతా—నిజము కాని నామూలముగ ఈపసికాయలుగూడ చాల కష్టపడుచున్నారు.

లక్ష్మి—స్వామీ! ముందుగ స్వదేశమా లేక పిల్లలా

ప్రతా—లక్ష్మి! నీవు ధన్యురాలవు. నీకు సాటిలేదు. దైన్యనిలయమగు నీవిపత్సమయమందును నీవు నన్ను అధఃపతితుని గానీయలేదు కాని యిప్పుడు నావలన నేమియుఁగాదు. నేను దుర్బలుడను

నాకు బలమిమ్ము నేను కరగిపోవుచున్నాను. నన్ను కఠినునిఁ జేయుము. నాకనులముందు అంధకార మావరించినది. నాకు దీపము చూపింపుము.

ఈర—అమ్మా!

లక్ష్మి—ఏమి అమ్మాయీ!

ఈర—ఎంత సుందరము! చూడుమమ్మా! ఇది యెంత సుందరమో!

లక్ష్మి—ఏమి అమ్మాయీ!

ఈర—ఈ రంజిత సముద్రము. ఇందు ముక్తదేహములగు ఆత్మలెన్నియో కొట్టుకొని పోవుచున్నవి. అపారసౌందర్యమయములగు ప్రకాశ ఖండము లెన్నియో పరుగెత్తుచున్నవి. ఆకాశమునుండి నిరంతర మనురసంగీతధార వర్షించుచున్నది. మూర్తిమయియగు చింత, వర్ణమయియగు కామన, ఆనందమయియగు ఇచ్ఛ

ప్రతా—(లక్ష్మితో) ఇది స్వప్నము చూచుచున్నది కాఁబోలు.

ఈర—(ఉలికిపడి) అంతయు పోయినది. ఇదియేమి? అమ్మా! మనమెక్కడ నున్నాము?

లక్ష్మి—చూడుమమ్మాయీ! అందఱు నిక్కడనే యున్నారు.

ఈర—అమ్మా! మేహరు ఎక్కడ నున్నది?

లక్ష్మి—పిలచెదనా! అదుగో వచ్చుచున్నది.

(మేహరున్నిసా ప్రవేశించును.)

ఈర—మేహర్! నీ వెచ్చటకు వెళ్లితివి? ఇట్టి సమయమున నన్నువిడిచి నీవెచ్చటకు వెళ్లితివి? ఇదుగో నేను వెళ్లిపోవుచున్నాను రమ్ము నాతో రెండుమాటలు మాటలాడిపొమ్ము.

లక్ష్మి—ఛీ! ఈరా! ఏమిమాటలవి?

ఈర—కాదు అమ్మా! నేను వెళ్లిపోవుచున్నాను. మీకేమియు తెలియదు. నా కంతయు తెలియును. ఇప్పుడు నేను వెళ్లుచున్నాను. వెళ్ళుటకు ముందు మీకు రెండుమాటలు చెప్పెదను. నాయనగారి శరీరము సరిగా లేదు. వారినివ్యర్థముగ యుద్ధమున కెందుకు పురిగొల్పెదవు? వారిప్పు డీ కష్టములను సహింపఁజాలరు—

నాయనగారూ! వ్యర్థముగ మీ రేల యుద్ధము చేసెదరు? మానవుఁడు చేయఁజాలినదంతయు మీరు చేసితిరి. అక్బరు తన మానవత్వమును బోగొట్టుకొని చితౌరు దుర్గమును బట్టనెంచినచో నెంచుఁగాక. వ్యర్థమగు రక్తపాతముచే నేమి లాభము? మీరు అన్నియు విడిచిపెట్టుఁడు అక్బరు చిత్తూరుకోట కోరుచో నిచ్చివేయుఁడు. ఇంక నేమేని మీ యొద్దనున్నచో ఇచ్చివేయుఁడు ఆయన తీసికొనుఁగాక ఇవి యన్నియు స్థిరములా? ఇంక నేను పోవుచున్నాను. నాస్థానమున మేహారును విడిచిపోవుచున్నాను. మీ రీమెను నన్నుబలె ప్రేమింపుఁడు. మేహారు ఎట్టి శుభముహూర్తమున ఇచ్చుటకు వచ్చినది! ఆమె రాకున్నచో మీకు వినోదమునకై యెవరిని విడిచిపోవుదానను. మేహర్! మనయిద్దఱకు పరస్పరమైత్రి యున్నటుల మనతండ్రులకు లేదు. నీచేతనగుచో వీరిద్దఱకు స్నేహముగూర్పుము. మరవకుము.

మేహ — సోదరీ ఈర! నీ ప్రతిమాటయు జ్ఞాపకముండును.

ఈర — మంచిది. నేను పోవుచున్నాను (తల్లిదండ్రుల పాదముల స్పృశించి మేహరుతో) సోదరీ! ఇపుడు నేను వెళ్ళుచున్నాను. నామృత్యువెంతయు సుఖపూర్ణమైనది నేను నాతల్లిదండ్రుల ఒడిలో మాట్లాడుచు మాట్లాడుచు చనిపోవుచున్నాను. మంచిది నేను వెళ్లిపోవుచున్నాను.

లక్ష్మి — ఈరా! ఈరా!

ప్రతా — హా పరమేశ్వరా!

పంచమ దృశ్యము.

స్థానము — అక్బరుని ఆలోచనాగృహము. సమయము — మధ్యాహ్నము (అక్బరు చేత నొకజాబు పట్టుకొని ఉత్తేజితభావముతో గదిలోనిటునటు తిరుగుచుండును. మానసింహుఁడు ఎదుట నిలఁబడి యుండును.)

అక్బ — మహారాజా! మీరు ధన్యులు మీకు సాధ్యముగానివని యేదియు లేదు. మీకు లొంగనిశత్రువులును ఎవ్వరు లేరు. ప్రతాప

సింహునివంటి బలిష్ఠశత్రువులును మీరు కాలిబేరమునకు తేఁగలిగితిరి. నేఁడు పృథ్వీరాజు ఇఁకను ఏలరాలేదు.

[మహబత్ఖాను వచ్చి సలాముచేయును]

అక్బ—మహబత్! నాయాజ్ఞప్రకారము నేఁడు పట్టణమంతయువిజయోత్సవమును చాటఁబంచుము. ప్రతిసౌధశిఖరమందును చీనాంబర పతాకములుగట్టవలయును. రాజవీథులందుగీతవాద్యములుజరుగవలయును. విశాలమగు ఢిల్లీచౌకులో రాజపుత్రులును, మహమ్మదీయులును ఉత్సవములు చేయవలయును. దేవాలయములందును మసీదులందును దైవప్రార్థనలు గావింపవలయును. ఆగ్రాపట్టణమున దీపావళిఉత్సవము చేయవలయును బీదలకు విరివిగా అన్నవస్త్రములు పంచిపెట్టవలయును. నేఁడు రాణాప్రతాపసింహుఁడు అక్బరుని అధికారమును స్వీకరించెను. తెలిసినదా మహబత్? త్వరగా పొమ్ము.

మహ—చిత్తము. (ప్రస్థానము.)

(పృథ్వీరాజు ప్రవేశించును.)

అక్బ—రండు కవిరాజుగారూ! నేఁడు మీ కొకసంతోషవార్త చెప్పెదను. దీనిపై నొక చక్కని పద్యము వ్రాయవలయును.

పృథ్వీ—సమ్రాట్ ఏమి యావార్త?

అక్బ—రాణాప్రతాపసింహుఁడు నాయధీనతను ఒప్పుకొనెను.

పృథ్వీ—సమ్రాట్! పరిహాస మాడుచుంటిరా?

అక్బ—ఇదుగో జాబు చదువుఁడు. (జాబు ఇచ్చును.)

పృథ్వీ—(చదువుకొనును.)

అక్బ—మహారాజా! ప్రతాపసింహున కేమని జవాబు వ్రాయుదము?

మాన—ఇదియె బాదుషాగారు చాలసంతోషించిరనియు, మీరాక నిరీక్షించుచుంటిమనియు, మీకు వీరోచితమగు సన్మానముఁజరుగుననియు వ్రాయుట మంచిది. (కొంచెమూగి స్వగతము) కాని ప్రతాప్! నీ వేసన్మానమును నేఁడు చేతులార పోఁగొట్టు

కొంటివో దానిముందు నీకు ఢిల్లీలో జరుగు సన్మానము అచ్చంపు ముత్తెముముందు మాయముత్తెమువలె నుండును.

పృధ్వీ—సమ్రాట్! ఈజాబు నిజమైనది గాదు.

అక్బ—(ఉలికిపడి) నిజముగాదని మీ కెట్లు తెలియును?

పృధ్వీ—సమ్రాట్! నాకు దీనిపై బొత్తుగా నమ్మకము కలుగుటలేదు.

గీ॥ గగనము కఠోరమగుటయు ఖరకరుండు
నల్లపడుటయు ననలుండు చల్లపడుట
ధరను గనవచ్చుఁగాని ప్రతాపసింహుఁ
డొరులకు శిరమ్ము వంచుట జరుగ దెప్పుడు.

సీ॥ ఆకొన్నఁ బ్రాణమ్ము లవనయించును గాని
సింగమ్ము ఖసమును మ్రింగునొక్కొ
పీకెండుటయు నెండుఁగాక చాతకపక్షి
ధరఁబడ్డ యుదకమ్ము ద్రాగునొక్కొ
ముత్తెముల్ లేకున్నఁ బొగులునే కాని మా
నసహంస నత్తల మెసవునొక్కొ
పతిగతప్రాణయౌ సతిపూతచిత్త మ
న్యనిరూపధనముల కోరగునొక్కొ

గీ॥ ఎంతదారిద్ర్యమే నిచ్చగించుఁగాని
ఎట్టికష్టమ్ములకు నోర్చిగట్టుఁగాని
ధరణి తలక్రిందులైనఁ బ్రతాపసింగు
మొగలులకు శిరముఁ వంచఁబోవఁ డెపుడు॥

కాన ఇది ప్రతాపసింహుని చేతివ్రాత గాదు.

అక్బ—కాదుకాదు ఇది తప్పక ప్రతాపుని చేతివ్రాతయే. పృధ్వీరాజా! రేపు ఉదయము మొదలుకొని రాత్రివఱకు ఆగ్రాలో విజయోత్సవము చేయవలసినదని నేను ఆజ్ఞాపించితిని. ఇంక నేను పోవుచున్నాను. మహారాజా! ఉత్సవములో నేమియు లోపము లేకుండఁ జూడుఁడు. (త్వరగా పోవును.)

మాన—పృధ్వీరాజా! మీ రేమందురు?

పృధ్వీ—మహారాజా! ఏమందును.

చ॥ అవిరలవిక్రమక్రమపరాస్తసమస్తసపత్నవీరులై
భువి నతినీతినేలు రసపుత్రులజాతి నిరస్తవీర్యమై
యవనులదాస్యపాశమున నాదటఁ జిక్కి కృశింపుచుండ శా
త్రవదళభీకరుండగు ప్రతాపుఁడొకండె కడంక స్వాత్రగౌ
రవమును బ్రోచు చిందనుక రాజితకీర్తి వహించె నెంతయున్॥

మన మెల్లరము నతని నే నమ్ముకొనియుంటిమి. ఆతనిమూలము
న నే రాజపుత్రకులోద్ధరణము, మాతృదేశస్వాతంత్ర్యము జరుగఁగల
దని తలంచుచుంటిమి. తుదకు మన యీయంతిమాశాదీపముగూడ
చల్లారినది.

గీ॥ తరుణసింహప్రతాపప్రతాపసింగు
ప్రక్కబల్లెంపుపోటుచే పడిలియుంట
వ్యాజవిజృంభము బాదుషా యణఁగియుండెఁ
గాక యితనికిఁ బట్టఁ బగ్గములుగలవె?

ఇంక అక్బరు నిర్భయుఁడు. ఆతనినిరంకుశస్వేచ్ఛాచారము నెవ్వ
రడ్డగలరు?

మాన—మీహృదయమందలిభావము తెలసినది. అక్బరుపై మీరింత
క్రుద్ధులగుటకుఁ గారణము నెఱుఁగుదును. మీరు మేవాడకుఁ
బోయి ప్రతాపసింహుని మరల యుద్ధమున కుత్సాహితునిఁ
జేయఁగోరినచో చేయవచ్చును. నేనేమియు నాతంకము సేయను.

పృధ్వీ—మీరు మహోదారులు. మీ మహత్త్వము ప్రశంసనీయము.
(ప్రస్థానము.)

మాన—ప్రతాప్! ప్రతాప్! తుద కేమి యిట్లు చేసితివి? నేడుఁ
మేవాడుసూర్యుఁ డస్తమించెను. నేఁడు పర్వతశిఖరము విరిగి
పడినది. (మెల్లగా నిష్క్రమించును.)

ష ష్ఠ దృ శ్య ము.

స్థానము—పృథ్వీరాజగృహము. సమయము—ప్రాతఃకాలము.

[బికనేరు, మార్వాడు, గ్వాలియరు, చందేరీరాజులును, పృథ్వీరాజును కూర్చుండియుందురు.]

మార్వా—నౌరోజు ఉత్సవము పూర్తిఅయినది.

గ్వాలి—ఆఁ దానితోపాటు రాజపుత్రమహిళాసాంవత్సరిక పరిభవోత్సవమును పూర్తి అయినది.

చందే—(బికనేరుతో) ఊరకుంటిరేమి? మీరును ఏమేని సెలవిండు. ఏమి ఆలోచించుచున్నారు?

బిక—నేనేమి చెప్పుదును?

చందే—వీరరంగు కొంచెము మారినట్లున్నది. తప్పక యేదోజరిగినది.

గ్వాలి—ఈమాఱు నౌరోజుఉత్సవములో నొకక్రొత్తవిషయము జరిగినదని జనులనుకొనుచున్నారు. ఇది నిజమేనా?

బిక:—లేదు. వట్టియసత్యము.

గ్వాలి:—అసత్యమా—నౌరోజు ఉత్సవమునుండి తిరిగి వచ్చునపుడు బికనేరు రాణిగారి అలంకారధ్వనులు మేము మామేడలోనుండి వినలేదా? వహ్వా! ఎంత శ్రావ్యమైనధ్వని. —టింగుటంగు టింగుటంగు స్వదేశభూషణముల కట్టిధ్వనియుండదు. అవి ఊరక ఘణఘణఘణఘణమని మ్రోగును. ఈటింగుటంగు తప్పక మొగలులవనివాటుతనమే.

మార్వా.—అయితే. ఇంతకు ఈమాఱు రాణిగారి కేమేమి సత్కారములు జరిగినవి.

బిక:—మంచిసత్కారముతే జరిగినవి,

గ్వాలి:—కొంచెము చెప్పుదురు. మేముగూడ వినెదము.

చందే:—అవును. అవును. స్పష్టముగా చెప్పుడు.

బిక:—మీరెల్లరు మీమీ యిండ్లకుఁబోయి రాణుల కెట్టిసత్కారము జరుగునో అడుగుఁడు. తమతమ పిల్లలనెత్తిపై చేయివేసి ధర్మసాక్షిగా ఎట్టి సత్కారము జరిగినదో నిజము చెప్పుమని యడు

గూడు. గుసగింజ తనవలెం బెలుఁగ దనినట్లు మాట్లాడిన నేమి ప్రయోజనము?

(రక్తనేత్రయు, శిథిల కేశ పాశయు, విచలిత వసనయునయి జోషిబాయి ప్రవేశించును. ఆమె భీకరవేషమును జూచి అందఱు నిలబడుదురు.

జోషి:— (రెండుచేతులు పైకెత్తి) ఓ రాజపుత్ర రాజులారా! నేను పృథ్వీరాజు ధర్మపత్నిని. నాపేరు జోషిబాయి. నేఁడు లజ్జను విడనాడి నాకళంక కథను మీ యెదుట చెప్పికొనుటకై వచ్చితిని. ఆవిషయమును నేను హృదయమున దాఁచియుండఁ జాలను. నా శరీరమంతయు మండిపోవుచున్నది. వినుఁడు—నేను ను నౌరోజు ఉత్సవమునకుఁ బోతిని. మరల నెటులనో తిరిగివచ్చితిని, మానప్రతిష్ఠలతోఁ బోతిని వానిని పోఁగొట్టుకొని వచ్చితిని. ఇట్లు నేనొక్కతెనే కాదు. ఈవార్షికలాంటోత్సవమునకు బోయిన రాజపుత్రస్త్రీలలో దాదాపు సగముమంది మానప్రతిష్ఠల బోగొట్టికొనియు సగముమంది భ్రష్టలయియు తిరిగివచ్చిరి. నేఁడు తప్పని పనిచే ఈయసహ్యాలజ్జా విషయములు మీకు చెప్పవలసి వచ్చినది. నిద్ర అతిగాఢదశను బొందినపుడు ఇట్టి చెప్పు దెబ్బలచేతనే అది తొలఁగిపోవును తక్కినవిషయములేవి యెట్లున్నను హిందువులు తమస్త్రీల సతీత్వరక్షణమునకై ప్రాణములర్పించెదరనివినెడిదానను. ఇప్పుడాశక్తికూడ వారియందు లేదు. నేడు రాజపుత్రస్థానములో హిందూసతీ రక్షణకై సాయపడు వాఁడొక్కడును లేడా?

జోధ:— లేకేమి? రాణాప్రతాపసింహుఁడున్నాఁడు.

జోషి:— లేఁడు. ఇప్పుడు ఆయనయు లేడు. దేశవ్యాప్తమగు నీచత్వ మధ్యమున ఇన్ని దినముల వరకు ఆయన యొక్కఁడే తలయెత్తుకొని నిలబడియుండెను. ఈ ఘోరవాతావరణమున ఆయనహృదయ మొక్కటియే అజేయమై యున్నతమై కనుపట్టుచుండెడిది. రాజప్రసాద భోగులగు నీరాజపుత్ర కులాంగారుల మధ్య ఆయన యొక్కఁడే గరిమామయమగు దారిద్ర్యవ్రతము నవలంబించి

యున్నాఁడు. కాని ఇప్పుడాయనకూడ అక్బరునకు తలవంచెనని వింటిని. ఇంతదనుక దేశమందలి సాధ్వీమణులెల్లరు ఆయన నామమును జపించుచుండెడివారు. కాని ఇప్పుడా ప్రతాపసింహుఁడు లేడు.

చ॥ ధనమును వైభవంబులఁ బదంబులఁ గోరుచు మాతృదేశముం
దనయులు మ్లేచ్ఛజాతులకుఁ దార్చిననాఁడె యెఱుంగనాయె వీ
తనయులు వీర లింతులను దల్లులఁ బిల్లలఁ దార్తురింకనం
చనుభవమయ్యె నేఁటికది యక్షరమక్షరమున్ యథార్థమై.
గీ॥ రాజపుత్రాంగనలు మాన రహితలగుచు
నిర్మలం బడునప్పుడు నిలను బతుకు
సతులధర్మంబు రక్షింపఁ జాలనపుడు
తుది యుపాయంబు ప్రాణముల్ తొలఁగుటొకటె.

(కత్తి దూసి) దీనిచే హిందువులు కన్నులు తెరతురేమో చూచెదను. నిద్రితమగువారిమానవత్వముబహుశః మేల్కొనవచ్చును (జోషికత్తితో రొమ్మునఁ బొడుచుకొని క్రింద బడిపోవును. అందఱు ఆశ్చర్యముతోఁ జూచుచుందురు.)

పృథ్వీ—జోషి! జోషి! ఏమి యిట్లు చేసితివి? (దగ్గరకు వెళ్ళును.)

జోషి—చాలు ఇంక పోఁడు స్వామీ! నన్నవమానించినవాని పాదములు చుంబనము సేయుఁడు. వానిగుణములుగానము సేయుడు. నీకును ధర్మమునకును భేదము పొడగట్టునపుడు నేను నిన్ను విడిచి ధర్మమునే స్వీకరించెదను. పతి తనపడఁతియొక్క ధర్మమును రక్షింపఁ జాలనపుడు పడతియే తనధర్మమును రక్షించుకొనును.

సప్తమ దృశ్యము

స్థానము—పర్వతగుహ. సమయము—రాత్రి

(ప్రతాపుఁడు, లక్ష్మి.)

ప్రతా—లక్ష్మి! మేహరున్నిసా యెక్కడున్నది?

లక్ష్మి—వంటచేయుచున్నది.

ప్రతా—నేను మేహరును నాబిడ్డనుబలె ప్రేమించెదను. నాకోడలు కూడ ఇట్టిగుణవతి లభించుగాకయని నేనీశ్వరుని ప్రార్థించుచుందును.

లక్ష్మి—(మెదలక యుండును.)

ప్రతా—లక్ష్మి! మరల నీవు దుఃఖించుచుంటివా? మన ఊర పుణ్యలోకమునకు బోయినది దానికై దుఃఖమెందుకు?

లక్ష్మి—నాథా!—(ఏడ్చును)

ప్రతా—నీవుకొంచెమాలోచించుము మనము మాత్ర మింకెన్నిరోజులుందుము? ఏద్వారకము. కొలదికాలములో మనమును దాని వద్దకు బోయెదము.

లక్ష్మి—నాథా! నన్ను క్షమింపుఁడు. ఇంక నే నేడ్వను. మీరు నాకు గురువులు. నేను మీకు శిష్యురాలను. ప్రాణేశ్వరా! నేను మీకు తగినశిష్యురాలను కాఁగోరుచున్నాను. (ప్రస్థానము.)

(గోవిందసింహుని ప్రవేశము)

గోవిం—రాణాజీ! మీరు అక్బరుని అధీనత నొప్పుకొనిరని నేఁడు ఆగ్రా పట్టణమున గొప్పఉత్సవము చేయఁబడుచున్నది. మేడలపై జెండాలు గట్టినారు, రాజవీధులందు దీపోత్సవము జరుగుచున్నది. యింటింటను నృత్యగీతములు జరుగుచున్నవి ఇది మీ కెంతయు గౌరవవిషయము.

ప్రతా—(శుష్కహాస్యముతో) అవును. గౌరవవిషయము.

గోవిం—అక్బరు తనదర్బారులో కుడిప్రక్క ప్రప్రథమమున మీకు ఆసనము వేయించినాఁడు.

ప్రతా—ఇది ఆయన అపారదయ.

శక్త—(ప్రవేశించి) అన్నయ్య యెక్కడ?

ప్రతా—ఎవరు? శక్తా!

శక్త—అవును అన్నా! నేనే. మొగలులయుద్ధములో నీకు సాయము చేయుటకై వచ్చితిని.

ప్రతా—వద్దు తమ్ముఁడా! ఇప్పుడు సహాయ మక్కఱలేదు. నేను మొగలులకు లొంగి సంధిచేసికొన నిశ్చయించితిని.

శక్త—ఆఁ యేమి! నీవు అక్బరునకు లొంగితివా?

ప్రతా—అవును తమ్ముఁడా! ఇప్పుడు అక్బరుతో నాకేమియు వైరము లేదు. మేవాడు పోనిమ్ము, చిత్తూరుపోనిమ్ము, కోమలమీరు పోనిమ్ము.

శక్త—ప్రపంచము నవ్వును.

ప్రతా—నవ్వనిమ్ము,

శక్త—మానసింహుఁడు నవ్వును,

ప్రతా—నవ్వనిమ్ము. ఏమిచేయుదును.

శక్త—అన్నా! నీవిట్టిమాటయందువని నేను స్వప్నమందును అనుకొనలేదు.

ప్రతా—తమ్ముఁడా! నేనేమి చేయుదును. ఎన్నాళ్ళు దినములుగాని ఎప్పుడు నొకరీతినుండవు.

శక్త—నేను చెప్పునదియు నిదియే. ఇంతదనుక మేవాడుకు కష్టపు దినములు. ఇంక మంచిరోజులు రాగలవు. ఈవిషయము నీకు తెలుపుటకే నేను వచ్చితిని.

(ప్రతా— [illegible])

శక్త—అన్నా! నీవెఱుఁగుదువా? నే నిచ్చటకు వచ్చుటకు ముందు ఫినసహారా దుర్గమును జయించితిని

ప్రతా—నీవా!—నీకు సేన యెక్కడిది?

శక్త—నేను దారిలోనే చాలమంది సైనికులఁ బోగుచేసితి. నేను వెళ్ళినచోటనెల్ల "నేను ప్రతాపసింహుని తమ్ముఁడను. శక్తసింహుఁడను. ప్రతాపసింహునికి సహాయము చేయఁబోవుచున్నాను. నాతో రాఁదలచిన వారెల్లఱు రండు" అని అఱచుచు వెళ్లితిని. ఈనా పిలుపు వినగనే గృహస్థులు తమభార్యలను విడిచియు తండ్రులు తమపిల్లలను విడిచియు లోభులు తమ ధనమును విడిచియు నాకు సహాయమునకు వచ్చిరి. దారినిబోవు కూలివాండ్రు నెత్తి

పైని మోపులు పాఱవేసి యస్త్రములు ధరించిరి. గూనువాండ్రు ఱొమ్ములు తిన్నగా సాచి నిలఁబడిరి. ఇంకనాకు సైనికుల కేమి తక్కువ? నీపేరులో ఇంద్రజాల మున్నది. దానిని నీవెఱుఁగవు, నేనెఱుఁగుదును.

[భామాషాతో పృథ్వీరాజు ప్రవేశించును.]

పృథ్వీ—రాణాగారెక్కడ?

ప్రతా—ఎవరు? పృథ్వీరాజా! ఇచ్చట కేల వచ్చితివి?

పృథ్వీ—రాణాజీ! మీరు అక్బరుని అధీనత నొప్పుకొంటిరా?

ప్రతా—అవును పృథ్వీరాజా!

పృథ్వీ—హా! అభాగ్యభారతవర్షమా! తుదకు నిన్ను రాణాకూడ విడచి పెట్టెనా? రాణాజీ! మేము భ్రష్టులము బానిసలము కానే అయితిమి, మీరొక్కరేని మాజాతి గౌరవము కాపాడుచుంటి రని సంతోషించుచుండెడి వారము, రాజపుత్రరాజమండలములో అక్బరునకు తలవంచక ప్రతిష్ఠతో మీరొకరుండిరని చెప్పికొనియేని మేము గర్వపడుచుండెడి వారము. అకటా! నేఁడు మా ఆయాదర్శముకూడ నష్టమాయెను.

ఉ॥ సంతతదాస్యవేదనకుఁ జాలగ నేడ్చెడు భారతాంబ య
త్యంతమనంత బాష్పజలధారకు మీఁదుక తానఁ గొంత వి
శ్రాంతి లభించె నిందనుక క్షత్రియవంశ వతంస! యింక న
శ్రాంతతదశ్రుపూరమున సర్వము కొట్టుకపోవు నీయెడన్

ప్రతా—పృథ్వీరాజా! నీకు లజ్జ యగుటలేదా? నీవును నీయన్నయగు రాయసింహుఁడును గ్వాలియర్ మార్వాడమున్నగు రాజులెల్లరును నీచభోగవిలాసములఁ జిక్కుకొని అక్బరునివద్ద ముఖస్తుతులు చేయుచు పైఁగా రాజపుత్రస్థానమంతకు నే నొక్కఁడనే రెండుపూటలు ఇన్నిగంజినీళ్లేని త్రాగుటమాని మీయెల్లర యభిమానమునకును ఆదర్శము కావలయునని కోరుచుంటిరా? ఎంతటి స్వార్థపరులు!

పృథ్వీ—రాణాజీ! అధమమగు భల్లూకమును ఆటగాండ్రు ఇచ్చవచ్చి నటుల ఆడించెదరు, కాని సింహము ఘోరారణ్యముల నతిగౌరవముతో తిరుగుచుండును. దీపము లెన్నియో యుండును. గాని సూర్యుఁడొక్కఁడే. సస్యశ్యామలయగు, భూమిని ఎల్లఱు దున్నెదరు, కాలితో త్రొక్కెదరు. కాని మహోన్నతమగు పర్వతరాజము దరిద్రమయ్యును అభిమానముతో తలయెత్తుకొని నిలబడును. ప్రపంచములో క్షుద్రమానవులు తుచ్ఛవిలాసములకును దుచ్ఛసుఖములకును ఆరటపడుచుందురు. కాని అప్పుడప్పుడు అనశనవ్రతులు నిస్వార్థులునగు సిద్ధులు, సన్న్యాసులు వచ్చి నూతనతత్త్వములను నూతన ధర్మములను ఉపదేశింపు చుందురు. అత్యాచారుల కఱకు కటారులు వారి సత్యజ్యోతి నింకను విస్తరింపజేయును. కారాగృహము లందలి కటిక చీఁకటులు వారి మహిమను మఱియు ప్రకాశింపఁ జేయును. జ్వలదనల జ్వాలలు వారికీర్తిని మఱియు ప్రసరింపఁజేయును, మీరు ఆసిద్ధ సన్న్యాసులలోఁ జేరిన మహాపురుషులు. మీరు ఒకరి యధీనతను పాటింప వచ్చునా?

సీ॥ అనమతేజోరాశియైన భాస్కరునకు
గ్రహరాజ్యపట్టంబు గట్టెనెవఁడు
భూరివిక్రమకళా స్ఫారసింహమునకు
మృగరాజబిరుదంబు నిచ్చె నెవఁడు
గగన నిరంకుశగతిగల్గు గరుడున
కురుపక్షిరాజాఖ్య నొసఁగె నెవఁడు
జలచరరాజ్యమ్ము శాసింపుమని తిమిం
గలమును బీఠ మెక్కించె నెవఁడు
గీ॥ సహజవిక్రమ ప్రక్రమస్ఫారవీర
వరులు పరులయాతంకమ్ము దరియనీరు
దేశమునకయి సర్వసన్న్యాసివయిన
నీవు తుద కొక్కనికి లొంగ నీతి యగునె?

ప్రతా—రాజపుత్రులెల్లరు నేకమయి మొగలుల హస్తమునుండి భారతవర్షమును లాగుకొనుటకు దృఢనిశ్చయులగుచో మొగలుల సింహాసన మింక నెన్నిరోజులు నిలువఁగలదు? నీవెఱుఁగుదువుగదా ఇరువది సంవత్సరములనుండి నేనొక్కఁడనే విడువక యుద్ధము చేయుచున్నాను. ఇంతవఱకు రాజపుత్రరాజొక్కఁడును తనదేశమును, తనధర్మమును ఉద్ధరించుటకు నాకు సాయపడలేదు నేఁడు నాసర్వస్వమును బోఁగొట్టుకొని ఘోరమగు సాంసారికదుఃఖములోఁ బడియున్నాను. పృథ్వీరాజా! నాకూతురు ఈరచనిపోయినది. ఈయుగ్రారణ్యమున తినుటకు తిండియు కప్పుకొనుటకు వస్త్రమును లేక అది యుసురుల విడిచినది. ఇప్పుడు నేనా ప్రతాపుఁడను గాను. ఆతని యస్థిపంజర మొక్కటియే మిగిలియున్నది.

పృథ్వీ, శక్త—(ఉలికిపడి) ఆఁ! ఈర చనిపోయినదా?

ప్రతా—అవును. ఈదారిద్ర్యకఠోర తుషారపాతముచే నాస్వర్గీయ కుసుమము రాలిపోయినది.

పృథ్వీ—హాపరమేశ్వరా! అట్టిసత్కర్మముల కిట్టి పరిణామమా! రాణాజీ! నేనును మీకు సమానునిగనే యున్నాను. మీరు మహానుభావులు, నేను నీచుఁడను. కాని నేనును మీవలెనే దుఃఖితుఁడనే, జోషియు ఇపుడు ఈలోకములో లేదు.

ప్రతా—ఆఁ! జోషిబాయి చనిపోయినదా?

పృథ్వీ—లేదు. ఆమె చావలేదు. నరాధముడనగు నన్ను విడిచి దేవలోకమునకుఁ బోయినది.

ప్రతా—ఆమె మృత్యువునకుఁ గారణము?

పృథ్వీ—నాకళంకిత సమాచారమును నే నేమి చెప్పుదును? నౌరోజు ఉత్సవమునకు రమ్మని నవోఢయగు నాభార్యకుకూడ ఆహ్వానము వచ్చినది. ఆమెకిష్టము లేకున్నను బలవంతముగ ఆమెను పంపితి. పైశాచిక కామనావశుఁడై అక్బరు ఆమెను స్పృశించెను. వెంటనే కటారిని దూసి ఆమె తనసతీత్వమును గాపాడు

కొనెను. పదపడి ఇంటికి వచ్చి సర్వరాజసమక్షమున ఆకత్తి తోనే పొడుచుకొని చనిపోయినది.

ప్రతా—ఏమి! అక్బరు హిందూరాజపరాభవ మాత్రమునకు సంతుష్టి జెందక ఇప్పుడు హిందూస్త్రీలపైకిఁగూడ దాడివెడలెనా? అక్బర్! నీవు నిజముఁగ భారతవర్షమును జయించిన వీరుఁడవు.

శక్త—నేను దీనికి బదులు తీర్చుకొందును.

పృథ్వీ—రాణాజీ! దీనికి ప్రతిక్రియ సేయుటకు మీసహాయమును గోరియే నేను ఆగ్రానుండి ఇంతదూరము వచ్చితిని. ఇప్పుడు మీరే నన్ను రక్షింపఁగలరు.

గోవిం—రాణాజీ! ఈపలుకులు వినికూడ మీరింకను తలవంచుకొని కూర్చుంటిరేమి?

ప్రతా—నే నేమి చేయుదును? నావద్ద నేమియు లేదు. ఒంటరిగా నే నేమి చేయఁగలను? పట్టుమని పదిమంది సైనికులునునావద్ద లేరు.

శక్త—నేను క్రొత్తసేనను పోగుచేసెదను.

ప్రతా—నావద్ద ధనమున్నచో నేను క్రొత్తసేనను పోగుచేయఁగలను. ఏమిచేయుదును? రాజకోశము శూన్యముగ నున్నది.

భామాషా—రాణాజీ! చాల ధన మున్నది.

ప్రతా—మంత్రీ! ధన మెక్కడిది? నే నెఱిగున్నంతవఱకు కోశములో గుడ్డిగవ్వకూడ లేదు.

భామా—రాజకోశములో గ్రుడ్డిగవ్వయు లేకున్నను ధనమునకు కొఱత లేదు.

ప్రతా—వృద్ధమంత్రీ! నీకు పిచ్చియా లేక మతిభ్రమయా? ఇప్పుడు ధన మెక్కడనుండి వచ్చును?

భామా—రాణాజీ! చితోరురాజ్య మున్నతశిఖరమున నున్నపుడు మా పెద్దలు చితొరు రాజవంశమునుండి చాల ధనమును సంపాదించిరి. ఆధన మిప్పటికిని సేవకునివద్ద నున్నది. సెలవగుచో పాదములకడఁ జేర్చెదను.

ప్రతా—నీవద్ద నెంత ధన మున్నది?

భామా—మహారాజా! ఆశ్చర్యపడకుండు, ఆధనముతో ఇరువదివేల సైనికులకు పదునాల్గుసంవత్సరములవఱకు వేతనమిచ్చి పోషింప వచ్చును.

(అందఱు విస్మయముతో నొకరివంక నొకరు చూచుకొందురు.)

ప్రతా—మంత్రీ! నీస్వామిభక్తిని నేను హృదయపూర్వకముగఁ బ్రశం సించుచున్నాను. అయితే భృత్యులకొసఁగిన ధనమును తిరిగి తీసికొనుట మేవాడురాణా కుచితముగాదు. నీవనుభవించుటకే నీకు ధన మొసంగఁబడినది. గాన దానిని నీవేయనుభవింపుము

భామాషా—రాణాజీ! ఇట్టి సంకట సమయములందు సేవకునివద్ద నుం డియు ధనముతీసికొనుట యనుచితము గాదు. నేఁడు మేవా డుకు చాలసంకటదినము. హిందూస్త్రీలదురవస్థ నొకమాఱు స్మరింపుఁడు. హిందువుల యధోగతియుఁ దిలకింపుఁడు వారి దేశముపోయినది. ధర్మముపోయినది. ధనముపోయినది. ఇంత దనుక మిగిలియున్న స్త్రీలసతీత్వముగూడ పోవుచున్నది. రాణాజీ మీరు దానిని రక్షింపుడు. నేను నాపూర్వపురుషులయు నా దియు ఆజన్మార్జితమగు ధనరాశిని మీచేతికిచ్చుచున్నాను. అది మీకొరకుగాదు.—హిందూధర్మమును, హిందూస్త్రీల సతీత్వ మును రక్షించుటకు నిచ్చుచున్నాను. (మోకరిలబడును.)

శక్త—(మోకరిలబడి) అన్నా! దేశనిమిత్తమై మీరీధనమును, దప్పక గ్రహింపుఁడు.

ప్రతా—మంచిది. అట్లే కానిండు. నే నీధనమును దీసికొందును. రాజ పుత్రసైనికుఁ డొక్కడేని ప్రాణావశిష్టుఁడై యుండునంతవఱకు హిందూస్త్రీలసతీత్వమును సురక్షితముగ నుండును. అక్బర్ నీవు పాముకలుగులోఁ జేయిపెట్టితివి. (ప్రస్థానము)

పృథ్వీ—ఇంక నేమియు భయములేదు. నిదురించిన సింగము మేల్కా నినది. మంత్రీ!

గీ॥ అసురసంహారమునకు వజ్రాయుధంబు
నొనరుపంగ దధీచి శక్రునకు మున్ను

తనదు నఖ్ముల నొసఁగెనంచును బురాణ
ములను జదివినదిపు డనుభూతమయ్యె॥

అది సత్యయుగపుది. కలియుగమునఁగూడ నిట్టిది జరుగునని యనుకొనలేదు.

భామా—కవిరాజా ! హిందూరమణుల సతీత్వమునకు సంకటము వాటిల్లినపుడు తద్రక్షణార్థమై యేహిందువు తనసర్వస్వము నర్పింపఁడు ?

శక్త—మంచిది. నేను పోయి సేనను సిద్ధపఱచెదను. ఒక నెలలో యిరువదివేలసైనికులఁ బోగుచేసెదను (వెళ్ళిపోవును.)

పృథ్వీ—(శక్తసింహుని ఆపి) ఆగుము. నేనును వచ్చెదను. ఒకనాఁడు జోషి దేశీయులను మోహనిద్రనుండి మేలుకొలుపు నొకగీతమును రచింపుమనినది. నేఁ డట్టిదానిని వ్రాసి రాజపుత్రస్థానమందలి రాళ్లను రప్పలను గూడ మేఁలుకొలిపెదను జయ కాళీ మాతా.

అందఱు—జయకాళీ మాతా.

(అందఱునిష్క్రమించెదరు.)

అష్టమదృశ్యము.

స్థానము—పర్వతమార్గము. సమయము—ప్రభాతము.

[పృథ్వీరాజును గాయకులును పాడుచుందురు. కొంచెము దూరమున గ్రామవాసులు నిలఁబడియుందురు.]

గీతము.

సమరానలమున నురికెదము - శత్రుగణమ్ముల నరకెదము
అమితశక్తి చూపించెదము - యశము భృశమ్ముగ గడించెదము
ఆశ్రితజనకల్పకవల్లి - యఖిలగుణాలయ మాతల్లి
ప్రశ్రయమునఁ బూజించెదము - ప్రాణములిడి రక్షించెదము

జనని పరాధీనతఁ గుందన్ - సౌఖ్యములేలాకొ పొందఁగ
అనశనవ్రత మొనరించెదము - జననిశ్శృంఖలన్ ద్రుంచెదము
మాన్యచరిత కరుణోపేత - మా యీభారతమాత
అన్యులు దీఁగని శాసింప - నర్వాలె నయముదలంప
కఱకుకత్తులు తుపాకిగుండులుఁ - మఱఫిరంగులున్ మఱి భుసుండులున్
సరకుగొనము స్వాతంత్ర్యప్రాప్తికై - సర్వస్వమునర్పించెదము.

రాణాప్రతాపసింహ.

పంచమాంకము.

ప్రథమదృశ్యము,

స్థానము—మానసింహుని ప్రాసాదము. సమయము—సాయంకాలము

[మానసింహుఁడు మహాబత్ఖాను.]

మాన—అయితే శక్తసింహుఁడు మన ప్రధానవర్తకస్థానమగు మాల్పూరును దోచుకొనెనా?

మహా—అవును మహారాజా!

మాన—ఇంతిసాహసమా?

మహా—అటు ప్రతాపసింహుఁడును కోమలమీరును వశపఱచుకొని అక్కడ దుర్గము కట్టించుచున్నాఁడు.

మాన—మంచిది. నీవు పదివేల మొగల సైనికులను దీసికొనిపోయి ఫినసహారా దుర్గమును బట్టుకొనుము. అవసరమగుచో వెనుక నుండి నే నింకను సేనను బంపెదను.

మహా—చిత్తము [ప్రస్థానము]

మాన—ఈదేవారుయుద్ధ మెంత యద్భుతమైనది! అందు ప్రతాపుఁడు చూపిన సాహసము, చాతుర్యము వర్ణనాతీతము. అతఁడు మొగల సేనాపతియగు శాహబాజు సైన్యమును తుపానువలె వచ్చి కొట్టుకొనిపోయెను. ప్రతాపసింహా! ధన్యుఁడవు, నేఁడీ దేశములో నిన్నుబోలినవీరుఁడు లేడు, ఏవిధమున నేని నీతోవియ్యముచేయఁ గల్గినచో నాకెంత గౌరవము, ఎంత సన్మానముండెడిది! కాని మాభాగ్య చక్రము తిరిగిపోవుచున్నది. నీశిరము కోసినను అవనతము కాఁజాలదు. మొగలులతో సంబంధము చేయుటకు నేనెంత వెనుకకు పాఱిపోవు చున్నానో అది

అంత ముందుకు తోసికొని వచ్చుచున్నది. మహమ్మదీయమతా చారముపై దినదిన ప్రవర్ధమానమగు నా ద్వేషభావమును చతురుఁడగు అక్బరును ఇప్పుడు కనిపెట్టినాడు. గనుకనే యతఁడు సలీముతో రేవకు వివాహము గావింపఁజేసి నన్నొక నవీనజాలమున చిక్కింపఁ గోరుచున్నాఁడు. ఈ వివాహము మూలమున సలీమునకును నాకునుగల మనస్పర్ధను దొలఁగించుటయు నొక యుద్దేశము. ఔరా! అక్బరునికూట నీతి అత్యద్భుతము!

[రేవ ప్రవేశించును]

మాన—ఎవరు? రేవా?

రేవ—అవును, అన్నా!

మాన—ఏమి రేవా?

రేవ—నాకు పెండ్లియా?

మాన—అవును, రేవా?

రేవ—నీవిందు కంగీకరించితివా?

మాన—నే నంగీకరించిన నేమి మానిన నేమి? అంతయు అక్బరుని ఇచ్ఛా ప్రకారము జరుగును. ఆయన ఇచ్ఛయే నా కనుల్లంఘనీయమగు ఆజ్ఞ.

రేవ—అనఁగా ఈ వివాహము నీకిష్టము గాదు, అదియేకాదు?

మాన—అవును సోదరీ!

రేవ—అయితే ఈవివాహము ఇంకఁ గాఁజాలదు.

మాన—ఆఁ! అదియెట్లు? ఇది బాదుషాకోరికపై ఆధారపడి యున్నది.

రేవ—బాదుషాకోరిక విశ్వమంతకు అనుల్లంఘనీయమైనఁ గావచ్చును కాని రేవ ఆవిశ్వములోనిది గాదు, ఇంక ఈవివాహము కాఁజాలదు.

మాన—ఏమిమాటలవి రేవా? నేను మాట యిచ్చితిని.

రేవ—ఏమి అన్నా! నన్నడుగకయే మాట యిచ్చితివా? స్త్రీలను వారి యనుమతి దీసికొనకయే యిచ్చవచ్చినవారి కంటఁగట్టుటకు వారంతటి తుచ్ఛురాండ్రా?

మాన—అయితే నీ భవిష్యజీవితము సుఖపూర్వముగఁ గడచునను తలంపుతో నేను మాట యిచ్చితిని.

రేవ—అయితే బాదుషాకు వెలచికాదుగదా?

మాన—లేదు.

రేవ—అయితే ఈవివాహము నీ కిష్టమన్న మాటయే

మాన—అవును.

రేవ—అయితే దీనికి నాయభ్యంతర మేమియు లేదు.

మాన—రేవా! నీ కీవివాహ మిష్టము గాదా?

రేవ—అన్నా! నీ విష్టపడుచో నింక నే నిష్టపడుటయు మానుటయు అవసరము లేదు. నీకిష్టమయినది నాకును గావలయును. ఇదియే నా కర్తవ్యము.

మాన—రేవా! నీవీ వివాహముచే సుఖపడెదవు.

రేవ—సుఖపడిన మంచిదియే. కాని నా కాయాశ లేదు. (మెల్లగా వెళ్లిపోవును.)

మాన—నేను నాయీసోదరివంటి ఉదాసీనయు, అనాసక్తయు. కర్తవ్యపరాయణయునగు బాలికను మఱియెచ్చటను జూడలేదు. అప్పుడే వెళ్లి నిశ్చింతముగ సంగీతము పాడుచున్నది. దీనికంఠస్వరము చాల కోమలమైనది. దర్బారునకుఁ బోవు సమయమయినది. ఇంక నేను పోవుదును. (ప్రస్థానము)

ద్వితీయదృశ్యము.

స్థానము—ఫినసహారాదుర్గములోపలిభాగము. సమయము-ప్రభాతము.

(శస్త్రధారియై శక్తసింహుఁడు ఒంటరిగా తిరుగుచుండును.)

శక్త—ఏమి హత్య! ఏమిహత్య! ఏమిహత్య! ఈప్రపంచ మొక్క పెద్ద కసాయిఖానా. ఒకచెంప భూకంపము, వరదలు, రోగములు, వార్ధక్యము మున్నగువానిచే నిత్యము ప్రపంచములో అసంఖ్యములగు హత్యలు జరుగుచుండ మేమింకను తృప్తిచెందక కామక్రోధలోభాదులకు వశులమై యుద్ధమను పేరుతో ప్రపంచమును

ముంచివేయు భీకరరక్త ప్రవాహములను బాతించుచున్నాము. మేము హత్యలు చేసినచో ఘోరపాపమఁట! ఇంక ఈశ్వరుఁడు నిత్యము నొనరించు ఈయసంఖ్య హత్య లేమియుఁగావఁట! మానవుఁ డెవ్వఁడేని ఒకనిని చంపినచో అది హత్యయందురు. యుద్ధములోఁజేయు హత్యలను వీరత్వమందురు. ఔరా! ఈమానవుఁడెంత చక్కని ధర్మనీతిని సిద్ధపఱచినాఁడు. (అనతి దూరమున ఫిరంగులమ్రోఁత విని) అదుగో మరల హత్యాకాండము ప్రారంభమయినది. ఇది మృత్యుదేవత హుంకారము!—అదుగో మరల వినఁబడుచున్నది.

(భయముచే వణఁకుచు దుర్గాధ్యక్షుఁడు ప్రవేశించును.)

శక్త—చెప్పుము. ఏమి సమాచారము?

దుర్గా—మహారాజా! కోటతూర్పుగోడ పడిపోయినది. ఇంక రక్షణమున కేమియు నుపాయము లేదు.

శక్త—కోటను ముట్టడించుట విషయమై రాణాగారికి పంపినవార్త కేమియు జవాబు రాలేదా?

దుర్గా—లేదు.

శక్త—మంచిది. సైన్యమును సిద్ధపఱుపుము. ఇప్పుడు జేహారువ్రతమున కుద్యాపనము చేయవలయును. (దుర్గాధ్యక్షుఁడు పోవును.) మహాబత్ఖాను యుద్ధవిద్యలోఁ గడు నేర్పరి. కోటగోడలన్నిటిలో తూర్పుగోడయే గట్టితనములేనిది. అందుకనియే యతఁడు తొలుదొల్త దానిని పడఁగొట్టించెను. మంచిది ఏమియు భయములేదు. నేను మృత్యుముఖమునఁ బడుట కెప్పుడును సిద్ధముగనే యుంటిని. కాని సలీమ్! నీఋణము తీర్చుకొనలేక పోతిని.

[వెంట్రుకలు విరియఁబోసికొని దౌలతు ప్రవేశించును.]

శక్త—ఎవ్వరు? దౌలతున్నిసా! నీ విచ్చట కేల వచ్చితివి?

దౌల—నాథా! మీ రింత వెందలకడనే యెచ్చటకు బయలుదేరితిరి!

శక్త—చచ్చుటకు. నీకు జవాబు ముట్టినదిగద? ఇంక లోనికిఁ బొమ్ము. ఇంక నిలచియుంటివేమి? నీకు బాగుగ అర్థము కాలేదా? అయి

తే వినుము బాగుగ చెప్పెదను. మొగలు లీకోటను ముట్టడించిరి నీ వెఱుఁగుదువా?

దాల—అవును ఎఱుఁగుదును.

శక్త—మంచిది. వారిపు డీదుర్గమును దాదాపు జయించి రేయనుకొనుము. దుర్గమును శత్రువులకు వశపరచుటకు మున్ను ప్రాణములు విడుచుట రాజపుత్రజాతి కొకయాచారము. గనుకనే నేను సేన నంతను దీసికొని కోటబయటకు పోవుచున్నాను, అచ్చటనే శత్రులతోఁ బోరాడి ప్రాణము లర్పించెదను. (ఫిరంగుల మ్రోఁతవిని) అదుగో వినుము. ఇంక నాకు దారియిమ్ము. నేను వెళ్లెదను.

దాల—ఆగుఁడు. నేనును వచ్చెదను.

శక్త—నీవును వచ్చెదవా? యుద్ధరంగమునకు! దాలత్! యుద్ధక్షేత్ర మనఁ బ్రేమిజనము పరుండు పూలపాను పనుకొంటివిగాబోలు. కాదు. అది మృత్యులీలాక్షేత్రము.

దాల—నాథా! నేనును మరణించుట యెఱుఁగుదును.

శక్త—అవును. నీవు రోజుకు పదిపండ్రెండుమారులు మరణించుచుందువు. కాని యీమరణమంత సులభము గాదు. ఈమరణము అభిమానవతియగు పడఁతియొక్క రోదనముగాదు, ఇది చాల కఠినమైనది.

దాల—అంతయు నెఱుఁగుదును. నేనును మొగలుల బిడ్డను. చచ్చుటకు వెఱువను, యుద్ధక్షేత్రము నాకు క్రొత్తదికాదు. నేనును మీావెంటవచ్చెదను.

శక్త—(కొంచెముసేపు ఆశ్చర్యముతో దాలతువంక చూచి) అయినను మరణించుటకు నీకింతపట్టుదల యెందుకు? ఇంకను నీవయస్సు చాల చిన్నది. ఇంకను కొంతకాలము నీవు ప్రాపంచిక సుఖ మనుభవించుట న్యాయము.

(దాలతు తెల్లని మొగము వెంటనే యెఱ్ఱపడును)

శక్త—ఓహో తెలిసినది. నీయీచూపున కర్థము తెలిసినది! నేనుచాల కఠినుఁడననియు, నీవు నన్ను చాల ప్రేమించుచుంటివనియునీయ

భిప్రాయముగాఁబోలు. కాని డాలత్! ఈ ప్రపంచములో నాకంటె సుందరులగు పురుషు లెందరో కలరు.

డాల—(వెంటనే శక్తసింహుని వైపునకు మెడత్రిప్పి నిలఁబడి దృఢస్వరముతోఁ జెప్పును) నాథా! పురుషుని ప్రేమవిషయము నే నెఱుఁగను. కాని స్త్రీ ఒక్కమారే ప్రేమించును. ప్రేమ పురుషునకు శారీరిక లాలస కావచ్చును. కాని స్త్రీ కది మజ్జాగతమగు ధర్మము వియోగమందును, నిరాశయందును, నిరాదరణమందును స్త్రీల ప్రేమ ధ్రువతారవలె స్థిరముగ నుండును.

శక్త—భగవద్గీతా పారాయణము చేసితివి. మంచిది. అట్లనే కానిమ్ము నీవును నావెంటరమ్ము. మరణముపై నీకింత యభిలాషయున్నచో రమ్ము. అయితే నీ వేవేషముతో మరణింపఁగోరుచున్నావు?

(తుపాకి మ్రోఁతవినఁబడును.)

డాల—వీరవేషమున నేను మీతోపాటు యుద్ధము చేయుచు ప్రాణములు విడిచెదను.

శక్త—(నవ్వి) డాలత్! వాగ్యుద్ధముదక్క నీకు మఱియేమేని యుద్ధము వచ్చునా?

డాల—నే నింతవఱకెన్నడును యుద్ధము చేయలేదు. అయినను మొగలకన్యను—కత్తిత్రిప్పుట యెఱుఁగుదును.

శక్త—మంచిది పొమ్ము నీకవచము ధరించిరమ్ము. అయితే తుపాకిగుండు వచ్చి ప్రేమివలె నిన్ను ముద్దుపెట్టుకొనునేమోనుమా జాగ్రత్తగాపొమ్ము, వీరవేషమును ధరించిరమ్ము.

(డాలతు వెళ్లును. కనుచాటగునంతవఱకు శక్తసింహుఁడు ఆమెవంక చూచుచుండును.)

శక్త—అయితే ఈమెనిజముగ నాతో మరణించుటకే వచ్చుచున్నదా? స్త్రీలప్రేమ విలాసమును, సంభోగమాత్రమునే కాదా? ఈమె మఱియొక తగులాటము తెచ్చిపెట్టినది.

(దుర్గాధ్యక్షుఁడు మరలఁ బ్రవేశించును)

శక్త—సేన సిద్ధముగ నున్నదా?

మర్గా—చిత్రము.
శక్త—మంచిది పద. (ఇద్దరు నిష్క్రమింతురు.)

దృశ్యాంతరము.

ఫినసహారాదుర్గముగోడ—ప్రభాతము.

(గోడపై శక్తసింహుఁడును వీరవేషమున దౌలతును నిలబడియుందురు.)

శక్త—అదుగో ఎదురుగ శత్రుసైన్యము కనుపించుచున్నదా? మనము వారివ్యూహమును భేదింపవలయును, నీ కీపని చేతనగునా?

దౌల—అగును.

శక్త—మంచిది పద. గుఱ్ఱము సిద్ధముగ నున్నది. ఈయుద్ధములో చచ్చుట తప్పదుసుమా.

దౌల—ఆఁ ఎరుగుదును.

శక్త—ఇంక పద. ఆలసించెద వేల? భయము వేయుచున్నదా?

దౌల—మీరు నావెంటనుండ నింక భయమెందుకు? మిమ్ము మృత్యు ముఖమునఁ జూచికూడ భయపడుదునా? నేను నాసర్వస్వమును పోఁగొట్టుకొనుటకు సిద్ధపడియు భయపడుట యెందుకు? ఇన్ని దినములయినది. మీరెన్నడును నన్ను ప్రేమించలేదు. కాని యెన్నఁడేని మీరు నన్ను ప్రేమించెదరనియు ప్రేమపూర్ణదృష్టితోఁ జూచెదరనియు ప్రేమభరితమగు స్వరముతో 'నాదౌలత్' అని పిలిచెదరనియు ఆశ పెట్టుకొనియుంటిని. ఆయాశ చేతనే నేనింతదనుక జీవించియుంటిని. నేఁడు ఆయాశకూడ నష్టముకానున్నది. ఇంక నాకు భయమెందుకు?

శక్త—మంచిది పద.

దౌల—నడువుము. (శక్తసింహుని రెండుచేతులు పట్టుకొని ఆతనికి ఎదురుగ నిలఁబడును.)

శక్త—ఇదియేమి?

దౌల—నాథా! చచ్చుటకుఁ బోవుచున్నాను. చచ్చుటకు ముందు శత్రుసేనా సమక్షమున, ఈభీషణకోలాహలమున, ఈజీవనమరణ

సంధిస్థలమున చచ్చుటకు ముందు ఒకమాఱు మీనోటితోఁ నేను నిన్ను ప్రేమించుచున్నాను. అనుఁడు.

(తెఱలో యుద్ధకోలాహల మెక్కువగ వినఁబడును.)

శక్త—దౌలత్! యుద్ధక్షేత్రము ప్రేమిజనము పరుండు పూలపాన్పు కాదని నీకు తొలుతనే చెప్పితిని.

దౌల—నాథా! ఎఱుగుదును. కాని ఈయభాగ్యురాలకు చిరకాలము నుండి యొకకోరిక గలదు. మీరీ తుదికోరికను నెరవేర్పుడు. నేను నాచుట్టములను, పక్కములను, పరిజనమును, భోగవిలాస ములను అన్నిటిని వదలి మీశరణకు వచ్చితిని. చిరకాలము నుండి మీనోట నీమాట యెప్పుడు వచ్చునాయని వేచియుంటి ని. నేటివఱకు నాకాసౌభాగ్యము గలుగలేదు. నేను మరణించు టకు ముందు నాయీకోరికను దీర్పుఁడు. ఒకమాఱు ప్రేమతో నావంక చూచి ప్రేయసీ యనుఁడు.

శక్త—దీని కిదియేనా సమయము?

దౌల—అవును ఇదియే సమయము. అదుగో ఎదురుగ సూర్యుఁడుద యించుచున్నాఁడు. (ఫిరంగుల మ్రోత విని) అదుగో వికటమృ త్యుగర్జనములు. వెనుక జీవనము ముందు మరణము. ఈసమ యమున నన్నొకమాఱు 'ప్రేయసీ' యని పిలువుఁడు ఏమాటను మీరింతదనుక నెన్నఁడు నుచ్చరింపలేదో, ఏయమృతాస్వాద ము నాకెన్నఁడు లభింపలేదో, ఏమాటను వినుటకై ఆకొన్న దానివలె నేను అధికాశతో నుంటినో దానిని ఒక్కమాఱు పలుకుడు. మరణించుటకు ముందొకమాఱు మీరు నన్ను ప్రే మించుచుంటిరని విని సుఖపూర్వముగ మరణించెదను.

గీ॥ తలఁగని నితాంతదారిద్ర్య భరముగాని
ఘన సుదుస్సహ మృత్యుయంత్రణయుఁ గాని
యడఁచి స్వర్గీయ మహిత సౌఖ్యంబునొసఁగు
పొలఁతులకు పతిప్రేమ సంబోధనమ్ము॥

గీ॥ చంద్రకిరణమ్ములం లేనిచల్లదనము
ఇంద్రు భండారమున లభియింపని సుధ
మలయ పవనమ్మునన్ లేని ప్రాణశక్తి
పొలచు పతికృతప్రేమ సంబోధనమున॥

శక్త—ఆః! ఇది యేమి? నా నేత్రముల ఈ అశ్రువులేమి! లేదు. దౌలత్! ఇప్పుడు నేనీమాట యనఁజాలను.

దౌల—అనుఁడు, అనుఁడు. (కాళ్లపైఁబడి) ఒక్కమారు అనుఁడు.

శక్త—ఒకవేళ నే నన్నను నీవు విశ్వసించెదవా? నేఁడు— (నోట మాటరాదు)

దౌల—మిమ్ము విశ్వసింపనా? ఎవ్వనిపాదములపై విశ్వాసముంచి నేను నాయిహకాలమంతయు నర్పించితినో వానిని ప్రేమింపనా? మీ మాట యసత్యమైనఁ గానిండు. నే నేమియు ప్రశ్నింపను. వితర్కము సేయను. ఇదివఱకెన్నఁడును వితర్కము సేసియెఱుఁగను. ఇప్పుడు చనిపోవుటకు ముందును అట్టి యుందును ఆమాట వినుటకు నీకింత యభిలాషయెందుకు అందురేమో?—వినుఁడు నేను స్త్రీని. స్త్రీజాతికి సహజముగనుండు మహాత్త్వరాభిలాష నాకు నేటివరకు తీఱలేదు. నేఁడు ఆకోరిక తీర్చుకొని సుఖముగ మరణింపఁ గోరుచున్నాను. అనుఁడు అనుఁడు

శక్త—దౌలత్! నీ వెంత సుందరివి! నీముఖమున నెట్టి స్వర్గీయజ్యోతి విరాజిల్లుచున్నది! నీస్వర మెంత మధురమైనది! నే నెంతయు మూర్ఖుఁడనై ఇంతవఱకు నీవిషయములపై ధ్యానముంచలేదు. నేను మోహాంధుడను. స్వార్థపరుఁడను. గనుక నేలోకమంతయు నావలెనే స్వార్థపరమనుకొంటిని. స్వప్నమందును నేనీవిషయము నాలోచింపలేదు. దౌలత్! దౌలత్! నేఁడు నీవు నా కెట్టి మార్పు గలిగించితివి? నా ప్రతి రక్తాణువు నందును లీనమైయున్న విశ్వాసమును, తలంపును నేఁడు నీవు తొలఁగించితివి. కాని యిట్లుచేయుట కింత విలంబమేల చేసితివి?

దౌల—అనుఁడు అనుఁడు నిన్ను ప్రేమించుచుంటిని, అని యనుఁడు

అదుగో యుద్ధ వాద్యములు మ్రోగుచున్నవి. ఇంక సమయము లేదు. త్వరగా ననుఁడు. (శక్తసింహుని కాళ్ళపైఁబడి) ఒక మాఱు ఒక్క మాటేయనుడు.

శక్త—దౌలత్! నిన్ను నిజముగ ప్రేమించుచున్నాను. హృదయపూర్వ ముగ ప్రేమించుచున్నాను. ఇంతదనుక నా హృదయస్రోతమున కొక పెద్దరాతిబండ అడ్డుపడి యుండెను. నేఁడు నీవు దానిని తీసివేసితివి. దౌలత్! ప్రేయసీ దౌలత్! నేఁడు నా నోటివెంట నీమాట తేలవచ్చుచున్నవి! ఆగియున్న ప్రవాహము గట్టుతెంపి కొని బయలు దేఁనది. ఇంక దీని నెవ్వరడ్డగలరు? దౌలత్! నిన్ను మనఃపూర్వకముగ చాల ప్రేమించుచున్నాను. నా ప్రేమను నాకు రుజువుచేయుట కింక నవకాశము చిక్కదనియే నాకు విచారము. ఇంక నేను మరణించుటకుఁ బోవుచున్నాను. ఈ ప్రేమ యిచ్చటనే ప్రారంభమై యిచ్చటనే అంతముచెందు ను.

దౌల—అయితే నాకొకమారు అంతిమచుంబనము ప్రసాదింపుఁడు.

శక్త—(దౌలతును కౌగలించుకొని ఆమె ముఖము ముద్దువెట్టుకొని గద్గదస్వరముతో) దౌలత్! నా ప్రియ దౌలత్!

దౌల—చాలు చాలు. ఇది గొప్ప మధురస్వప్నము! మరణమునకు ముందు ఇది భగ్నముగాకుండుగాక. ఇకఁ బోయి యుద్ధతరంగ ములలో నుఱుకవలయును.

శక్త—రమ్ము గుఱ్ఱము సిద్ధముగనున్నది.

(ఇద్దరును అక్కడనుండి దిగిపోయెదరు. తెరలో యుద్ధకలకలము దుర్గాధ్యక్షుఁడు ప్రవేశించును.)

దుర్గా—(ఉలికిపడి) ఆఁ! ఇదియేమి! (మరల జయనాదము వినఁబడును.) ఇంకనేమియు విచారము లేదు. రాణాజీ దుర్గరక్షణమునకై ససైన్యముగ వచ్చినారు. ఇంక నేమియు భయము లేదు. (ప్రస్థానము)

తృతీయదృశ్యము.

స్థానము—దుర్గసమీపమున యుద్ధక్షేత్రము. ప్రతాపునిశిబిరము.
సమయము—సాయంకాలము. [ప్రతాపుడు గోవిందసింహుఁడు పృథ్వీరాజు సశస్త్రులై నిలఁబడుదురు.]

ప్రతా—ఇదియంతియు భగవతీకటాక్షము!

పృథ్వీ—సాక్షాత్తు మహాబత్ఖాను కైదీ అయినాడు.

గోవిం—యెనిమిదివేల మొగల సైనికులు నరుకబడిరి.

ప్రతా—గోవిందసింహా! మహాబతుని ఇచ్చటకుఁ గొనిరమ్ము.

(గోవిందసింహుఁడు వెళ్ళి ఇరువురుసిపాయిలతో శృంఖలాబద్ధుడగు మహాబతుని తీసికొనివచ్చును.)

ప్రతా—సంకెలలు విప్పుము. (పహారేదారు సంకెలలు విప్పును.)

ప్రతా—మహాబత్! పొమ్ము. నేను నిన్ను విడిచిపెట్టితిని. నీవు ఆగ్రాకు బోయి మానసింహునితో జెప్పుము. ఈ యుద్ధమునకు అతఁడు వచ్చునని నేను చాల ఆశపడితిని. అతఁడు ఈయుద్ధమునకు వచ్చియున్నచో హల్దీఘాటుఋణమును దీర్చుకొనువాడను. మొగలసేనాపతియగు మహారాజ మానసింహునితోఁ జెప్పుము. యుద్ధక్షేత్రమున సేనతనిని కలియఁగోరుచున్నాను. ఇంక పొమ్ము.

(మహాబత్ఖాను మెదలక తలవంచుకొని పోవును.)

పృథ్వీ—ఉదయపూరు రాణాగారిచేతికి చిక్కినట్లేనా?

ప్రతా—ఆఁ

పృథ్వీ—అయితే చిత్తూరు ఒకటియే మిగిలియున్నది.

ప్రతా—అజమేరు మండలగఢుదుర్గములుగూడ మిగిలియున్నవి.

(శక్తసింహుఁడు ప్రవేశించును.)

ప్రతా—రమ్ము తమ్ముఁడా! (లేచి కౌగిలించుకొని) ఒకక్షణము విలంబమగుచో నిన్ను జీవితావస్థలోఁ జూచువాఁడను గాను.

శక్త—అన్నా! నీవు నన్ను రక్షించినమాట వాస్తవము. కాని (నిట్టూర్పు విడిచి) ఈయుద్ధములో నేను నాసర్వస్వమును బోఁగొట్టుకొంటిని.

ప్రతా—ఏమి? ఏమయినది?

శక్త—నా భార్య దౌలతున్నిసా చనిపోయినది.

ప్రతా—నీభార్య దౌలతున్నిసా!!!

శక్త—అవును. నా భార్య దౌలతున్నిసా.

ప్రతా—ఆఁ! నీవు తురుష్క స్త్రీని పెండ్లి యాడితివా?

శక్త—అవును అన్నా! నేను తురుష్క స్త్రీని పెండ్లియాడితిని.

ప్రతా—(నివ్వెఱపడి తలమొత్తుకొని) తమ్ముఁడా! తమ్ముఁడా! అయ్యో నీవేమిచేసితివి? నేను నాసర్వస్వమును బోఁగొట్టుకొని నావంశ గౌరవమును గాపాడితిని. (నిట్టూర్పు విడిచి, కొంచెమాగి దృఢ స్వరముతో) కాదు శక్తసింహా! నేను బ్రదికియుండగా నిట్టి మాట కాఁజాలదు. నేటినుండి నీవు నాకు సోదరుఁడవుగావు. నేను నీకేమియుఁ గాను. మేవాడు రాజవంశముతో నీకేమియు సంబంధము లేదు. అయితే ఫినసహారా దుర్గమును నీవు జయించితివి. దానిపై నీకు సంపూర్ణాధికారము గలదు. నేటినుండి నిన్నును ఆదుర్గమును మేవాడువంశమునకును మేవాడురాజ్యమునకును జెందనివానినిగా తలఁచెదను.

పృథ్వీ—రాణాజీ! ఏమిపని యిది?

ప్రతా—పృథ్వీరాజా! నేను చేయునది యేమియో నేను బాగుగ నెఱుఁగుదును. శక్తసింహా! నేటినుండి నీవు మేవాడుకేమియుఁ గావు. నా రాజవంశముతో నీకేమియు సంబంధము లేదు. (క్రోధదుఃఖములచే రెండుచేతులతోఁ గన్నులు మూసికొనును)

గోవిం—రాణాజీ!

ప్రతా—గోవిందసింహా! ఊరకొనుము. నేటివఱకు ప్రాణములు ధార పోసి ఈపవిత్రవంశగౌరవమును గాపాడుచువచ్చితిని.

చ॥ సతతదరిద్రతాప్రతతి మహారత్నణాదిక భక్షణంబునుఁ
క్షితిశయనంబు కానల వసించుటయుఁ బలవద్విరోధమున్
ధృతి నిజవంశగౌరవప్రతిష్ఠకుఁ బూనితిఁ దన్నిమిత్తమై
సుతహితబంధుభార్యలను సోదరులన్ బనిమోని వీడరే॥

నేను బ్రదికియున్నంతవరకు ఈ వంశగౌరవమును గాపాడెదను. నాయనంతర మేమి కావలయునో అగును.

పృథ్వీ—రాణాజీ! శక్తసింహుఁడీయుద్ధమున—

ప్రతా—అవును. శక్తసింహుఁడీయుద్ధమున నాకు కుడిభుజముగానున్న మాట యెఱుఁగుదు. కాని వ్యాధిగ్రస్తమగు కుడిభుజమును కోసివేయునటుల నేనితనిఁ బరిత్యజించెదను. (ప్రస్థానము)

పృథ్వీ—హా అభాగ్యరాజ్యస్థానమా! (ప్రస్థానము)

(పృథ్వీరాజువెనుక గోవిందసింహుఁడును వెళ్ళును.)

శక్త—అన్నా! దైవసమానముగ హృదయమునఁ నిన్ను బూజింతును. కాని నీ వాజ్ఞయొసఁగినను నేను దాలతున్ని సానుమాత్రము విడునఁజాలను. నేనామెను వివాహమాడితినని ఒక్కమారుగాదు. నూరుమార్లు చాటిచెప్పెదను. ఆవివాహములో మంగళవాద్యములు లేకుండుగాక. పురోహితుఁడు మంత్రములఁ బఠించకుండుగాక. అగ్నిదేవుడుసాక్షిగ లేకుండుగాక. అయినను అది వివాహమే. నేనామెను వివాహమాడితినని చెప్పుటయే, నాకిప్పుడు సుఖకరముగ నుండును. రాణాజీ! నీవు దైవస్వరూపుఁడవైన మాట వాస్తవము. ఆమెయు దేవియే. నాకన్నులు దెఱపించి నీవు నాకు పురుషులమహాత్మ్యమును జూపించితివి. అటులనే ఆమెయు నాకు స్త్రీజాతి మహాత్మ్యమును జూపించినది. నేను పురుషులు వట్టిస్వార్థపరులని తలఁచుచుండెడివాఁడను. కాని నీవు పురుషులందును సార్థత్యాగమంత్ర ప్రతిష్ఠాతలు గలరని చూపించితివి. అట్లె స్త్రీలుతుచ్ఛలు, అసారలు, కదాకారలు అని తలఁచుచుండెడివాఁడను. కాని ఆమె స్త్రీలయందును సౌందర్యము గలదని చూపించెను. ఆహా! ఆసౌందర్య మెంతయద్భుతమైనది! ఎంతప్రభావముగలది. నేటి ప్రభాతమున ఆమె నాయెదుట నిలఁబడినది. ఆమె ముఖమున ఎట్టి స్వర్గీయ ప్రకాశము, ఎట్టి స్వర్గీయ తేజము, ఎట్టి స్వర్గీయశోభ విరాజిల్లుచుండెను. ఆమె ముఖమున నొకస్వర్గీయ

జ్యోతి తాండవమాడుచుండెను. ఆమె ముఖము తచ్చిరసంచిత పుణ్యజలములచే క్షాళితమైనట్లు లుండెను. ఆమె పాదములను మోయుటచే భూమి తన్ను ధన్యురాలుగ తలఁచుచున్నటు లుండెను. ఏమి యాశోభ! హత్యారాక్షసియొక్క భూమీ భూతమగు ఆనిశ్వాసమున, ఆమరణప్రళయకల్లోలమున, ఆజీవన సంధ్యాలగ్నమున ఏమిమూర్తి! ఏమిమూర్తి! (మెల్లగా నిష్క్రమించును.)

చతుర్ధ దృశ్యము.

స్థానము— కోమల మీరులో ఉదయసాగరతీరము. సమయము:— వెన్నెలరాత్రి. (మేహరున్నిసా ఒంటరిగ కూర్చుండును.)

మేహ— ఆహా! ఈ రాత్రి ఎంత శోభాయమానముగ నున్నది. నలు దిక్కులు ప్రశాంతభావమునఁ దనరారుచున్నవి. వెన్నెల పిండి యారఁబోసినట్లు లున్నది. (కొంచెమాగి) నాకు తడవ తడవకు ఆయనమాట లేల జ్ఞాపకము వచ్చుచున్నవి! ఇన్ని దినములైనను నే నాయనను మరవఁజాలకుంటిని. నా జనకుని యగాధ ప్రేమను ఆగ్రాలోని సుందరరాజ ప్రాసాదమును నేను బుద్ధిపూర్వకముగనే విడిచినమాట వాస్తవము కాని నన్నిచటకు ఈడ్చుకొని వచ్చినదెవరు?—అశక్తసింహుఁడే. నే నిచటకు వచ్చినపిమ్మట ఎదుటఁబడినను కనులార ఆయనను జూడనని ప్రతిజ్ఞ చేసితిని. నేటిదనుక నే నా ప్రతిజ్ఞను నిర్వహించితిని. అయితే నేనీప్రదేశము నేల విడువఁజాలను? దీనికి కారణము రోజున కొకమాఱేని ఆయన నామము నాకు కర్ణానందము గలిగించుటయే. శక్తసింహ, ఆహా! ఏమి మధురనామము! కాని నేనింక నిచట నుండజాలను. ఇంతవఱకు నాకిచట ఊర సహవాసినిగా నుండెడిది. ఆమెసాంగత్యముచే నేనునావిచారము నెట్లో పోఁగొట్టుకొనుచుంటిని. ఇప్పు డాయాధారము లేదు. నన్ను నే నింక భద్రపఱచుకొనఁజాలను. ఇప్పుడీ ప్రదేశమును విడుటయే

నాకు క్షేమము. నామాటలు దౌలతున్నిసాకుఁ దెలిసినచో అది చాల విచారపడును. ప్రియదౌలత్! నిన్నుజూచియెంతకాలమో అయినది. నీసమాచారమేమియుఁ దెలియుటలేదు. రాణాగారికి వెఱచి శక్తసింహుఁడు ఈవిషయము నెవ్వరితోడను చెప్పలేదు కాబోలు. ఒకమాఱు ఈ సంగతి రాణాగారి చెవులబడెను, కాని వారు విశ్వసింపలేదు. వినినప్పుడు మాత్రము వారిమొుగ మెఱ్ఱ పడినది. స్వాతంత్రమగు ప్రేమ రాజ్యమున వ్యర్థముగ నీసంఘపు కట్టుపాట్లిందుకు, ఈతెగ లెందుకు. ఈహద్దు లెందుకు? ప్రియదౌలత్! నేనుచేసినదంతయు నీసుఖముననే చేసితిని నీవుసుఖముగ నుండుము. అదియే నాకుపరమసుఖము నీసుఖమే నాకుఆనందము

దాసి—(ప్రవేశించి) శాహజాదీ!

మేహరు—(ఉలికిపడి) ఎవరు?

దాసి—రాణాగారు తిరిగివచ్చిరి. అమ్మగారు మిమ్ము పిలుచుచున్నారు. బాదుషాగారివద్దనుండి మీపేర జాబు వచ్చినది.

మేహ—నా పేర జాబువచ్చినదా? ఎక్కడనున్నది?

దాసి—రాణాగారివద్ద. అమరసింహుఁ డిచ్చటకు రాలేదుగద?

మేహ—లేదు.

దాసి—అయితే వారెచటకు వెళ్ళిరి? వెళ్లి వెదకెదను (ప్రస్థానము)

మేహ—నాయనా! ఇన్నిదినములకు నేను మీకు జ్ఞప్తికి వచ్చితినా? ఏమి వ్రాసిరో పోయిచూచెదను. ఎవరు? అమరసింహా!

అమర—(ప్రవేశించి)అవును. నేనే.

మేహ—ఇప్పుడే దాసి నిన్ను వెదకుచు వచ్చినది. పద పోదము.

అమర—పదపోదము. (ముందుకుఁబోయి మేహరుచేయి పట్టుకొనును)

మేహ—ఆఁ! ఇదియేమి! చేయి విడువుము.

అమర—విడిచెదను. ముందు నామాట వినుము. నీ కొకమాట చెప్పెద నుండుము.

మేహ—నీస్వరమును బట్టిచూడ నీవు మద్యము త్రాగివచ్చినటులున్నది. ఏమి చెప్పెదవో చెప్పుము

అమర—నే నేమి చెప్పనుంటినో నీ వెఱుగుదువా? అదుగో ఎదురుగఁ జూడుము, ఆసరోవరమునఁ బ్రసరించు చంద్రకాంతి యెంత అందముగ నున్నది! చూచుచుంటివా?

మేహ—ఆఁ చూచుచున్నాను.

అమర—ఈయాకాశము, ఈవెన్నెల, ఈచల్లనిగాలి-చూచుచుంటివా! ఈసౌందర్య మంతయు దేనికి సిద్ధపఱుపఁబడినది?

మేహ—ఏమో నేనెఱుగను. పద ఇంటికిఁ బోదము.

అమర—నీ వెఱుఁగవు. కాని నే నెరుగుదును. ఇదియంతయు భోగమునకై సిద్ధపఱుపఁబడినది.

మేహ—మంచిది. దారి విడువుము.

అమర—మేహార్! మానవుఁడీ మధుపూర్ణపాత్రమును గ్రోలనిచో ప్రకృతి దీనిని వానినోటివద్ద నేల పెట్టుచున్నది?

మేహ—పద ఇంటికిఁ బోదము. (వెళ్ళఁబోవును.)

అమర—(దారి అడ్డి) నేను చాలకాలము అణచుకొని యుంటిని. కాని యింక నావలనఁగాదు. మేహారున్నిసా! వినుము. నేను యువకుఁడను. నీవు యువతివి. ఇది యేకాంతస్థానము. దానిపై నీ వెన్నెలరాత్రి!

మేహ—నీవు నేఁడు మరల మద్యము త్రాగితివి, నీ వేమిఁ జేయనుచుంటివో నీకు తెలియదు.

అమర—కాదు మేహార్! నేను బాగుగ నెఱుగుదును. (మరల చేయి పట్టుకొనును.)

మేహ—(బిగ్గరగా) నా చేయి విడువుము.

అమర—ప్రేయసీ! మేహారున్నిసా! (కౌగలించుకొనఁ బోవును.)

మేహ—అమరసింహా! నాచేయి విడువుము. (చేయి విడిపించుకొనుటకు యత్నించును.) ఎవ్వరక్కడ?

(లక్ష్మియు ప్రతాపుఁడును ప్రవేశించెదరు.)

ప్రతా—ఏమి యేమి? ఇదుగో నేను వచ్చితిని. (గంభీర స్వరముతో) అమరసింహా!

(అమరసింహుఁడు మేహరుచేయి విడిచి దూరముగ నిలఁబడును)

ప్రతా—అమరసింహా! ఇది యేమి? నేను తొలుతనే అనుకొంటిని బాల్యమున సోమరిగా తిరిగినవాఁడు యౌవనమున తప్పక దురాచారియు, నిరంకుశుఁడు నగును. కాని నాకుమారుఁడు ఆశ్రితయగు నొక యబలపై నిట్టి అత్యాచారమును జేయునని నేనుకలలోఁగూడ అనుకొనలేదు. దుష్టుఁడా! కులాంగారా! నిలఁబడుము. నీకు శిక్ష విధించెదను. (పిస్తోలు తీయును.)

అమర—నాయనగారూ! నాయనగారూ! (కాళ్లపై బడును.)

ప్రతా— ఓరీ పిరికిపందా! క్షత్రియుండవయ్యు చావుకు వెఱచుచుంటివా? నిలఁబడుము.

లక్ష్మి— (ప్రతాపుని కాళ్ళపైబడి) నాథా! క్షమింపుఁడు. అది నా దోషమే. ఇన్ని దినములవరకు నేను తెలిసియు తెలియనివానివలె నుంటిని.

ప్రతా—లేదు. వీనిని శిక్షింపక విడువను. ఈయుపరాధము క్షమించుటకు వీలులేదు.

మేహ—రాణాజీ! మీరీయనను క్షమింపుడు. ఇప్పుడీయన స్మారకములో లేడు. ఈయన మద్యమును ద్రావినాఁడు.

ప్రతా—ఏమి? వీఁడు మద్యము త్రావినాఁడా?

అమర—నాయనగారూ! నన్ను క్షమింపుఁడు.

ప్రతా—(పిస్తోలుఎత్తి) లేదు. నేను నిన్ను క్షమింపను.

మేహ—రాణాజీ పుత్రహత్య చేయకుఁడు

లక్ష్మి—(కొడుకునకు ముందు నిలఁబడి) వీనిని చంపుటకుముందు నన్ను చంపుఁడు (ఇంతలో పిస్తోలు ప్రేలుటచే లక్ష్మి క్రిందపడును.)

మేహ—అరే ఇదియేమి! ఇది యేమి! అమ్మా! అమ్మా! (పరుగెత్తుకొనిపోయి లక్ష్మిశిరము నెత్తి తనతొడపై పెట్టుకొనును)

ప్రతా—లక్ష్మి! లక్ష్మి!

లక్ష్మి—నాథా! అమరసింహుని క్షమింపుఁడు. నేను నాజీవితములో నొక్కమారే మీయానతిని మీఱితిని. నన్నును క్షమింపుఁడు.

ఈ మృత్యుకాలమున మీ చరణములకడ నాకు స్థానమిందు (ప్రతాపుని పాదములు పట్టుకొని లక్ష్మి ప్రాణములు విడుచును.)

ప్రతా—మేహర్! నే నెంతపని చేసితిని!

(అమరుఁడు నిశ్చేష్టితుఁడై నిలఁబడును. మేహరు ఏడ్చును.)

ప్రతా—జగదీశ్వరా! పూర్వజన్మమున నే నేమి పాపము చేసితిని అన్ని విధములగు విపత్తులును నాకు తటస్థించుచున్నవి. నాకన్నులయం దు అంధకార మావరించుచున్నది. (మూర్ఛితుఁడై పడిపోవును.)

పంచమదృశ్యము

స్థానము—అక్బరుని ఏకాంతగృహము. సమయము—మధ్యాహ్నము.

(అక్బరును మానసింహుఁడును ఎదురుగ నిలఁబడి యుందురు.)

అక్బ—వింటిని మానసింహా! అంతయు వింటిని దుర్గములన్నియు క్రమముగ రాజపుత్రుల యధీనము లగుచున్నవి. పైఁగ మహాబత్ఖాను ప్రతాపునిచేతిలో ఖైది అయ్యెను. తుదకెట్లో ఆయన దయతలచి విడిచిపెట్టగా ఢిల్లీకి తిరిగివచ్చినాడు ఇదియు వింటిని.

మాన—జహాంపనాహ్: ప్రతాపసింహుఁడు నేఁడు మూర్తీభవించిన ప్రళయమువలె నున్నాఁడు. ఆయన నడ్డుట కెవ్వరికి తరము!

అక్బ—మహారాజా! యీవృత్తాంతము వినుటకై నేను మిమ్ము పిలువలేదు.

మాన—(మెదలక యుండును.)

అక్బ—మానసింహా! దీనియర్థము కేవలము మొగలుల పరాజయమని యే కాదు. దీనియర్థము—మొగలుల యవమానము. దీనియర్థము—దేశమున నిరుత్సాహము. దీనియర్థము—స్వదేశ రాజుల రాజభక్తిక్షయము. మహారాజా! ప్రపంచములో వ్యాధియొక్కటియే సంక్రామకము గాదు. స్వాస్థ్యమును సంక్రామకమే. భీరుత్వమువలె సాహసమును సంక్రామకమే. పాపమువలె పుణ్యమును సంక్రామకమే. అట్లేప్రతాపుని ఈ స్వదేశభక్తియు అంటువ్యాధివలె దేశమంతటను వ్యాపించునని తోఁచుచున్నది.

మాన—(తలవంచుకొని) చిత్తము.

అక్బ—గనుక ముందుగనే దీనికి ప్రతిక్రియ చేయవలయును. ఈప్రతాపునిగతి నిరోధించుటకై ఎంత ద్రవ్యము, సైన్యము కావలసియున్నను ఇచ్చెదను.

మాన—(మెదలక యుండును)

అక్బ—(మానసింహుని భావ మెఱింగి) మహారాజా! మీరు ప్రతాపుని ప్రతాపమునకు ముగ్ధులైతిరని నేనెరుగుదును నేనును ముగ్ధుడనైతిని నిజముగ ప్రతాపసింహుడు ఒక మహావీరుడు. అయితే ఏసామ్రాజ్యమును స్థాపించుటకు మీరును, మీతండ్రియు నాకు పరమాప్తుడునగు భగవాన్దాసును ఇన్ని సంవత్సరములనుండి సహాయము చేయుచు వచ్చితిరో ఆసామ్రాజ్య మిపుడు నాశనమగుచుండ మీరు తప్పక చింతించెదరనియు నే నెఱుగుదును.

మాన—మొగల సామ్రాజ్యము నాక్రమించుట ప్రతాపునియుద్దేశ్యము గాదు. చిత్తూరు దుర్గము నుద్ధరించుటమాత్రమె ఆయన సంకల్పము. ఆయన దేశభక్తుడే కాని పరస్వాపహారి యెన్నడును కాడు.

అక్బ—తెలిసినది, కాని మహారాజా! చిత్తూరుదుర్గమును పోగొట్టుకొనినచో సామ్రాజ్యమంతయు పోగొట్టుకొనిన వాడ నగుదునని నానిశ్చయము. మహారాజా! మీరు నాకు పరమాప్తులగు భగవాన్దాసునకు పుత్రులగు. కొలదిరోజులలో ఇంకను ఆప్తసంబంధులు కానున్నారు. నే నెంతయు మీమీదనే ఆధారపడి యుంటినని యు మీ రెఱుగుదురు,

మాన—సమ్రాట్! చిత్తూరు మొగలుల చేతిలోనుండి పోకుండ యథాశక్తి ప్రయత్నింతునని నమ్ముడు.

అక్బ...ఇదియే మానసింహునకు తగినమాట,

మాన...ఇంక నాకు సెలవిండు. (సలాముచేసి పోవును.)

అక్బరు...(పచారుచేయుచు) నేను ఆనాడు సలీముతో పరుని శాసింపవలయునన్నచో ముందుగ తన్నుదా శాసించుకొనవలయు

నని చెప్పితిని. కాని అటుసిమ్మటనే క్రోధవశుఁడనై నా ప్రాణప్రియయగు కన్యను పోఁగొట్టుకొంటిని. ఇటు నౌరోజు మేళాలో కామవశుఁడనై రాజపుత్రి రాజులప్రేమను బోఁగొట్టుకొంటిని. బుద్ధిబలముచే మరల నీవనులన్నియు చక్కఁబడునేమో చూచెదను. మహాబతాఁనువలన మేహరున్నిసా సమాచారము తెలిసినది. ప్రాణాధిక కుమారీ! నీవు అభిమానముచే నన్ను విడిచి నాశత్రువులపజ్జ చేరితివి. హా! నేఁడు నే నెంతటి నిరభిమానకార్యము చేయవలసి వచ్చినది! నాముద్దులపట్టి మొగము చూచుటకై నేఁడు నాశత్రుని క్షమాపణ వేఁడితిని. నాపుత్రికను గూడ క్షమాపణ వేఁడవలసివచ్చినది. ఈశ్వరా! ఎంత విరుద్ధమైన మాట! తండ్రిని ఇంతప్రేమ దుర్బలునిగ నేల సృజించితివి?

(ద్వారపాలకుఁడు ప్రవేశించును.)

అక్బ—మేహర్! మేహర్! నీవు తిరిగి రమ్ము. నేను నీతప్పులన్నియు క్షమించితిని. నీవును నాతప్పు క్షమింపుము.

ద్వార—ఖుదావంద్! మేవాడునుండి ఒకదూత వచ్చినాఁడు.

అక్బ—(ఉలికిపడి) మేవాడునుండి వచ్చెనా? ఎక్కడ నున్నాఁడు? ఏమి కబురు తెచ్చినాడు?

ద్వార—వెంట బాదుషాకన్యయగు మేహరున్నిసాకూడ—

అక్బ—మేహరున్నిసాకూడ వచ్చినదా? ఎక్కడ నున్నది?

(అక్బరు త్వరగా ముందుకుఁ బోవును ఇంతలో మేహరున్నిసా వచ్చి "నాయనా నాయనా" అని కాళ్ళపైఁ బడును. ద్వారపాలకుఁడు పోవును.)

అక్బ—మేహర్! మేహర్! నిజముగ నీవు వచ్చితివా?

మేహ—నాయనగారూ! నన్ను క్షమింపుఁడు. నా దోషములన్నిటిని క్షమింపుఁడు నేను నాబుద్ధిదోషముచే డాలతున్నిసాను పాడుచేసితిని, రాణాజీని పాడుచేసితిని, నన్ను పాడుచేసికొంటిని క్షమింపుఁడు.

అక్బ—లెమ్ము మేహర్! నేను నీతప్పులనన్నిటిని క్షమించితినని నీకు

ముందే వ్రాసితిని. అజేయుఁడగు భారతసార్వభౌముఁడును నీ ముందు గడ్డిపరకవలె దుర్బలుఁడు మేహర్! నీవు నన్ను క్షమిం చితివా?

మేహ—నేను మిమ్ము క్షమించుదాననా. దేనికి?

అక్బ—నేను నీతల్లిని దూషించితిని.

మేహ—ఆవిషయమై మీరు క్షమాపణ గోరియుంటిరిగదా?

అక్బ—క్షమాపణ గోరనిచో తింగివచ్చెడుదానవు గావా?

మేహ—అదియంతయు నాకు తెలియదు. నే నింతగా ఆలోచనచేసి యిచ్చటకు రాలేదు. మీజాబు చదివితిని. ఇంక ఉండలేకపోతిని. వెంటనే వచ్చితిని నాయనగారూ! నేను మిమ్మింతగా ప్రేమించు చుంటినని నాకు పూర్వము తెలియదు. (మేహరు అక్బరుని హృదయముపై తలయుంచి యేడ్చి పిదపఁజెప్పును.) నాయన గారూ! ఇన్నిదినములకు నేను తెలిసికొనఁగల్గితిని స్త్రీల కెన్నఁ డును ప్రతివాదము పనికిరాదు. సర్వము సహింపవలయును. స్త్రీల కర్తవ్యము అంతఃపురముననేకాని బయట కాదు. స్త్రీల ధర్మము సేవయేకాని స్వేచ్ఛాచారము గాదు.

అక్బ—ప్రతాపుఁడు నీవిషయమై యెట్టి అత్యాచారమును జేసియుండ లేదుగద?

మేహ—అత్యాచారమా! నన్ను అత్యాచారమునుండి రక్షించుటకై ఆయన తనభార్యనుగూడ చంపికొనెను.

అక్బ—అదియెట్లు?

మేహ—ఒకనాఁడు రాణాగారిపుత్రుఁడు మద్యపానప్రమత్తుఁడై నాచేయి పట్టుకొనెను. రాణాగా రదిచూచి పుత్రునిఁ జంపుటకై తుపాకి గుఱిపెట్టెను. ఇంతలో పుత్రరక్షణార్థము ఆయన భార్య అడ్డము పోయి తుపాకిగుండు తగిలి చనిపోయెను.

అక్బ—ప్రతాప్! ప్రతాప్! నీవెంతయు మహాత్ముఁడవు. నీవు నాకుమిత్రు డవగుచో నిన్ను నాకుడిప్రక్క కూర్చుండఁబెట్టుకొనెడువాఁడను. కాని నీవు నాకు శత్రువైతివిగాన నీయాసనము నాకు ఎదురుగ

నుండవలసివచ్చెను. ఇట్టి శత్రు వుండుటయు మా రాజ్యమునకు గౌరవమే. నేను అక్బరు బాదుషా కాకుండినచో రాణాప్రతాప సింహుడనగుట కేకోరువాడను. నేను సార్వభౌముడను. భారత వర్షమంతయు శాసింపగోరుచున్నాను. కాని నన్ను నేనుశాసించు కొనజాలకున్నాను. ఇంక నీవు దీనుడవు. దరిద్రుడవయ్యును నిన్ను శరణుజొచ్చిన శత్రు కన్యనురక్షించుటకై నీ యేకపుత్రుని గూడ చంపనెంచితివి! నీమహత్త్వమేమని కొనియాడుదును?

మేహ— మునగారూ! నాది యొక విన్నపమున్నది. మీరింతటినుంచి రాణాప్రతాపసింహునిపైకి కత్తికట్టవలదు. ఆయనను వీరోచిత రీతిని గౌరవింపుడు. ప్రతాపుడు శత్రువయ్యును మహావీరుడు. ఆయన మానవుడు గాడు- దేవాంశగలవాడు ఆయనతోటి వైరము మా నాయనగారికి ఉచితము గాదు. నేడు ఆయన ఘోర సాంసారిక కష్టములు జిక్కికొని యున్నాడు. ఆయన కొమార్తెయు భార్యయు మరణించిరి. సోదరుడు విడిపోయి నాడు. కుమారుడు డెందుకును కొఱగానివాడుగ నున్నాడు. ఆయనపై దయవహింపుడు.

అక్బ—మంచిది. అట్లే కానిమ్ము. నీకు బదులుగ చిత్తోరుదుర్గమును ఆయన కిచ్చివేసితిని.

మేహ—అయితే వారింతవరకు దానిని తీసికొనుట కంగీకరింప లేదు. ఒకమాట మఱచితిని. రాణాగారు మీ కిమ్మని యొక జాబు ఇచ్చిరి. (జాబుతీసి అక్బరున కిచ్చును.)

అక్బ—ప్రతాపసింహుడు వ్రాసిన జాబేనా? (జాబు మేహరున కిచ్చి) నాకు బాగుగ కనిపించుట లేదు. అమ్మాయీ! నీవే చదువుము.

మేహ—(జాబుచదువును) "ప్రబల ప్రతాపులగు అక్బరు బాదుషా గారికి. మహాశయా! మీ మేనకోడలగు దౌలతున్నిసా ఇపుడు ఈలోకమున లేదని తెలుపుటకు విచార మగుచున్నది. ఆమె ఫినసహారా యుద్ధమున చనిపోయినది. ఆమెకు యథోచితముగ అంత్య సంస్కారము చేయించబడినది.

ముందే వ్రాసితిని. అజేయుఁడగు భారతసార్వభౌముఁడును నీ ముందు గడ్డిపరకవలె దుర్బలుఁడు మేహర్! నీవు నన్ను క్షమిం చితివా?

మేహ—నేను మిమ్ము క్షమించుదాననా. దేనికి?

అక్బ—నేను నీతల్లిని దూషించితిని.

మేహ—ఆవిషయమై మీరు క్షమాపణ గోరియుంటిరిగదా?

అక్బ—క్షమాపణ గోరనిచో తిరిగివచ్చెడుదానవు గావా?

మేహ—అదియంతయు నాకు తెలియదు. నే నింతగా ఆలోచనచేసి యిచ్చటకు రాలేదు. మీజాబు చదివితిని. ఇంక ఉండలేకపోతిని. వెంటనే వచ్చితిని నాయనగారూ! నేను మిమ్మింతగా ప్రేమించు చుంటినని నాకు పూర్వము తెలియదు. (మేహరు అక్బరుని హృదయముపై తలయుంచి యేడ్చి పిదపఁజెప్పును.) నాయన గారూ! ఇన్నిదినములకు నేను తెలిసికొనఁగల్గితిని స్త్రీల కెన్నఁ డును ప్రతివాదము పనికిరాదు. సర్వము సహింపవలయును. స్త్రీల కర్తవ్యము అంతఃపురముననే కాని బయట కాదు. స్త్రీల ధర్మము సేవయే కాని స్వేచ్ఛాచారము గాదు.

అక్బ—ప్రతాపుఁడు నీవిషయమై యెట్టి అత్యాచారమును జేసియుండ లేదుగద?

మేహ—అత్యాచారమా! నన్ను అత్యాచారమునుండి రక్షించుటకై ఆయన తనభార్యనుగూడ చంపికొనెను.

అక్బ—అదియెట్లు?

మేహ—ఒకనాఁడు రాణాగారిపుత్రుఁడు మద్యపానప్రమత్తుఁడై నాచేయి పట్టుకొనెను. రాణాగా రదిచూచి పుత్రునిఁ జంపుటకై తుపాకి గుఱిపెట్టెను. ఇంతలో పుత్రరక్షణార్థము ఆయన భార్య అడ్డము పోయి తుపాకిగుండు తగిలి చనిపోయెను.

అక్బ—ప్రతాప్! ప్రతాప్! నీవెంతయు మహాత్ముఁడవు. నీవు నాకుమిత్రు డవగుచో నిన్ను నాకుడిప్రక్క కూర్చుండఁబెట్టుకొనెడువాఁడను. కాని నీవు నాకు శత్రువైతివిగాన నీయాసనము నాకు ఎదురుగ

నుండవలసివచ్చెను. ఇట్టి శత్రు వుండుటయు మా రాజ్యమునకు గౌరవమే. నేను అక్బరు బాదుషా కాకుండినచో రాణాప్రతాప సింహుఁడనగుట కేకోరువాఁడను. నేను సార్వభౌముఁడను. భారత వర్షమంతయు శాసింపఁగోరుచున్నాను. కాని నన్ను నేను శాసించుకొనజాలకున్నాను. ఇంక నీవు దీనుఁడవు. దరిద్రుఁడవయ్యును నిన్ను శరణుజొచ్చిన శత్రు కన్యను రక్షించుటకై నీ యేకపుత్రుని గూడ చంపనెంచితివి! నీమహాత్త్వమేమని కొనియాడుదును?

మేహ— ముసగారూ! నాది యొక విన్నపమున్నది. మీరింతటినుంచి రాణాప్రతాపసింహునిపైకి కత్తికట్టవలదు. ఆయనను వీరోచిత రీతిని గౌరవింపుఁడు. ప్రతాపుఁడు శత్రువయ్యును మహావీరుఁడు. ఆయన మానవుఁడు గాడు- దేవాంశగలవాఁడు ఆయనతోటి వైరము మా నాయనగారికి ఉచితము గాదు. నేఁడు ఆయన ఘోర సాంసారిక కష్టములఁ జిక్కికొని యున్నాఁడు. ఆయన కొమార్తెయు భార్యయు మరణించిరి. సోదరుఁడు విడిపోయినాఁడు. కుమారుఁ డెందుకును కొఱగానివాఁడుగ నున్నాఁడు. ఆయనపై దయవహింపుఁడు.

అక్బ——మంచిది. అట్లే కానిమ్ము. నీకు బదులుగ చిత్తోరుదుర్గమును ఆయన కిచ్చివేసితిని.

మేహ—అయితే వారింతవరకు దానిని తీసికొనుట కంగీకరింప లేదు. ఒకమాట మఱచితిని. రాణాగారు మీ కిమ్మని యొక జాబు ఇచ్చిరి. (జాబుతీసి అక్బరున కిచ్చును.)

అక్బ—ప్రతాపసింహుఁడు వ్రాసిన జాబేనా? (జాబు మేహారున కిచ్చి) నాకు బాగుగ కనిపించుట లేదు. అమ్మాయీ! నీవే చదువుము.

మేహ—(జాబుచదువును) "ప్రబల ప్రతాపులగు అక్బరు బాదుషా గారికి. మహాశయా! మీ మేనకోడలగు దౌలతున్నిసా ఇపుడు ఈలోకమున లేదని తెలుపుటకు విచారమగుచున్నది. ఆమె ఘినసహారా యుద్ధమున చనిపోయినది. ఆమెకు యథోచితముగ అంత్య సంస్కారము చేయించబడినది.

అక్బ—ఇది మొదటనే వింటిని. ఇంక నేమి వ్రాసెనో చదువుము.

మేహ—"దౌలతున్నిసా వృత్తాంతమును యుద్ధానంతరము మేహరున్నిసావలన వింటిని. అంతకు మున్నె శక్తసింహుఁడు బహిష్కరింపఁబడెను. శక్తసింహుఁడు నా సోదరుండు. యుద్ధములో నాకు కుడిభుజముగ నుండెను. కాని యిప్పు డతనికి నాతోఁగాని మేవాడుతోఁగాని యట్టిసంబంధమును లేదు. ఇప్పటికిని నేను పూర్వమువలె మీకు శత్రువునే చిత్తోరు స్వాధీనమైనను గాకున్నను భారతవర్షమునకు దోపిడిగాడగు అక్బరునకు శత్రువుగ నుండియే మరణింపవలెనను నాసంకల్పమెన్నఁడు వికల్పము కాఁజాలదు. దౌలతున్నిసా శక్తసింహునిపెండ్లి యాడుటయు, మేహరున్నిసా నావద్దనున్న సంగతియు వెల్లడింపవలదని మీరు కోరితిరి. నే నట్లు చేతునని మీరు నమ్ముదురు, మేహరున్నిసాను మీకు అప్పగించినచో దానికి బదులుగా నాకు చిత్తోరుదుర్గమును ఇచ్చెదమని వ్రాసితిరి. మేహరున్నిసా తన యిచ్ఛచే నన్ను శరణు జొచ్చినది. ఆమెను నేను యుద్ధములో కైదుచేయలేదు. గాన ఆమెను తిరిగి మీకిచ్చుటకు నాకధికారము లేదు. ఆమె తన స్వేచ్ఛచే నిచ్చటకువచ్చినది. మరల స్వేచ్ఛచే వెళ్లుచున్నది. ఆమెను నేనేమియు నడ్డగింపజాలను. గాన ఆమెకు బదులుగ నేను చిత్తోరుదుర్గమును దీసికొనఁగోరుట లేదు. నాచేతనగుచో నాశక్తిచేతనే చిత్తోరు నార్జించెదను. చిత్తగించవలెను.

రాణా ప్రతాపసింహుఁడు.

అక్బ—(ఉచ్చస్వరముతో) ప్రతాప్! ప్రతాప్! నీకు నాయెదుటనే స్థానమున్నదను కొంటిని. కాని యిప్పుడు తెలిసినది. నీస్థానము నాకు చాల పైగానున్నది. నీవు నాకు ప్రజవును, నేను నీకు బాదుషాను అనుకొంటిని. అట్లుకాదు. నీవే బాదుషావు. నేనే ప్రజను. మొదట నేను విజయిని, నీవు విజితుఁడవు ననుకొంటిని. కాదుకాదు. నీవే విజయివి. నేనే విజితుఁడను. మంచిది మేహర్! నీవు లోనికిఁ బొమ్ము. నేను నీమాట నంగీకరించితిని. నేటి

నుండి ప్రతాపునకును నాకును ఎట్టి వైరము లేదు. నేటినుండి ఆయన నాకు మిత్రుఁడు. ఇంక మొగలు లెవ్వరును ఆయన కెట్టిహానియు చేయఁజాలరు. మంచిది. అమ్మాయీ! నీవు లోనికిఁ బొమ్ము, నే నిప్పుడే వచ్చుచున్నాను. (ప్రస్థానము)

మేహ—నాపరిశ్రమవు వ్యర్థముగా లేదు. నాకష్టములు, నాదుఃఖము లు అన్నియు సఫలములయినవి. తుదకు నేను రాణాకును బాదుషాకును సంధిచేసితిని. (ఉద్యానాభిముఖమగు కిటికీవద్దకుఁ బోయి) నేఁడు మఱల నేను నా బాల్యస్మృతి చిహ్నితమగు నా ప్రదేశమునకు వచ్చితిని. ఇది యాస్థానమే, మధురములగు నీనోబతువాద్యములు నవియే. విమలసలిలయగు నీయమునానదియు నదియే అంతయు నదియే, నేనొక్కదానసే మారిపోతిని నేను నామూర్ఖతచే శిక్షసింహునకును, దౌలతున్నిసాకును, రాణాప్రతాపసింహునకును సర్వనాశము చేసితిని. నేను వెళ్ళిన చోటికెల్ల నొక యూపదగ, ఒకయుపద్రవముగ, వెళ్లితిని. అయినను ఈశ్వరుఁ డెఱుఁగును, నే నేమిచేసినను మహదిచ్ఛ ప్రేరితనై చేసితిని నాలక్ష్యము మహత్తు. నేనొక్కతెను సర్వప్రాపంచికనియమములకు విరుద్ధముగ నిలఁబడి అనర్థసృష్టి గావించితిని, అయినను ఈశ్వరుఁ డెఱుఁగును నే నేమిచేసినను నిష్కపటభావముతో నాసుఖభోగముల వదలుకొని, ఆపదలకంగీకరించి సత్సంకల్ప ప్రేరితనై స్వాతంత్ర్యముతో చేసితిని. ఇప్పుడు నే నీప్రాపంచిక కోలాహలమునుండి తొలఁగి నీరవనిభృత నిరహంకార మగు కర్తవ్యసాధనకుఁ గడంగెదను. ఈశ్వరా! నన్ను బాగుగ పరిశీలింపుము-నేను నీదయకుపాత్రురాలనుగాని ద్వేషమునకుఁగాదు.

షష్ఠదృశ్యము

స్థానము—మానసింహుని ఏకాంతగృహము సమయము—రాత్రి

(మార్వాడ, బికనేరు, గ్వాలియరు, చందేరీరాజులును, మానసింహుడును గూర్చుండియుందురు.)

చందే—ఛీఛీ మహారాజ మానసింహ! మీనోటివెంట నిట్టిమాటయా

మాన—నేనేమి యనుచితమైన మాట యంటిని? ఈశాసనము నిరం
కుశమును నీతిబాహ్యము నగుచో నేను మీతోఁగలసి దీనిని
విరోధించుటకు వెనుదీయను. కాని అట్లుగాదు. మొగలుల రాజ
నీతి శాసనముగాని దోపిడిగాదు. ఇందు రక్షణమేకాని పీడన
ము లేదు. ఇందు ప్రేమయేకాని అహంకారము లేదు.

బిక—ఆప్రేమ హద్దుమీఱినది. ఆప్రేమ మర్యాదగల రాజపుత్రుల
అంతఃపురములందుకూడ ప్రవేశించినది.

మాన—అవును ఈమాట నేను కాదనను అయితే ఒకసంగతి యున్న
ది. అక్బరు బాదుషాఅయినను మానవుఁడు. ఆయన ఉద్దేశ్య
ము గొప్పది అయినను కామక్రోధాది శత్రువుల కధీనము.
అన్యాయములు, అపరాధములు అప్పుడపుడు ప్రతివారు
చేయుచుందురు. అయినను అక్బరు తనయపరాధము నొప్పు
కొనెను. ఆవిషయమై ఆయన క్షమాపణకూడఁగోరెను. ఇంక
నెన్నఁడు భారతమహిళల నవమానింపనని ప్రతిజ్ఞచేసెను. ఇంత
కంటె ఆయన యేమిచేయఁగలడు?

మార్వా—అవును. ఇది నిజమే.

మాన—హిందూమహమ్మదీయు లేకముగ నుండవలయుననియే అక్బ
రుని ఉదేశ్యము. వారుభయులు కలసిమెలసి యుండవలయు
ననియు ఆయనకోరిక.

గ్వాలి—కాని ఈలక్షణము లేమియుఁ గనుపట్టుట లేదు.

మాన—వందలకొలఁది నిదర్శనము లున్నవి. అక్బరు మహమ్మదీయుఁ
డుగదా? ఆయన హిందూధర్మ పక్షపాతియని యెవ్వరెరుగరు!
మహమ్మదీయుఁడు హిందువు కాఁగలిగియున్నచో అక్బరు ఇది
వఱకే హిందువయి యుండువాఁడు. ఆయన హిందువు కాఁజా
లకపోయెను. అందుచే నిపుడు ముల్లాలయొక్కయు పండితుల
యొక్కయు సహాయముచే ఒకనూతనమతమును స్థాపింపఁ గోరు
చున్నాడు. ఆమతమున ఉభయజాతులును నిస్సంకోచముగఁ
జేరవచ్చును. రాజ్యమందలి ఉన్నతపదవులు హిందూమహమ్మ

దీయులకు సమానముగ నొసంగఁబడుచున్నవి. భారతరాజేశ్వరి హిందూస్త్రీ.

గ్వాలి—కాఁబోవు భారతరాజేశ్వరియు హిందూస్త్రీయే—అనఁగా మహారాజ మానసింహుని సోదరియే. (మార్వాడు రాజువంక చూచి) నేను మీకు తొలుతనే చెప్పితిని. మానసింహునివలన మనకేమియు నాశలేదు. భారతవర్షమునకు స్వాతంత్ర్యమనునది స్వప్నవార్త.

మాన—మీరు స్వాతంత్ర్యవిషయము చెప్పుచుంటిరా? జాతీయ జీవనము నశించి చాలకాలమైనది. జాతియంతయు క్షీణించుచున్నది.

చందే—ఎట్లు?

మాన—దీనికిని దృష్టాంతము కావలయునా? ఈనిరంతరాలస్యము, ఈ ఔదాసీన్యము, ఈనిశ్చేష్టత ఇవి జీవనమునకు లక్షణములా? ద్రావిడదేశబ్రాహ్మణులు కాశీబ్రాహ్మణులతోఁ గలసి భోజనము చేయరు. సముద్రయాత్రచేసిన మానవుఁడు జాతిభ్రష్టుఁడగును, జాతికి ప్రాణస్వరూపమగు ధర్మము నామావశిష్టముగ నున్నది, ఇది జాతీయజీవనమునకు లక్షణమా? అన్నదమ్ములలో నొకరిపై నొకరికి ఈర్ష్య, ద్వేషము, అహంకారము— ఇవి జాతీయ జీవనమునకు లక్షణమా?—ఆరోజులన్నియు పోయినవి మహారాజా!

వీక—హిందువులందఱు నొక్కటియగుచో ఇప్పుడును ఆరోజులు వచ్చును.

మాన—అది కాఁజాలదు. హిందువులహృదయ మెంతయు శుష్కించినది. వారు ఎంతయు జడులును విచ్ఛిన్నులు నయిరి. ఇంక వారిలో సంఘీభావ మసంభవము.

గ్వాలి—అయితే హిందువుల కైకమత్యము ఇంక కలుగనేకలుగదా?

మాన—కలుగును. ఏనాఁడు హిందువులు ఈజీర్ణశీర్ణశుష్కసంఘాచారముల విడిచి సజీవము నుజ్జ్వలమునగు నూతనధర్మమును

గ్రహింతురో? ఆనాడుహిందువులకుమరల ఐకమత్యము కలుగును

మార్వా—మానసింహా! మీరు చెప్పినదెంతయు నిజము.

మాన—మహారాజులారా? నేనిమొగలదాస్యమును సంతోషముతో స్వీకరించితిననుకొంటిరా? నే నీతురుష్కసంబంధపాశమును అభిమానముతో మెడకు తగిలించుకొంటిననుకొంటిరా? నేను రాణాప్రతాపసింహుని మహత్త్వ మెఱుఁగ ననుకొంటిరా? నేనంత మూర్ఖుడను తుచ్ఛుడనునా? కాని మహారాజులారా! ఆస్వాతంత్ర్యస్వప్నము సత్యము కాఁజాలదు. ఎదుటలేనిదాని స్వప్నము చూచుటకంటె ఉన్నదానిని చక్కగ వ్యవహరించుకొనుట చాల మంచిది.

(ద్వారపాలకుఁడు వచ్చి నమస్కరించును.)

మాన—ఏమి సమాచారము?

ద్వార—బాదుషా గారొకజాబు పంపిరి.

మాన—ఏదీ? (జాబు అందుకొని చదువును.)

బిక—నేను మొదటనే యనుకొంటిని.

గ్వాలి—నేనును చెప్పితినిగదా.

బిక—మనకు మానసింహునిసహాయ మవసరము లేదు. మనము ప్రతాపుని పక్షమునఁజేరి తిరుగుపాటు చేసెదము.

మాన—మహారాజులారా! బాదుషాగారు మీకు సలాములు తెలియజేయుచు మిమ్ము నెల్లను ఆలోచనాగృహమునకు రాఁగోరిరి. సలీమునిశుభవివాహమున శుభలక్ష్యముగ మీరు నాయపరాధములనెల్ల క్షమించుఁడు” అని వ్రాసిరి.

చందే—మాసౌభాగ్యము. మేమెంతయు కృతజ్ఞులము.

మార్వా—ఈశుభవివాహమున శుభలక్ష్యముగ నింక వారేమి చేసిరి?

మాన—తమకు ప్రధానశత్రువగు రాణాప్రతాపసింహుని క్షమించిరి. ప్రతాపుఁడు జీవించియున్నంతవఱకు మొగలసేన మేవాడుపైకి దండెత్తఁగూడదని ఆజ్ఞాపించిరి. మఱియు మొగలసేనాపతులెవ్వరును మహారాణాప్రతాపసింహున కెట్టియపకృతియు చేయఁ

కూడదనియు ఇంతవఱకు ప్రతాపుఁడు నాకు ప్రధానశత్రువుగ నుండెనుగాక. ఇంతటనుండి ఆయన నాకు పరమమిత్రుఁడు అని యువ్రాసిరి.

బీర — ఈ ఔదార్యమునకుఁగూడ నేదియో విశేషార్థమున్నది. చంక దుడ్డు శరణార్థ యనుసామెత స్మృతికి వచ్చుచున్నది.

మాన — బాదుషాగారు ఇపుడే నన్ను రమ్మని సెలవిచ్చిరి. గాన నాకు సెలవిండు (అందఱకు నమస్కరించి వెళ్లును.)

గ్యాలి . . ఇఁక మనము పోదము. (అందఱు నిలఁబడుదురు.)

మార్వా . . మీరు లక్ష్య చెప్పుఁడు, కాని బాదుషాగారి హృదయము మాత్రము ఉదారమును ఉన్నతమునయినది.

చందే . . . అవును. ఆయన శత్రువును క్షమింపఁగలఁడు,

గ్యాలి . . . క్షమాపణ గోరనుగలఁడు.

మార్వా . . హిందూరాజులపై ఆయన కిమిత్రశ్రద్ధ.

చందే . మానసింహుఁడుచెప్పినమాట వాస్తవము. ఆయన విజయియందును విజితునందును భేదభావ ముంచఁడు!

మార్వా . . . అదియునుగాక ఆయన హిందూధర్మపక్షపాతి.

గ్యాలి . . . వాస్తవమైనసంగతి యేమన ఇప్పుడు హిందువులకు స్వాతంత్రులగు ఆసక్తి లేదు.

మార్వా . . . ఓయీ! ఈస్వాతంత్ర్యము ఉన్మత్తుని స్వప్నము.

(అందఱు నిష్క్రమించెదరు.)

సప్తమదృశ్యము.

స్థానము . . రాజమార్గము. సమయము . . . రాత్రి.

(చిత్రదీపికలు వెలుఁగుచుండును, అనతిదూరమున వాద్యములు మ్రోగుచుండును. జెండా లెగురుచుండును. రాజభటులు వచ్చుచుపోవుచునుందురు. ఒకప్రక్కకొందఱుదర్శకులు నిలఁబడి మాట్లాడుచుందురు.)

౧ . . . (నెట్టి) అరే సాగా నుంచో.

౨ . . . అరే నెట్టుతావేం?

౩ . . . అరే పెళ్ళివారు వస్తున్నారు మాట్లాడమాకు

౪...అబ్బా! నుంచునినుంచుని కాళ్లు లాక్కుపోతున్నాయిరా! పెళ్లోరు దబ్బున వొస్తే బాగుండును.

౫...అరేయ్! యువరాజుకున్నా మానసిమ్మ మహారాజు కూతురుకున్నా కాదంట్రా పెళ్లి?

౧...కాదుకాదు. ఆయన చెల్లిలికి

౨...కాదనే. కూతురుకే

౩ ..చెల్లిలికేరా.

౨...అయితే ఈపెళ్లీ ఎల్లా చేశారు? ఇదికాకూడదు.

౧...కాగూడకేం?

౨...సలీముతాత హుమాయూను భగవాందాసు కూత్తుర్ని పెళ్లిచేసి కొన్నాడాయరి, ఇప్పుడు సలీము కిచ్చేదేమిటో మళ్లీ ఆయన రొండోకూతుర్నేగా?

౧...అయితే యాం?

౨...అదిగాక సలీముతండ్రి భగవాందాసు చెల్లెల్ని పెండ్లిచేశికొన్నాడు

౪...వరసేమీ చెడిపోలేదులే. తండ్రి భగవాందాసు చెల్లిల్ని పెళ్లి చేసుకొన్నాడు తాతామనమ లిద్దరూ భగవాన్ దాసు కూతుళ్ళ నిద్దర్నీ పంచుకొన్నారు,

౫...మొత్తానికి సంబంధం అంతా బీరకాయ పీచల్లే భగవాందాసుకు చుట్టు కొని వుంది.

౧...నిజంగా భగవాందాసు చాలా అదుష్టమంతుడు

౨...కాని మానసింగు బలే పన్నుగడ పన్నాడు.

౫...ఏంపన్నాడు?

౨...ఉండి ఉండి ఇట్టే సలీముకు బావమరదైనాడు.

౩...సలీముకు బావమరదిఅవుట నిజంగా గొప్ప అదుష్టమే.

౫...ఇందులో అదుష్టమేమున్నది?

౩...అసలు పపంచకంలో బావమరది అవటమె అదుష్టము అందులో బావమరదన్న బావమరదా? యువరాజుకు బావమరదవుటం ఆహా! నేను బావమర్దినాతే!

౫...పిచ్చివాడా! అందరూ అవుతారా? మొగాన రాసివుండాలి.

౩...ఇది పూర్వజన్మ కర్మఫలంరా ఇక్కడే పూర్వజన్మ వొప్పుకోవలసి వస్తుంది.

౫...వొప్పుకోందే పనేసాగదు

౩—లేకమోతే యువరాజుకు బావమరదిఅవటం మాటలా?

౧—అయితే ఈపెళ్లితోకూడా సలీముకు మొత్తం ఎన్నిపెళ్లిళ్లు?

౨...నూటికి తక్కువుండవు.

౩...నిజమేరా! మనం ఎన్నేళ్లనుంచో నెలకోపెళ్లి సూస్తునే వున్నాము

౪...ఇంతమంది పెళ్లాలున్నవాళ్లు నిజంగా చాల అదుష్టమంతులే.

౧...దీనికీ అదుష్టానికీ సంబంధం ఏమిటి?

౪...ఇందులో అదుష్టంలేదా? కూకున్నప్పుడు, లెగుస్తున్నప్పుడు, వస్తున్నప్పుడు పోతున్నప్పుడు, పడుకున్నపుడు, మేలుకొన్నపుడు, తింటున్నపుడు ఆడుకుంటున్నపుడు ఎవళ్లో వొకళ్లు కనుపిస్తునే వుంటారు గులాబితోటలో తిరుగుతున్నట్లు వుంటుంది.

౧...అదుగో పెళ్లోళ్లు వొచ్చారు సరగా నుంచో.

౨...అరే రామసింగ్! నీతలకాయ ఆకాశాన్ని అంటుతుందేంరా?

౩...ఈ తలకాయ కూసేపు ఇంటికాడొగ్గేసి రాకపోయా?

(పెండ్లి ఊరేగింపు అతివైభవముతో పోవును.)

౧...ఇదుగో ఈయనే బాదుషా,

౩—ఇదుగో ఈయన పెళ్ళికూతురు తండ్రి మానసిమ్ముడు.

౨—కాదుకాడు. ఈయన పెళ్ళికూతురు అన్న. ఇందాకనుండి సిలకకు సెప్పినట్టు సెప్పాను అన్నిమరిసిపోయావు.

౪—పాదుషా సరిగ్గా పాదుషాఅల్లేనే వున్నాడురా.

౫—మానసిమ్ముడుకూడా సరిగ్గా మానసిమ్ముడల్లేనే వున్నాడు.

౧...అదుగో భోగమాళ్ళు వస్తున్నారు.

౨...వహ్వా! బలేసక్కగా ఆడుతూన్నారురా

౪—అదుగో దార్లో ఆడుతున్నారు.

౩...సరీగ్గా నెమళ్లల్లే వున్నారు.

౧... పెళ్ళికొడుకు వెళ్ళిపోయాడు ఇంక వెడదామువదండిరా

౨...మనమంతా సలీములు కాము!

౩—పెళ్ళికొడుకును సూస్తే అందరికి పెళ్ళికొడుకు కావాలనిపిస్తుంది

౨... గడ్డి అమ్ముకొనేవాడైనా చివరకి పెండ్లికొడుకౌతే మంచిడాబుగా నడుస్తాడు. ముందు బాజాలు మోగుతాయి వెంబడి వందలుతరిపిడి మనుషులుంటారు. ఇంతకంటే ఇంక మంచిరోజు ఏమివుంది!

(తెరలో తుపాకిమ్రోత వినబడును. చాల గల్లంతు జరుగును. మరల తుపాకిమ్రోత వినబడును)

౧... బాబో ఏమిటిది కీ గలభా?

(ముగ్గురు మనుష్యులు భయకంపితులై ప్రవేశింతురు)

౨... ఏమిటయ్యా అది?

౧మను—బాబో చాల మొప్పం.

౧...ఏమి? ఏమాయింది?

౨మను...ఓపిచ్చోడు వచ్చి సలీము పల్లకీమోసేవాళ్లని ముగ్గుర్ని కత్తెట్టి నరికాడు.

౩...ఏమి! తర్వాత?

౧మను... చాలామంది వాణ్ణి పట్టుకోవటానికి వెంటపడ్డారు. ఆడుఎవళ్ళీ చంపలేదు. కత్తి అవతల పారేసి పిస్తోలెట్టి తన్నే చంపుకొన్నాడు.

౨. ఆ డెవడు?

౩మను... ఒకపిచ్చోడు

౨మను—అరే ఆయన పిచ్చోడు కాడు. రాణాప్రతాపసిమ్మని తమ్ముడు శక్తసిమ్ముడు.

౨... నువ్వు ఆయన్ని ఎట్లా గురుతట్లా?

౨మను... ముందు సలీమును రొండు తన్నులుతన్ని తర్వాత ఆయనే చెప్పాడు "నేను శక్తసిమ్ముడను ఇదుగో సలీమ్! ఇది నీతన్నుకు మారుతన్ను ఇంక ఇది దానికి వడ్డీ" అని మళ్ళీ రెండు తన్నులు తన్నాడు

౧...బలే సాహసంపని చేశాడు

౨—అయితే శక్తసిమ్ముడు సచ్చిపోయాడా?

౧మను...అవును.

౩మను...ఇపుడాయన్ని తగలేస్తారో పాతేస్తారో సూద్దాము పదండి

(అందఱు నిష్క్రమించెదరు.)

అష్టమ దృశ్యము.

స్థానము...చిత్తూరు పరిసరారణ్యము. సమయము...సాయంకాలము.

(ప్రతాపుడు మృత్యుశయ్యపై బరుండియుండును ఎదుట వైద్యుడు రాజపుత్రసర్దారులు, పృథ్వీరాజు, అమరసింహుడు, నిలబడి యుందురు)

ప్రతా...పృథ్వీరాజా! తుదకు బావమామకు దయాపాత్రుడగుటకూడ సహింపవలసివచ్చెను.

పృథ్వీ—ఇది దయ గాదు, భక్తి.

ప్రతా—వ్యర్థప్రపసంగ మేల చేసెదవు? ఇది భక్తగాదు, దయయే. నేను దురదృష్టవంతుడను. దుర్బలుడను. పీడితుడను. శోకాపన్నుడను. గనుకనే సపత్నులు నాపై నిపుడు ఆక్రమణ సేయుదు. ఆహా! మరణకాలమున ఇట్టి మాటలను వినవలసి వచ్చెనుగదా. గోవిందసింహా!

గోవిం—రాణాజీ!

ప్రతా—నన్నొకమారు ఈడేరాలోనుండి బయటకు తీసికొని పొమ్ము. మరణించుటకు ముందొకమారు చిత్తూరుదుర్గము చూచెదను.

గోవిం—(వైద్యునివంక చూచును.)

వైద్య—హానియేమి? బయటకు తీసికొనిపొండు.

(అందరు కలసి ప్రతాపుని మంచము బయటకు తెచ్చి దుర్గమున కెదురుగ నుంచెదరు)

గోవిం—(వైద్యుని విడిగా బిలిచి) ఇంక జీవితాశ యేమియులేదా?

వైద్య—ఏమియు లేదు. గోవిందసింహుడు తలవంచుకొనును.)

ప్రతా—(శయ్యపైనుండి సగము లేచి చిత్తోరుకోటవంక చూచుచు)

ఇదియే ఆచిత్తోరు, ఒకనాఁడు రాజపుత్రుల యధికారమ్ము నున్న యజేయదుర్గ మిదియే. నేఁడు దీనిపై తురుగలవాణ్ణి యెగురుచున్నది. నేఁడు నాకు చిత్తోరు ముట్టడించు మ్లేచ్ఛుల ఓడించి వారిని గజనీవఱకు తఱిమి గజనీ సింహాసనమున సోదర కుమారుని గూర్చుండబెట్టిన మహావీరుఁడు. నా పూర్వ పురుషుఁడు స్వర్గీయ బాప్పారావలు స్మృతికి వచ్చుచునా. నేఁడు నాకు పఠానులకును సమర సింహునకును జరిగిన ఘోర యుద్ధము తలపునకు వచ్చుచున్నది, ఆ మహాసంగ్రామమున నల్లని కాగర్నదీజలము మ్లేచ్ఛ రాజపుత్రుల రక్తముచే నెఱ్ఱ బడెను. నేఁడు నాకు పద్మినీ నిమిత్తము జరిగిన ఆ ఘోర యుద్ధము కనుల కగపడుచున్నది. అందే చందాతురాణి షోడశ వర్షప్రాయుండగు తన కొమరుని కోడలిని దీసికొని వెళ్లి యవ నులతోఁ బోరి ప్రాణములు విడిచెను. ఆఘటనలన్నియు నేఁడు నాకు ప్రత్యక్షముగఁ గనుపడు చున్నది. ఇదియే ఆ చిత్తోరు. దీనినే నే నుద్ధరింపఁ గోరితిని గాని నావలనఁ గాలేదు. నా పని నేను చేయవలయు ననుకొంటిని. అంతలోనే దినాంతమయ్యెను. పని యసంపూర్ణముగనే యున్నది.

పృథ్వీ—రాణాజీ! మీరు దీనికై చింతింపకుఁడు. ఎప్పుడును పను లన్నియు నొక వ్యక్తివలననే కావు. అవి అసంపూర్ణముగ ఉండును. కాని సమయము వచ్చినప్పుడు ఆవ్రతమును బాలించు ఉత్తరాధికారులు జన్మించి వానిని పూర్తిచేయుదురు. ఒకదాని వెనుక నొకటిగ కెరటములు వచ్చును. మరల వెనుకకు మర లును. సముద్ర మిటులే ముందుకు నడచును. పగటి వెంట రాత్రి, రాత్రివెంట పగలు ఇట్లే పృథ్వీజీవితము నడచుచుండును. అపారములగు స్పందననివృత్తులవలననే ప్రకాశము వ్యాపించు చుండును. జన్మ మరణములవలననే మానవుల యుత్థానము, సృష్టిలయములవలననే బ్రహ్మాండవికాసము జరుగును. గాన మీ రేమియు చింతింపకుఁడు.

ప్రతా—నేను నా వెనుక నొకవీరపుత్రుని ఉంచి పోవుచో నాకు విచారముండెడిది కాదు. కాని—అబ్బా!—(ఒత్తిగిలును.)

గోవిం—ఏమి రాణాజీ! చాల బాధగా నున్నదా?

ప్రతా—అవును గోవిందసింహా! అయితే ఈకష్టము మానసికముగాని శారీరికము గాదు. నేను చచ్చిపోయిన పిమ్మట ఈపని చాల వెనుకపడిపోవునని చింతించుచున్నాను.

గోవిం—అదియేమి?

ప్రతా—అమరుఁడు బాదుషా సమ్మానలోభమునఁ బడి నేను ఉద్ధరించిన యీరాజ్యమును మొగలుల కప్పగించుననితలచుచున్నాను

గోవిం—రాణాజీ! ఈవిషయమై మీరేమియు శంకింపకుడు.

ప్రతా—గోవిందసింహా! నేను అహేతుకముగ శంకించుటలేదు. అమరుఁడు విలాసి, వాఁడీదారిద్ర్యకష్టములు సహింపలేడు. గనుక నే నామరణానంతరము ఈకుటీరస్థానమున ప్రాసాదమునిర్మింపఁబడుననియు ఈమేవాడుభూమి మొఁగలుల కమ్మివేయఁబడుననియు, మీరును విలాసమున కాశ్రయ మొసగుఁదురనియు శంకించుచున్నాను.

గోవిం—నేను బాప్పాసాక్షిగా చెప్పుచున్నాను, అట్లెన్నఁడును గాదు.

ప్రతా—అగుచో నేను సుఖముగ మరణించెదను (అమరసింహుని వంక చూచి) అమర్! ఇటు రమ్ము. ఇదుగో నేను వెళ్లుచున్నాను. నేఁడు నేను పోవుచోటికి ఒకనాఁడు అందఱును వెళ్ళవలసినదే. అబ్బాయీ! ఏడ్వకుము. నేను నిన్ను ఒంటరిగా విడిచిపోవుటలేదు. ఇర్వైదు వత్సరములనుండి పర్వతములందును, అరణ్యములందును నాతోఁబాటు సకలకష్టములను అనుభవించిన వీరులను నీకు విడిచిపోవుచున్నాను. నీవు వారిని విడిచినను వారు నిన్నెన్నఁడును విడువరు వారందఱు ప్రతాపుని పుత్రునికై ప్రాణ మొసఁగుటకు సిద్ధముగ నుందురు. మేవాడు రాజ్యమంతయు నీకు అప్పగించి పోవుచున్నాను. చిత్తోరు దుర్గమును నీకు నొసఁగఁజాలననియే విచారము. చిత్తోరు నుద్ధరించుభారమును నీకై విడిచిపోవుచున్నాను. నీవీకార్యమున సమర్థుఁడ వగుదువుగాక

యని ఆశీర్వదించుచున్నాను. నిష్కళంకమగు నీఖడ్గమును నొసగుచున్నాను. (ఖడ్గమిచ్చును.) నీవీఖడ్గము నుజ్జ్వలముగ చెదరనియు దీనికి కళంకము తగులనీయననియు నమ్ముచున్నాను కుమారా! ఇంక నేమి చెప్పుదును. ఇదియే నాయాశీర్వాదము. పొమ్ము. విజయివి, యశస్విని సుఖివి గమ్ము." (అమరు నమస్కరింప ప్రతాపుడు ఆశీర్వదించును.) నా కన్నులయొక్క అంధకారము గ్రమ్ముచున్నది కంఠస్వరము సన్నగిలుచున్న అమరసింహా! నీ వెక్కడ నున్నావు? కుమారా! రమ్ము. ఇను దగ్గఱకు రమ్ము ఇంక నేను వెళ్లుచున్నాను. ప్రియతమ లక్ష్మీ! ఆగుము. నేను వచ్చుచున్నాను.

వైద్య—(నాడిచూచి) రాణాగారి జీవనలీల సమాప్తమైనది. ఇంక సంస్కారయత్నము చేయవలయును.

గోవిం—పురుషోత్తమా! మేవాడప్రభాకరా! ప్రియసఖా! సహచరసంచరుని విడిచి యెచటికేగ బోతివి! (రాణా పాదములపైబడును రాజపుత్రులెల్లరును మోకరిలంబడి రాణాపాదములకు నమస్కరించెదరు.)

పృథ్వీ—వీరవరా! నీవు నిజపుణ్యార్జితమైన స్వర్గధామమునకుం బొమ్ము నిష్కళంకమగు నీకీర్తి అనంతకాలముదనుక రాజపుత్రులహృదయములందును మొగలుల హృదయములందు నేకాక సమస్త మానవజాతి హృదయమందును విరాజిల్లును. ఇతిహాసము నీకీర్తిగాథలు సువర్ణాక్షరములతో వ్రాయబడును ఆరావళి పర్వతమందలి ప్రతిశిఖరమును, ప్రతి లోయయు నీపుణ్యకథలను ప్రతిధ్వనించును. రాజపుత్రస్థానమందలి ప్రతిక్షేత్రమును, వనమును, ప్రతి పర్వతమును నీఅక్షయస్మృతిచే సర్వదా పవిత్రమయియుండును.

యవనికా పతనము

ఓం తత్సత్